
'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 2

మంగళవారం 25-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విశాఖలో అశుతోష్ 'షో'
ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఒంటిచేత్తో గెలిపించిన అశుతోష్ శర్మ
-14లో



అరుంధతి రెడ్డి తొలిసారి...
బీసీసీఐ మహిళా క్రికెటర్ల కాంట్రాక్ట్ జాబితాలో హైదరాబాద్ బౌలర్
-14లో



జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీ
ఇంట్లో కరెన్సీ కట్టలు దొరికిన ఘటనలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీం కొలీజియం బదిలీ చేసింది.
వివరాలు 6లో ▸



ఎంపీల వేతనాలు 24% పెంపు
పార్లమెంటు సభ్యుల నెలవారీ జీతభత్యాలు, మాజీ ఎంపీలకు అందించే పెన్షన్ మొత్తాలను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.
వివరాలు 6లో ▸



ఆత్మహత్యలపై టాస్క్‌ఫోర్స్
విద్యార్థుల ఆత్మహత్యల నివారణ కోసం జస్టిస్ ఎస్.రవీంద్రభట్ సారథ్యంలో నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.
వివరాలు 6లో ▸



కోమా.. కొన్ని సంగతులు
కోమా గురించి సామాన్య ప్రజల్లో చాలా అపోహలు ఉన్నాయి. దానిపై అవగాహన కల్పించే కథనం.
వివరాలు 'సాక్షి ప్లస్'లో ▸

న్యూస్‌రీల్

ఏప్రిల్ 23న హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నిక




హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు.. ఈసీ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. ప్రస్తుత ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు పదవీకాలం మే 1తో ముగియనుంది.
- వివరాలు 12లో▶

ఉగాదిలోపు రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు !



రాష్ట్ర బీజేపీకి ఉగాదిలోపు కొత్త అధ్యక్షుడు వస్తారనే ప్రచారం పార్టీవర్గాల్లో ఊపందుకుంది. దీనికి సంబంధించి ఒకటి, రెండురోజుల్లోనే పూర్తి స్పష్టత వస్తుందని ముఖ్యనేతలు చెబుతున్నారు.
- వివరాలు 2లో▶

ప్లస్-2 పరీక్షల్లో కాలిక్యులేటర్‌కు అనుమతి



సీబీఎస్‌ఈ నిర్వహించే 12వ తరగతి పరీక్షలకు ఇకనుంచి ప్రాథమిక స్థాయి (బేసిక్) కాలిక్యులేటర్‌ను అనుమతించనున్నారు. 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఇది అమలులోకి వస్తుంది.
- వివరాలు 3లో▶

వైద్యులకు ఆధార్ అటెండెన్స్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), జిల్లా, ఏరియా స్థాయి ఆస్పత్రుల్లో ఉద్యోగం చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.
- వివరాలు 16లో▶

ఉగాదికి అటు ఇటుగా!



రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం

నలుగురా లేక ఐదుగురా అన్న దానిపై కొరవడిన స్పష్టత

రాజగోపాల్‌రెడ్డి, వివేక్, శ్రీహరి పేర్లు దాదాపు ఖరారు

పోటీలో సుదర్శన్‌రెడ్డి, విజయశాంతి, ప్రేమ్‌సాగర్‌రావు, ఆది శ్రీనివాస్

బీఆర్‌ఎస్ నుంచి వచ్చినవారికి అవకాశం లేనట్టే..!

ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ తదితరులతో సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ

ఎన్నో నెలలుగా ఊరిస్తున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సమయం సమీపించింది. ఉగాదికి కొంచెం అటు ఇటుగా కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించాలని కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఎంతమందికి అవకాశం దక్కుతుందన్న దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. నలుగురా? లేక ఐదుగురా? అన్నది తేలాల్సి ఉంది. ఏఐసీసీ వర్గాలు, రాష్ట్ర నేతలు అందిస్తున్న సమాచారం మేరకు.. సీనియర్ నేతలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి పేర్లు ఖరారైనట్లు తెలుస్తుండగా, మిగతా పేర్లపై నేడో, రేపో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

విస్తృత చర్చలు..అనేక కోణాల్లో పరిశీలన

ప్రస్తుతం ఆరు కేబినెట్ స్థానాలు ఖాళీ ఉండగా, వీటి భర్తీపై గత కొన్ని నెలలుగా విస్తృత కసరత్తు జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు పలుమార్లు హైకమాండ్‌తో చర్చలు జరిపినా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. అయితే ప్రస్తుతం కీలకమైన కులగణన పూర్తికావడం, దానికి చట్టబద్ధత కల్పించే బిల్లుతో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం, మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల
మిగతా 12వ పేజీలో ▶

మంత్రుల శాఖల్లో మార్పులు?

కొత్తగా నలుగురిని లేక ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకుంటే ముఖ్యమంత్రి వద్ద ఉన్న ఏయే శాఖలు వారికి కేటాయించాలి, కొంతమంది మంత్రుల శాఖల్లో మార్పులు చేయాలా? కొందరికి కీలక శాఖలు అప్పగించాలా? అన్న దానిపైనా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్, హోం, విద్యా శాఖలను సీనియర్ మంత్రులకు ఇవ్వాలన్న చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో పాత మంత్రుల శాఖలు కొన్ని మార్చే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కార్మికుల వెలికితీత సహాయక చర్యలపై సోమవారం అసెంబ్లీ కమిటీహాల్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, జూపల్లి



డ్రిల్లింగ్ & బ్లాస్టింగ్

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాలు, కార్మికుల వెలికితీత ఈ విధానంలోనే..

టీఎంబీ పద్ధతికి స్వస్తి.. సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకంతోపాటు, అందులో చిక్కుకున్న కార్మికులను వెలికితీసేందుకు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానాన్ని అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనికి సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ నుంచి సత్వర అనుమతులకు ప్రయత్నించాలని నీటిపారుదల శాఖను ఆదేశించింది. ఏఎంఆర్ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం జలాశయం నుంచి నీటిని 43.93 కి.మీల సొరంగ మార్గంలో తరలించి లింక్ కాల్వ ద్వారా డిండి జలాశయంలోకి పోయాల్సి ఉంది. సొరంగాన్ని రెండు టన్నెల్ బోర్ మెషీన్ల (టీబీఎం) సహాయంతో రెండు వైపులా (ఇన్‌లెట్, అవుట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ పోతున్నారు. శ్రీశైలం జలాశయ ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీల పనులు పూర్తి కాగా,
మిగతా 12వ పేజీలో ▶

అవసరమైన అనుమతులు తీసుకోవాలి

కార్మికుల ఆచూకీ కనుక్కునేందుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ ఆపద సమయంలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 22న ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలడంతో ఎనిమిది మంది కార్మికులు గల్లంతు కాగా, వారిలో గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహాన్ని మార్చి 9న వెలికితీశారు. మిగతా కార్మికులను గుర్తించేందుకు ఆపరేషన్ కొనసాగించాలని, అవసరమైన అన్ని ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సీఎం చెప్పారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితోపాటు భూ విలువల పెంపు

ఉగాది తర్వాత మంచిరోజున అమల్లోకి..

మీడియాతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాపులు తప్పనిసరి
- తొలుత వ్యవసాయ భూములకు.. ఆ తర్వాత ప్లాట్లకు వర్తింపు
- వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తాం
- ఎల్‌ఆర్‌ఎస్ పొడిగించే యోచన లేదు

సాక్షి, హైదరాబాద్

ఉగాది తర్వాత మంచిరోజున భూ భారతి చట్టాన్ని అమల్లోకి తేవడంతో పాటు అదేరోజు భూముల విలువలను కూడా పెంచనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువలు పెంచాలని గతంలోనే భావించినా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందకొడిగా ఉండడం, దేశ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నేపథ్యంలో వాయిదా వేశామని చెప్పారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో ముచ్చటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.5 వేల కోట్లు పెరుగుతుందని బడ్జెట్‌లో ఎలా చెబుతారన్న ప్రశ్నకు స్పందించారు. 'రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడం, భూముల విలువల సవరణను అమల్లోకి తీసుకుని వస్తున్నందున
మిగతా 12వ పేజీలో ▶



గ్రామ పరిపాలన అధికారులకు పరీక్ష

'రాష్ట్రంలో 10,956 వీఆర్‌వో పోస్టులను మంజూరు చేశాం. ప్రస్తుతం వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలను ఈ పోస్టుల్లో నియమించడానికి ఇంటర్ అర్హతగా నిర్వహించే రాత పరీక్షకు 2,3 రోజుల్లో నోటిఫికేషన్ ఇస్తున్నాం. ఈ అర్హత ఉన్నవారు 6 వేల మంది వరకు ఉంటారు. వారిలో ఉత్తీర్ణత సాధించిన వారిని సర్దుబాటు చేస్తాం. మిగిలిన వారిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తాం. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను మార్చి 31 తరువాత పొడిగించే యోచన ప్రస్తుతానికి లేదు' అని మంత్రి తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్లపై అట్టుడికిన పార్లమెంటు



ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగాన్ని కాంగ్రెస్ మారుస్తుందని రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఆ పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇది కచ్చితంగా రాజ్యాంగంపై దాడే. దీన్నెంత మాత్రమూ సహించరాదు. ఇలాంటి వ్యాఖ్యలపై సభ మౌనంగా ఎలా ఉండగలదు?
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

- కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్లా?
- కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ ధ్వజం
- రాజ్యాంగాన్నే మార్చేస్తామంటారా?
- శివకుమార్ రాజీనామా చేయాల్సిందే: రిజిజు
- జస్టిస్ వర్మపై చర్చ జరగొద్దన్నదే బీజేపీ లక్ష్యమన్న కాంగ్రెస్.. తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్న డీకే

6లో



రాజ్యాంగాన్ని ఏ శక్తీ మార్చలేదు. రాజ్యాంగాన్ని కాపాడేది మా పార్టీయే. దేశాన్ని విభజించడమే బీజేపీ పని. రాజ్యాంగాన్ని మార్చాలని శివకుమార్ అనలేదు. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవతే గతంలో అలాంటి వ్యాఖ్యలు చేశారు.
- ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే

మహోన్నత దానం మరింత వేగం!

'తోటా'కు అసెంబ్లీ ఆమోదంతో అవయవ దానాలు, మార్పిళ్లకు మార్గం సుగమం

రాష్ట్రంలో అవయవ దానం, మార్పిడిపై పెరుగుతున్న అవగాహన



- కళ్లతో పాటు గుండె, మూత్రపిండాలు తదితర ఆర్గాన్ల మార్పిడి
- 2013 నుంచి ఇప్పటివరకు 6 వేల మందికి శస్త్రచికిత్సలు.. 2020 నుంచి ఇప్పటివరకు 3,205 మందికి పునర్జన్మ
- రాష్ట్రంలో 'జీవన్‌దాన్' ద్వారా అవయవ మార్పిడి ప్రక్రియ.. అవయవ దానంలో అత్యధికులు మహిళలే..
- రాష్ట్రంలో అవయవ మార్పిడి కోసం 3,823 మంది ఎదురుచూపు

సాక్షి, హైదరాబాద్: అవయవ దానం ఎంతో ఉదాత్తమైనది. సంకల్ప బలం ఉంటే గానీ సాధ్యమయ్యే విషయం కాదు. కొంతమంది కళ్లు, మూత్రపిండాలు ఇతర అవయవాలు దానం చేస్తారు. దాతలు చనిపోయాక వాటిని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. తమవారి ప్రాణాలు కాపాడేందుకు కుటుంబసభ్యులు కిడ్నీ దానం చేయడం కూడా అడపాదడపా జరుగుతుంటుంది. గతంలో అవయవ దానం అంటే చనిపోయిన వారి కళ్లు దానం చేయడమే అనుకునేవారు. కానీ పదేళ్లలో పెరిగిన అవగాహన వల్ల కళ్లతో పాటు ఇతర అవయవాల దానం కూడా పెరిగింది. అవయవ మార్పిడితో పునర్జన్మ పొంది ప్రాణాలు కాపాడుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. తాజాగా 'తోటా' అమలు తీర్మానంతో ఇది మరింత ఊపందుకునే అవకాశం ఏర్పడింది. గత పదేళ్లలో రాష్ట్రంలో అవయవాలను దానం చేసిన వారి సంఖ్య 1,594 కాగా.. ఎవరైనా చనిపోయిన తర్వాత, బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరించిన కంటి కార్నియా, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు ఇతర అవయవాలను ట్రాన్స్‌ప్లాంట్ చేయడం ద్వారా పన్నెండేళ్లలో ఏకంగా 6 వేల మంది
మిగతా 16వ పేజీలో ▶

ఇదండీ సంగతి




టికెట్లివ్వగానే పని చేయడం మానేస్తున్నార్సార్!

బటన్‌తో భద్రతకు భరోసా

ప్రయాణంలో మహిళల భద్రతపై ఆర్టీఏ కీలక నిర్ణయం

- అన్ని ప్రైవేటు ప్యాసింజర్ వాహనాల్లో లొకేషన్ ట్రాకింగ్ డివైజ్‌ల ఏర్పాటు
- అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ప్యానిక్ బటన్ కూడా..
- పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానమై పనిచేసే వ్యవస్థ
- టీజీ ఆర్టీసీలో ఇప్పటికే వెహికల్ ట్రాకింగ్ డివైజ్‌ల ఏర్పాటు
- త్వరలో 2 లక్షల ప్రైవేటు బస్సులు, క్యాబ్‌లలో బిగించాలని నిర్ణయం
- నిర్భయ చట్టం అమలుపై ఆర్టీఏ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వంటి నగరాల్లో ఉద్యోగాలు చేసే మహిళలు రాత్రుళ్లు కూడా క్యాబ్‌లు, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇలాంటి సమయాల్లో వారి భద్రత ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంటోంది. త్వరలో ఈ పరిస్థితి మారిపోనుంది. మహిళలు క్యాబో.. ప్రైవేటు బస్సో ఎక్కినప్పుడు వేధింపులు ఎదురైతే అందులో ఉండే ఒక్క బటన్ నొక్కితే చాలు.. పోలీసులు క్షణాల్లో అక్కడ వాలిపోతారు. ఇలాంటి వ్యవస్థ ఏర్పాటుపై రవాణాశాఖ దృష్టి సారించింది. ప్రైవేటు ప్రజా రవాణా బస్సులు, క్యాబ్‌లు, మ్యాక్సీ క్యాబ్‌లలో 'వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్'లను తప్పనిసరి చేసింది. నిర్భయ చట్టం ప్రకారం కొత్తగా నమోదయ్యే వాహనాలతో పాటు, పాత వాటిలోనూ ఈ పరికరాలు ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. వీటికి అదనంగా ప్రతి వాహనంలో 'ప్యానిక్ బటన్'ను కూడా
మిగతా 12వ పేజీలో ▶



ఎలా పనిచేస్తుందంటే..

1 ప్రైవేటు ప్రజా రవాణా వాహనాలన్నింటిలో వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్‌లతోపాటు అత్యవసర సమయంలో సమాచారం ఇచ్చేందుకు ప్యానిక్ బటన్‌ను బిగిస్తారు.

2 ఈ వాహనాలను పర్యవేక్షించేందుకు రవాణా కమిషనర్ కార్యాలయంలో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు.

3 ప్రతి వాహనం కదలికలు తెలుసుకొనేందుకు వీలుగా అన్ని రకాల ప్రజా రవాణా వాహనాలను పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేస్తారు.

4 ఎవరైనా మహిళలకు ప్రయాణంలో వేధింపులు ఎదురైతే ప్యానిక్ బటన్ నొక్కగానే.. పోలీస్ కంట్రోల్ రూంకు అత్యవసర సందేశం వెళ్తుంది.

5 వాహనం లొకేషన్ ఆధారంగా పోలీసులను అలర్ట్ చేస్తారు. వెంటనే లోకల్ పోలీసులు వాహనం వద్దకు చేరుకొని బాధితులను రక్షించే చర్యలు చేపడతారు.

6 ఈ వ్యవస్థతో డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్నాడా? లేదా? అనే విషయం కూడా అధికారులకు తెలిసిపోతుంది. ట్రాకింగ్ డివైజ్‌లు ఏర్పాటుచేసుకోని వాహనాలను సీజ్ చేస్తారు. లేదంటే జరిమానా విధిస్తారు.

లైంగికదాడికి యత్నం.. ఎంఎంటీఎస్ నుంచి దూకిన యువతి

- బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై ఆగంతకుడి దుశ్చర్య
- తప్పించుకునేందుకు నడుస్తున్న రైలులోంచి దూకిన యువతి
- గాయాలపాలైన బాధితురాలిని గాంధీకి తరలించిన స్థానికులు
- 22న రాత్రి 8 గంటల సమయంలో ఘటన.. మొదట రైలు నుంచి జారి పడ్డట్లు బాధితురాలి స్టేట్‌మెంట్
- తల్లిదండ్రులకు అసలు విషయం చెప్పటంతో వెలుగులోకి ఘటన
- నిందితుడిని పట్టుకొనేందుకు రంగంలోకి నాలుగు బృందాలు
- త్వరలోనే పట్టుకుంటాం: జీఆర్‌పీ ఎస్పీ చందనదీప్తి వెల్లడి

5లో



ఉగాదిలోపు రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

పాత కాపుకేనా లేక కొత్తగా చేరిన వారికి అవకాశం ఇస్తారా?

- బీసీ నేతను నియమిస్తారా... ఓసీకి దక్కుతుందా?
- ముందు వరుసలో ఈటల పేరు, పరిశీలనలో ఎంపీలు డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు కూడా..
- అనూహ్యంగా తెరపైకి కేంద్రమంత్రి బండి సంజయ్...అయితే తాను పోటీలో లేనని వివరణ... సంజయ్‌కు దక్కినా దక్కొచ్చని పార్టీలో ఊహాగానాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీకి ఉగాదిలోపు కొత్త అధ్యక్షుడు వస్తారనే ప్రచారం పార్టీవర్గాల్లో ఊపందుకుంది. దీనికి సంబంధించి ఒకటి, రెండురోజుల్లోనే పూర్తి స్పష్టత వస్తుందని ముఖ్య నేతలు చెబుతున్నారు. తాజాగా కేరళ పార్టీ అధ్యక్షుడిగా రాజీవ్‌చంద్రశేఖర్‌ను నియమించడంతో ఈ ఊహాగానాలకు బలం చేకూరుతోంది. త్వరలోనే కేంద్రమంత్రి శోభకరాండ్లజే తెలంగాణకు వచ్చి అభిప్రాయసేకరణ జరుపుతారని తెలుస్తోంది. ఇది ముగిశాక ఒకనేత పేరుతో నామినేషన్ పత్రాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి.. మరుసటి రోజు అధ్యక్షుడి ప్రకటన ఉండొచ్చునని అంటున్నారు. అధ్యక్ష పదవి కోసం పార్టీలో పాత-కొత్త నేతల మధ్య 'జాతివైరం'స్థాయిలో ఇప్పటికీ సాగుతోంది. పార్టీ సిద్ధాంతాలు, హిందుత్వ భావాలున్న పాత నాయకులకే ఈ పదవి ఇవ్వాలని కొందరు పట్టు పడుతున్నారు. పార్టీలో చేరాక, ఎంపీగా, ఎమ్మెల్యేగా లేదా మరో పదవికో ఎన్నికయ్యాక పాత-కొత్త అంటూ ఉండదని కొందరు (గత మూడు, నాలుగేళ్లలో చేరి ఆయా పదవులు పొందినవారు) వాదిస్తున్నారు. పార్టీలో కొత్తరక్తం నింపి వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అనేక మార్పులు చేయాల్సి ఉంటుందని ఈ వర్గం సూచిస్తోంది.

రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ముఖ్యనేతలు, సీనియర్ నేతలు, పాత-కొత్త నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ

➤ ఈసారి బీసీ వర్గానికి చెందిన నేతకు అవకాశం దక్కొచ్చుననే ఊహాగానాలు ఎక్కువగా సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, బీజేఎల్పీ ఉపనేత పాయల్‌శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి తదితరులు పోటీపడుతున్నారు.

➤ ఇక ఓసీ నాయకుల విషయానికొస్తే ఎంపీలు డీకే అరుణ, ఎం.రఘునందన్‌రావు, ఇంకా పి.మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

➤ అధ్యక్ష పదవిని కోరుకుంటున్న వారిలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కూడా ఉన్నారు. అయితే కొన్నిరోజులుగా అనూహ్యంగా కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సంజయ్‌ను మళ్లీ అధ్యక్షుడిగా నియమించేందుకు బీజేపీ అధినాయకత్వం మొగ్గుచూపొచ్చుననేది ఈ ప్రచార సారాంశం. అయితే అధ్యక్ష పదవి కోసం తాను పోటీలో లేనంటూ తాజాగా సంజయ్ వివరణ ఇచ్చారు. అయినా, పార్టీని ముందుండి నడిపించేందుకు ఆయన్నే అధ్యక్షుడిగా నియమించే అవకాశాలున్నాయని కొందరు నేతలు చెబుతున్నారు. బీసీ నేతకు ఇస్తే ఈటల రాజేందర్‌కు దక్కొచ్చునని గతంలోనే ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. పీఎం మోదీ, సీనియర్ నేతలు అమిత్ షా, నడ్డా వంటివారు ఈటలకే ఓటేస్తారనే ప్రచారం జరిగింది.



నేనంటే నేను అని ప్రచారం

గతంలో ఎన్నడూలేని విధంగా తనకే అధ్యక్ష పదవి వస్తుందంటూ కొందరు ముఖ్యనేతలు సైతం ప్రచారం చేసుకోవడం పట్ల రాష్ట్ర పార్టీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే తాను అధ్యక్షుడిని అవుతున్నానంటూ వారు మీడియాకు, అనుచరులకు లీక్‌లు ఇచ్చుకోవడం ఇటీవల బాగా పెరిగిపోయింది. పార్టీనాయకుల్లో ఇలాంటి పోకడలు గతంలో ఎప్పుడూ లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనే దానిపై రాష్ట్రపార్టీలో ఏకాభిప్రాయం కుదరని కారణంగానే జాతీయ నాయకత్వం కూడా డైలమాలో పడిందని సమాచారం. ఈ పరిస్థితుల్లో అధినాయకత్వం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి


- తన సస్పెన్షన్‌పై బులెటిన్ ఇవ్వాలని స్పీకర్‌కు వినతిపత్రం
- కోర్టుకు పోతాననే భయంతోనే బులెటిన్ ఇవ్వడం లేదన్న ఎమ్మెల్యే



స్పీకర్‌కు లేఖను అందజేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనకుండా తనపై విధించిన సస్పెన్షన్‌కు సంబంధించిన అధికారిక బులెటిన్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సోమవారం స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జగదీశ్‌రెడ్డి కలిశారు. తనను అన్యాయంగా, ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ఇప్పటికైనా తన సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయడంతో పాటు అసెంబ్లీ వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పీకర్‌కు అందజేసిన లేఖలో జగదీశ్‌రెడ్డి కోరారు. కాగా అసెంబ్లీ లాబీలోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష చాంబర్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డిని సభ ఆవరణ నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కరుణాకర్ కోరారు. తనను సస్పెన్షన్ చేసినట్టు బులెటిన్ చూపిస్తే బయటకు వెళతానని జగదీశ్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. తాను అసెంబ్లీకి రావడంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటలకు బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలోనే జగదీశ్‌రెడ్డి గడిపారు.

అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోంది: రాజ్యాంగ విలువలు, నిబంధనలు లేకుండా అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోందని జగదీశ్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నన్ను అసెంబ్లీ సమావేశాల నుంచి ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ కారణాలు, ఆధారాలు చూపడం లేదు. మందబలంతో సభ నడుపుతామంటే కుదరదు. కోర్టుకు వెళతాననే భయంతోనే నా సస్పెన్షన్‌కు సంబంధించిన బులెటిన్ విడుదల చేయడం లేదు. సభ్యులు వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ఏకంగా ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా మంత్రులు గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్లను వాడుతున్నారు. జాన్‌పాడ్‌లో జరిగిన దావత్‌కు కూడా మాజీమంత్రి జానారెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు'అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.



ఎవరూ నమ్మకుంటే పెట్టుబడులు ఎలా వచ్చాయి?

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: 'మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు..ఎక్కడా అప్పు పుడత లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మరోవైపు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని ప్రభుత్వం అంటోంది. రెండింటిలో ఏది నిజం'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనసభలో సోమవారం పురపాలకశాఖ బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వచ్చిన పెట్టుబడులపై వాస్తవాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 26 కి.మీల దూరంలోని కొండపోచమ్మసాగర్ నుంచి హైదరాబాద్‌లోని జంట జలాశయాలకు నీటిని తరలిస్తే రూ.1,000 కోట్ల వ్యయం అవుతుందని, దానికి బదులుగా సుదూరంలోని మల్లన్నసాగర్ నుంచి రూ.7 వేల కోట్లతో నీటిని తరలించాలని నిర్ణయించారని తప్పుబట్టారు. ఎవరి ప్రయోజనాల కోసం అంచనాలను పెంచారని ప్రశ్నించారు. సుంకిశాల ఇన్‌టేక్ వాల్ కుప్పకూలిన ఘటనలో నిర్మాణ సంస్థ మెఘా ఇంజనీరింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

జీర్ణించుకోలేకే సీఎంపై ఆరోపణలు: ఆది శ్రీనివాస్



సీఎం రేవంత్‌పై అక్కసుతో కేపీ వివేకానంద ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తప్పుబట్టారు. పెట్టుబడులు రావొద్దని విపక్ష పార్టీలు భయపెడుతున్నాయనే విషయాన్ని మాత్రమే సీఎం అన్నారని వివరణ ఇచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో కేటీఆర్ తేలేకపోయిన పెట్టుబడులను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావడంతో జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

50% చెరువులు, కుంటలు కబ్జా: మల్‌రెడ్డి రంగారెడ్డి



పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్ నగరంలోని 50 శాతం చెరువులు, కుంటలను కబ్జా చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట 95 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాహా చేశారన్నారు. హైడ్రాతో తమ అక్రమాలు బయటపడతాయనే భయంతో బీఆర్‌ఎస్ పార్టీ దానిని ప్రజలకు బూచీగా చూపిభయపెడుతోందని మండిపడ్డారు.

పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- జీరో అవర్‌లో పలు అంశాలను లేవనెత్తిన సభ్యులు



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పంట నష్టం అంచనాలు లెక్కగట్టడంలో తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఇప్పటికే ఆదేశించారని, ఆ పనులు కొనసాగుతున్నట్టు తెలిపారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు వారి పరిధిలోని ప్రాంతాల్లో పంట నష్టం గురించి ప్రస్తావించగా, మంత్రి తుమ్మల ఈ మేరకు స్పందించారు. కాగా, జుక్కల్‌లో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. ఆసిఫాబాద్ ప్రాంతంలో రోడ్ల అంశాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఇచ్చినట్టుగానే పంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. నిర్మల్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన టీఏ, డీఏ, పీఆర్‌సీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, పోలీస్ సిబ్బందికి రావాల్సిన రూ.352 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

బెట్టింగ్ యాప్స్ కేసులో అసలు దోషులను శిక్షించాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



యువతను అప్పుల ఊబిలో నెట్టి వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న బెట్టింగ్ యాప్స్ కేసుల్లో నిజమైన దోషులను శిక్షించాలని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. జీరో అవర్‌లో మాట్లాడుతూ, బెట్టింగ్స్ యాప్స్ నిర్వహణలో ఒక మాజీ మంత్రి ప్రమేయం ఉన్నట్టు వార్తలు వచ్చాయని, గతంలో డ్రగ్స్ కేసును నీరుగార్చినట్టుగా కాకుండా బెట్టింగ్ యాప్‌ల నిజమైన నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేస్థాయి కేన్సరో చెప్పండి

బీజేపీ ఎమ్మెల్యే శంకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేన్సర్ ఏ స్థాయిలో ఉందో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సోమవారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. ఇటీవల సీఎం రేవంత్ పలు సందర్భాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేన్సర్ వచ్చిందని చెప్పారని, అయితే అది ఏస్థాయిలో ఉందో చెప్పలేదన్నారు. ఆ అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. చికిత్స చేస్తే నయమయ్యే స్థాయిలో ఉందా? లేదా? అనే విషయం సీఎం చెబితే బాగుంటుందని శంకర్ వ్యాఖ్యానించారు. సాధారణంగా ప్రభుత్వం తెచ్చే అప్పులు అత్యంత తక్కువ వడ్డీకి ఉంటాయని, కానీ ఇక్కడ 12 శాతానికి పైగా వడ్డీలు కడుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఇంతటి అప్పులతో రాష్ట్రం భవిష్యత్తు ఏమవుతుందో అనే ప్రశ్న ప్రజలను వేధిస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో.. కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఉగాది పండుగకల్లా బిల్లులు క్లియర్ చేయాలని శంకర్ కోరారు.

పది పద్దులకు శాసనసభ ఆమోదం

అర్ధరాత్రి వరకు కొనసాగిన అసెంబ్లీ





సాక్షి, హైదరాబాద్: శాసనసభలో వివిధ పద్దులపై సోమవారం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సుదీర్ఘ చర్చ జరిగింది. రెండోరోజు పురపాలక- పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, మహిళా సంక్షేమం, బీసీ సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమం వంటి పది పద్దులతో పాటు పురపాలక, పంచాయతీరాజ్ శాఖ సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధీనంలోని పురపాలక, సాంఘిక సంక్షేమంతో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖలపై మంత్రి శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సీతక్క, వెనుకబడిన తరగతులు, మైనారిటీల శాఖపై పొన్నం ప్రభాకర్ పది పద్దులకు సమాధానం ఇచ్చారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అవయవ దాన చట్టాన్ని ఇక్కడ అమలు చేసేందుకు వీలుగా శాసనసభ తీర్మానాన్ని ఆమోదించింది.

కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం..అయోమయం

బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా తయారైందని..అసలు ఏం జరుగుతుందో ముఖ్యమంత్రికే స్పష్టత లేక అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శాసనసభలో పద్దులపై చర్చలో భాగంగా సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. అసలు రాష్ట్రం మొత్తం అప్పులెన్ని.. వాటిపై చెల్లిస్తున్న వడ్డీ ఎంత.. కొత్తగా తెస్తున్న అప్పు ఎంత ? లాంటి వివరాలేవీ తెలపటం లేదని విమర్శించారు.

అందరితో చర్చించాకే నిర్ణయం

- జీహెచ్‌ఎంసీలో ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీల విలీనంపై మంత్రి శ్రీధర్‌బాబు
- రాష్ట్రంలో కొత్తగా ఆరు మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలిపే అంశంపై అందరితో చర్చించిన తర్వాతే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్ట సవరణ బిల్లు 2025ను మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చట్టంలో పలు సవరణలతో ఈ బిల్లును పెట్టినట్టు తెలిపారు. అందులో ప్రధానంగా మున్సిపాలిటీ చైర్మన్, మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు ఓటు హక్కు కల్పించడం, ప్రైవేటు ఆస్తులను ఎన్నికల కోసం వాడుకునేలా వెసులుబాటు, మున్సిపాలిటీల పరిధిలోంచి కొన్ని ప్రాంతాలను తొలగించడం, మరికొన్ని మున్సిపాలిటీల్లో అదనపు ప్రాంతాలను చేర్చడంతో పాటు కొత్తగా ఆరు మున్సిపాలిటీలు ఏర్పాటు చేస్తూ సవరణలు చేసినట్టు పేర్కొన్నారు. ములుగు, ఖమ్మంలో కల్లూరు, మేడ్చల్ జిల్లాలో అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట, కామారెడ్డి జిల్లాలో బిచ్కుంద సహా ఆరు మున్సిపాలిటీలను నూతనంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం, పాల్వంచ, సమీపంలోని ఏడు గ్రామ పంచాయతీలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. పలు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల్లో వ్యత్యాసాల విషయంలోనూ అసెంబ్లీలో సభ్యుల ప్రతిపాదనల మేరకు పరిశీలిస్తామన్నారు. చేగుంట మున్సిపాలిటీ ఏర్పాటు ఇప్పుడే సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానందరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, రింగ్‌రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలపవద్దని, దీని వల్ల పన్నుల భారంతోపాటు ఇతర సమస్యలు ఎదురవుతాయని సూచించారు. చర్చ అనంతరం మున్సిపాలిటీ చట్ట సవరణ బిల్లు 2025ను అసెంబ్లీ ఆమోదించింది. కాగా ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులను ఆక్రమించుకుని నిర్మించుకున్న కట్టడాలను, ఎలాంటి అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిందని శ్రీధర్‌బాబు చెప్పారు.

మరిన్ని అసెంబ్లీ వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

నల్లబ్యాడ్జీలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన

- రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని నినాదాలు
- ప్లకార్డులతో అసెంబ్లీలోకి.. వాయిదా తీర్మానంపై పట్టు



ప్లకార్డులతో సభలోకి వస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ సోమవారం అసెంబ్లీ ఆవరణలో నిరసన తెలిపింది. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నల్లబ్యాడ్జీలు ధరించి 'రుణమాఫీ బూటకం.. కాంగ్రెస్ నాటకం' అని నినాదాలు చేస్తూ సభలోకి వెళ్లారు. 'రెండు లక్షల రుణమాఫీ అరకొర.. కాంగ్రెస్ కొరకొర'అనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు న్యాయం చేయాలని, రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 'రూ.2 లక్షల రుణమాఫీని అందరికీ వర్తింపజేయాలి'అంటూ బీఆర్‌ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. రుణమాఫీ అంశంపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు డిమాండ్ చేశారు.

సభలోనూ నిరసన..

పంట రుణాల మాఫీ హామీని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపిస్తూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ సభ్యులు సోమవారం సభ ప్రారంభమైన వెంటనే కొద్దిసేపు నిరసన తెలియజేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నిలబడి నినాదాలు చేశారు. వారికి మద్దతుగా బీజేపీ సభ్యులు సైతం నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. పద్దులపై చర్చ ప్రారంభమైన వెంటనే ఆందోళనను విరమించాయి.

రూ. 31 వేలకోట్ల రుణమాఫీ చేయాల్సిందే

బీఆర్‌ఎస్ తరఫున పోరాటం చేస్తాం: హరీశ్



సాక్షి,హైదరాబాద్: బడ్జెట్‌లో పెట్టిన విధంగా రూ. 31 వేల కోట్ల రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రెండు లక్షలకుపైబడిన రైతు రుణాలను మాఫీ చేయలేమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడం చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పే మాటలకు పొంతనలేదని స్పష్టమవుతోందని ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాన్ని ఎండగడుతూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశామన్నారు. రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పితే దేవుడు వదిలిపెట్టడని, రుణమాఫీ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకపోతే బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. రెండు లక్షలలోపు రుణం కూడా చాలా మందికి రాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, ఖాతాల్లో లోపాలుంటే వాటిని సవరించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. రుణమాఫీ అయ్యే వరకు ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని, నిలదీస్తూనే ఉంటామని హరీశ్‌రావు హెచ్చరించారు.

బడ్జెట్ ఘనం.. వ్యయం శూన్యం

- నిధుల కేటాయింపులే తప్ప ఖర్చు చేయటంలేదు
- అసెంబ్లీలో పద్దులపై చర్చలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ శాఖలకు భారీగా నిధులు కేటాయిస్తూ, ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఏమాత్రం ఖర్చులు చేయకపోవడం దారుణమని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. 'బడ్జెట్ కేటాయింపులు భారీగా ఉంటాయి. వాటికి సంబంధించి నిధులు విడుదల చేస్తున్నట్లు బీఆర్వో (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్లు) వస్తాయి. ఆ తర్వాత ఆర్థిక శాఖ వాటిని నిలుపుదల చేస్తుంది. చివరకు ఆ బడ్జెట్ విడుదల కాదు. ప్రభుత్వం ఇలా తెలివిగా ట్రిక్స్ ప్లే చేస్తోంది'అని విమర్శించారు. హైడ్రా కూల్చివేతల కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. తెలంగాణ చుట్టూ నీటి వనరులు పుష్కలంగా ఉన్నా, గ్రామాలు దాహార్తితో తల్లడిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో కనీసం రంజాన్ సమయంలోనైనా నీళ్లివ్వాలని కోరారు. హైడ్రాపై అక్బరుద్దీన్ ఆరోపణలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. హైడ్రా ఉద్దేశాన్ని కొంత ఉంది రాజకీయ లబ్ధి కోసం తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూముల జోలికి ప్రభుత్వం వెళ్లడం లేదని స్పష్టత ఇచ్చారు.

పల్లెల్లో పరిశుభ్రతపై కదిలిన యంత్రాంగం

- చిన్నగౌరాయపల్లి బావిలో చెత్తను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

యాదగిరిగుట్ట రూరల్/వలిగొండ/నేలకొండపల్లి/గార్ల/కమలాపూర్: పల్లెల్లో పడకేసిన పాలన శీర్షికతో సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి డివిజన్ పంచాయతీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం చిన్నగౌరాయపల్లి గ్రామంలో బావిలో చెత్త, వ్యర్థ పదార్థాలు పడేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడి వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది సహాయంతో తొలగించారు. బావి చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

మురుగు కాల్వలు శుభ్రం

యాదాద్రి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో అధికారులు మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇతర కాలనీలలో కూడా చెత్తను శుభ్రం చేయించారు.

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో రహదారుల వెంట, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ గ్రామంలో పర్యటించారు.

గార్లలో చెత్తకుప్పల తొలగింపు

మహబూబాబాద్ జిల్లా గార్ల పట్టణంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను పంచాయతీ కార్యదర్శి అజ్మీర కిషన్.. సిబ్బంది సాయంతో పరిశుభ్రం చేశారు. అదేవిధంగా వీధుల్లోని సైడ్‌కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించారు.



యాదగిరిగుట్ట మండలం చిన్నగౌరాయపల్లి గ్రామంలో బావిలో పడేసిన వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది



హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో వీధిలైట్లు పెడుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

వీధిలైట్లు అమర్చిన అధికారులు

గత 20 రోజులుగా వీధిలైట్లు వెలగక అంధకారంలో ఉంటున్న హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో గ్రామ పంచాయతీ అధికారులు అవసరమైన చోట వీధి లైట్లు అమర్చారు. గ్రామ పంచాయతీలో నిధులులేక అధికారులు ఓ దుకాణదారుడిని బతిమిలాడి 9 వీధి లైట్లు తీసుకొచ్చి అమర్చారు.

ప్లస్ టు పరీక్షల్లో కాలిక్యులేటర్‌కు అనుమతి

- 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి..
- సీబీఎస్ఈ కీలక నిర్ణయం
- ప్రయోగాత్మకంగా డిజిటల్ మూల్యాంకనం
- నైపుణ్యంతో కూడిన బోధన ప్రణాళికకు ఆమోదం



సాక్షి, హైదరాబాద్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించే 12వ క్లాస్ పరీక్షలకు ఇకనుంచి ప్రాథమిక స్థాయి (బేసిక్) కాలిక్యులేటర్‌ను అనుమతించను న్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇది అమలులోకి వస్తుంది. సాధారణ కూడికలు, తీసివేతలు, భాగాహారాలకు సంబంధించిన ప్రోగ్రామ్ ఉండే కాలిక్యులేటర్‌ను మాత్రమే విద్యార్థులు పరీక్షకు తీసుకెళ్ళవచ్చు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన కాలిక్యులేటర్‌ను అనుమతించరు. సీబీఎస్ఈ 140వ బోర్డ్ మీటింగ్ సోమవారం జరిగింది. ఇందులో కాలిక్యులేటర్‌కు అనుమతితో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థి ఆలోచన శక్తిని సరికొత్త కోణంలో అంచనా వేయడం, సిలబస్ విధానం, మూల్యాంకనంలో మార్పులు తదితర సంస్కరణలు తీసుకొచ్చారు.

ఇకనుంచి ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానం

ఇకనుంచి ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎంఎస్) విధానంతో డిజిటల్ మూల్యాంకనం పద్ధతిని అనుసరించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. ప్రశ్నపత్రాలను స్కాన్ చేసి, సాఫ్ట్‌వేర్ ద్వారా మూల్యాంకనం చేస్తారు. దీనివల్ల ఫలితాలు త్వరగా వెల్లడయ్యే వీలుంది. అంతే కాకుండా మూల్యాంకనంలో తప్పులను సాఫ్ట్‌వేర్ గుర్తించేలా కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియను ముందుగా 10, 12 తరగతుల సైన్స్, మేథ్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు.

సబ్జెక్టుల్లో నైపుణ్యం మేళవింపు

చదువుతున్నప్పుడే నైపుణ్యం సంపాదించాలనే సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తేవాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. పారిశ్రామిక భాగస్వామ్యంతో నైపుణ్యాన్ని సబ్జెక్టుల్లో మేళవించే ఏర్పాట్లు చేయాలని భావిస్తోంది. టెస్ట్ స్టాండర్డ్ నుంచే దీన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. పాఠం పూర్తయిన రోజే సైన్స్, సోషల్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తారు. లోతైన ప్రశ్నలతో కూడిన రీజనింగ్ అంశాలను విద్యార్థులకు అందిస్తారు. ఈ మేరకు బోధన ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ విధానం 2026-27 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

బీసీ రాజకీయ జేఏసీ సమన్వయ కమిటీ చైర్మన్‌గా హరిశంకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వెనుకబడిన తరగతుల రాజకీయ కార్యాచరణ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా నూదగాని హరిశంకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన కోర్ గ్రూప్ సమావేశంలో బీసీ నాయకులు ఆయన్ను ఎన్నుకున్నారు. బీసీ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు, రచయితలు, విద్యార్థి, మహిళ, ఉపాధ్యాయ, ఉద్యోగ, ఆర్టీసీ, సింగరేణి వంటి వివిధ వర్గాల ప్రతినిధులు.. రాష్ట్రంలో బీసీల ఐక్యత కోసం కృషి చేయాలని నిర్ణయించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలని సూచించారు. ఉద్యమకారుడు వి.ప్రకాశ్ మాట్లాడుతూ బీసీ ఉద్యమానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజులు బీసీలవేనన్నారు. ప్రసన్నహరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్క బీసీని కదిలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు. జేఏసీ కార్య కలాపాలను విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హరి శంకర్ గౌడ్ నాయకత్వంలో బీసీల హక్కుల కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని బీసీ జేఏసీ నిర్ణయించింది.

పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళిక

- పరిశ్రమలతోనే ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ
- యూఎస్ ఇండియానా రాష్ట్ర ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు




అమెరికాలోని ఇండియానా రాష్ట్ర ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ లక్ష్య సాధనలో పారిశ్రామికరంగం కీలకపాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో అమెరికాలోని ఇండియానా రాష్ట్ర సెక్రటరీ ఆఫ్ స్టేట్ డియెగో మోరాలెస్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను శ్రీధర్‌బాబు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఇండియానా పారి శ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. ఎమర్జింగ్ టెక్నాలజీలకు హబ్‌గా మారుతున్న తెలంగాణ వైపు ప్రపంచం ఆసక్తితో చూస్తోందన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గూగుల్, మైక్రో సాఫ్ట్ వంటి అనేక ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వ హిస్తున్నాయని గుర్తుచేశారు. నాణ్యమైన మానవ వనరులను అందించేందుకు యంగ్‌ఇండియా స్కిల్ యూ నివర్సిటీని ప్రారంభించి, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు అందిస్తున్నామన్నారు.ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తమ రాష్ట్రంలో పర్యటించాలని మంత్రిని డియెగో మోరాలెస్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోరాలెస్ సతీ మణి సిడోని యానికోల్, సోజోస్ క్యాపిటల్ సీఈఓ ఫాబి యో పెరెజ్ పెరేయ్రా, ఇండియానా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజు చింతల, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్ పాల్గొన్నారు.

ఎస్ఈసీఎల్‌లో కోల్ ఇండియా చైర్మన్ రెండ్రోజుల పర్యటన

సాక్షి, హైదరాబాద్: కోల్ ఇండియా చైర్మన్ (సీఐఎల్) పీ.ఎం.ప్రసాద్ ఇటీవల రెండ్రోజుల పాటు సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈ సీఎల్)లో పర్యటించారు. మొదటి రోజు కోర్బా బొగ్గుగనుల్లోని దిప్కా, కుస్ముండా మెగా గనులను పరిశీలించారు. రెండోరోజు పర్యటనలో బెకుంత్‌పూర్‌ను సందర్శించారు. అక్కడ బైకుంత్‌పూర్, బిశ్రంపూర్, భట్‌గావ్ జనరల్ మేనేజర్స్‌తో భేటీ అయ్యారు.






ముంబై ఐఐటీలో ఆన్‌లైన్ ఏఐ కోర్సు

సాక్షి, హైదరాబాద్: ముంబై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఇకనుంచి ఇంట్లో ఉండే పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు చేయవచ్చు. అది కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులు చేసే వీలు కల్పించింది. ఈ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును ఐఐటీ ముంబై సోమవారం ప్రారంభించింది. జూన్ నుంచి పలు ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించేందుకు సిద్ధమైంది. దేశంలోనే టాప్ మోస్ట్ ఐఐటీ అధ్యాపకులు ఆన్‌లైన్‌లో బోధిస్తారు. తొలి దశలో మొత్తం ఆరు కోర్సులను అందిస్తోంది. అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామింగ్, కంప్యూటింగ్ సిస్టమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌తో పాటు మరో రెండు కోర్సులను డిజైన్ చేసింది. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్, ఐటీ ప్రొఫెషనల్స్, డేటా సైంటిస్టులు, మెషీన్ లెర్నింగ్ ప్రాక్టీషనర్లు, ఇంజనీర్లు, ఐటీ ఆధారిత ఉద్యోగాలు చేసేవారు ఈ కోర్సులు చేసేందుకు అర్హులు. త్వరలో ప్రవేశాల నోటిఫికేషన్ ఇస్తారు.

400 ఎకరాల బదిలీపై మీ వాదన చెప్పండి

- కంచె గచ్చిబౌలి భూములపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల అటవీ భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీఐఐసీ)కి బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలేంటో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేసింది. ఐటీ, ఇతర అవసరాల కోసం ఎకరం రూ.75 కోట్లకు వివిధ సంస్థలకు కేటాయించేలా కంచె గచ్చిబౌలీ సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల అటవీ భూములను టీజీఐఐసీకి సర్కార్ కేటాయించింది. దీనికి సంబంధించి గత ఏడాది జూన్ 26న రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో 54ను సవాల్ చేస్తూ వటా ఫౌండేషన్ (ఈఎన్‌పీవో) హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యార ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఈ 400 ఎకరాలు 237 జాతుల పక్షులు, నెమళ్లు, చుక్కల జింకలు, అడవి పందులు, నక్షత్ర తాబేళ్లు, ఇండియన్ రాక్ పైథాన్, బోయాస్ వంటి వివిధ పాము జాతులకు ఆవాసం. పర్యావరణ సమ తుల్యతను దెబ్బతీసే తదుపరి కార్యకలాపాలను నిరోధించాలి'అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదుల వాదనలు చెప్పాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

మళ్లీ మూల్యాంకనంపై మీ వైఖరి చెప్పండి

- గ్రూప్-1పై టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని దాఖలైన పిటిషన్ విషయంలో వైఖరిని తెలియజేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కమిషన్‌కు నోటీసులు జారీ చేస్తూ, నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 21కి వాయిదా వేసింది. గ్రూప్-1 మెయిన్స్ పేపర్ మూల్యాంకనం పారదర్శకంగా జరగలేదని, తిరిగి దిద్దించేలా టీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఖమ్మంకు చెందిన ఎస్.నరేశ్‌తో పాటు మరో 22 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అప్పటివరకు తదుపరి నియామక ప్రక్రియపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అనిరుధ్ సాధు వాదనలు వినిపిస్తూ.. మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని, మొత్తం 18 రకాల సబ్జెక్టులుంటే, 12 రకాల సబ్జెక్టుల నిపుణులతోనే పేపర్లు దిద్దించారన్నారు. మూడు భాషల్లో పరీక్ష నిర్వహించినా తగిన నిపుణులను ఏర్పాటు చేయలేదని, తెలుగు, ఆంగ్ల మీడియం పేపర్లను ఒకే నిపుణులతో మూల్యాంకనం చేయించారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ నియమించిన మూల్యాంకనదారుల్లో చాలా మందికి తెలుగు, ఉర్దూ తెలియదని, ఈ కారణంగా తెలుగు, ఉర్దూ భాషలలో పరీక్షలు రాసిన అభ్యర్థులు మార్కులను కోల్పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్రం వెలుపల నుంచి వచ్చిన నిపుణులకు తెలంగాణ ఉద్యమం, స్థానిక చరిత్ర వంటి అంశాలపై అవగాహన లేదని, ఈ నేపథ్యంలో పేపర్ల పునఃమూల్యాంకనం చేయించాలని అభ్యర్థించారు. 12 అంశాల్లో సుమారు 351 మంది నిపుణులను పేపర్ల మూల్యాంకనం కోసం నియమించినట్లు టీఎస్‌పీఎస్సీ న్యాయవాది పీఎస్ రాజశేఖర్ స్పష్టం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. టీఎస్‌పీఎస్సీకి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

ప్రభాకర్‌రావు పిటిషన్‌పై మీ వైఖరి తెలియజేయండి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ-1), ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వైఖరిని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటర్ వేయాలని పోలీసులకు స్పష్టం చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. తనను అన్యాయంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేస్తూ, పోలీసులకు నోటీసులు జారీ చేశారు.







ఒక పెద్దమనిషి కావడానికి పునాది విద్య.
కానీ పఠనం, సజ్జన సాంగత్యం, తరచి చూసుకోవడం అతడిని రూపుదిద్దుతాయి.
– జాన్ లాకీ

ఫోకస్

సాక్షి
మంగళవారం, 25 మార్చి 2025

ఇంతకూ ఆ కరెన్సీ ఎక్కడ?

దేశంలో అవినీతి సర్వాంతర్యామి అని, ఏ వ్యవస్థా అందుకు అతీతం కాదని గ్రహించినవారిని సైతం దిగ్భ్రాంతిపరిచేలా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదం ఉదంతం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఆ ఘటనలో భారీ మొత్తంలో కాలిన కరెన్సీ నోట్ల కట్టలున్న సంచులు బయటపడ్డాయని గుప్పుమంది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సైతం అందుకు సంబంధించిన వీడియో ఉంది. కానీ నోట్ల కట్టల సంగతి అబద్ధమని, కుట్రపూరితమని అంటున్నారు న్యాయమూర్తి. పైగా తానుంటున్న నివాసానికి విడిగా, అందరూ వచ్చిపోగలిగేలా ఉండే ఆ స్టోర్ రూమ్‌కు తాళం కూడా ఉండదని, అలాంటిచోట అంత డబ్బు ఎవరైనా దాస్తారా అన్నది ఆయన ప్రశ్న. కానీ, సామాన్యుల్లో తలెత్తుతున్న ప్రశ్నలు ఇంకా చాలా ఉన్నాయి. ఆయనొక్కరే కాదు... బాధ్యతాయుత స్థానాల్లోవున్న చాలామంది సంజాయిషీ ఇవ్వకతప్పని ప్రశ్నలవి. ఈ నెల 14 అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగితే 21వ తేదీన మీడియా బయటపెట్టేవరకూ అధికారికంగా ఎందుకు వెల్లడించలేదు? న్యాయవ్యవస్థ, పోలీస్, అగ్నిమాపక విభాగాలు మౌనంగా ఎందుకు ఉండిపోయాయి? న్యాయమూర్తిపై అంతర్గత విచారణ నిర్వహిస్తున్నామని ఈ ఉదంతం వెల్లడైన వెంటనే సుప్రీంకోర్టు తెలిపింది. కానీ ఆయన విధులకు దూరంగా వుంటారని ఆ మర్నాడు ప్రకటించింది. బదిలీ చేశామని తాజాగా చెబుతోంది. మంచిదే. కానీ ఘటన తర్వాత వారంపాటు ఆయన విధులు ఎలా నిర్వర్తించగలిగారు? స్టోర్‌రూమ్‌కు తాళం లేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు. ఘటన సంగతి తెలిశాక తానిచ్చిన ఆదేశాలతో అక్కడికెళ్లిన హైకోర్టు రిజిస్ట్రార్ సైతం ఆ మాటే అన్నారని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ అంటున్నారు. మరి తాళం వున్న గదిలోనే మంటలు రేగాయని పోలీసులు ఎలా చెబుతున్నారు? అసలు అగ్నిమాపక విభాగం తనకున్న నిబంధనల మేరకు నిర్వహించాల్సిన పంచనామా పూర్తిచేసిందా? అక్కడ గుర్తించదగిన లేదా సగం కాలిన సరుకు గురించిన వివరాలు నమోదు చేసిందా? ఇద్దరు సాక్షులతో ఆ పంచనామాపై సంతకం చేయించిందా? మంటలు ఆర్పిన సందర్భంలో తమకు నోట్ల కట్టలున్న సంచులేమీ కనబడలేదని ఢిల్లీ అగ్నిమాపక విభాగం చీఫ్ అతుల్ గార్గ్ శనివారం చెప్పారు. అలాంటి ప్రకటనేమీ తానీయలేదని ఆ మర్నాడు ఖండించారు. మళ్లీ గొంతు సవరించుకుని కరెన్సీ నోట్లు దొరకలేదని ఇప్పుడంటున్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టిన వీడియోలో కాలిపోయిన, సగం కాలిన నోట్లు స్పష్టంగా కనబడుతున్నాయి. కానీ ఆశ్చర్యకరంగా ఇప్పుడా నోట్లు మాయమయ్యాయి. పోలీస్ కమిషనర్ సైతం తన ప్రెస్‌నోట్‌లో పనికిరాని స్టేషనరీ సామాను కాలిపోయిందని తెలియజేశారు తప్ప కరెన్సీ నోట్ల సంగతి ప్రస్తావించలేదు. 14వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో కాలిబూడిదైన సామానంతా ఆ మర్నాడు ఉదయం అక్కడి నుంచి తొలగించారు. ఈ పనంతా చేసిందెవరన్న ప్రశ్నకు సమాధానం లేదు. న్యాయమూర్తితోపాటు అగ్నిమాపక విభాగం, పోలీసులు కరెన్సీ లేదని చెబుతుండగా, ఆ నివాసానికి సమీపంలోనే పారిశుద్ధ్య సిబ్బందికి ఒకటి రెండు కాలిన నోట్లు కంటబడ్డాయి. అంటే... ఇందులో నిగూఢంగా ఏదో జరుగుతున్నట్టే కదా!

ఈ ఉదంతంలో పారదర్శకంగా వ్యవహరించటానికి సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నించటం అసాధారణమైంది, అభినందించదగ్గది కూడా. మంటల్లో బుగ్గి అయిన కరెన్సీ నోట్ల వీడియోనూ, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన ప్రాథమిక నివేదికనూ తన వెబ్ సైట్‌లో ఉంచింది. గతంలో న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భాలున్నా ఎన్నడూ ఇలా జరగలేదు. అంతేగాక పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగూ, హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌లతో ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసింది. అయితే అంతమాత్రాన అంతా సక్రమంగా సాగుతోందని భావించనక్కరలేదు. కాలిబుగ్గయిన కరెన్సీ నోట్ల సంచులు మాయమవటం, ఎవరూ నోట్ల సంగతి ధ్రువీకరించకపోవటం సందేహాలకు తావిస్తోంది.

రాజ్యానికి సంబంధించిన మూడు ప్రధాన అంగాల్లో ఒక్క న్యాయవ్యవస్థకు మాత్రమే ఆ మూడింటి పరిధులనూ నిర్ణయించగల గొప్ప అధికారాన్ని రాజ్యాంగం ఇచ్చింది. కానీ ఆ బరువు బాధ్యతలకు తగ్గట్టుగా న్యాయవ్యవస్థ జవాబుదారీతనంతో ఉంటున్నదా? గత అనుభవాలు గమనిస్తే లేదన్న సమాధానమే వస్తుంది. కొలీజియం వ్యవస్థను మార్చాలని నిశ్చయించుకుని ఎన్డీయే సర్కారు బిల్లు తెచ్చినప్పుడు పార్లమెంటులో అనేకులు న్యాయవ్యవస్థ తీరుతెన్నులపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకరిద్దరు న్యాయమూర్తులపై అభిశంసన వరకూ వెళ్లింది. కానీ విధాన సంబంధమైన సంక్లిష్టత వల్ల అవి వీగిపోయాయి. కొందరు రాజీనామా చేశారు. మరికొందరిపై చేసిన దర్యాప్తు అతీగతీ లేదు. న్యాయాన్యాయాలను విశ్లేషించి తీర్పులివ్వాల్సిన స్థానంలో ఉన్నందువల్ల న్యాయమూర్తులకు పటిష్ఠమైన రక్షణ కవచం ఉండాల్సిందే. దురుద్దేశంతో, కుయుక్తులతో వారిపై నీలాపనిందలు వేసే ధోరణులను అడ్డుకోవాల్సిందే. కానీ అది అవినీతి మకిలి అంటినవారికి ఆలంబన కారాదు. ఈ రెండింటి మధ్యా సమతౌల్యం సాధించటానికి ఇంతవరకూ ఎలాంటి ప్రయత్నమూ జరగకపోవటమే సమస్యకు మూలం. ఇప్పుడున్న కొలీజియం బదులు మరొకటి వస్తే అంతా మారిపోతుందనుకోవటానికి లేదు. స్వయంప్రక్షాళనకు నడుంబిగించి జవాబుదారీతనం పెంపొందించే పకడ్బందీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనంతవరకూ ఈ పరిస్థితి మారదు.

ఫలిస్తున్న ప్రజాభాగస్వామ్య పోరాటం

విశ్లేషణ



జేపీ నడ్డా

క్షయవ్యాధి (టీబీ)పై పోరులో భారత్ స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోంది. ఇటీవల విస్తృత స్థాయిలో 100 రోజులపాటు నిర్వహించిన 'టీబీ–ముక్త్ భారత్ అభియాన్'... వినూత్న విధానాలను ప్రవేశ పెట్టడమే కాక, జన బాహుళ్యాన్ని మమేకం చేయడం కూడా అంతే కీలకమని స్పష్టం చేస్తోంది. టీబీ కేసులను గుర్తించడాన్ని వేగవంతం చేయడం, మరణాలను తగ్గించడం, కొత్త కేసులను నివారించడం వంటి లక్ష్యాలతో 2024 డిసెంబర్ 7న ఈ ప్రచారం ప్రారంభమైంది.

ఈ ప్రచారం ద్వారా టీబీ లక్షణాలు లేనివారే కాదు, ఆ లక్షణాలు గుర్తించని వారిని సైతం తొలిదశలోనే పసిగట్టి చికిత్స అందించింది. డయాబెటిస్ ఉన్నవారు, ధూమపానం చేసేవారు, మద్యపానం సేవించేవారు, హెచ్ఐవీ రోగులు, వృద్ధులు, తక్కువ 'బీఎమ్ఐ' ఉన్నవారు, టీబీ రోగులతో మసిలే కుటుంబ సభ్యులు... ఇలా అధిక రిస్కున్న వ్యక్తుల చెంతకు పోర్టబుల్ ఎక్స్–రే యంత్రాలను నేరుగా తీసుకెళ్ళి చికిత్స అందించడం జరిగింది. కృత్రిమ మేధ సాయంతో పనిచేసే ఎక్స్–రేల ద్వారా అక్కడికక్కడే అనుమానిత టీబీ కేసులను గుర్తించారు. ప్రామాణికమైన 'న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్ట్' (ఎన్ఏఏటీ) ఉపయోగించి రోగ నిర్ధారణ కూడా జరిగింది. ఈ ప్రయత్నాలు అంటువ్యాధులను గుర్తించి త్వరగా చికిత్స చేయడానికీ, అవి వ్యాప్తి చెందకుండా అరికట్టడానికీ, ప్రాణాలను కాపాడటానికీ దోహదపడ్డాయి. దేశం నలుమూలలా చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమంతో టీబీ బారిన పడటానికి అవకాశమున్న దాదాపు 12.97 కోట్ల మందికి పరీక్షలు జరిగాయి. తద్వారా సుమారు 7.19 లక్షల టీబీ రోగులను గుర్తించారు. ఇది కేవలం ఒక మైలురాయి అంటే సరిపోదు, ఒక మలుపు అనే చెప్పాలి.

భాగస్వామ్య ఉద్యమం

చెప్పాలంటే... నిజమైన గేమ్ ఛేంజర్ కేవలం టెక్నాలజీ మాత్రమే కాదు– జనాలను సమీకరించడం (కమ్యూనిటీల సమీకరణ). టీబీ నిర్మూలన అనేది ఇప్పుడు 'జన్ భాగీదారీ' (ప్రజల భాగస్వామ్యం) ద్వారా నడిచే ఒక ప్రజా ఉద్యమంగా మారింది. దేశమంతటా 13.46 లక్షలకు పైగా 'ని–క్షయ్' శిబిరాలు జరిగాయి. ఇందులో గౌరవ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీఆర్లు, యూఎల్బీల ప్రతినిధులతో సహా 30,000 మందికి పైగా ఎన్నికైన ప్రతినిధులు 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'కు మద్దతు అందించారు. కార్పొరేట్ భాగస్వాములు, సాధారణ పౌరులు సైతం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. టీబీ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సామూహిక లక్ష్యం అనే ఆలోచనను వీరు బలోపేతం చేశారు. ఈ మిషన్లో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రజల భాగస్వామ్యం ఉండటం విశేషం.

టీబీపై అవగాహన, న్యూట్రిషన్ కిట్ పంపిణీ, టీబీ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయడం వంటి 35,000కి పైగా కార్యకలాపాలను 22 వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు చేపట్టాయి. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలు, వాణిజ్య సంఘాలు, వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు 21,000కి పైగా కార్యకలాపాలను చేపట్టగా... 78,000 విద్యా సంస్థలలో 7.7 లక్షలకు పైగా విద్యార్థులు క్షయవ్యాధి అవగాహన కార్యకలాపాలలో పాల్గొన్నారు. జైళ్లు, గనులు, తేయాకు తోటలు, నిర్మాణ ప్రదేశాలు, పని ప్రదేశాల వంటి సామూహిక ప్రాంతాల్లో టీబీ బారిన పడటానికి అవకాశమున్న 4.17 లక్షలకు పైగా జనాలకు పరీక్షలు నిర్వహించారు.



'జన్ భాగీదారీ'కి పునాది వేసిన మన ప్రధాని దార్శనికత సమాజంపై విస్తృత ప్రభావాన్ని చూపింది. ఫలితంగా రోగులకు తగిన పోషకాహారాన్ని అందించడం కోసమే కాక, వారి మానసిక – సామాజిక స్థితిగతుల్లో తోడ్పాటుకు ఎంతోమంది ముందుకొచ్చారు. టీబీ రోగుల బాగోగులు ఇప్పుడు ఆసుపత్రులకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది ఇంటింటికీ, గ్రామ గ్రామానికీ, పని ప్రదేశాలకూ వ్యాపించాయి. 'నిక్షయ్ మిత్ర' ద్వారా వ్యక్తులు, సంస్థలు ఇప్పటికే వేలాది ఆహార బుట్టలను పంపిణీ చేసి, టీబీ బాధిత కుటుంబాలకు పోషక సహాయాన్ని అందిస్తున్నాయి. కేవలం 100 రోజుల కార్యక్రమంలో 1,05,181 కొత్త నిక్షయ్ మిత్రులు నమోదయ్యారు. పోషకాహారం అందించడం, క్షయవ్యాధి నుంచి రోగులు కోలుకునేలా చేయడం మధ్య కీలక సంబంధాన్ని గుర్తిస్తూ... ప్రభుత్వం 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద ఆర్థిక సహాయాన్ని నెలకు 800 నుంచి 1,000 రూపాయలకు పెంచింది. తద్వారా ఏ క్షయవ్యాధి రోగీ ఒంటరి పోరాటం చేయకుండా చూడటమే ప్రభుత్వ ఉద్దేశం.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కూడా విభిన్న రీతిలో టీబీ కేర్ ప్రోగ్రాం కింద రోగులకు అవసరమైన చర్యలు తీసుకోవడమే కాదు, రోగిని బట్టి శ్రద్ధ తీసుంటూ చికిత్సను అందిస్తోంది. ఉదాహరణకు, ఒక టీబీ రోగి తక్కువ బరువుతో ఉన్నట్లు తేలితే (18.5 కంటే తక్కువ బీఎమ్ఐ), వారి ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు తగిన పోషకాహారం, చికిత్స ప్రణాళికను రూపొందిస్తారు.

- వంద రోజుల 'టీబీ– ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో 12.97 కోట్ల మందికి పరీక్షలు జరిగాయి. సుమారు 7.19 లక్షల రోగులను గుర్తించడమైనది.
- టీబీ నిర్మూలన ఇప్పుడు 'జన్ భాగీదారీ' (ప్రజల భాగస్వామ్యం) ద్వారా నడిచే ప్రజా ఉద్యమంగా మారింది.
- 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని నెలకు 800 నుంచి 1,000 రూపాయలకు పెంచింది. తద్వారా ఏ క్షయవ్యాధి రోగీ ఒంటరి పోరాటం చేయకుండా చూడటమే ప్రభుత్వ ఉద్దేశం.

చికిత్స సమయంలో నెల నెలా వారి పురోగతిని పర్యవేక్షిస్తారు.

100 రోజుల పురోగతి

క్షయ వ్యాధి పై అవగాహన కల్పించడం, రోజువారీ జీవితంలో సేవలను అందించే విషయంలో 22 మంత్రిత్వ శాఖలు చేతులు కలిపి ముందుకు సాగాయి. గోవా కార్నివాల్ పరేడ్‌లలో టీబీపై అవగాహన ఒక ప్రధానాంశంగా నిలిచింది. తమ కార్యాలయాలను సందర్శించే వేలాది మందికి ఉచిత టీబీ స్క్రీనింగ్‌లను చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ విభిన్న చర్యలు అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశాయి. క్షయ నిర్మూలనలో ప్రజా చైతన్యానికి బాటలు పరిచాయి.

100 రోజుల ప్రచారం అనేది కేవలం ప్రారంభం మాత్రమే! ప్రతి పౌరుడు... వారు ఎక్కడ నివసిస్తున్నారనే దానితో సంబంధం లేకుండా ఆధునిక పద్ధతుల్లో రోగనిర్ధారణ, నాణ్యమైన చికిత్స అందించడం, అన్ని వర్గాల వారినీ భాగస్వాములను చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఈ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉంది. కోవిడ్–19 పరీక్షల విషయంలో ప్రభుత్వం ఎంత చురుగ్గా స్పందించిందో... అదే మాదిరి మరింత వేగవంతమైన, కచ్చితమైన అత్యాధునిక టీబీ పరీక్షలను అన్ని ప్రాంతాలకూ, అన్ని వర్గాలకూ అందుబాటులోకి తేవడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది.

స్వచ్ఛ భారత్ మిషన్ కావొచ్చు, పోలియో నిర్మూలన కార్యక్రమాలు కావొచ్చు... యావత్ సమాజం కదలి వస్తే ఎటువంటి ప్రయోజనాలు ఒనగూరుతాయో స్పష్టంగా రుజువు చేశాయి. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కూడా ఇప్పుడు ప్రజల నేతృత్వంలో మరో ఉద్యమంగా మారుతోంది. భారత్ ఇప్పుడు కేవలం క్షయవ్యాధితో పోరాడటం మాత్రమే కాదు– దాన్ని ఓడిస్తోంది కూడా!

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి
(మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం)

సోషల్ మీడియా

విమర్శను స్వీకరించలేరా?



ఢిల్లీలోనేమో ప్రధాని మోదీ 'విమర్శే ప్రజాస్వామ్యపు ఆత్మ' అంటారు. ముంబయిలోనేమో శివసేన (శిందే) వర్గీయులు... స్టాండప్ కమెడియన్ కుణాల్ కామ్రా ప్రదర్శన జరిపిన కామెడీ క్లబ్‌ను ధ్వంసం చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఎవరైనా కామ్రా భావస్వేచ్ఛ కోసం నిలబడతారా?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

వర్తమానమే ముఖ్యం



ఒక ఫలితం ఉందంటే, దానికి కారణం ఉంటుంది. మీరు వెనక్కి వెళ్లి గతానికి అతుకులు వేయడం ద్వారా దాన్ని మార్చలేరు. ఎదగడానికీ, మెరుగుపడటానికీ వర్తమానంలోని స్వీయ ప్రయత్నమే ముఖ్యం. ఒక ఆధ్యాత్మిక అన్వేషిగా, జరగవలసిందే జరిగిందని నమ్మితే ఇక విచారం లేదు. అది అక్కడితో ముగుస్తుంది.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

ప్రాచీనతను ఒప్పుకోరా?



పశ్చిమాసియా, చైనాల్లో– వ్యవసాయం (గోధుమ, వరి), పశువుల పెంపకం చాలా ముందు జరిగిందని నిరూపించడానికి ఎందుకు చాలామంది పాశ్చాత్య రచయితలు తపిస్తుంటారు? భారత పురాతత్వశాస్త్రం అనగానే ఎందుకు తామేదో కోల్పోయినట్టు ఫీలవుతారు? భారత పశుపాలనకు సంబంధించి ఎంతోమంది మోసపూరిత సంవత్సరాలను ప్రచురించారు.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

రెండూ ముఖ్యమే



ప్రియమైన సామాన్యులారా! మీ భవిష్యత్ సంపద కోసం వర్తమానంలో పెట్టుబడి పెట్టటం అవసరమే! అయితే మీ వర్తమానాన్ని భవిష్యత్తుకు ఒక ఆస్వాదనగా ఉంచుకోవటం కోసం మీ ప్రియమైన వారితో జ్ఞాపకాల సంపదను సృష్టించుకోవటం కూడా అవసరమే!!

– రాజీవ్ తల్రేజా, బిజినెస్ కోచ్

కృత్రిమ జవాబులు



ఇన్ని పదాల్లో రాయమని ఓ పిల్లాడికి అసైన్‌మెంట్ ఇచ్చినట్టుగా చాట్‌జీపీటీ జవాబులిస్తోంది. సరైన జవాబు చిన్నగా కూడా ఉంటుందని అది అర్థం చేసుకోవడం లేదు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

ఎవరం మనుషులం?



ఇంతకుముందెప్పుడూ ఇంత స్పష్టంగా అర్థం కాలేదు. ఎదుటివాళ్లు మనుషులు కారని నిరూపించే ప్రయత్నంలో, మనమే మనుషులం కామని నిరూపించుకుంటాం.

– ఎమీ దార్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నూరేళ్ల గ్రంథాలయం

పాల్వంచ సంస్థానంలో కుక్కునూరులో ఉన్న 'దేశోద్ధారక ఆంధ్రభాషా నిలయం' ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. సరిగ్గా నేటికి వందేళ్ల క్రితం (1925 మార్చి 25) గోదావరి తీరంలో ఉన్న 'అమరవరం'లో 'గౌతమి ఆశ్రమం'తో పాటు ఈ గ్రంథాలయాన్నీ, ఒక పత్రికా పఠన మందిరాన్ని, ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. అమరవర వాస్తవ్యులు, ఆంధ్ర భాషా కోవిదులు బ్రహ్మశ్రీ వేలూరు సుబ్రహ్మణ్యం తన పుస్తకాలు ఈ గ్రంథాలయానికి బహూకరించారు. వీటితో పాటు రెండు చెక్క బీరువాలు, బెంచీలు, బల్లలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వర రావు తమ పత్రికలను ఈ గ్రంథాలయానికి అందించడంతో పాటు దాని ఉన్నతికి ఎంతో కృషి చేశారు. అందుకే 'దేశోద్ధారక ఆంధ్రభాషా నిలయం' అని దీనికి పేరుపెట్టారు. తరువాత ఈ గ్రంథాలయాన్ని కుక్కునూరుకు మార్చారు.

గ్రంథాలయంలోని పత్రిక పఠన మందిరంలో 'ఆంధ్ర పత్రిక, భారతి, నీలగిరి, తెలుగు, ఆంధ్ర రంజని, జన్మభూమి, త్రిలింగ, సుజ్ఞాన చంద్రిక, బ్రహ్మానందిని, ఆంధ్ర అభ్యుదయం, శ్రీ శారద ధన్వంతరి, కృష్ణా పత్రిక' వంటివి... కోటగిరి వెంకట అప్పారావు, మాజేటి రామచంద్ర రావు తదితరుల సహాయ సహకారాలతో గ్రంథాలయానికి వచ్చేవి. దసరా, దీపావళి, వైకుంఠ ఏకాదశి, పోతన జయంతి, శ్రీకృష్ణ జయంతి సందర్భంగా 'గ్రంథాలయ యాత్ర' చేపట్టి విరాళాలు సేకరించి గ్రంథాలయం ఉన్నతికి కృషి చేశారు. 1960–70 కాలం వరకు చుట్టుపక్కల దాదాపు 20 గ్రామాల ప్రజలు ఈ గ్రంథాలయాన్ని చక్కగా వినియోగించుకున్నారు. 1970 తరువాత అనుకున్నంత స్థాయిలో ఈ గ్రంథాలయం తన ప్రతిభను కనపరచలేకపోయింది, కారణం ఆర్థిక వనరులూ, మానవ వనరుల కొరత, నాటి అవసరాలకు అనుగుణంగా పుస్తకాలు లేకపోవడం వంటి కారణాలతో 1980–85 మధ్యకాలంలో ఈ గ్రంథాలయాన్ని ప్రభుత్వ గ్రంథాలయంలో విలీనం చేశారు. అప్పటికే ఆ గ్రంథాలయంలో ఉన్న చాలా విలువైన గ్రంథ సంపద అంతరించి పోయింది.

– డా॥ రవి కుమార్ చేగొని
తెలంగాణ గ్రంథాలయ సంఘం కార్యదర్శి
(నేటితో దేశోద్ధారక ఆంధ్రభాషా నిలయానికి వందేళ్లు)

మరిన్ని ప్రయోగాలకు మార్గదర్శనం!

అభిప్రాయం



దినేశ్ సి. శర్మ

తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి మళ్లీ భూమ్మీదకు చేరారు. చాలామంది సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లో ఇరుక్కుపోయారని అన్నారు. ఈ వర్ణన అంత సరైంది కాదు. ఐఎస్ఎస్‌లో దీర్ఘకాలం ఉండటం ఇదే మొదటిసారి కాదు. సుమారు పాతికేళ్లుగా మనుగడలో ఉన్న ఐఎస్ఎస్‌లో నిత్యం యూఎస్, రష్యా, యూరప్, జపాన్ వ్యోమగాములు ఉంటూనే ఉన్నారు. ఒక్కొక్కరి కాలావధి వేర్వేరుగా ఉండవచ్చు. కనీసం 4 నుంచి 8 మంది వ్యోమగాములు జీవశాస్త్ర, బయోమెడికల్, మొక్కలకు సంబంధించిన ప్రయోగాలు చేస్తూ వచ్చారు. గత వారం కొద్ది కాలమైనా సరే... దాదాపు 11 మంది వ్యోమగాములు ఐఎస్ ఎస్‌లో గడిపారు. పరిశోధనలు చేయడంతోపాటు ఉపగ్రహాలను ప్రయోగించడం, ఐఎస్ఎస్ నిర్వహణ పనులు చేశారు వీరందరూ! స్పేస్ వాక్స్ ద్వారా ఐఎస్ఎస్ వెలుపల ఉండే రోబో చేతుల మరమ్మతులు కూడా ఉన్నాయి ఈ పనుల్లో! వ్యోమగాములు నిత్యం ఐఎస్ఎస్‌లో ఉంటారు కాబట్టి వారికి ఆహారం, ఇతర సరుకుల రవాణా ఎప్పటికప్పుడు జరిగింది.

అంతరిక్ష కేంద్రంలో సునీత, విల్మోర్‌లు 286 రోజుల పాటు ఉండటం చాలా ఎక్కువ అనిపిస్తుంది కానీ... కొత్త కాదు. ఫ్రాంక్ రూబియో విషయాన్నే తీసుకుంటే... 2023 సెప్టెంబరులో ఆయన 371 రోజులపాటు అంతరిక్ష కేంద్రంలో ఉండి రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో ఆయన 2022లో మార్క్ వెండే హే 355 రోజుల రికార్డును బద్దలు కొట్టారు. అయినప్పటికీ సోవియట్ యూనియన్ కాస్మోనాట్ల రికార్డులతో పోలిస్తే ఇవి తక్కువ. సోవియట్ యూనియన్ ప్రయోగించిన 'మిర్' అంతరిక్ష కేంద్రమే... కాలక్రమంలో ఇతర దేశాల భాగస్వామ్యంతో ఐఎస్ఎస్‌గా రూపాంతరం చెందిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. భౌతిక శాస్త్రవేత్త, కాస్మోనాట్... వలేరీ పోల్యాకోవ్ 1994–95లో ఏకాయెకిన సుమారు 437 రోజులపాటు మిర్ స్టేషన్‌లో గడిపారు. ప్రస్తుతం చైనా సిద్ధం చేసిన అంతరిక్ష కేంద్రం టియాన్‌గాంగ్‌లో ముగ్గురు వ్యోమగాములు 139 రోజులుగా ఉంటున్నారు. వీరిలో కాయ్ షూజీకి అంతరిక్షంలో 320 రోజులు గడిపిన అనుభవం ఉంది.

లక్ష్యాల్లో ఒకటి అదే...

అంతరిక్ష కేంద్రం ఏర్పాటు లక్ష్యాల్లో ఒకటి– దీర్ఘకాలం అంతరిక్షంలో గడపడం. గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎక్కువ సమయం గడిపితే మనకేం అవుతుందన్న విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇలా ఎక్కువ కాలం అక్కడ గడిపినప్పుడు ఎముకలు, కండరాలు బలహీనపడతాయన్న విషయం మాత్రం ఆందోళన కలిగించే వ్యవహారమే. 1970లలో



సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్

శాల్యూట్, స్కైల్యాబ్‌లతో ప్రయోగాలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ అంశాలకు సంబంధించి బోలెడంత సమాచారం సేకరించారు. బయో మెడికల్ సమాచారాన్ని సేకరించడమే లక్ష్యంగా పలు పరిశోధనలు జరిగాయి. ఉదాహరణకు ప్రస్తుత అంతరిక్ష యాత్రలో విల్మోర్ సైక్లింగ్, రోయింగ్, రెసిస్టెన్స్ వ్యాయామాలను కలిపి చేయగల ఒక పరికరాన్ని ఐఎస్ఎస్‌లో ఏర్పాటు చేయడానికి సాయపడ్డారు. ఎక్కువ సమయం ఇక్కడ గడపాల్సిన వ్యోమగాములు ఈ పరికరం ద్వారా వ్యాయామాలు చేస్తే కండరాలు, ఎముకలు మరీ గుల్లబారకుండా ఉంటాయి. గుండెకూ మేలవుతుంది. గుండె కొట్టుకునే వేగం, శ్వాస, రక్తపోటు వంటి... గుండె–రక్తనాళాలకు సంబంధించిన డేటాను సేకరించడానికీ, ఉష్ణోగ్రతలను వ్యోమగాములు వేసుకునే దుస్తుల్లో ఉంచిన సెన్సార్ల ద్వారా రాబట్టేందుకూ ఉద్దేశించిన ప్రయోగం కూడా జరిగింది. భవిష్యత్తులో మనిషి జాబిల్లిపై, అంగారకుడిపై నివసించాల్సి వస్తే... ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వారి పరమావధిగా ఉండనుంది.

1970, 1980లలో సోవియట్ యూనియన్, అమెరికన్ల అంతరిక్ష కేంద్రాల అనుభవం తరువాత ఇది చాలా ఖరీదైన వ్యవహారమని వారికి అర్థమైంది. ఈ కారణంగానే ఐఎస్ఎస్ నిర్మాణం, నిర్వహణ రెండింటినీ అంతర్జాతీయ స్థాయికి చేర్చి పలు దేశాలు పాల్గొనేలా చేశారు. నాసా, కెనడా స్పేస్ ఏజెన్సీ, యూరోపియన్ ఏజెన్సీ, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ ఏజెన్సీ, రాస్కోమాస్‌లు ఐఎస్ఎస్ నిర్వహణ బాధ్యతలు చేపట్టాయి. ఆ యా ఏజెన్సీలు అందించిన పరికరాల నిర్వహణ బాధ్యత వారిదే. 2000వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ అరవై ప్రయోగాల ద్వారా ఐఎస్ఎస్‌ను 21 దేశాలకు చెందిన 260 మంది వ్యోమగాములు సందర్శించారు. భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా కూడా త్వరలోనే ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. ఐఎస్ఎస్ 2030 వరకూ పని చేయనుంది. చైనా ఇప్పటికే ఒక అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోగా... 2035 నాటికి ఒక కేంద్ర నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో మొదలైన అంతరిక్ష కేంద్రం ఏర్పాటు ఆలోచన ఈ అంతర్జాతీయ ప్రాజెక్టు!

అంతరిక్ష ప్రయోగాల విషయంలో అమెరికా ఒక కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలోనే ప్రయోగాలు జరగనున్నాయి. స్పేస్ ఎక్స్, బోయింగ్ వంటివి సరుకు రవాణా కోసం ప్రత్యేకమైన నౌకలను సిద్ధం చేయనున్నాయి. నాసాతో కలిసి పని చేస్తున్న ఈ రెండు సంస్థలూ ఐఎస్ఎస్ నిర్వహణతోపాటు జాబిల్లి, అంగారకుడిపైకి చేరే ప్రయత్నాలు చేస్తున్నాయి. స్పేస్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ ప్రస్తుత ట్రంప్ ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తిగా మారిన నేపథ్యంలో బిలియనీర్ జేర్డ్ ఐసాక్‌మాన్ నాసా అధ్యక్షుడు అయ్యే పరిస్థితుల్లో ప్రైవేట్ కంపెనీలు అంతరిక్ష ప్రయోగాల్లో మరింత ఎక్కువగా పాల్గొనే అవకాశాలున్నాయి. వీరందరూ సునీత, విల్మోర్‌ల అనుభవం నుంచి లబ్ధి పొందనున్నారు.

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

మానవ సేవతో...



మూడు శతాబ్దాలు చూసిన మునిగా పేరు గాంచిన కల్యాణ్ దేవ్... వివేకానందుని బోధనలతో ఉత్తేజితుడై మానవ సేవ ద్వారా మాధవునికి సేవ చేసి తరించారు. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లాలోని కోటనా గ్రామంలో 1876లో జన్మించిన ఆయన అసలు పేరు కాలూరామ్. రిషీకేశ్‌లో స్వామి పూర్ణానంద శిష్యులై స్వామి కల్యాణ్ దేవ్ అయ్యారు. కొన్నేళ్ళు హిమాలయాలలో తపస్సు చేశారు. అనంతరం ఆయన తన ప్రాంతంలోని పేద ప్రజలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ, ఇతర ప్రాంతాల ప్రజల కోసం దాదాపు మూడు వందల పాఠశాలలు, వైద్యకేంద్రాలను ఏర్పాటు చేశారు. అంటరానితనం, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన తన వాణిని వినిపించారు.

నిర్లక్ష్యానికి గురైన మతపరమైన, చారిత్రక ప్రదేశాల పునర్నిర్మాణానికి కల్యాణ్‌దేవ్ మద్దతు ఇచ్చారు. ముజఫర్‌నగర్‌లోని శుక్తల్‌లో ఆయన 'శుకదేవ ఆశ్రమం', 'సేవా సమితి'ని కూడా స్థాపించారు. హస్తినాపూర్‌లోని కొన్ని ప్రాంతాలను, హరియాణాలోని అనేక తీర్థయాత్రా స్థలాలను పునరుద్ధరించారు.

ఒక ఇంటర్వ్యూ సందర్భంగా కల్యాణ్‌దేవ్ మాట్లాడుతూ... 1893లో ఖేత్రిలో వివేకానందుడిని కలిసినప్పుడు తనకు ప్రేరణ కలిగిందని, ఆయన తనతో... 'నువ్వు దేవుడిని చూడాలనుకుంటే, పేదల గుడిసెలకు వెళ్ళు... నువ్వు దేవుడిని పొందాలనుకుంటే, పేదలకు, నిస్సహాయులకు, అణగారినవారికి, దుఃఖితులకు సేవ చేయి' అని అన్నారని చెప్పారు. పేదల సేవ ద్వారా దేవుడిని పొందడమే తనకు స్వామీజీ నుండి లభించిన మంత్రమని కల్యాణ్‌దేవ్ పేర్కొన్నారు.

భారత ప్రభుత్వం 1982లో ఆయనను పద్మశ్రీ, 2000లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది మీరట్ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డి.లిట్. ప్రదానం చేసింది. తుదకు ఆయన 2004లో పరమపదించారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.11.58 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** శ్రవణం రా.12.28 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** తె.4.23 నుండి 5.55 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.29 నుండి 9.17 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.45 వరకు, **అమృత ఘడియలు:** ప.1.55 నుండి 3.31 వరకు, మతత్రయ ఏకాదశి; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 6.07.



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.
– యాదగిరిగుట్ట రూరల్

ఏఐసీసీ డ్రాఫ్ట్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, న్యూఢిల్లీ: ఏప్రిల్ 8, 9 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్న ఏఐసీసీ కీలక సమావేశానికి 15 మందితో డ్రాఫ్ట్ కమిటీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అవకాశం కల్పించారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా వ్యవహరించనుండగా, సభ్యులుగా జైరాం రమేశ్, తారిక్ అన్వర్, దీపాదాస్ మున్షీ, సచిన్ పైలట్, బీకే హరిప్రసాద్, గౌరవ్ గొగోయ్, మనీశ్ తివారీ, రజినీ పాటిల్ సహా పలువురున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.

బండి వ్యాఖ్యలపై కేసు నమోదు చేయండి

- పోలీసులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ ఫిర్యాదు

బంజారాహిల్స్ (హైదరాబాద్): కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి.. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అవగాహన లేమితో బండి సంజయ్ చేసిన ఆరోపణలు ఎంతవరకు సమంజసమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎన్ని కల్లో నకిలీ నగదు ఉపయోగించారని కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేశారని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సంజయ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

లైంగిక దాడికి యత్నం.. రైలు నుంచి దూకిన యువతి

ఎంఎంటీఎస్ బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై ఆగంతకుడి దుశ్చర్య

- తప్పించుకునేందుకు నడుస్తున్న రైలులోంచి దూకిన యువతి
- గాయాలపాలైన బాధితురాలిని గాంధీకి తరలించిన స్థానికులు
- త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం: జీఆర్‌పీ ఎస్పీ చందనదీప్తి వెల్లడి

సికింద్రాబాద్/గాంధీ ఆస్పత్రి: ఎంఎంటీఎస్ రైలులో ఓ యువతిపై అత్యాచార యత్నం జరిగింది. ఆగంతకుడి బారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వేగంగా వెళ్తున్న రైలు నుంచి బాధితురాలు కిందకు దూకటంతో తీవ్రంగా గాయపడింది. ఈ నెల 22న రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో కోలుకుంటోంది. నిందితుడిని పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జి.సాయీశ్వర్‌గౌడ్ తెలిపారు.

బోగీలో ఒంటరిగా ఉండటంతో..

అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఓ యువతి (23) మేడ్చల్‌లోని ఒక ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన మొబైల్ రిపేర్ చేయించుకునేందుకు సికింద్రాబాద్‌కు వచ్చింది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తెల్లాపూర్– మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. ఆమె ఎక్కిన లేడీస్ కోచ్‌లో ఉన్న మరో ఇద్దరు మహిళలు రాత్రి 8 గంటల సమయంలో అల్వాల్ స్టేషన్‌లో దిగిపోవటంతో బోగీలో బాధితురాలు ఒక్కరే మిగిలింది. అది గమనించిన ఒక ఆగంతకుడు బోగీలోకి ప్రవేశించి బాధి తురాలిపై అఘాయిత్యం చేయబోయాడు. భయాందోళనకు గురైన ఆమె కొంపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో నడుస్తున్న రైలు నుంచి కిందికి దూకేసింది. తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితికి చేరిన యువతిని గుర్తించిన స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు.



బాధిత మహిళను పరామర్శించి, వివరాలు తెలుసుకుంటున్న జీఆర్‌పీ ఎస్పీ చందనదీప్తి

రెండు స్టేట్‌మెంట్లు

గాంధీ ఆస్పత్రిలో అదే రోజు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అయితే, తాను ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడ్డట్లు ఆమె పోలీసులకు తెలిపింది. దీంతో ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగానే పోలీసులు రికార్డు చేశారు. ఆ తర్వాత ఆస్పత్రికి వచ్చిన తన కుటుంబ సభ్యులకు తనపై అత్యాచార యత్నం జరిగిందన్న విషయాన్ని బాధితురాలు చెప్పటంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరోమారు బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్న పోలీసులు అత్యాచార యత్నం కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలిని కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నాలుగు బృందాలతో గాలింపు

బాధితురాలిని గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) ఎస్పీ చందనదీప్తి సోమవారం పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. రెండు బృందాలు సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలన, సాంకేతిక ఆధారాల సేకరణలో ఉన్నాయని వివరించారు. నిందితుడిని గుర్తించడంలో పురోగతి సాధించామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాం

బాధితురాలిని 22న రాత్రి 11.30 గంటలకు గాంధీ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారని ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆ సమయంలో ఆమె స్పృహలోనే ఉన్నప్పటికీ మతిస్థిమితం కోల్పోయినట్లు కనిపించిందని చెప్పారు. ఆమె చేయి మణికట్టు వద్ద విరిగిందని, శరీరంపై గాయాలున్నాయని వివరించారు. బాధితురాలికి వెంటనే ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు తగిన వైద్యసేవలు అందించారని, సీటీ స్కానింగ్ చేయించామని వెల్లడించారు. కాగా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సూచన మేరకు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి సోమవారం సాయంత్రం గాంధీ ఆస్పత్రికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. మంత్రుల ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం కోసం యశోద ఆస్పత్రికి తరలించారు. లెఫ్ట్ ఎగెనెస్ట్ మెడికల్ ఎడ్వైజ్ (లామా) ద్వారా బాధితురాలు గాంధీ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఆ తర్వాత వెల్లడించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణం

- ఎంఎంటీఎస్ ఘటనపై విచారణ వేగవంతం చేయాలి: కేటీఆర్
- మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/ గాంధీఆస్పత్రి: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా తయారైందని, ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారయత్నం ఘటనలో ఓ యువతి తీవ్ర గాయాలపాలవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసేలా ఆదేశించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం వల్లే ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన మొత్తం తెలంగాణ సమాజాన్ని కలిచివేసేదిలా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. హోంశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి చేతగానితనం వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని తెలిపారు. రాష్ట్ర రాజధానిలో ఈ తరహా దారుణాలు జరుగుతుంటే, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, రైల్వే సిబ్బంది ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైల్వే ఎస్పీ చందన దీప్తితో కవిత ఫోన్లో మాట్లాడి యువతిపై అత్యాచారయత్నం ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళలకు భద్రత కరువైంది: సబిత, శ్రీనివాస్‌గౌడ్

నడుస్తున్న రైలులో అత్యాచారయత్నం రాష్ట్రానికే సిగ్గుచేటని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు భద్రత కరువైందని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాసగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను వారు సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో షీ టీమ్ పనితీరు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు.



గాంధీఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

11,298 ఎకరాల్లో పంట నష్టం

- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

సాక్షి, హైదరాబాద్: ఈనెల 21 నుంచి 23 వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాల వల్ల 11,298 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. 13 జిల్లాలలోని 64 మండలాల్లో 6,670 ఎకరాలలో వరి, 4,100 ఎకరాలలో మొక్కజొన్న, 309 ఎకరాలలో మామిడి, మిగిలిన పంటలు దెబ్బతిన్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. వాస్తవానికి అంతకు రెండింతలు పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం కురిసిన వడగళ్ల వానకు వందల ఎకరాల్లో మామిడి, వేల ఎకరాల్లో వరి పంటలు నాశనమయ్యాయి. నల్లగొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, వరంగల్ వంటి జిల్లాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంట నాశనమైంది. పత్తి, మొక్కజొన్న పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.

బయ్యారంలో రాళ్లవాన

- నేలరాలిన మొక్కజొన్న.. విరిగిపడిన విద్యుత్‌స్తంభాలు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో సోమవారం సాయంత్రం గాలితో కురిసిన రాళ్ల వాన రైతులను నిలువునా ముంచింది. చేతికి వచ్చిన మొక్కజొన్న నేలవాలింది. మండలంలోని భీరోనిమడువ, రెడ్యాతండా, జగత్‌రావుపేట, అల్లిగూడెం, భీమ్లాతండా, పందిపంపుల, కొత్తూరు, కంబాలపల్లి, సుద్దరేవు, కోయగూడెం, లక్ష్మీపురం, మిర్యాలపెంట, వెంకటాపురం, సాంబతండా తదితర గ్రామాల్లో జోరువాన కురిసింది. దీంతో భీరోనిమడువ గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో అంధకారం నెలకొంది.



మహబూబాబాద్ జిల్లా భీరోనిమడువ సమీపంలో నేలవాలిన మొక్కజొన్న పంట




కెనడా ఎన్నికల్లో అడ్వాంటేజ్ కార్నీ

రేసులో ప్రధాని ముందంజ

- తగ్గుతున్న కన్జర్వేటివ్ గ్రాఫ్
- ట్రంప్ వ్యతిరేకతే ప్రధానాంశం
- కార్నీవైపే మెజారిటీ ప్రజల మొగ్గు


పియే పొలియెవ్రా


మార్క్ కార్నీ


జగ్మీత్ సింగ్

కొన్నేళ్లుగా నానారకాలైన ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్న కెనడాలో ఎన్నికల నగారా మోగింది. లిబరల్ పార్టీ సారథి, నూతన ప్రధాని మార్క్ కార్నీ అనూహ్యంగా 'ముందస్తు' నిర్ణయం తీసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ దాకా ఆగకుండా ఏప్రిల్ 28వ తేదీనే ప్రజా తీర్పు కోరాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే ముమ్మర ప్రచారంతో దూసుకెళ్తున్నారు. విపక్ష కన్జర్వేటివ్ పార్టీ నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నా విజయంపై ధీమాగా ఉన్నారు. ప్రస్తుతం తమ పార్టీకి అంతా అనుకూలంగా ఉందని కార్నీ భావిస్తున్నారు. ఇందుకు గట్టి కారణాలూ లేకపోలేదు. నిజానికి జస్టిన్ ట్రూడో పదేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆర్థికంగానే గాక అన్నివిధాలా దేశాన్ని ఆయన తిరోగమన బాట పట్టించారని వారంతా ఆగ్రహించారు. దాంతో ఎన్నికలు ఎప్పుడొచ్చినా కన్జర్వేటివ్ పార్టీ విజయం నల్లేరుపై నడకేనని అంతా భావించారు. కానీ మూడు నెలలుగా పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది. ట్రూడోను ప్రధాని పదవి నుంచి తప్పించడంతో లిబరల్ పార్టీపై ప్రజల ఆగ్రహావేశాలు చల్లార్చినట్టు కన్పిస్తోంది. దానికితోడు కెనడాను అడుగడుగునా అవమానిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరే ఈ ఎన్నికల్లో ప్రధానాంశంగా మారిపోయింది. తమ సమస్యల పరిష్కారం కంటే ట్రంప్‌కు గుణపాఠం చెప్పడమే ముఖ్యమని ప్రజలు భావిస్తున్నారు. అన్ని విషయాల్లోనూ అమెరికా అధ్యక్షునితో ఢీ అంటే ఢీ అంటున్న కార్నీ తీరు వారిని ఎంతగానో ఆకట్టుకుంటోంది. దీనికి తోడు కార్నీ ప్రధాన ప్రత్యర్థి అయిన కన్జర్వేటివ్ నేత పొలియెవ్రాకు ట్రంప్ సమర్థకునిగా పేరుండటం ఆ పార్టీకి ప్రతికూలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో వరుసగా నాలుగోసారి తమ గెలుపు లాంఛనమేనని లిబరల్ పార్టీ అంచనా వేసుకుంటోంది. కెనడాలో గత పదేళ్లలో జస్టిస్ ట్రూడో లేకుండా జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవే కావడం విశేషం.

మార్క్ కార్నీ

60 ఏళ్ల కార్నీ వృత్తిరీత్యా బ్యాంకర్. బ్యాంక్ ఆఫ్ కెనడాతో పాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు కూడా చీఫ్‌గా పని చేసిన ఘనత ఆయనది. అయితే రాజకీయాలకు మాత్రం పూర్తిగా కొత్త. కనీసం పార్లమెంటుకు పోటీ చేసి గెలిచిన చరిత్ర కూడా లేకున్నా కొద్ది రోజుల క్రితమే అనూహ్యంగా ఏకంగా ప్రధాని అయిపోయారు. అలా ప్రధాని హోదాలో ఎన్నికల అరంగేట్రం చేస్తున్న నేతగా అరుదైన రికార్డు నెలకొల్పారు. ట్రూడో గద్దె దిగాక లిబరల్ పార్టీ సారథ్య ఎన్నికల్లో ఏకంగా 85 శాతం మంది కార్నీకే ఓటేయడం విశేషం. ఉత్తర కెనడా నుంచి ప్రధాని అయిన తొలి వ్యక్తి కూడా ఆయనే. ఈ కొద్ది రోజుల్లోనే వరుస నిర్ణయాలతో కార్నీ మంచి దూకుడు కనబరిచారు. ట్రంప్‌పై ఆయన కఠిన వైఖరి ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటోంది. కెనడాను 51వ రాష్ట్రంగా చేసుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనను కార్నీ తూర్పారబట్టారు. కెనడా సార్వభౌమత్వాన్ని గుర్తించినప్పుడే ఆయనతో ఎలాంటి చర్చలైనా జరుపుతానని ప్రకటించారు. కెనడాపై ట్రంప్ సుంకాలకు దీటుగా అమెరికా మీద వెంటనే ప్రతీకార సుంకాలకు తెర తీసి ప్రజల మన్నన చూరగొన్నారు. నానా సమస్యలు ఎదుర్కొంటున్న దేశాన్ని ఈ ఆర్థిక నిపుణుడు గాడిలో పెడతారని వారు నమ్ముతున్నారు. నలుగురు అభ్యర్థుల్లో కార్నీయే మెరుగని ప్రజలు భావిస్తున్నట్టు పలు సర్వేలు చెబుతుండటం విశేషం. ఆదివారం నాటి ఆయన ఎన్నికల ప్రచార సభకు విశేషాదరణ లభించింది. ''ట్రంప్ రూపంలో కెనడా తన చరిత్రలోనే అతి పెద్ద ముప్పు ఎదుర్కొంటోంది. దాన్ని దీటుగా ఎదుర్కొనేందుకు నాకు భారీ మెజారిటీ ఇవ్వండి'' అంటూ కార్నీ ఇచ్చిన పిలుపునకు జనం విపరీతంగా స్పందించారు.

పియే పొలియెవ్రా

45 ఏళ్ల పొలియెవ్రా కన్జర్వేటివ్ పార్టీ సారథి. రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఆరితేరిన యువ నేత. 25 ఏళ్ల వయసులోనే హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికయ్యారు. అప్పట్లో ఆ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కునిగా నిలిచారు. ట్రూడో విధానాలకు తీవ్ర వ్యతిరేకి. దేశ సమస్యలన్నింటికీ అవే కారణమని నిత్యం విమర్శిస్తుంటారు. ధరల పెరుగుదల నుంచి హౌసింగ్ సంక్షోభం దాకా నానా ఇక్కట్లతో సతమతమవుతున్న కెనడావాసులను దూకుడైన ప్రసంగాలతో ఆకట్టుకుంటూ వచ్చారు. ఏడాదిన్నర క్రితం దాకా అన్ని సర్వేల్లోనూ హాట్ ఫేవరెట్‌గా నిలిచారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా పొలియెవ్రా ప్రధాని కావడం లాంఛనమేనని అంతా భావించిన పరిస్థితి! కానీ కార్నీ రాకతో పరిస్థితులు మారిపోయాయి. దీనికి తోడు ట్రంప్ సమర్థకుడన్న పేరు కూడా పొలియెవ్రాకు చేటు చేస్తోంది. దాంతో ఆయన కూడా ట్రంప్‌పై విమర్శలకు దిగుతుండటమే గాక 'కెనడా ఫస్ట్' నినాదం ఎత్తుకున్నారు. అయితే ఆదివారం నాటి ఆయన ఎన్నికల ప్రసంగానికి అంతంత స్పందనే లభించింది.

సర్వేలు ఏమంటున్నాయి...

ప్రధాన పార్టీలైన లిబరల్స్, కన్జర్వేటివ్స్ మధ్య పోటీ నువ్వా, నేనా అన్నట్టుగా ఉందని సర్వేలు చెబుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే తాజా సర్వేల్లో లిబరల్స్‌కు 37.5 శాతం, కన్జర్వేటివ్ పార్టీకి 37.1 శాతం ఓట్లొచ్చాయి. సర్వేల్లో లిబరల్స్ ముందంజ వేయడం గత మూడేళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం.

ఎన్నిక ఇలా...

భారత్‌లో మాదిరిగానే కెనడాలో కూడా ప్రధాని పదవికి ప్రత్యక్ష ఎన్నిక ఉండదు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో మెజారిటీ స్థానాలు సాధించే పార్టీ అధ్యక్షుడే ప్రధాని అవుతారు.

పార్టీల ప్రస్తుత బలాబలాలు

మొత్తం స్థానాలు	343
లిబరల్ పార్టీ	153
కన్జర్వేటివ్ పార్టీ	120
ఎన్డీపీ	24
క్యూఎన్‌పీ	33
ఇతరులు	13

జగ్మీత్ సింగ్

భారత సంతతికి చెందిన 46 ఏళ్ల జగ్మీత్ వామపక్ష న్యూ డెమొక్రటిక్ పార్టీ సారథి. కెనడాలో ఓ ప్రధాన పార్టీకి సారథ్యం వహిస్తున్న తొలి మైనారిటీ నేతగా రికార్డులకెక్కారు. ఎన్డీపీ 2021 నుంచి ట్రూడో ప్రభుత్వానికి మూడేళ్ల మద్దతిచ్చి దాని మనుగడకు కీలకంగా నిలిచింది. 2024లో మద్దతు ఉపసంహరించుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీపీ పెద్ద ప్రభావం చూపబోదని సర్వేలు పేర్కొన్నాయి. దానికి 9% మంది ఓటర్లు మద్దతిస్తున్నట్టు తేల్చాయి. పార్టీకి అధికారిక గుర్తింపును నిలుపుకోవడమే ఎన్డీపీకి సవాలుగా మారవచ్చంటున్నారు. బ్లాక్ క్యుబెక్ నేషనలిస్ట్ పార్టీ నుంచి ఫ్రాన్సోయిస్ బ్లాంచెట్ బరిలో ఉన్నారు. క్యూఎన్‌పీ పోటీ ఫ్రెంచి ప్రాబల్య ప్రాంతాలకే పరిమితమైంది. జగ్మీత్, బ్లాంచెట్ పోటీ నామమాత్రమేనని భావిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

హిమాచల్ డిప్యూటీ సీఎంకు త్రుటిలో తప్పిన ప్రమాదం

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ముకేశ్ అగ్నిహోత్రి, ఢిల్లీ డీజీపీ ప్రతుల్ వర్మ సహా 30 మంది ప్రయాణికులున్న విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. వీరు ప్రయాణిస్తున్న విమానం జుబ్బర్‌హట్టి ఎయిర్‌పోర్టులోని రన్‌వేపై ల్యాండవ్వకుండా ముందుకు దూసుకెళ్లింది. పైలట్ ఎమర్జెన్సీ బ్రేక్ వేయడంతో చిట్టచివరి అంచున ఉన్న స్టడ్స్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. దాదాపు అరగంట తర్వాత ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. అన్ని తనిఖీల తర్వాతే ఢిల్లీలో విమానం టేకాఫ్ తీసుకుందని చెప్పారు. సిమ్లాకు 15 కిలోమీటర్ల దూరంలో కొండప్రాంతంలో ఉన్న జుబ్బర్‌హట్టి ఎయిర్ స్ట్రిప్ పొడవు 1,230 మీటర్లు మాత్రమే. పైపెచ్చు ఏటవాలుగా ఉంటుందని చెబుతున్నారు. కాగా, తాజా ఘటనకు దారితీసిన కారణాలపై పౌర విమానయాన శాఖ దర్యాప్తు చేపట్టింది. విమానంలో సాంకేతిక లోపాలపై ఇంజనీరింగ్ సిబ్బంది తనిఖీ చేస్తున్నారని అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు టాస్క్‌ఫోర్స్

సుప్రీంకోర్టు మాజీ జడ్జి రవీంద్ర భట్ సారథ్యంలో ఎన్‌టీఎఫ్ ఏర్పాటు ● విద్యార్థుల మానసిక ఆందోళనలను తగ్గించేలా కృషి జరగాలన్న సుప్రీం

న్యూఢిల్లీ: ఐఐటీల వంటి ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం ప్రధానంగా దృష్టిపెట్టింది. రెండేళ్ల క్రితం ఐఐటీ(ఢిల్లీ)లో విద్యనభ్యసిస్తూ ఆత్మహత్య చేసుకున్న ఇద్దరు విద్యార్థుల విషయంలో ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయాలంటూ సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం సోమవారం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. ఆత్మహత్యల అంశంలో దర్యాప్తు చేయాలని సూచిస్తూ పలు వ్యాఖ్యలు చేసింది. '' వేర్వేరు ఉన్నతవిద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు కలచివేస్తున్నాయి. విద్యార్థులు తనవు చాలిస్తూ తమ జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్న ఉదంతాలకు చరమగీతం పాడాల్సిందే. విద్యార్థులు ఆత్మహ త్యలు చేసుకోకుండా నివారించే సమగ్ర, విస్తృతస్థాయి, స్పందనా వ్యవస్థలను బలోపేతం చేయాలి. ప్రైవేట్ కాలేజీలు సహా ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితిని పట్టించుకునే చట్టపరమైన, సంస్థాగతమైన వ్యవస్థ సమర్థంగా లేదు. ఒకవేళ ఉన్నా అందులో అసమానతలు ఎక్కువయ్యాయి. విద్యార్థులు తీవ్రమైన నిర్ణయాలు తీసుకోకుండా నివారించే నివారణ వ్యవస్థ కావాలి. అందుకే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్రభట్ సారథ్యంలో నేషనల్ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటుచేస్తున్నాం. ఇందులో రాష్ట్రాల ఉన్నతవిద్య, సామాజిక న్యాయం, సాధికారత, న్యాయ, మహిళ, చిన్నారుల అభివృద్ధి మంత్రిత్వ శాఖల కార్యదర్శులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. ఆత్మహత్యలకు దారితీస్తున్న కారణాల గుర్తింపు, ఆత్మహత్యల నివారణకు సంబంధించి నియమనిబంధనల పటిష్ట అమలుపై ఎన్‌టీఎఫ్ ఒక సమగ్ర నివేదికను రూపొందించనుంది. ఈ నివేదిక తుది రూపు కోసం ఎన్‌టీఎఫ్ దేశంలోని ఎలాంటి ఉన్నత విద్యాసంస్థలోనైనా ఆకస్మిక తనిఖీలు చేస్తుంది. ప్రస్తుత నిబంధనలకు తోడు అదనపు సిఫార్సులు చేసే అధికారమూ ఎన్‌టీఎఫ్‌కు ఉంది''అని సుప్రీంకోర్టు పేర్కొంది.

4 నెలల్లో మధ్యంతర నివేదిక

ఎన్‌టీఎఫ్ తమ మధ్యంతర నివేదికను నాలుగు నెలల్లోపు సమర్పించాల్సి ఉంటుంది. 8 నెలల్లోపు సమగ్ర నివేదికను సమర్పించాలి. 2023లో ఢిల్లీ ఐఐటీలో ఇద్దరు విద్యార్థులు మరణిస్తే ఎఫ్ఐఆర్ నమోదుకు ఢిల్లీ హైకోర్టు గతేడాది జనవరిలో నిరాకరించిన నేపథ్యంలో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు సుప్రీంకోర్టు ఆదేశించడంతో తాజాగా సుప్రీంకోర్టు పై విధంగా స్పందించింది. 2018 నుంచి 2023 ఏడాది వరకు ఉన్నతవిద్యాసంస్థల్లో 98 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు రాజ్యసభలో కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి 2023లో ప్రకటించడం తెల్సిందే. ఈకాలంలో ఐఐటీల్లో 39, ఎన్ఐటీల్లో 25, కేంద్రీయ వర్సిటీల్లో 25, ఐఐఎంలలో నలుగురు, ఐఐఎస్ఈఆర్‌లలో ముగ్గురు, ఐఐఐటీల్లో ఇద్దరు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

దక్షిణకొరియా ప్రధాని అభిశంసన కొట్టివేత

- హన్‌కు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు
- రాజ్యాంగ న్యాయస్థానం సంచలన తీర్పు

సియోల్: దక్షిణ కొరియాలో నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో అక్కడి రాజ్యాంగ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. దేశంలో మార్షల్ లాకు కారణమయ్యారనే ఆరోపణలపై ప్రధాని హన్ డక్-సూను అభిశంసిస్తూ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేయడంతోపాటు ఆయనకు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ తీర్పు వెలువరించింది. గతేడాది డిసెంబర్‌లో అకస్మాత్తుగా దేశంలో మార్షల్ లా విధించి అభిశంసనకు గురైన అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వ్యవహారంపై ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడం గమనార్హం. అయితే, మార్షల్ లా విధింపులో ఎలాంటి పాత్ర లేని హన్ విషయంలో రాజ్యాంగ కోర్టు 7–1 మెజారిటీతో వెలువరించిన తీర్పు ప్రభావం యూన్ విషయంలో ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పడం కష్టమని పరిశీలకులు చెబుతున్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై అట్టుడికిన పార్లమెంటు

కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లా?

- కర్నాటక ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ ధ్వజం
- రాజ్యాంగాన్నే కాంగ్రెస్ మార్చేస్తుందంటారా?
- శివకుమార్ రాజీనామా చేయాల్సిందే: రిజిజు
- జస్టిస్ వర్మపై చర్చ జరగొద్దన్నదే బీజేపీ లక్ష్యం
- అందుకే మాపై తప్పుడు ఆరోపణలు: కాంగ్రెస్


కిరెన్ రిజిజు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం సోమవారం పార్లమెంటులో దుమారం రేపింది. అధికార బీజేపీ ఉభయ సభల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తింది. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలని కర్నాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సూచించడం దారుణమంటూ బీజేపీ సభ్యులు మండిపడ్డారు. దీన్ని నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలకు దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఉభయ సభల్లోనూ ఈ అంశంపై మాట్లాడారు. ''ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగాన్ని కాంగ్రెస్ మారుస్తుందని రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న ఆ పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇది కచ్చితంగా రాజ్యాంగంపై దాడే. దీన్నెంత మాత్రమూ సహించరాదు. ఇలాంటి వ్యాఖ్యలపై సభ మౌనంగా ఎలా ఉండగలదు?'' అన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని మార్చాలని ఎందుకనుకుంటోందో ఆ పార్టీ అధ్యక్షుడు, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పష్టం చేయాలన్నారు. శివకుమార్‌తో రాజీనామా చేయించాలని రిజిజు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ చీలికలు పేలికలు చేయాలనుకుంటోందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా మండిపడ్డారు. మతాధారంగా రిజర్వేషన్లను అనుమతించే ప్రసక్తే లేదని అంబేడ్కర్ ఆనాడే స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అన్యాయం చేస్తూ తెలంగాణలో ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని ఆరోపించారు. అంతేగాక ముస్లింలను ఓబీసీ జాబితాలోకి మార్చేందుకు ప్రయత్నించిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు ఏ మేరకు సబబో ఖర్గే చెప్పాలన్నారు. అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ వివేకాన్ని కోల్పోయి ఇలాంటి పనులు చేస్తోందని నడ్డా ఎద్దేవా చేశారు. ఖర్గే స్పందిస్తూ రాజ్యాంగాన్ని ఏ శక్తీ మార్చలేదని స్పష్టం చేశారు. ''రాజ్యాంగాన్ని కాపాడేది మా పార్టీయే. దేశాన్ని విభజించడమే బీజేపీ పని. రాజ్యాంగాన్ని మార్చాలని శివకుమార్ అనలేదు. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ గతంలో అలాంటి వ్యాఖ్యలు చేశారు'' అంటూ ఆక్షేపించడంతో బీజేపీ సభ్యులు మండిపడ్డారు. ఖర్గే ప్రసంగాన్ని అడుగడుగునా అడ్డుకున్నారు. దాంతో సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. ఆ తర్వాత కూడా బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల వాగ్యుద్ధం ఆగకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది.

నడ్డా, రిజిజుపై సభాహక్కుల నోటీసు

బీజేపీ తీరుపై కాంగ్రెస్ మండిపడింది. ''ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారం పార్లమెంటులో చర్చకు రాకుండా చూడటమే బీజేపీ లక్ష్యం. అందుకే కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలతో ఉభయ సభలను స్తంభింపజేసింది'' అని రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్ ఆరోపించారు. నడ్డా, రిజిజుపై ఆయన సభాహక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చారు. ''కర్నాటక అసెంబ్లీ తీర్మానం, శివకుమార్ వ్యాఖ్యలపై వారిద్దరూ రాజ్యసభను తప్పుదోవ పట్టించారు. కనుక వారిపై చర్యలు తీసుకోవాలి'' అని చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను కోరారు. ముస్లిం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మార్చాలని తాను అనలేదంటూ శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు తమకు 400 లోక్‌సభ సీట్లివ్వాలని గత ఎన్నికల్లో ప్రజలను కోరిన బీజేపీ ఇలాంటి ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు.

రాజ్యాంగాన్ని సవరిస్తారా? డీకేను తొలగిస్తారా?

కాంగ్రెస్‌ను నిలదీసిన రిజిజు

న్యూఢిల్లీ: ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు రిజర్వేషన్లను కట్టబెట్టేందుకు రాజ్యాంగాన్ని సవరిస్తామంటూ ప్రకటించిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. లేదా ముస్లిం లీగ్ మార్గాన్ని అనుసరిస్తూ ముస్లింలకు రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరిస్తామని ఆ పార్టీ ప్రకటించాలన్నారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. అనంతరం, ఆయన 'ఎక్స్'లో..'ముస్లింలకు రిజర్వేషన్లతోపాటు ఇతర సదుపాయాలను కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరిస్తామని డీకే శివకుమార్ ప్రకటించిన విషయం స్పష్టమైంది. ఇది రాజ్యాంగాన్ని మోసం చేయడమే. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత చేసిన ప్రకటనను ఎన్డీఏ పక్షాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి'అని పేర్కొన్నారు.

ఆ వ్యాఖ్యలు చేయనేలేదు

ఖండించిన డీకే శివకుమార్



బెంగళూరు: రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరిస్తామని తాను చెప్పానంటూ వస్తున్న వార్తలను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా ఖండించారు. అటు వంటి వ్యాఖ్యలను తానసలు చేయ లేదని కుండబద్దలు కొట్టారు. దీనిపై అవసరమైతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. 'గత 36 ఏళ్లుగా అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగుతున్న సీనియర్ రాజకీయ నాయకుడిని. నాకు వివేకం ఉంది. ప్రాథమిక జ్ఞానం ఉంది. రాజ్యాంగాన్ని మార్చడం గురించి ఎప్పుడూ అలా మాట్లాడలేదు' అని మీడియాతో అన్నారు. 'కోర్టులిస్తున్న అనేక తీర్పులతో రిజర్వేషన్లలో ఎన్నో మార్పులుండొచ్చని ఏదో యథాలాపంగా మాత్రమే చెప్పాను. ఇప్పుడిచ్చిన రిజర్వేషన్ కూడా వెనుకబడిన కులాల కోటాలోనిదే. మేం రాజ్యాంగాన్ని మారుస్తామని మాత్రం అనలేదు'అని వివరించారు.

ఎంపీల వేతనాలు 24% పెంపు

నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యుల నెలవారీ జీతభత్యాలు, మాజీ ఎంపీలకు అందించే పెన్షన్ మొత్తాలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా పార్లమెంట్ సభ్యుల జీతాన్ని దాదాపు 24 శాతం మేర పెంచుతున్నట్లు కేంద్రప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో గతంలో ఒక్కో పార్లమెంట్ సభ్యుని వేతనం నెలకు లక్ష రూపాయలు కాగా పెంపు తర్వాత రూ.1.24 లక్షలకు పెరగనుంది. ఇతర అలవెన్సుల కింద గతంలో రూ70,000 ఇస్తుండగా ఇకపై రూ.87,000 ఇవ్వనున్నారు. ఆఫీస్ ఖర్చుల కింద గతంలో రూ.60,000 ఇస్తుండగా ఇకపై రూ.75,000 అందచేయనున్నారు. ఈ రూ.75,000లో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వ్యక్తికి జీతభత్యాలుగా రూ.50,000వరకు చెల్లించేందుకు అనుమతిస్తారు. మిగతా రూ.25,000ను స్టేషనరీ కోసం వినియోగించుకోవచ్చు.

డ్యూరబుల్ ఫర్నిచర్ కోసం రూ.1లక్ష

ఇవిగాక ప్రతి ఎంపీ తన ఐదేళ్ల సభ్యత్వకాలంలో రూ.1 లక్ష విలువైన సామగ్రిని కొనుగోలుచేసుకోవచ్చు. కుర్చీ, సోఫా వంటి డ్యూరబుల్ ఫర్నిచర్ ఈ విభాగంలోకి వస్తుంది. నాన్-డ్యూరబుల్ ఫర్నిచర్‌ను కొనేందుకు రూ.25,000వరకు చెల్లిస్తారు. విఠల్‌భాయ్ పటేల్ హౌస్‌లోని హాస్టల్ లేదంటే రెండు గదుల ఫ్లాట్‌ను వాడుకోవచ్చు. లేదంటే సెంట్రల్ ఢిల్లీలో బంగ్లాను వినియోగించుకోవచ్చు. వీటిల్లో ఉపయోగించిన విద్యుత్, నీరు, టెలిఫోన్, ఇంటర్‌నెట్ సదుపాయాల ఖర్చులనూ తిరిగి రీయింబర్స్ చేసుకోవచ్చు.

34 విమాన టికెట్లు సైతం

ఎంపీ తన నియోజకవర్గం నుంచి ఢిల్లీకి వచ్చేందుకు 34 సార్లు వన్-వే విమాన టికెట్లను రీయింబర్స్ చేసుకోవచ్చు. ఈ సదుపాయం ఎంపీ కుటుంబసభ్యులకూ ఉంటుంది. రైలు ప్రయాణంలోనూ ఇలాంటి సదుపాయాలు అందిస్తారు. పార్లమెంట్ సమావేశాలు, పార్లమెంటరీ కమిటీల మీటింగ్‌లలో పాల్గొనేందుకు వచ్చినందుకు సభ్యుల రోజువారీ భత్యాన్ని సైతం పెంచారు. ప్రస్తుతం ఇది రూ.2,000 కాగా ఇకపై రోజుకు రూ.2,500 అందించనున్నారు.

పెన్షన్ రూ.31వేలకు పెంపు

మాజీ పార్లమెంటు సభ్యులకు ప్రస్తుతం ఇస్తు న్న పెన్షన్‌ను రూ.25,000 నుంచి రూ. 31,000కు పెంచుతున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొత్త వేతనాలను 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తింపజేయనున్నారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీ

సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం

న్యూఢిల్లీ/ ప్రయాగ్‌రాజ్: కరెన్సీ కట్టల ఘటనలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ వేటు వేసింది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సోమవారం సిఫార్సుచేసింది. మార్చి 20, 24న సమావేశాల అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ఘటనపై సుప్రీం సూచన మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ అంతర్గత విచారణ జరపడం, జస్టిస్ వర్మ బదిలీకి సిఫార్సు చేయడం తెలిసిందే. ఆయన నివాసంలో అగ్నిప్రమాదం తాలూకు ఫొటోలు, వీడియోలతో పాటు అంతర్గత కమిటీ నివేదికను కూడా మార్చి 22న సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టడం తెల్సిందే.

మాకొద్దు: అలహాబాద్ హైకోర్టు లాయర్లు

అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ యశ్వంత్‌ను మళ్లీ అలహాబాద్ హైకోర్టుకు బదిలీచేయాలన్న కొలీజియం నిర్ణయాన్ని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (ఏహెచ్‌సీబీఏ) తీవ్రంగా తప్పుబట్టింది. ఆ జడ్జి గతంలో వెలువర్చిన తీర్పులను సమీక్షించాలని, తమ కోర్టుకు ఆయనను బదిలీచేయొద్దని డిమాండ్‌చేసింది. మార్చి 25వ తేదీ నుంచి నిరవధిక ధర్నాకు దిగుతామని ఏహెచ్‌సీబీఏ అధ్యక్షుడు అనిత్ తివారీ హెచ్చరించారు. జస్టిస్ వర్మను అభిశంసించాలంటూ సోమవారం మధ్యాహ్నం నుంచి లాయర్లు విధులకు దూరంగా ఉండిపోయారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేసు

కరెన్సీ కట్టల ఉదంతంపై ఎఫ్ఐఆర్ నమోదుచేసేలా ఢిల్లీ పోలీసులను ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు/సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై ఎలాంటి నేర విచారణా జరపకూడదన్న 1991 నాటి సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అడ్వకేట్ మాథ్యూస్ నెడుంపారా తదితరులు కేసు వేశారు. ''ఈ రక్షణ న్యాయవ్యవస్థ జవాబుదారీతనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఇలా భారీగా నగదు బయటపడితే కేసు నమోదు చేయాల్సిందే. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై కేసు నమోదుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందస్తు అనుమతి కావాలన్న నిబంధనను తొలగించండి'' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

విధులకు దూరం పెట్టిన ఢిల్లీ హైకోర్టు

జస్టిస్ వర్మను న్యాయపరమైన విధుల నుంచి దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఒక నోట్ జారీచేశారు. ఇది తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. తర్వాత కాసేపటికే జస్టిస్ వర్మ బదిలీ సిఫార్సు వెలువడింది.

ఆర్థిక శాఖ కార్యదర్శిగా అజయ్ సేథ్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా సీనియర్ అధికారి అజయ్ సేథ్ సోమవారం నియమితులయ్యారు. కర్ణాటక కేడర్‌కు చెందిన 1987 బ్యాచ్ ఐఏఎస్ అయిన సేథ్‌ను ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొన్నటి వరకు కార్యదర్శిగా పనిచేసిన తుహిన్ కాంత్ పాండే సెబీ చైర్మన్‌గా నియమితులవడంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో అత్యంత సీనియర్ అధికారిని ఆర్థిక కార్యదర్శిగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది.

కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు.. హమాస్ కీలక నేత సహా 61 మంది మృతి

జెరూసలేం: గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో 61 మంది పాలస్తీనియన్లు చనిపోయినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. దక్షిణ ప్రాంత నగరం ఖాన్‌యూనిస్‌లోని అతిపెద్దదైన నాసర్ ఆస్పత్రిపై ఆదివారం రాత్రి చోటుచేసుకున్న వైమానిక దాడిలో ఇద్దరు చనిపోయారు. వీరిలో ఒకరు హమాస్ రాజకీయ విభాగం సభ్యుడు ఇస్మాయిల్ బర్హోమ్ కాగా, మరొకరు రెండు రోజుల క్రితమే శస్త్రచికిత్స పూర్తయిన 16 ఏళ్ల బాలుడు. అయితే, హమాస్ స్థావరంపై తాము దాడి చేసినట్లు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. హమాస్, ఇజ్రాయెల్ మధ్య పోరు మొదలైనప్పటి నుంచి ఇప్పటి దాకా పలుమార్లు నాసర్ ఆస్పత్రి దాడికి గురైన విషయం తెల్సిందే. ఇజ్రాయెల్ దాడులతో 24 గంటల వ్యవధిలో మొత్తం 61 మంది ప్రాణాలు కోల్పోయారని సహాయక బృందాలు తెలిపాయి. వీరిలో మహిళలు, చిన్నారులు ఉన్నారన్నాయి. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన మొత్తం 50,082 మందిలో 15, 613 మంది చిన్నారులున్నట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. వీరిలో ఏడాది లోపు పసికందులు 872 మంది అని వివరించింది. మరోవైపు, రఫా నగర శివార్లలోని టెల్ అల్-సుల్తాన్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ మిలటరీ చేసిన హెచ్చరికలతో వేలాదిగా పాలస్తీనియన్లు తలదాచుకునేందుకు మువాసి దిశగా సాగిపోతున్నారు. రఫా నగరాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధించిందని, పౌరులెవ్వరినీ బయటకు రానివ్వడం లేదని స్థానిక యంత్రాంగం తెలిపింది.




హిట్.. హిట్.. హుర్రే..
గంటల తరబడి వ్యాయామం చేయడానికి బదులు కేవలం నిమిషాల్లో ముగించేందుకు వీలుగా కొత్త కొత్త పద్ధతులు పుట్టుకొస్తున్నాయి. అలా వచ్చిందే ఈ హిట్ వర్కవుట్. -సిటీప్లస్‌లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం సా. 6.34 గం.	బుధవారం ఉ. 4.54 గం.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 35.0/23.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

క్రైం సిటీ @ మండే



అమీర్‌పేటలో క్రిసెంట్ కేఫ్ గోడ కూలి వెనుకవైపున్న కారుపై పడిపోయిన దృశ్యం

హబ్సిగూడలో అదుపుతప్పి గోడను ఢీకొన్న డీసీఎం

- ఒకరి హత్య, రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- 'ఎంఎంటీఎస్ బాధితురాలికి' పరామర్శలు
- కలకలం సృష్టించిన మరికొన్ని ఉదంతాలు

- వివరాలు 8లో

సోమవారం రక్తమోడిన మహా నగరం

మహా నగరం సోమవారం ఉలిక్కిపడింది..ఫాక్స్ సాగర్‌లో పడి ఇద్దరు చనిపోగా... ఆ మృతదేహాలు సోమవారం ఉదయమే వెలుగులోకి వచ్చాయి. వరుసపెట్టి రోడ్డు ప్రమాదాలు, హత్య చోటు చేసుకున్నాయి. వీటితో మొత్తం ఐదుగురు చనిపోగా... వీరిలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నారు. చంపాపేటలో ఓ న్యాయవాదిని దారుణంగా హతమార్చారు. ఎస్సార్‌నగర్ పరిధిలో గ్యాస్ లీకై పేలుడు జరిగి ఆరుగురు గాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన బెట్టింగ్ యాప్స్ కేసుల్లోనూ కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇక ఎంఎంటీఎస్ రైలులో లైంగికదాడి యత్నాన్ని తప్పించుకునేందుకు కిందకు దూకిన బాధితురాలిని పలువురు పరామర్శించారు. - సాక్షి, సిటీబ్యూరో

1 ఆమెకు బాసటగా...

ఆంధ్రప్రదేశ్‌లోని ఉరవకొండకు చెందిన యువతిపై (23) ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారయత్నం జరిగింది. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్‌కు ప్రయాణిస్తున్న ఈ యువతి ఉన్న కంపార్ట్‌మెంట్‌లోని అల్వాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి (25) ఎక్కాడు. అఘాయిత్యానికి యత్నించడంతో రైలు నుంచి దూకి తీవ్రంగా గాయపడింది. శనివారం రాత్రి ఈ ఘాతుకం చోటు చేసుకోగా...ఆదివారం కేసు నమోదైంది. సోమవారం వెలుగులోకి రావడంతో రైల్వే ఎస్పీ చందనాదీప్తి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు.

2 రోడ్ టెర్రర్..విద్యార్థులు బలి

ఉస్మానియా యూనివర్సిటీ ఠాణా పరిధిలోని అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యూనివర్సిటీలో మైనింగ్ ఇంజినీరింగ్ చదువుతున్న గోదావరిఖనికి చెందిన సిద్ధార్థ్, భద్రాద్రి కొత్తగూడెం వాసి రాజ్‌కుమార్ తెల్లవారుజామున 1.45 గంటలకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ అదుపుతప్పి పడిపోయారు. ఈ యాక్సిడెంట్‌లో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు.

3 అండగా నిలిచినందుకు హత్య

ప్రేమ పేరుతో వేధింపులకు గురవుతున్న గృహిణికి అండగా నిలబడిన న్యాయవాది దారుణహత్యకు గురయ్యారు. అడ్వకేట్ ఇజ్రాయిల్ ఇంటిలో అద్దెకు ఉంటున్న వివాహితను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ గులాం దస్తగిరి ప్రేమ పేరుతో వేధించాడు. ఈ విషయం బాధితురాలి ద్వారా తెలుసుకున్న ఇజ్రాయిల్ ఆమెతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆమెకు దస్తగిరి నుంచి ప్రాణహాని ఉండవచ్చని అనుమానించి స్వగ్రామానికి పంపేశారు. దీంతో ఇజ్రాయిల్‌పై కక్షకట్టిన దస్తగిరి చంపాపేటలో కాపుకాసి పట్టపగలు నడిరోడ్డుపై హత్య చేశాడు.

4 ముంచేసిన మద్యం మత్తు

పేట్ బషీరాబాద్ పరిధిలోని ఉమహేశ్వర్ కాలనీకి చెందిన నామ్ దేవ్, అతడి సమీప బంధువు బాలాజీ శనివారం రాత్రి సమీపంలోని ఓ బార్‌కు వెళ్లారు. మద్యం మత్తులో వాహనం నడుపుకుంటూ వస్తూ ఫాక్స్ సాగర్ వద్ద అదుపుతప్పి చెరువులో పడి మరణించారు. సోమవారం వీరి మృతదేహాలు చెరువులో తేలడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

5 బ్రేక్ ఫెయిలై బీభత్సం..

హబ్సిగూడ ప్రధాన రహదారిలో బ్రేక్ ఫెయిల్ అయిన డీసీఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. ఈ వాహనం మెట్రో రైలింగ్, డివైడర్‌లతో పాటు గ్రీన్ సిగ్నల్ కోసం వేచి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయా వాహనాలు ధ్వంసం కాగా..తల్లీ కుమారులు విజయలక్ష్మి, సాయికుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఉదంతంతో ఆ రహదారిలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

6 నిందితులుగా మరికొందరు..

సామాజిక కార్యకర్త ఫణీంద్ర శర్మ ఫిర్యాదు మేరకు గత వారం మియాపూర్ పోలీసులు 25 మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసు నమోదు చేశారు. దీని దర్యాప్తులో భాగంగా వీళ్లు ప్రమోట్ చేసిన 19 కంపెనీలను నిందితులుగా చేర్చారు.

7 వీఐపీలనూ వదలొద్దు

బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్, ప్రముఖ క్రికెటర్లు సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లీపై కూడా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడు అర్జున్ గౌడ్ పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన బంజారాహిల్స్ నివాసి కావడంతో ఆ ఠాణాలో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించి వెనక్కు పంపారు. మరోపక్క ఇటీవల నమోదైన బెట్టింగ్ యాప్స్ కేసులో నిందితురాలిగా ఉన్న సినీ నటి, యాంకర్ శ్యామల పంజగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

8 ఊహించని ముప్పు

అమీర్‌పేట సత్యం థియేటర్ చౌరస్తాలోని క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్‌లో గ్యాస్ లీకై పేలుడు జరిగింది. ఈ ధాటికి దాని గోడలు పగిలిపోవడంతో పాటు షట్టర్ గాలిలోకి ఎగిరింది. ఇటుక పెళ్లలు పక్కనే ఉన్న హరి దోశ హోటల్‌లోకి దూసుకుపోయాయి. అక్కడ సలసలా కాగుతున్న కడాయిలో పడటంతో ఆ నూనె మీదపడి ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

సిటీకి బెర్త్ లేనట్లే..!

మంత్రి వర్గ విస్తరణపై ఊహాగానాలు

- హైదరాబాద్ నుంచి గెలిచింది ఒకే ఒక్కరు.. తొలిసారి ఎమ్మెల్యే
- పార్టీ మారిన ఎమ్మెల్యేల మెడపై వేలాడుతున్న 'అనర్హత వేటు' కత్తి

సాక్షి, సిటీబ్యూరో: మంత్రి వర్గ విస్తరణలో హైదరాబాద్ నగరానికి బెర్త్ లేనట్లుగానే కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీచినా..సిటీలో మాత్రం ఒక్కరు కూడా గట్టెక్కలేక పోయారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికలో మాత్రం కంటోన్మెంట్ నుంచి శ్రీ గణేష్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశం దాదాపు లేదు. ఇక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సిటీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కత్తి వేలాడుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆయన ఇటీవల ప్రభుత్వం అక్రమ కట్టడాల కోసం ఏర్పాటు చేసిన హైడ్రాపై పెదవి విరవడం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో పెట్టుకుంటే తప్పేంటి అని ప్రశ్నించడం లాంటి ఘటనలను అధికార పక్షం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. సిటీ నుంచి మైనారిటీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ ఎన్నికైనప్పటికీ తొలిసారిగా కావడంతో ఆయనకు అవకాశం ఉండక పోవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. నగర శివారులోని రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

మంత్రి పదవి ఆశిస్తున్న మల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి ఆశిస్తున్నారు. నిజానికి ఆయన తొలి మంత్రివర్గ విస్తరణలోనే అవకాశం లభిస్తుందని ఆశించారు. కానీ ఇప్పటికీ అవకాశం రాకపోవడంతో అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. గాంధీభవన్ సాక్షిగా పార్టీ పెద్దలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వంలో విప్‌గా పనిచేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చేవెళ్ల సీనియర్ శాసన సభ్యుడు కాలె యాదయ్యలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు, మంత్రి పదవులను ఆశించి వీరంతా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే, ఆయా ఎమ్మెల్యేల మెడపై కూడా కోర్టు తీర్పు కత్తి వేలాడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వారెవరికీ మంత్రి పదవి దక్కే అవకాశం లేనట్లు కనిపిస్తోంది.

నిమ్స్ పన్ను బకాయి రూ. 50 కోట్లు

చెల్లించాలని లేఖ రాసిన అధికారులు

- ఇదే జాబితాలో కత్రియా హోటల్, అమరావతి థియేటర్

బంజారాహిల్స్: ఆస్తి పన్ను బకాయిలు రాబట్టడానికి జీహెచ్ఎంసీ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఈ నెల 31లోపు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోకుండా ఇంకా సతాయిస్తే సీజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 అధికారులు ఆస్తి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు, వారెంట్లు జారీ చేశారు. మొండిగా వ్యవహరిస్తున్న యాజమాన్యాల నుంచి ఆస్తి పన్ను ముక్కుపిండి వసూలు చేసేలా ఆస్తుల జప్తుకు కసరత్తు చేస్తున్నారు. పంజగుట్టలోని నిమ్స్ ఆస్పత్రి రూ. 50 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిపడింది. ఓటీఎస్ కింద చెల్లించాలని ఇప్పటికే నిమ్స్ యాజమాన్యానికి అధికారులు లేఖ రాశారు.

- తెలంగాణ సచివాలయం పన్ను బకాయిలు రూ.2 కోట్ల మేర పేరుకుపోయాయి.
- సోమాజిగూడలోని కత్రియా హోటల్ రూ.8 కోట్లు పన్ను బకాయి పడింది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే వారెంట్లు కూడా జారీ చేశారు. త్వరలోనే హోటల్‌ను సీజ్ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.



నోటీసు అంటిస్తున్న అధికారులు

- ఖైరతాబాద్‌లోని అమరావతి థియేటర్ రూ.2 కోట్ల మేర పన్ను బకాయి పడింది.
- హెచ్ఎండీఏ అధీనంలోని బుద్ధ పూర్ణిమ, ఎన్టీఆర్ గార్డెన్, జలవిహార్‌లు రూ.20 కోట్లు పన్ను బకాయి పడ్డాయి.
- సోమాజిగూడలోని జాయ్ ఆస్పత్రి రూ.45 లక్షలు,పోలో హోటల్ రూ.50 లక్షలు చెల్లించాలి.
- సుమారుగా 120 కమర్షియల్ ప్రాపర్టీస్ వివిధ కారణాలతో మూతపడటంతో బకాయిలు పెండింగ్‌లో పడ్డాయి. ఈడీ, బ్యాంక్‌లు సీజ్ చేసిన ఈ వాణిజ్య సముదాయాల నుంచి కోట్లాది రూపాయల ఆస్తి పన్ను రావాల్సి ఉంది. వీటిని ఎలా రాబట్టాలనే దానిపై యోచిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా!



అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

- నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీ ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ కోటా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న ఎమ్మెస్ ప్రభాకర్‌రావు పదవి గడువు మే ఒకటో తేదీన ముగియనున్న నేపథ్యంలో ఈ షెడ్యూల్ జారీ అయింది.

ఈసారి ఎంఐఎంకు?

తొలుత కాంగ్రెస్‌లో ఉన్న ఎంఎస్ ప్రభాకర్‌రావు బీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఈ సీటు ఎవరికి దక్కనుందన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడుస్థానాల్లో గెలవగా, బీఆర్ఎస్, సీపీఐ ఒక్కో స్థానం వంతున గెలవడం తెలిసిందే. ఆ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తమకు సహకరించాల్సిందిగా ఎంఐఎంను కోరినట్లు ప్రచారం జరిగింది. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఎంఐఎంకు అవకాశం కల్పిస్తామన్నట్లు రాజకీయంగా ప్రచారం జరిగింది. ఒకవేళ అదే జరిగితే కాంగ్రెస్ తమ అభ్యర్థిని బరిలో దింపే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ ఎలా వ్యవహరిస్తాయనేది ఆసక్తికరంగా మారింది. సాధ్యమైనంతవరకు పోలింగ్ వరకు ఈ ఎన్నికల ప్రక్రియ సాగే అవకాశం లేదు. బలాబలాల నేపథ్యంలో కొన్ని పార్టీలు ఈ ఎన్నికకు దూరంగా ఉండే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అభివృద్ధి పనులకు ఆటంకం

ఈ ఎన్నికల కోడ్ వెంటనే అమల్లోకి వస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో, నగరంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగనుంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఈ స్థానిక సంస్థ పరిధిలో కొచ్చే కోర్‌సిటీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు వీల్లేదు. పనులకు శంకుస్థాపనలు వంటివి సైతం చేయరు. రాజకీయ నేతలు..పనుల కోసం ఉన్నతాధికారులను అడిగేందుకూ వీల్లేదు. నగరంలోని వివిధ పనులపై ఈ కోడ్ ప్రభావం పడనుంది. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులిచ్చినప్పటికీ, పలు ప్రాజెక్టుల పనులకు టెండర్లు సైతం పిలవలేకపోయారు. నిర్వహణకు సంబంధించిన పనులు యథావిధిగా జరుగుతాయని అధికారులు చెబుతున్నా.. చాలా పనులు నిలిచిపోనున్నాయి. కొత్త పనులకు అవకాశం లేదు. జీహెచ్ఎంసీలో విధానపర నిర్ణయాలు తీసుకునే స్టాండింగ్ కమిటీ సమావేశాలు సైతం జరగవు. నాలాల సమస్యలకు సంబంధించిన పనులు సైతం ఇంకా ప్రారంభం కానివి, ప్రారంభించే అవకాశం లేదు. సీఆర్ఎంపీ కింద రోడ్ల నిర్వహణను సైతం కొత్తగా చేపట్టే అవకాశం ఉండదు.

ఎంఎంటీఎస్ రైళ్లలో భరోసా లేని భద్రత



- ఎంఎంటీఎస్ స్టేషన్‌లు, రైళ్లలో కొరవడిన ఆర్పీఎఫ్ నిఘా
- అల్వాల్‌స్టేషన్ సమీపంలో ఘటన నేపథ్యంలో ప్రశ్నార్థకంగా మహిళల భద్రత

సాక్షి.సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రైళ్లు, స్టేషన్లలో మహిళా ప్రయాణికుల భద్రత మరోసారి చర్చనీయాంశంగా మారింది. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్‌కు వెళ్తున్న ఎంఎంటీఎస్ ట్రైన్‌లోని మహిళా కోచ్‌లోకి ప్రవేశించిన ఒక వ్యక్తి ప్రయాణికురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడడం, అతడి నుంచి తప్పించుకొనేందుకు ఆమె కదులుతున్న రైలులోంచి దూకి తీవ్ర గాయాలపాలు కావడంతో ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళా ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సికింద్రాబాద్ నుంచి లింగంపల్లి వరకు నడుస్తున్న కొన్ని రైళ్లలో ఆర్పీఎఫ్ శక్తి బృందాలు, జీఆర్పీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఎంఎంటీఎస్‌లలో మహిళలకే కాకుండా సాధారణ ప్రయాణికుల భద్రతపైన కూడా ఆందోళన నెలకొంది. తరచూ ఏదో ఒక స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరి దాడులకు పాల్పడుతున్నారు. ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్, మేడ్చల్, నాంపల్లి, తదితర మార్గాల్లో నడిచే రైళ్లపైన ఎలాంటి నిఘా వ్యవస్థలు పని చేయడం లేదు. ఆర్పీఎఫ్, జీఆర్పీ భద్రత కూడా లేదు. నగరంలో సుమారు 30 ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా కేవలం 10 స్టేషన్ల మాత్రమే ఆర్పీఎఫ్ విధులు నిర్వహిస్తోంది. సికింద్రాబాద్ డివిజన్‌లో ఒక ఎస్ఐతోపాటు 16 మంది మహిళా కానిస్టేబుళ్లతో శక్తి టీమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఈ బృందాల పనితీరు కొన్ని స్టేషన్‌లకు పరిమితం. అలాంటి నిఘా, భద్రతా బృందాలు హైదరాబాద్ డివిజన్‌లో లేకపోవడం గమనార్హం.

సీసీ కెమెరాల నిఘా లేదు...

ప్రస్తుతం లింగంపల్లి–ఫలక్‌నుమా, మేడ్చల్–సికింద్రాబాద్–లింగంపల్లి, ఫలక్‌నుమా–సికింద్రాబాద్–మేడ్చల్, ఫలక్‌నుమా–నాంపల్లి–లింగంపల్లి, తదితర మార్గాల్లో ప్రతి రోజు సుమారు 75 సర్వీసులు నడుస్తున్నాయి. ఈ సర్వీసుల సమయ పాలన, నిర్వహణ, భద్రతను అధికారులు కొంతకాలంగా గాలికి వదిలేశారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు. ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి ట్రైన్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా కోచ్‌ను ఏర్పాటు చేసినా ఆయా బోగీల్లోకి పురుషులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. మహిళలు అభ్యంతరం చెబుతున్నా పట్టించుకోకుండా కొందరు ఆకతాయిలు ఇష్టారాజ్యంగా ఒక స్టేషన్‌లో ఎక్కి మరో స్టేషన్‌లో దిగిపోతూ మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. మగ ప్రయాణికులు ఈ బోగీల్లోకి ప్రవేశించకుండా అరికట్టేందుకు ప్రతి బోగీలో ఆర్పీఎఫ్ మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. మరోవైపు అన్ని బోగీల్లోనూ సీసీకెమెరాలను ఏర్పాటు చేసి ఆర్పీఎఫ్ డివిజన్ కార్యాలయాలతో అనుసంధానం చేయాలనే ప్రతిపాదనను కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, బేగంపేట్, హైటెక్‌సిటీ, లింగంపల్లి, మల్కాజిగిరి, చర్లపల్లి, ఘట్కేసర్ వంటి ప్రధానమైన స్టేషన్లలో మినహా మిగతా స్టేషన్లలో కూడా సీసీ కెమెరాలు సరిగ్గా పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 'ప్రస్తుతం దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే రైళ్లలో మాత్రమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే మహిళా ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఎంఎంటీఎస్ రైళ్లలో కూడా ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది. ఆ దిశగా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.' అని ఆర్పీఎఫ్ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. సిబ్బంది కొరత దృష్ట్యా అన్ని చోట్ల ఏర్పాటు చేయడం సాధ్యం కాకపోవచ్చునని, సీసీకెమెరాలు ఉంటే పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసి నేరాలు జరగకుండా నిరోధించవచ్చునని పేర్కొన్నారు.

ఆకతాయిలు, అసాంఘికశక్తులకు అడ్డాలుగా బోగీలు

భద్రతా విభాగాల మధ్య సమన్వయం కరువు

మరోవైపు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కూడా నేరాల నియంత్రణ సవాల్‌గా మారిందనే అభిప్రాయం కూడా ఉంది. ప్రయాణికుల భద్రత తమ పరిధిలోని అంశం కాదన్నట్లుగా, రైల్వే ఆస్తుల రక్షణ మాత్రమే తమ బాధ్యత అన్నట్లుగా ఆర్పీఎఫ్ వ్యవహరిస్తుందని జీఆర్పీ పోలీసులు ఆరోపిస్తున్నారు. కానీ జీఆర్పీ నిర్వర్తించాల్సిన విధులను తామే నిర్వహిస్తున్నామని, జీఆర్పీ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆర్పీఎఫ్ పోలీసులు ఆరోపిస్తున్నారు. ఇలా ఇరువర్గాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా నేరస్తులకు అవకాశంగా మారుతోంది.

మద్యం మత్తులో బైక్ అదుపు తప్పి

- చెరువులోకి దూసుకెళ్లిన వాహనం
- నీట మునిగి ఇద్దరి మృతి..


నామ్‌దేవ్, బాలాజీ మృతదేహాలు

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో బైక్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో నీట మునిగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది... పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉమామహేశ్వర కాలనీకి చెందిన నామ్‌దేవ్, అతని మేనల్లుడు బాలాజీ ఆదివారం రాత్రి సమీపంలోని బార్‌లో మద్యం సేవించి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఫాక్స్‌సాగర్ చెరువు గట్టు మీదుగా వస్తుండగా బైక్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో ఇద్దరు నీట మునిగారు. సోమవారం ఉదయం ఫాక్స్‌సాగర్‌లో రెండు మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీసి వారిని నామ్‌దేవ్, బాలాజీగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన వేగం

బైక్ అదుపు తప్పి ఇద్దరు
ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం


రాజ్‌కుమార్ (ఫైల్)


సిద్దార్థ్ (ఫైల్)

లాలాపేట: అతి వేగం ఇద్దరు విద్యార్థుల నిండు ప్రాణాలను తీసుకుంది. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం దుమ్ముగూడెం ప్రగలపల్లి గ్రామానికి చెందిన బంటు రాజ్‌కుమార్(20), పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనికి చెందిన అటికెటి సిద్దార్థ(21) ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఆదివారం రాత్రి వీరు ఓయూ హాస్టల్ నుంచి బైక్‌పై విద్యానగర్ వెళుతుండగా అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడి మృతి


షాదుల్లా మృతదేహం

శామీర్‌పేట: స్కూటీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామానికి చెందిన షాదుల్లా (27), రాపిడో డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం అతను కొల్తూర్ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా సిటీ నుంచి జినోమ్ వ్యాలీకి వస్తున్న ఆర్‌కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు అతడిని ఢీ కొట్టింది. ఈ తీవ్ర గాయాలు కావడంతో షాదుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణికి అండగా ఉన్నందుకు... అంతమొందించాడు

చంపాపేటలో న్యాయవాది దారుణ హత్య

- గృహిణిపై లైంగిక వేధింపులను అడ్డుకున్నందుకు కక్షపూనిన వైనం
- మూడు రోజులుగా రెక్కీ...
- అనంతరం పక్కా ప్లాన్‌తో కత్తితో దాడి చేసిన ఎలక్ట్రీషియన్


రక్తపు మడుగులో ఇజ్రాయిల్


ఇజ్రాయిల్ (ఫైల్)


నిందితుడు దస్తగిరి

చంపాపేట: లైంగిక వేధింపులకు గురవుతున్న ఓ మహిళకు అండగా ఉన్న లాయర్‌ను కక్షగట్టి దారుణంగా హత్య చేశాడు. చంపాపేటలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువులు తెల్పిన వివరాల ప్రకారం..మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎర్రబాబు ఇజ్రాయిల్ (56) నగరంలోని చంపాపేట డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీలో నివసిస్తున్నాడు. తన ఇంటి సమీపంలోనే ఓ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల ఫ్లాట్‌ను కొనుగోలు చేసి..ఓ గృహిణి కుటుంబ సభ్యులకు అద్దెకు ఇచ్చాడు. అదే కాలనీ సమీపంలోని సుల్తానా అల్వా కాలనీ శ్మశాన వాటిక కాపలాదారుడుగా పని చేస్తున్న గులాం దస్తగిరి ఖాళీ సమయంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా కూడా పనిచేస్తున్నాడు. ఇజ్రాయిల్ కొనుగోలు చేసిన ఫ్లాట్‌లో దస్తగిరి విద్యుత్ మరమ్మతు పనులకు వెళ్తుండే వాడు. ఈ క్రమంలోనే ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్న గృహిణితో పరిచయం ఏర్పడింది. దీన్ని అలుసుగా తీసుకున్న దస్తగిరి తనను ప్రేమించాలని, అండగా ఉంటానని ఆమెను వేధించసాగాడు. వేధింపులు భరించలేని ఆ గృహిణి ఫ్లాట్ యజమాని ఇజ్రాయిల్‌కు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఆయన దస్తగిరిని మందలించాడు.

పోలీసులకు ఫిర్యాదు చేయించి..

దస్తగిరి వేధింపులు ఎక్కువ అవడంతో 25 రోజుల క్రితం ఇజ్రాయిల్ ఐఎస్‌సదన్ పోలీసులకు గృహిణితో ఫిర్యాదు చేయించాడు. ఆమెకు దస్తగిరి నుంచి ప్రాణహాని ఉందని హెచ్చరించాడు. ఆమెను బంధువుల ఇంటికి పంపించి వేశాడు. ఈ క్రమంలో పోలీసులు దస్తగిరిని స్టేషన్‌కు పిలిపించి..నామమాత్రంగా మందలించి, కౌన్సిలింగ్ చేసి పంపించేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన దస్తగిరి.. ఇజ్రాయిల్‌పై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతన్ని అంతం చేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ ఇంటి ముందు రెక్కీ నిర్వహించిన దస్తగిరి సోమవారం ఉదయం 9 గంటలకు ఇజ్రాయిల్ తన స్కూటీపై ఒంటరిగా రావటాన్ని పసిగట్టి..ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రక్తపు మడుగులో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇజ్రాయిల్‌ను సమీపంలోని డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఇజ్రాయిల్ అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కాగా పోలీసులు గృహిణి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోలేదని, తీసుకుని ఉంటే ఈ హత్య జరిగేది కాదని స్థానికులు విమర్శిస్తున్నారు. కాగా ఇజ్రాయిల్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మాజీ డైరెక్టర్‌గా పనిచేశాడు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

న్యాయవాది హత్యపై ప్రభుత్వానికి బార్ కౌన్సిల్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో అత్యంత దారుణంగా న్యాయవాదిని హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. వీలైనంత త్వరగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. దాడులు, హత్యలు ఇలాగే కొనసాగితే న్యాయవాదులు విధులు నిర్వహించడం కష్టంగా మారుతుందని బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి పేర్కొన్నారు. హత్య విషయం తెలిసిన వెంటనే కౌన్సిల్ భేటీ అయ్యి.. దారుణాన్ని ఖండించినట్లు చెప్పారు. చంపాపేట్ డివిజన్ ఐఎస్ సదనలో న్యాయవాది ఇజ్రాయెల్‌ను దుండగుడు దస్తగిరి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. న్యాయవాది హత్య అత్యంత దారుణమని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్, హెచ్‌సీఏఏ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు న్యాయవాదులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. హత్యపై పారదర్శక దర్యాప్తు చేయించి, వీలైనంత త్వరగా దోషులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పెద్ద తలకాయలను వదలొద్దు

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై
హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడు అర్జున్ గౌడ్



పంజగుట్ట: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేస్తున్న ప్రముఖులను వదిలి పెట్టవద్దని, ఈ వ్యవహారంతో సంబంధమున్న ప్రముఖ సినీనటుడు షారూఖ్ ఖాన్, క్రికెట్ ప్రముఖులు సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎ 23 రమ్మి గేమ్‌ను షారూఖ్ ఖాన్, పేటీయం ఫస్ట్ గేమ్ సచిన్ టెండుల్కర్, మిడిల్ ప్రీమియర్ లీగ్‌కు విరాట్ కోహ్లి ప్రమోషన్ చేశారని, వీరి ప్రభావంతో చాలామంది బెట్టింగ్ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారని, కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు. అయితే బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు ఆయనకు సూచించారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో సినీనటి, యాంకర్ శ్యామల సోమవారం పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. దాదాపు నాలుగు గంటలపాటు శ్యామలను వివిధ ప్రశ్నలు వేసిన పోలీసులు తిరిగి ఎప్పుడు విచారణకు పిలిస్తే అప్పుడు హాజరు కావాలని నోటీసులు ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం పోలీస్‌స్టేషన్ బయట శ్యామల మీడియాతో మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చెయ్యడం తప్పని, ఇకపై ప్రమోషన్స్ చేయబోనని చెప్పారు. ఇప్పటికే టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్ గౌడ్, బుల్లితెర నటులు విష్ణుప్రియ, రీతూ చౌదరీ విచారణకు హాజరయ్యారు. ఇదే కేసులో ఉన్న హర్షసాయి, ఇమ్రాన్ విదేశాలకు వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

తప్ప తాగి వాహనం నడుపుతూ..

పోలీసులకు చిక్కిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్



పంజగుట్ట: మద్యం మత్తులో వాహనం నడుతున్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెలితే .. సోమవారం ఉదయం పంజగుట్ట అమీర్‌పేట రహదారిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు అటుగా వస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆపి వాహనం పత్రాలు చూపించాలని కోరారు. అయితే అతని నోటిలో నుంచి మద్యం వాసన వస్తుండటాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించగా బీఏసీ 325 వచ్చింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ యాదగిరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

గంజాయి డాన్ అరెస్ట్

- 115 కేజీల గంజాయి, కారు స్వాధీనం..
- మరో కేసులో ముగ్గురు బీటెక్ విద్యార్థుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించి విక్రయిస్తున్న ఓ గంజాయి డాన్‌ను ఎక్సైజ్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి 115 కిలోల గంజాయి, కారు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తులశ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా, బూర్గుపాడు గ్రామానికి చెందిన దుగ్యంపూడి శివశంకర్‌రెడ్డి అలియాస్ శివారెడ్డి గంజాయి డాన్‌గా గుర్తింపు పొందాడు. గతంలో అతను ఒడిశా నుంచి హైదరాబాద్‌తో పాటు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పెద్ద ఎత్తున గంజాయి అక్రమ రవాణా చేశాడు. 2019 నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అతను ఇప్పటి వరకు 850 కిలోలకుపైగా గంజాయిని సరఫరా చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడిపై పీటీ వారెంట్ కూడా ఉంది. సోమవారం శివారెడ్డి జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు కారులో తరలిస్తున్న 115 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 లక్షలు ఉంటుందని అంచనా. అతనితో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు.

ముగ్గురు బీటెక్ విద్యార్థుల అరెస్ట్

కేపీహెచ్‌బీ వసంతనగర్ కాలనీకి చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థులు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా సుల్తాన్‌పూర్‌కు చెందిన రాహుల్, పెద్దపల్లి జిల్లా భూంనగర్ కు చెందిన అజయ్ కుమార్, కమాన్‌పూర్ మండలానికి చెందిన తాడిపల్లి అభిలాష్‌లను అరెస్టు చేశారు.

'ఫ్యూచర్ సిటీ' కోసం 36 పోస్టులు

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం 36 పోస్టులను కేటాయించినట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో కేడర్, నాన్ కేడర్ పోస్టులు ఉన్నాయి. ఐఏఎస్ కేడర్ ఉన్నవారిని కమిషనర్ పోస్టుల్లో, ప్రమోషన్ల మీద ఉన్నవారిని నాన్ కేడర్ పోస్టుల్లో నియమించింది. కమిషనర్, అడిషనల్ కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫైనాన్షియల్ అడ్వయిజర్, అకౌంట్స్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అడిషనల్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్, ప్లానింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, ఆర్కిటెక్ట్, డ్రాఫ్ట్‌మెన్, సర్వేయర్, జీఐఎస్ ఎక్స్‌పర్ట్, టెక్నికల్ అసిస్టెంట్, చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, లీగల్ సెక్రటరీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించింది. పరిపాలనా విభాగం, ఆర్థిక విభాగం, మానిటరింగ్ యూనిట్ ఎస్టేట్ ఆఫీస్, లీగల్ వింగ్ విభాగాల్లో పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బేకరీలో భారీ పేలుడు

- క్రిసెంట్ కేఫ్ బేకర్స్‌లో గ్యాస్ లీకై పేలిన సిలిండర్
- ఆరుగురికి గాయాలు


పేలుడు ధాటికి రోడ్డుపై పడ్డ సామగ్రి


చికిత్స పొందుతున్న పుండలిక్ / గాయపడిన కరణ్‌సింగ్ / కారుపై కూలిన గోడ

అమీర్‌పేట: అమీర్‌పేట సత్యం థియేటర్ చౌరస్తాలోని క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్‌లో గ్యాస్ లీకై భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి షాపు గోడలు బద్దలై షట్టర్ గాలిలో ఎగిరి ఫుట్‌పాత్‌పై పడింది. ఇటుక పెల్లలు పక్కనే ఉన్న హరి దోస హోటల్ లోపలికి దూసుకెళ్లి నూనె కడాయిలో పడటంతో ఆరుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో హుస్సేన్ అనే వ్యక్తి నాలుగు నెలలుగా క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి హరి దోస హోటల్‌తో పాటు వెనక ఉన్న మెకానిక్ షాపు వైపు గోడలు ధ్వంసమయ్యాయి. గోడ కుప్ప కూలడంతో ఓ కారు ధ్వంసమైంది. షాప్ ముందు భాగం గోడలతో సహా ఊడిపోయి షట్టర్ ఎగిరి ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై పడింది. ఇటుకలు హరి దోస హోటల్‌లో స్టవ్‌పై ఉన్న కడాయిలో పడటంతో కాగుతున్న నూనె పడి వంట మాస్టర్లు పుండలిక్, కరణ్‌షిండేలకు తీవ్ర గాయాలయ్యాయి. హోటల్‌లో పనిచేసే మరో నలుగురు సిబ్బంది నాగప్ప, సోను, బబ్లు కుమార్, భీమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. పుండలిక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల్లో నలుగురు బీదర్‌కు చెందిన వారు కాగా ఒకరు జార్ఖండ్‌కు చెందిన వాడు. కాగా హోటల్ యజమాని సంతోష్ ఘటనకు కొద్ది క్షణాల ముందే బయటికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడని సిబ్బంది తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వాంగ్మూలాన్ని సేకరించారు. వెస్టు జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హబ్సిగూడలో డీసీఎం బీభత్సం

మూడు బైక్‌లు ధ్వంసం, ముగ్గురికి గాయాలు


హబ్సిగూడ సిగ్నల్ వద్ద మెట్రో రెయిలింగ్‌ను ఢీకొన్న డీసీఎం వాహనం

లాలాపేట: హబ్సిగూడ ప్రధాన రహదారిలో ఓ డీసీఎం వాహనం బ్రేక్ ఫెయిలై బీభత్సం సృష్టించింది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల కథనం మేరకు సోమవారం ఉదయం హబ్సిగూడ చౌరస్తాలో సిగ్నల్ పడిన సమయంలో వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వాహనం అదుపుతప్పి నాచారం వైపు వెళ్లే దారిలోని మెట్రో స్టేషన్ రెయిలింగ్‌ను, డివైడర్‌ను, అక్కడే వేచివున్న మరో మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకుపై వెళ్తున్న సాయికుమార్, అతని తల్లి విజయలక్ష్మి, మరో బైకుపై వెళ్తున్న రసూల్‌పురాకు చెందిన రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో సాయికుమార్, విజయలక్ష్మిలను చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీసీఎం బ్రేకులు ఫెయిల్ అయినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఈ సంఘటనతో హబ్సిగూడ రహదారిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

చోరీకి వచ్చి..భవనం పైనుంచి పడి..

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

గన్‌ఫౌండ్రీ: ఓ భవనంలో దొంగతనానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని మనోరంజ్ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో ఆదివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. దీనిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకునేందుకు వెంటపడటంతో వారు భయంతో మరో భవనంపైకి దూకేందుకు యత్నించారు. ఈ ఘటనలో ఓ వ్యక్తి (45) ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడగా, మరో వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కిందపడిన వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సెక్యూరిటీ సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న బేగంబజార్ పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు సేకరించేందుకు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఎవరో ఈ బాలుడు?



అత్తాపూర్: పాండురంగానగర్‌లో ఏడుస్తూ కనిపించిన ఐదేళ్ల బాలుడిని స్థానికులు అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఐదు సంవత్సరాల బాలుడిని స్థానికులు గుర్తించారు. పుట్టు మూగ, చెవులు కూడా వినిపించకపోవడంతో ఎలాంటి సమాచారం అందించలేకపోతున్నాడు. దీంతో పోలీసులకు ఆ బాబును అప్పగించారు. పిల్లవాడి ఆచూకీ తెలిసిన వారు అత్తాపూర్ పోలీసులు సంప్రదించాలని కోరారు.

రేపు 'చలో రామోజీ ఫిలింసిటీ'


జగన్

ఇబ్రహీంపట్నం రూరల్: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల విముక్తి కోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న 'చలో రామోజీ ఫిలిం సిటీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాధిత పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్లు 189, 203లో ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించిన పేదల స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరయ్యే ఈ కార్యక్రమానికి బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్ల వంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 35, పచ్చి కాకరకాయ 35, పందిరిబీర 28, క్యాబేజీ 12, క్యారెట్‌ 23, దొండకాయ 35, గుండు బీన్స్‌ 45, గింజచిక్కుడు 50, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్‌ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 65, క్యాలీఫ్లవర్‌ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రేమించమని వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్‌: సోషల్‌ మీడియాలో పరిచయమైన యువకుడు ప్రేమించమని వేధిస్తున్న సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో నివసించే మహిళకు 15 ఏళ్ల క్రితం కార్మికనగర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. భర్త కార్మికనగర్‌లో చికెన్‌ సెంటర్‌ నిర్వహిస్తుంటాడు. ఆమె కూడా తన సోదరుడి మటన్‌షాపులో పని చేస్తుంది. ఆదివారం ఆమె మటన్‌షాపు నుంచి ఇంటికి వచ్చేసరికి స్టోర్‌ రూం తాళం తీసి ఉంది. ఆ గదిలో బాలాపూర్‌ ప్రాంతానికి చెందిన అబ్దుల్‌ రహీం అనే యువకుడు ఆమె కుమార్తెతో కలిసి ఉన్నాడు. గతంలో తన కుమార్తెకు సోషల్‌ మీడియా ద్వారా అతను పరిచయం అయ్యాడని, ఆమెను ప్రేమిస్తున్నానని వెంట పడుతున్నారని తల్లికి తెలిపింది. దాంతో యువతి తల్లి రహీంకు ఇది తగదని హెచ్చరించింది. అయినా యువతి వెంట పడుతున్నాడు. తన కుమార్తెను ప్రేమించమని వేధిస్తున్న అబ్దుల్‌ రహీంపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్‌ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జస్టిస్‌ వర్మను వెంటనే అరెస్టు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్‌ బోస్‌

హిమాయత్‌నగర్‌: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ యశ్వంత్‌ వర్మ ఇంట్లో బయటపడ్డ నోట్ల కట్టల ఆధారంగా ఆయనను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్‌.బోస్‌ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. జస్టిస్‌ వర్మకు నిజాయితీ... న్యాయ వ్యవస్థ మీద గౌరవం ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేసి విచారణ కమిటీకి పూర్తి సహకరించాలన్నారు. అలా కాకుండా నేరం నుంచి తప్పించుకోవటానికి తన మీద ఎవరో కుట్ర పన్నుతున్నట్టుగా ప్రకటనలు ఇవ్వటం.. తన ఇంట్లో బయటపడిన నోట్ల కట్టలకు తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పటం అతని స్థాయికి, తాను నిర్వహిస్తున్న పదవికి సరైంది కాదన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

రహమత్‌నగర్‌: గంజాయిని విక్రయిస్తున్న ఓ యువకుడిని నార్కొటిక్‌, బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పీలీ దర్గా వద్ద ఓ యువకుడు గంజాయి విక్రయిస్తున్నడనే సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడి అదుపులోకి తీసుకుని విచారించారు. బాలానగర్‌కు చెందిన మేకల తరుణ్‌కూమార్‌(28) అలియాస్‌ తరుణ్‌గా గుర్తించారు. తన కష్టమర్ల కోసం మహారాష్ట్ర నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుంటాడు. ఈ సందర్భంగా అతని వద్ద ఉన్న కిలో గంజాయి, సెల్‌ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మహిళను వేధిస్తున్న బావపై కేసు నమోదు

సనత్‌నగర్‌: మహిళను వేధిస్తున్న ఆమె బావపై సనత్‌నగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ హరీష్‌ తెలిపిన మేరకు.. బోరబండ ప్రాంతానికి చెందిన మహిళ (31) జీహెచ్‌ఎంసీలో ఉద్యోగం చేస్తోంది. 2020లో ఆమెకు వివాహం కాగా ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భర్త, అత్తా మామలు, బావ సంజీవ్‌కుమార్‌ (39)కుటుంబంతో కలిసి ఉమ్మడిగా ఉంటున్నారు. కొంతకాలంగా సదరు మహిళను బావ సంజీవ్‌కుమార్‌ వేధించడం మొదలుపెట్టాడు. ఈ నెల 22వ తేదీన బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా వచ్చి చేయి పట్టుకున్నాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రుల సహకారంతో సనత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు సంజీవ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారం అందజేసిన చిన్నారులు

సనత్‌నగర్‌: మోడల్‌కాలనీ కమాన్‌ వద్ద మానవ సేవా ఛారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మిత ఆహార పంపిణీ కార్యక్రమంలో సోమవారం చిన్నారులు తమవంతు భాగస్వామ్యం వహించి స్ఫూర్తిగా నిలిచారు. బాటసారులకు ఆహారం అందించే క్రమంలో ప్రతిరోజూ వండే వంటకాలను తల్లిదండ్రులతో కలిసి కేంద్రం వద్ద తామే వడ్డించడం గమనార్హం. ఇందుకు సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి దిక్సూచి అయ్యింది. మెనూలో భాగంగా చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి టమాటో రైస్‌, కూర, పెరుగన్నం తయారుచేసుకుని వచ్చి వాళ్లే వడ్డించారు. చిన్నారులకు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా చేయాలనే ఉద్దేశ్యంతో వారిని ప్రోత్సహించడం జరుగుతుందని సనాతన ధర్మ బల సంస్కరణ సమితి ప్రతినిధి దండా బుచ్చిబాబు తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లపై ఫోకస్‌!

- బకాయిదారులపై పెరుగుతున్న ఒత్తిడి
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న అధికారులు
- చెల్లింపునకు ఈ నెల 31న ఆఖరు
- ఓటీఎస్‌ను వినియోగించుకోవాలని సూచన
- చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామంటున్న అధికారులు



పన్ను చెల్లించాలని ఆటోల ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంజారాహిల్స్‌: ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేందుకు జీహెచ్‌ఎంసీ తీసుకువచ్చిన వన్‌ టైమ్‌ స్కీం (ఓటీఎస్‌) గడువు ఈ నెల 31తో ముగియనుంది. 2024–25వ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయి మొత్తాన్ని కేవలం 10 శాతం వడ్డీతో ఏకకాలంలో పూర్తిగా చెల్లించి వడ్డీపై 90 శాతం మాఫీని పొందేందుకు ఈ అవకాశం కల్పించారు. 10 శాతం వడ్డీ చెల్లించండి.. 90 శాతం వడ్డీ మాఫీ పొందండి అనే నినాదంతో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌–17, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆటోల ద్వారా బ్యానర్లను ప్రదర్శిస్తూ లౌడ్‌ స్పీకర్లలో ఈ స్కీం గురించి ప్రచారం చేస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లించని యజమానులకు అద్భుత అవకాశమని సర్కిల్‌–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. సర్కిల్‌లో 164 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు రూ. 120 కోట్లు వసూలయ్యాయి. మొత్తం 66 వేల మంది వినియోగదారులు పన్నులు చెల్లిస్తుండగా ఇందులో 51 వేల మంది ఇప్పటివరకు చెల్లించారు. మిగతా బకాయిదారులంతా ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలని, లేకపోతే వారి ఆస్తులు జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మొండి బకాయిదారులు చెల్లించాల్సిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను సాధ్యమైనంత త్వరగా చెల్లించాలని సూచిస్తున్నారు. హెచ్చరికలు ఖాతరు చేయకుండా మొండికేస్తున్న సంస్థలను సీజ్‌ చేయాలని తలపెట్టారు.

జూబ్లీహిల్స్‌ సర్కిల్‌ పరిధిలో...

- జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 పరిధిలో రూ. 187 కోట్లు ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 24వ తేదీ నాటికి రూ. 152 కోట్లు వసూలయ్యాయి. సర్కిల్‌ పరిధిలో మొత్తం 67 వేల మంది ప్రాపర్టీ ట్యాక్స్‌ చెల్లింపుదారులు ఉండగా ఇందులో ఇప్పటి దాకా 50 వేల మంది చెల్లించారు. రూ. 5 లక్షల పైబిలుకు చెల్లింపుదారులు 60 మంది వరకు ఉన్నారు. ఇప్పటికే మొండి బకాయిదారులకు నోటీసులు, వారెంట్లు జారీ చేసి హెచ్చరించారు.
- ఈ నెల 31వ తేదీ లోపు ఓటీఎస్‌ను వినియోగించుకుని వడ్డీ మాఫీ పొందాలని డీసీ ప్రశాంతి సూచించారు. రోజూ ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు మొండి బకాయిదారుల వద్దకు వెళ్తూ పన్నులు చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేసేందుకు సిద్ధం అవుతున్నారన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



బల్కంపేట రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

బంజారాహిల్స్‌: అమీర్‌పేట సత్యం టాకీస్‌ నుంచి బల్కంపేట ఎల్లమ్మ గుడి మీదుగా ఫతేనగర్‌ బ్రిడ్జి వరకు ఎస్సార్‌నగర్‌ ట్రాఫిక్‌ పోలీసులు సోమవారం ఫుట్‌పాత్‌ ఆక్రమణలపై కొరడా ఝళిపించారు. ఆపరేషన్‌ రోప్‌ నిర్వహించి సుమారు రోడ్డుకు రెండు వైపులా 35 ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించారు. ట్రాఫిక్‌ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సైదులు సిబ్బందితో కలిసి ఆక్రమణలను తొలగించారు. బస్టాపులతో పాటు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి కొన్నాళ్లుగా ఏర్పాటుచేసిన ఈ ఆక్రమణలతో రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్‌ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫిర్యాదులు అందుకున్న ట్రాఫిక్‌ పోలీసులు భారీ బందోబస్తు మధ్య వీటిని తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారులను హెచ్చరించారు. రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై డబ్బాలు ఏర్పాటుచేసి వ్యాపారాలు చేయడం ద్వారా ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడుతుందని, పాదచారులు రోడ్డెక్కుతున్నారని, సమస్య తీవ్రతరం అవుతుందని పేర్కొన్నారు.

నీరే జీవనాధారం



సాక్షి, సిటీబ్యూరో: అనేక రకాల ఆరోగ్య, ఆరోగ్యేతర అంశాలలో నీటి పాత్ర కీలకమని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అయాన్‌ ఎక్సేంజ్‌ ది మోడ్రన్‌ లివింగ్‌ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ది పార్క్‌ హోటల్‌లో హైడ్రోనెక్స్ట్‌ 2025 పేరిట సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ బి.దినేష్‌ కుమార్‌ (ఐసీఎంఆర్‌–ఎన్‌ఐఎన్‌, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) నీటి పాదుపు అవసరాన్ని నొక్కి చెప్పారు. డాక్టర్‌ ఎస్‌.శ్రీధర్‌ (ఐఐసీటీ), డాక్టర్‌ మనోజ్‌ కురియ కోస్‌ నీటి హీలింగ్‌ ఎనర్జీని హైలైట్‌ చేశారు. అదే విధంగా సర్టిఫైడ్‌ హైడ్రోజన్‌ అడ్వైజర్‌ శ్రీనివాసులు హైడ్రోజన్‌ నీటి ప్రయోజనాలను వివరించారు. డాక్టర్‌ భరత్‌ పటోడియా (ఆంకాలజిస్ట్‌) కేన్సర్‌ చికిత్సలో హైడ్రోజన్‌ పాత్రను వివరించారు హవాయి స్లైడ్‌ గిటారిస్ట్‌ జయవంత్‌ నాయుడు నీటిని సంగీత, సంతోషాలతో అనుసంధానిస్తూ మాట్లాడారు. ది మోడరన్‌ లివింగ్‌ బిజినెస్‌ హెడ్‌ రవికాంత్‌ నిమ్‌ మాట్లాడారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నేతలు

హిమాయత్‌నగర్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికలప్పుడు రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్‌ జి.సంజీవరెడ్డి పిలుపు మేరకు ఐఎన్‌టీయూసీ ప్రైవేట్‌ ట్రాన్స్‌పోర్ట్‌ డ్రైవర్స్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్‌ గౌడ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బిజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌.డి.చంద్రశేఖర్‌ నేతృత్వంలో సోమవారం నారాయణగూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడానికి కార్మికుల కృషి ఎంతో ఉందని గుర్తుచేశారు. ఎన్నికల సందర్భంగా వారికి ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఆటో కార్మికులకు ఏటా రూ. 12 వేలతో పాటు రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు, ఆటోనగర్‌ ఏర్పాటుతో పాటు కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని కాంగ్రెస్‌ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. తక్షణమే హామీల అమలుకు పూనుకోవాలన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తామని వారు హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ క్యాబ్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల ఉపేందర్‌, ఆటో యూనియన్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు ఎస్‌.దయానంద్‌, ఆటో యూనియన్‌ నాయకులు అంబదాసు, నాగరాజు, నాగ మల్లయ్య, జానయ్య, కనకయ్య, క్యాబ్‌ యూనియన్‌ నాయకులు రఫీ, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌ విందులు మతసామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్‌లో పాల్గొన్న బీఆర్‌ఎస్‌ ఖైరతాబాద్‌ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

వెంకటేశ్వరకాలనీ: ఇఫ్తార్‌ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్‌ఎస్‌ పార్టీ ఖైరతాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌రోడ్‌ రోడ్‌ నెం. 1లోని డెక్కన్‌ పేరెంట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన ఖర్జూరం తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎంఏ. ఫయాజ్‌, ప్రధాన కార్యదర్శి గులాం అజీముద్దీన్‌, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ మహ్మద్‌ జహంగీర్‌ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ‘జాస్మిన్‌’ మినీ కాన్వొకేషన్‌



శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు పట్టాలు అందుకొని సంబురపడ్డారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని జాస్మిన్‌ హైస్కూల్‌లో మినీ కాన్వొకేషన్‌ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు స్కూల్‌ చైర్మన్‌ పి.జగన్నాథం, కరస్పాండెంట్‌ పి.విజయలక్ష్మి పట్టాలను ప్రదానం చేశారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపాల్‌ యు.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

బంజారాహిల్స్‌: అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు మినిస్టర్‌ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్‌ నియోజకవర్గం కన్వీనర్‌ జెట్టి విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ... అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల హామీ అంశాన్ని ప్రస్తావించాలని నేతలు కోరారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలాన్ని ఇస్తామని మాటిచ్చారని ఇచ్చిన మాట ప్రకారం 250 గజాల స్థలంతో పాటు పెన్షన్‌ను అందించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్‌, ప్రసాద్‌, శంకర్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లలో సోదరభావం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ వర్మ

వెంగళరావునగర్‌: సమాజంలోని ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండటమే పెద్ద పర్వదినమని మధురానగర్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.శ్రీనివాస్‌ వర్మ అన్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్‌ వద్ద ఉన్న జాంగీర్‌ఖాన్‌ మసీదు వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్‌ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్‌ విందులతో సోదరభావం నెలకొని మతసామరస్య వెల్లివిరుస్తుందన్నారు. నిర్వాహకులు ఫయాంతోపాటు షఫీ, వసీం, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు నర్సింగ్‌దాస్‌, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి సేవించొద్దన్నందుకు మహిళకు బెదిరింపు

వెంగళరావునగర్‌: గంజాయి తాగవద్దని చెప్పిన మహిళను చంపుతానని ఓ యువకుడు బెదిరిస్తున్న సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సూరారం ప్రాంతానికి చెందిన మహిళ గత ఏడాది కూకట్‌పల్లిలో కాస్మొటిక్‌ క్లినిక్‌లో చేరింది. అదే క్లినిక్‌లో అవినాష్‌ అనే థెరపిస్ట్‌ ఆమెకు పరిచయం అయ్యాడు. తర్వాత ప్రేమిస్తున్నానని అన్నాడు. లేకపోతే చేయికోసుకు చనిపోతానని బెదిరించాడు. దాంతో ఆమె అంగీకరించింది. గత ఏడాది కూకట్‌పల్లి నుంచి స్థానిక కృష్ణకాంత్‌ పార్క్‌ వెనుక ప్రాంతానికి క్లినిక్‌ను మార్చారు. ఇద్దరూ కలిసి అక్కడ ఉంటూ విధులు నిర్వహిస్తుండగా ఫిబ్రవరి నెలలో అతని జేబులో గంజాయి పాకెట్‌ చూసింది. అనంతరం ఆమె అతనిని హెచ్చరించి మానేయాలని సూచించింది. అతని కజిన్‌ సోదరి ఉమకు కూడా విషయాన్ని తెలియజేసింది. అయినా మానలేదు. ఎవరికైనా తెలిపితే చంపేస్తానని, విడిపోక ముందు ఇద్దరి ఫొటోలు అందరికీ పంపుతానని బెదిరించాడు. గత నెలలో అతని ప్రవర్త సరిగ్గా లేకపోవడంతో విధుల నుంచి తొలగించారు. దాంతో అవినాష్‌ ఆమె వద్దకు వచ్చి నీ వల్లనే నా ఉద్యోగం పోయింది. నిన్ను చంపేస్తానని ఆమెను బెదిరించసాగాడు. ఆమె భర్తకు, తెలిసిన వారందరికీ కూడా ఫొటోలు పంపుతానని బెదిరిస్తున్నాడు. అతని బెదిరింపులు తాళలేక ఆ మహిళ మధురానగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వద్దంటున్నా.. దూసుకుపోతున్నారు...

- ట్రాఫిక్‌ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న మైనర్లు
- ఈ ఏడాది నార్త్‌జోన్‌ ఏసీపీ పరిధిలో 124 కేసులు
- 81 మందికి రూ.1,57,700 జరిమానా



ట్రాఫిక్‌ పోలీసుల వాహన తనిఖీలు.. (ఫైల్‌)

సనత్‌నగర్‌: నగర రోడ్లపై మైనర్లు రయ్‌ రయ్‌ అంటూ దూసుకుపోతున్నారు. మైనర్లు పట్టుబడ్డ సమయంలో బేగంపేటలోని ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ (టీటీఐ)లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌తో పాటు పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్రతినిత్యం నమోదవుతున్న కేసులే ఇందుకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తున్నాయి.

- డ్రైవింగ్‌ బాగానే చేస్తున్నారు కదా.. పర్వాలేదు అన్న ధోరణితో తల్లిదండ్రులు సైతం ప్రోత్సహిస్తుండడం మూలంగా తరచూ మైనర్లు పట్టుబడుతూనే ఉన్నారు. దీంతో మైనర్లతో పాటు వాహన యజమానులపై చర్యలు తీసుకుంటున్నారు. కేసులు నమోదు చేసిన సమయంలో చాలామంది ట్రాఫిక్‌ పోలీసులపై విరుచుకుపడిపోతుంటారు. కానీ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్న నిబంధనను మాత్రం మరిచిపోతున్నారు.
- కొందరు ఇక్కడే కదా? వెళ్లొచ్చేస్తాం అని ఇంట్లో చెప్పి వెళ్తుంటే..మరికొందరు ఇంట్లో చెప్పకుండా ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్తూ పట్టుబడుతున్నారు.
- మైనర్లను జువైనల్‌ కోర్టుకు, వాహన యజమానులను సాధారణ కోర్టుకు పంపిస్తున్నారు. అనంతరం ఇద్దరికీ కలిపి కౌన్సెలింగ్‌ ఇస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్‌ చేస్తూ పలు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు అనేకం చోటుచేసుకున్నాయి.
- పలు ఘటనల్లో తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగిల్చిన ఘటనలను తెలియజేస్తూ చైతన్యం తీసుకువస్తున్నా మైనర్లు డ్రైవింగ్‌ చేస్తూ పట్టుబడుతూనే ఉన్నారు.
- ఆ ఏముంది..మహా అయితే ఫైన్‌ వేస్తారు..అంతే కదా? అన్న పరిస్థితికి మైనర్లు, వారి తల్లిదండ్రులు వచ్చేశారు. ఏకంగా పాఠశాలలకు కూడా ద్విచక్ర వాహనాలను డ్రైవింగ్‌ చేసుకుంటూ వస్తున్నా పాఠశాలల యాజమాన్యాలు కూడా పట్టించుకోవడం లేదు. అటు తల్లిదండ్రులకు లేని అభ్యంతరం..తమకేంటి అన్నట్లుగా వారు వదిలేస్తున్నారు.
- ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు నార్త్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ పరిధిలోని బేగంపేట, మహంకాళి, గోపాలపురం, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో 124 కేసులు నమోదు కాగా, ఇందులో 81 మందిని కోర్టులో హాజరుపర్చారు.
- కోర్టు ఆదేశాల మేరకు మొత్తం రూ.1,57,700ల జరిమానాల రూపంలో చెల్లించారు. మరో 79 మంది కోర్టు ఆర్డర్స్‌ మేరకు సామాజిక సేవ చేశారు.

డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా 774 మంది

డ్రైవింగ్‌ లైసెన్స్‌ (డీఎల్‌) లేకుండా వాహనాలు నడిపిన వారిపై ఈ ఏడాది ఇప్పటివరకు 774 కేసులు నమోదయ్యాయి. ఇందులో 620 మందిని కోర్టులో హాజరుపరచగా, రూ.6,91,151లు జరిమానాల రూపంలో చెల్లించారు.

- డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనం నడపరాదని పదే పదే ట్రాఫిక్‌ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోన్నా ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధి లో ఈ ఏడాది జనవరి 1 నుంచి కేవలం 82 రోజుల్లోనే 774 మంది డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారంటే ఏ మేరలో చైతన్యవంతులు అయ్యారో అర్థమవుతోంది.
- ఏదైనా ప్రమాదానికి గురైతే డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేనిదే రావాల్సిన పరిహారాలు కూడా రావని ట్రాఫిక్‌ పోలీసులు స్పష్టంగా చెబుతున్నారు.

బాబాఫసియుద్దీన్‌ సేవలు అభినందనీయం



రహమత్‌నగర్‌: పవిత్ర రంజాన్‌ మాసంలో దశాబ్ద కాలంగా సహెర్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ యూట్యూబర్‌ కిరాక్‌కాలా అలియాస్‌ ప్రియారెడ్డి పేర్కొన్నారు. బోరబండ సైట్‌–1 కమాన్‌ వద్ద బాబా ఫసియుద్దీన్‌ నిర్వహిస్తున్న సహెర్‌ కార్యక్రమంలో సోమవారం ఉదయం ఆమె పాల్గొని సేవలందించారు. అనంతరం బాబా ఫసియుద్దీన్‌ సతీమణి హబీబాసుల్తానాతో కలిసి రంజాన్‌ కానుకలను ముస్లింలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ నాయకులు కాసుల మహేష్‌ గౌడ్‌, షేక్‌ వలీ, ఖయ్యూం , కాశన్న, యాదగిరి, కవిత పాల్గొన్నారు.

ఐపీఎల్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

రహమత్‌నగర్‌: ఐపీఎల్‌ క్రికెట్‌ మ్యాచ్‌పై బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకులపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... స్థానికంగా ఉండే మహ్మద్‌, ముదాస్సిర్‌, మహ్మద్‌అష్ఫక్‌లు శ్రీరాంనగర్‌ ఎస్టీ పాయింట్‌ వద్ద రహస్యంగా క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వైద్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు: తలసాని



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్‌, మోండా, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2.94 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని కోరారు. కార్యక్రమంలో సనత్‌నగర్‌ కార్పొరేటర్‌ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ పార్టీ నేతలు కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, నాగులు, మహేష్‌యాదవ్‌, లక్ష్మీపతి, వెంకట్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో వాతావరణం అంచనా



సనత్‌నగర్‌: ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికల విషయంలో ఉన్న అంతరాన్ని తగ్గించుకుంటూ వెళ్తున్నట్లు హైదరాబాద్‌ వాతావరణ శాఖ డైరెక్టర్‌ డాక్టర్‌ కే నాగరత్న అన్నారు. ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని వాతావరణ కేంద్రంలో సోమవారం ‘క్లోజింగ్‌ ది ఎర్లీ వార్నింగ్‌ గ్యాప్‌ టుగెదర్‌’ అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎర్లీ వార్నింగ్‌ సిస్టం అమలు చేయడంలో వాతావరణ శాఖ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. వాతావరణ శాఖ నుంచి అందే హెచ్చరికలను ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు త్వరితగతిన అందేలా ప్రస్తుత కమ్యూనికేషన్‌ వ్యవస్థ బలంగా ఉందన్నారు. దీని ద్వారా జరిగే నష్టాన్ని భారీగా తగ్గించడమో, లేక అసలు లేకుండా చేయడమో జరుగుతుందన్నారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్‌ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

లక్డీకాపూల్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 98 దరఖాస్తులను స్వీకరించారు. గృహనిర్మాణ శాఖకు 31, పెన్షన్ 24, డీసీఎస్ఓ 4, ఇతర శాఖలకు సంబంధించి 39 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి.ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ. వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, ఆశన్న సుబ్రహ్మణ్యం, సీపీఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

2025 హజ్ యాత్ర ఖర్చు రూ.3.50 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రం నుంచి 2025 హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికుల ప్రయాణ ఖర్చులను కేంద్ర హజ్ కమిటీ నిర్ధారించింది. ఈ ఏడాది ఒక్కో యాత్రికుడు రూ.3,46,900 కేంద్ర హజ్ కమిటీ ఖాతాలో ఏప్రిల్ 3వ తేదీలోపు జమ చేయాల్సి ఉంటుంది. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా గులామ్ అఫ్జల్ బియాబానీ ఖుస్రో పాషా వివరాలను వెల్లడించారు. హజ్ యాత్రకు ఎంపికైనవారు ఇప్పటికే మొదటి విడతగా రూ.లక్షా 30 వేలు చెల్లించారని, రెండో విడతగా రూ.లక్షా 42 వేలు కేంద్ర హజ్ కమిటీ అకౌంట్‌లో జమ చేశారని, మూడో విడతగా రూ.58 వేలను ఏప్రిల్ 3వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సకాలంలో డబ్బులు చెల్లించని యాత్రికుడి స్థానంలో ఇతరులకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఖుర్బానీ కోసం అదనంగా రూ.16 వేల 600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుసుము జమ చేసిన రసీదుతోపాటు డ్రా ద్వారా ఎంపికైన యాత్రికులు ఒరిజినల్ పాస్‌పోర్టు, ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్ కూడా జమ చేయాలని సూచించారు. యాత్రికులు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా జత చేయాల్సి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తి కోసం 040–23298793 నంబర్ ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత ఉగాది కేలండర్, పంచాంగాలను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

బంజారాహిల్స్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది కేలండర్, పంచాంగాలను మంత్రి కొండా సురేఖ సోమవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతిఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారు చేసిన గొప్ప కాల సూచికను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి, వల్లభపూర్ శివాలయ ప్రధాన అర్చకులు నిరంజన్ సిద్ధాంతి, ధూపదీప నైవేద్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్ ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురం సమ్మర్ క్యాంపులో భాగంగా సాయంత్రం 6 గంటలకు అన్నమయ్య కీర్తనలపై శిక్షణ తరగతులు జరుగుతాయి.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు దస్తకారీ హాట్ ఆధ్వర్యంలో వేసవి, వివాహ శ్రేణి 2025 పేరిట చేనేత కళల ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

హెచ్‌సీఏకు కంటోన్మెంట్

షాక్

- హెచ్‌సీఏ కబ్జాలోని స్థలం స్వాధీనానికి నోటీసులు
- 30 ఏళ్లుగా ఆక్రమించడంపై సీరియస్
- రూ.100 కోట్ల పరిహారం చెల్లించాలంటూ డిమాండ్



జింఖానా మైదానంలోని హెచ్‌సీఏ కార్యాలయం, గ్రౌండ్

కంటోన్మెంట్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు కంటోన్మెంట్ బోర్డు అధికారులు షాక్ ఇచ్చారు. బోర్డుకు ఎలాంటి లీజు చెల్లించకుండానే సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన స్థలాన్ని 30 ఏళ్లుగా ఆక్రమించడాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు. తక్షణమే ఆ స్థలాన్ని ఖాళీ చేయడంతోపాటు రూ.100 కోట్ల పరిహారం చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లోనే హెచ్‌సీఏ నుంచి స్థలం స్వాధీనానికి ఏర్పాట్లు చేస్తున్నామని బోర్డు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

అసలేం జరిగిందంటే..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ జనరల్ ల్యాండ్ రికార్డ్స్(జీఎల్ఆర్) సర్వే నెంబర్ 713లోని 23 ఎకరాల సీ కేటగిరీకి చెందిన జింఖానా మైదానం ఉంది. 1992లో ఈ స్థలంలోని 7.9 ఎకరాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సాప్)కు, 5.71 ఎకరాల స్థలాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు లీజు కింద కేటాయించారు. మిగిలిన 9.59 ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. 1996 ఫిబ్రవరి 23న కేంద్ర ప్రభుత్వం హెచ్‌సీఏ లీజును రద్దు చేసింది. అయితే ఆ స్థలాన్ని మాత్రం కేంద్రం స్వాధీనం చేసుకోలేదు. తిరిగి 2010లో సికింద్రాబాద్ సర్కిల్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ తన అధికార పరిధిని దాటి మరో ఏడు ఎకరాల స్థలాన్ని హెచ్‌సీఏకు లీజు కింద ఇచ్చారు. ఈ లీజు కూడా చెల్లదంటూ 2013లో రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌సీఏ రక్షణ శాఖకు ఎలాంటి లీజు రుసుం చెల్లించకుండానే సుమారు 14 ఎకరాల స్థలాన్ని వినియోగించుకుంటోంది. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన కంటోన్మెంట్ అధికారులు 2021లో తొలిసారిగా పబ్లిక్ ప్రిమిసెస్ (ఎవిక్షన్ ఆఫ్ అనాథరైజ్డ్ ఆక్యుపెంట్స్) యాక్ట్, 1971 ప్రకారం హెచ్‌సీఏకు నోటీసులు జారీ చేశారు. 5.71 ఎకరాల లీజుకు సంబంధించిన స్థలంపై తమకు అనుకూలంగా హైకోర్టు స్టే ఇచ్చినట్లు హెచ్‌సీఏ స్పందించింది. అయితే మిగిలిన 9.59 ఎకరాలకు మాత్రం ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. దీంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ కంటోన్మెంట్ అధికారులు పీపీ(ఈ) యాక్ట్ 1971, సెక్షన్ 4(1) ప్రకారం మరోసారి నోటీసు జారీ చేశారు. హెచ్‌సీఏ నుంచి స్పందన లేకపోవడంతో తాజాగా స్వాధీనానికి సంబంధించిన నోటీసులు జారీ చేశారు. దాదాపు 30 ఏళ్లుగా హెచ్‌సీఏ తమ స్థలాన్ని కబ్జాలోకి తీసుకుని వినియోగించుకున్నందుకు రూ.100 కోట్ల పరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ నోటీసు కూడా పంపారు.



ఆక్రమిత స్థలంలోనే గ్రౌండ్.

లీజు ద్వారా పొందామని పేర్కొంటున్న హెచ్‌సీఏ జింఖానా మైదానంలోని 5.71 ఎకరాల స్థలాన్ని మాత్రం ఖాళీగానే ఉంచింది. మిగిలిన 9.59 ఎకరాల స్థలంలోనే హెచ్‌ఏసీ కార్యాలయ నిర్మాణంతోపాటు క్రికెట్ గ్రౌండ్, నెట్స్ వేశారు. ఈ మైదానంలోనే క్రీడాకారులు శిక్షణతోపాటు ప్రాక్టీస్ చేస్తుంటారు.

క్షయ రహిత నగరంగా మారుద్దాం



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

లక్డీకాపూల్ : టీబీ రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రగడ్డలోని ఛెస్ట్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ కేసులను గుర్తించి త్వరగా నివేదించడం, క్షయవ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం అత్యవసరమన్నారు. ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ప్రైవేట్ వైద్యులు కూడా టీబీ నిర్మూలనను కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించడానికి ప్రారంభ దశలోనే గుర్తించడంతోపాటు బాధితులు భయపడకుండా, వివక్ష లేకుండా సరైన చికిత్స పొందేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. టీబీ నివారణ దిశగా కృషి చేస్తున్న పలువురు ఉద్యోగులను కలెక్టర్ అనుదీప్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకట్, రాష్ట్ర మహమ్మారి శాస్త్రవేత్త డా.రాజేశ్వరి, డబ్ల్యుహెచ్‌ఓ కన్సల్టెంట్ డా. స్నేహ శుక్లా, శ్రవణ్ కుమార్, టీబీ అలర్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, ఛెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుమూస్తూ.. మరో నలుగురి జీవితాల్లో వెలుగులు

సాక్షి, సిటీబ్యూరో: తాను మరణిస్తూ మరో నలుగురు జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ ఇంజనీరింగ్ విద్యార్థి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన టి.శివశంకర్, ప్రమీలరాణి కుమారుడు శ్రీ అస్లేష్(20) ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ చదువుతున్నాడు. శనివారం అకస్మాత్తుగా అనారోగ్యం పాలయ్యాడు. తోటి విద్యార్థులు ఆయన్ను సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కిమ్స్‌కు తరలించారు. కాపాడేందుకు వైద్యులు ఎంతో ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించడంతో ఆస్పత్రి వైద్యులు జీవన్‌దాన్‌కు సమాచారం అందించారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కార్నియాలను దానం చేశారు.

పలుకుబడి ఉన్నవారే దర్జాగా కబ్జా

హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజా అవసరాలకు ఉద్దేశించిన భూమిని స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు కబ్జా చేసేస్తున్నారని, వాటిని కాపాడాలని పలువురు సోమవారం జరిగిన హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఉద్దేశించిన స్థలాలను కూడా వదలడంలేదని వాపోయారు. ఫుట్‌పాత్‌లను, సర్వీసు రోడ్లనూ విడిచిపెట్టకుండా తోపుడు బళ్లు, డబ్బాలు పెట్టి వ్యాపారాలు చేయిస్తున్నారని, వాటిని తొలగిస్తే ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాలకు ఉపయుక్తంగా ఉంటుందని కోరారు. చెరువుల శిఖం భూములకు వేరే పట్టా భూమిల సర్వే నంబర్లు చూపించి నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటున్నారని హైడ్రా దృష్టికి తెచ్చారు. ఈ మేరకు సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులు అందాయి.



- ఇంజాపూర్ గ్రామ పాఠశాలకు ఆనుకుని ఉన్న 14 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆయనను నుంచి భూమిని కాపాడి, ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టామని, అయినా కబ్జా ప్రయత్నాలు సాగుతున్నాయని పేర్కొన్నారు.
- మియాపూర్–బీహెచ్ఈఎల్ ప్రధాన రహదారిలో ఉన్న గంగారాం చెరువు ఎఫ్‌టీఎల్ ఎగువున తమ ఇంటి స్థలాలు ఉన్నా నిర్మాణానికి అనుమతులివ్వడంలేదని పలువురు ఫిర్యాదు చేశారు. తమ ఇళ్ల స్థలాల చుట్టూ ఇతరుల ఇళ్లు కూడా ఉన్నాయని, గ్రామపంచాయతీ లేఔట్‌కు ఎల్ఆర్ఎస్ కూడా కట్టించుకుని రెగ్యులరైజ్ చేశారని వివరించారు. వెంటనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరారు.
- కీసర మండలం నాగారం మున్సిపాలిటీలోని అన్నరాయ చెరువు సమీపంలో తనకున్న ఎకరం భూమిని పక్కనే లే ఔట్ వేసిన వ్యక్తి ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని అన్నంరాజు హరిబాబు ఫిర్యాదు చేశారు.
- మేడిపల్లి ఊరచెరువుకు ఉన్న పాత నాలాను పునరుద్ధరించాలని పలువురు ప్రజావాణిలో కోరారు. వరదలప్పుడు ఉపశమనం కోసం తవ్విన నాలాను కొనసాగించడం వల్ల తమ పంటపొలాలు దెబ్బతిన్నాయని వాపోయారు. దిగువన ఉన్న 6 కాలనీలకు వరద, మురుగు ముప్పు లేకుండా చూడాలని కోరారు.

హెచ్‌సీయూ భూములపై జోక్యం చేసుకోవాలి

– రాహుల్‌గాంధీకి హెచ్‌సీయూ జేఏసీ లేఖ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి హెచ్‌సీయూ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) బహిరంగ లేఖ రాసింది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం భూ ఆక్రమణను ఆపేసి దానిని విశ్వవిద్యాలయం పేరు మీద నమోదు చేసేవిధంగా జోక్యం చేసుకోవాలని కోరింది. హెచ్‌సీయూలోని విద్యార్థి సంఘం–2024–25, టీచర్స్ అసోసియేషన్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, వర్కర్స్ యూనియన్‌లతో ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ రాహుల్‌గాంధీకి ప్రధానంగా మూడు డిమాండ్లతో లేఖ రాసింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల భూముల వేలంపాటను వెంటనే ఉపసంహరించేలా ఆదేశించాలని, హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు ఒక తీర్మానం చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, తెలంగాణ ప్రభుత్వం 2,300 ఎకరాలను హెచ్‌సీయూకు కేటాయిస్తూ మ్యుటేషన్ చేసేలా ఆదేశించాలని కోరింది. భవిష్యత్తులో హెచ్‌సీయూ భూములకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకొనేలా చూడాలని పేర్కొంది. హెచ్‌సీయూ 50 ఏళ్లుగా 'గ్రీన్ లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'గా గుర్తింపు పొందిందని, దీన్ని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని రాహుల్‌గాంధీని కోరింది. రోహిత్ వేముల ఉద్యమంలో హెచ్‌సీయూను సందర్శించినప్పుడు హెచ్‌సీయూ పోరాటాలకు మద్దతుగా ఉంటామని ప్రకటించారని రాహుల్‌కు గుర్తు చేసింది. 1970లో తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 'సిక్స్ పాయింట్ ఫార్ములా'కింద ఈ ప్రాంతంలో హెచ్‌సీయూను ఏర్పాటు చేశారని జేఏసీ గుర్తు చేసింది.



కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలివ్వాలి

– రాష్ట్రపతికి ప్రత్యేక లేఖ రాసిన ఏఐఓబీసీఎస్‌ఏ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూవివాదంపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆలిండియా భారత ఓబీసీ విద్యార్థుల సంఘం(ఏఐఓబీసీఎస్‌ఏ) సోమవారం లేఖ రాసింది. ఈ వివరాలను గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ వెల్లడించారు. 1975లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు 2,324.05 ఎకరాల విశ్వవిద్యాలయ భూమిని తిరిగి విశ్వవిద్యాలయానికి అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టేలా చూడాలని రాష్ట్రపతిని కోరినట్లు వివరించారు. ఆరు పాయింట్ల ఫార్ములా, భారత రాజ్యాంగంలోని 372 ఈ అధికరణ ప్రకారం విశ్వవిద్యాయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఈ భూమిపై హైదరాబాద్ హైకోర్టులో యూనివర్సిటీ హక్కును ప్రశ్నిస్తూ, ఈ భూమి తమదేనని పేర్కొందని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రైవేట్ ప్రయోజనాల కోసం విశ్వవిద్యాలయ భూమిని కేటాయిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయని, ఇది విద్యారంగానికి ముప్పుగా మారుతుందని, అందుకే జోక్యం చేసుకొని హెచ్‌సీయూకు న్యాయం చేయాలని కోరారు. భారత ప్రభుత్వంలోని విద్యా శాఖ ద్వారా ఐఓఈ గుర్తింపు కూడా పొందిన దక్షిణ రాష్ట్రాలలో ఏకైక విశ్వవిద్యాలయానికి ఇలాంటి పరిస్థితి వచ్చేలా చేయడం న్యాయం కాదని పేర్కొన్నారు. భూమిని విశ్వవిద్యాలయానికి బదలాయించేందుకు నిపుణుల కమిటీ నియమించాలని కోరారు. ప్రజా విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం, దేశ నిర్మాణానికి కీలకమని పేర్కొన్నారు.

ఆశా కార్యకర్తల భారీ ఆందోళన

- ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్
- కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తా వద్ద బైఠాయింపు
- పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం.. వందలాది మంది అరెస్ట్



కోఠి డీఎంహెచ్ఎస్ గేటు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

సుల్తాన్‌బజార్: అది నగరంలోని పెద్ద కూడళ్లలో ఒకటి.. వందలాది మంది గుంపులు గుంపులుగా అక్కడికి చేరుకున్నారు.. నినాదాలు చేస్తూ ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించారు.. ఏం జరుగుతుందో తెలియక వాహనదారులు అయోమయానికి గురయ్యారు.. పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం ఏర్పడింది. కొద్దిసేపట్లోనే రోడ్లన్నీ స్తంభించాయి.. ఇదీ కోఠిలోని డీఎంహెచ్ఎస్ కమిషనర్ కార్యాలయం వద్ద సోమవారం చోటు చేసుకున్న సన్నివేశం. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ తమ డిమాండ్ల సాధనకు వివిధ జిల్లాలకు చెందిన ఆశా కార్యకర్తలు ఆందోళనబాట పట్టి డీఎంహెచ్ఎస్ కమిషనర్ కార్యాలయం ఉన్న కోఠి ఉమెన్స్ కాలేజీ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం తెలుసుకున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ ఇన్‌స్పెక్టర్లతోపాటు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి.

పెద్ద ఎత్తున అరెస్టులు..

పోలీసులు ఆశా కార్యకర్తలను పెద్ద ఎత్తున అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, క్వాలిటీ యూనిఫామ్, ఎండాకాలంలో కాటన్ యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. లెప్రసీ, పల్స్‌పోలియో సర్వే డబ్బులు చెల్లించాలని, ఆసుపత్రుల్లో ఆశాలకు రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలని, వెహికిల్ కూడా సమకూర్చాలని కోరారు.

రూ.10 వేల వేతనం చెల్లించాలి



ధర్నాకు హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు

- ధర్నాచౌక్ వద్ద మధ్యాహ్న భోజనం కార్మికుల ఆందోళన
- బకాయిలు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు తరలి వచ్చి సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరసనకు దిగారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీ ఇచ్చినవిధంగా గృహజ్యోతి పథకం ఎక్కడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. మహిళల అకౌంట్‌లో రూ 2,500 జమ చేస్తామని మోసం చేశారని అన్నారు. 8 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా అందజేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న మహిళలంతా అట్టడుగు వర్గాలకు చెందినవారేనని, వారికి ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని అన్నారు. ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హాజరై మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉన్ని కృష్ణ, పద్మ, సుల్తాన్, మాయా, కృష్ణమాచారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇదే 'మండీ'..?

- మండీ–36 అరేబియన్ కిచెన్ దుర్గంధభరితం
- అనారోగ్యకర ఆహార పదార్థాల గుర్తింపు





బంజారాహిల్స్‌లోని మండీ–36 అరేబియన్ కిచెన్‌లో గడువు తీరిన ఆహార పదార్థాలు

బంజారాహిల్స్: కుళ్లిన ఆకుకూరలు.. గడువు ముగిసిన ఆహార పదార్థాలు.. కిచెన్ దుర్గంధభరితం.. ఎటు చూసినా అపరిశుభ్ర వాతావరణం.. ఇదీ బంజారాహిల్స్‌లోని మండీ–36 అరేబియన్ కిచెన్ దుస్థితి. ఈ మేరకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు సోమవారం ఆ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి పైన పటారం లోన లొటారం అన్నట్లుగా అక్కడ పరిస్థితి ఉన్నట్లు గుర్తించారు. ఫ్లోరింగ్ కూడా అధ్వానంగా ఉందని, రిఫ్రిజిరేటర్‌లో ఆహార పదార్థాలు ఇష్టానుసారంగా పెట్టారని, కూరగాయలు, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా తదితర ఆకు కూరలు కుళ్లిపోయి ఉన్నట్లు నిర్ధారించారు. ఖైరతాబాద్‌లోని మండీ కింగ్ రాయల్ రెస్టారెంట్ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. అక్కడ కూడా అధికారులు ఆహార పదార్థాలను తనిఖీలు చేశారు. కిచెన్, రిఫ్రిజిరేటర్లు, ఫ్లోరింగ్, ఆహార పదార్థాలు తనిఖీ చేసి వినియోగదారుల అనారోగ్యానికి కారణమవుతున్న వాతావరణం ఉన్నట్లు గుర్తించారు. పైగా ఆయా హోటళ్లకు సంబంధిత ధ్రువపత్రాలు కూడా లేవని అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ మేరకు ఆయా హోటళ్ల యాజమాన్యాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

'స్ట్రోక్' చికిత్సలో అపోలోకు ఏహెచ్ఏ గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: స్ట్రోక్ (పక్షవాతం) చికిత్సలో నూతన ప్రమాణాలకు గాను దేశంలోనే ప్రప్రథమంగా జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్, స్ట్రోక్ సెంటర్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్ఏ) గుర్తింపును అందుకుంది. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక స్ట్రోక్ బృందాలు, అధునాతన ఇమేజింగ్‌తో స్ట్రోక్ డయాగ్నసిస్, క్రిటికల్ కేర్‌లో అత్యున్నత ప్రమాణాలను కలిగి ఉన్నట్టు ఏహెచ్ఏ సర్టిఫికేషన్‌తో అపోలో హాస్పిటల్స్ నిరూపించుకుందన్నారు.

మేయర్ ఎక్కడున్నారో చెప్పండి!

జీహెచ్ఎంసీ 'ప్రజావాణి'లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ వింతైన ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వినతిపత్రాన్ని అడిషనల్ కమిషనర్ శివకుమార్‌నాయుడికి అందజేయడంతోపాటు రసీదు(ఫిర్యాదు ఐడీ నెంబర్) కూడా పొందారు. తన డివిజన్ సమస్యల గురించి చెప్పుకుందామంటే మేయర్ ఎక్కడున్నారో తెలియడంలేదని, ఆమెను కలిసేందుకు కొంత సమయాన్ని ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ దోమలు, కుక్కల సమస్యలకు సంబంధించి గతంలో అడిగిన ప్రశ్నలకు కమిటీలు వేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపిన మేయర్ ఇప్పటివరకు వాటి నివారణకు ఏం చర్యలు తీసుకున్నదీ, ఎంత ఖర్చు పెట్టిందీ వెల్లడించలేదన్నారు. పాలకమండలి సభ్యుడికి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీకే సమాధానం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



సమ్మర్‌క్యాంప్‌లు వచ్చినా స్పోర్ట్స్ సామగ్రి అందజేయలేదని పేర్కొన్నారు. శ్రవణ్ గతంలోనూ సర్కిల్, జోనల్, ప్రధాన కార్యాలయాల్లో జరిగిన 'ప్రజావాణి'కి హాజరయ్యారు.

ప్రజావాణికి 68 ఫిర్యాదులు

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి 68 ఫిర్యాదులందాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున కమిషనర్ ఇలంబర్తి హాజరు కాకపోవడంతో అడిషనల్ కమిషనర్ కిల్లు శివకుమార్‌నాయుడు, ఇతర అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు అత్యధికంగా 26 ఫిర్యాదులు వచ్చాయి.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 25, మార్చి, 2025



27న మెట్రో ఆర్ట్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో : ఐజీఏ గలేరియాతో కలిసి హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్–2025ని ఆవిష్కరించనున్నట్లు ఎల్అండ్‌టీ మెట్రో రైల్ ప్రకటించింది. ఎర్రమంజిల్‌లోని ప్రీమియా మాల్‌లో ఈ నెల 27 నుంచి 29 వరకూ ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో వివిధ కళారూపాలకు చెందిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. సందర్శకులు రియల్‌టైమ్‌లో సృజనాత్మక ప్రక్రియలను వీక్షించేలా ఐజీఏ గలేరియా లైవ్ పెయింటింగ్ సెషన్లకు ఆతిథ్యమివ్వనుంది. 'ప్రయాణికులు, సందర్శకులకు స్ఫూర్తినిచ్చే విధంగా కళలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొనేందుకు హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్ తోడ్పడుతుందని' హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్ వీఎస్ రెడ్డి తెలిపారు. 'హైదరాబాద్ మెట్రో రైల్ ఒక రవాణా మాధ్యమం మాత్రమే కాదు. ఇది నగర పురోగతి, ఆవిష్కరణలకు చిహ్నం. హైదరాబాద్ మెట్రో ఆర్ట్ ఫెస్ట్ లాంటి కార్యక్రమాల ద్వారా కళలను గ్యాలరీల పరిధి నుంచి అందరికీ అందుబాటులోకి తేవడం, నగరంలో సృజనాత్మకతను పెంపొందింపజేయడం తమ లక్ష్యం' అని ఎల్ అండ్ టీ మెట్రోరైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు. ఈ మూడు రోజుల వేడుకల్లో శ్వేతా చంద్ర (హైదరాబాద్), మనీష్ చావ్డా (అహ్మదాబాద్), రాము దాస్ (శాంతినికేతన్), బాసుకి దాస్‌గుప్తా (బెంగళూరు), మోనికా ఘూలే (బద్లాపూర్), దినకర్ జాదవ్ (పూణె), నర్సింలు కంది (హైదరాబాద్), బందనా కుమారి (భోపాల్), వసంతుల రామకృష్ణ (హైదరాబాద్), భాస్కర రావు బొచ్చ (హైదరాబాద్) తమ కళాత్మక నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుంది. కార్యక్రమంలో ఉచితంగా పాల్గొనవచ్చు. ఎలాంటి ప్రవేశ రుసుమూ ఉండదు.



రోడ్డు సేఫ్టీపై.. అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు వినూత్న డిజిటల్ రహదారి భద్రతా వేదిక, ఇ–గురుకుల్‌ను ప్రారంభించినట్టు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎమ్ఎస్) తెలిపింది. దీని ద్వారా 5 నుంచి 18 సంవత్సరాల వయసున్న చిన్నారులకు శిక్షణా మాడ్యూల్స్‌ను అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కూడా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. దీనిలో భాగంగా పాఠశాలలు, కాలేజీలు, విద్యాసంస్థలతో పని చేస్తున్నామని, తాజాగా నల్గొండలో నిర్వహించిన కార్యక్రమంలో1900 మందికి పైగా ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలియజేసింది. సురక్షిత రైడింగ్ పాఠాలు, ప్రమాద సూచనలు, హెల్మెట్ అవగాహన, రైడింగ్ ట్రైనర్ మాడ్యూల్స్ వంటి అంశాలు గేమ్స్, క్విజ్‌ల రూపంలో తమ శిక్షణా తరగతుల్లో ఉంటాయని వివరించింది.






ప్రపంచం వేగంగా మారుతోంది. అలా వేగం పెరుగుతున్న కొద్దీ మన శారీరక కదలికలు తగ్గిపోతున్నాయి. మరోవైపు ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామానికి సమయం లేదనడమూ సర్వసాధారణంగా మారింది. అయితే నిజానికి మానవ శరీరం చురుకుగా కదులుతూ ఉండేందుకు అనువుగా రూపొందింది. సమయం లేదంటూ దానిని కదిలించకపోతే శారీరక సమస్యలతో పాటు ఆరోగ్యానికి చేటు తప్పదు. ఈ నేపథ్యంలో గంటల తరబడి చేయడానికి బదులు కేవలం నిమిషాల్లో ముగించేందుకు వీలుగా కొత్త కొత్త వ్యాయామాలు పుట్టుకొస్తున్నాయి. అలా అందుబాటులోకి వచ్చిందే ఈ హిట్ పద్ధతి.

- సాక్షి, సిటీబ్యూరో


హిట్.. హిట్.. హుర్రే..

శరవేగంగా శరీరం మొత్తానికీ వ్యాయామం

పుష్-అప్స్: నేలపై లేదా చాపపై 'ప్లాంక్' పొజిషన్‌లోకి వెళ్లి చేసే ప్రక్రియ. బరువును పాదాలకు బదులుగా మోకాళ్లపై ఉంచడం ద్వారా దీన్ని సులభతరం చేయవచ్చు.

అమెరికాకు చెందిన వ్యాయామ మనస్తత్వవేత్త క్రిస్ జోర్డాన్ ఈ హిట్ అనే వ్యాయామ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇది కదలికలు కురవైన శరీరం తెచ్చిపెట్టే సమస్యలకు.. కేవలం 7 నిమిషాల్లో పరిష్కరించగలదని ఆయన చెబుతున్నారు. సొంత శరీర బరువును ఉపయోగించి సుపరిచితమైన కాలిస్తెనిక్ వ్యాయామాలను చేయడమే హై ఇన్‌టెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ (హెచ్ఐఐటీ) ఈ హిట్ ఫార్ములా. ప్రతి రౌండ్‌కూ మధ్య ఐదు సెకన్ల విశ్రాంతి తీసుకుంటూ చేసే హై ఇన్‌టెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ (హెచ్ఐఐటీ)గా దీనిని పేర్కొంటున్నారు. ఇందులో ప్రతి వ్యాయామం 30 సెకన్ల పాటు చేయాలి. ఒక భంగిమ నుంచి మరో భంగిమకు మారేటప్పుడు మధ్యన 5 సెకన్ల చొప్పున గ్యాప్ ఉండాలి.

కేవలం 7 నిమిషాల్లోనే సంపూర్ణ వర్కవుట్
కండరాలన్నింటికీ కదలికలు, కేలరీల ఖర్చు
అంతర్జాతీయంగానూ పాపులరైన 'హిట్' వర్కవుట్



వాల్ సిటప్స్: గోడ దగ్గర వెనుకభాగంలో నిల్చుని కుర్చీలో కూర్చున్నట్లుగా కూర్చునే భంగిమ. ఓ రకంగా గోడకుర్చీ వేయడం అని చెప్పొచ్చు.

అబ్ క్రంచ్: ప్రాథమిక క్రంచ్‌తో ప్రారంభించి, వెనుకభాగంలో చదునుగా ఉంచి పడుకోవాలి, మోకాళ్లను వంచి పాదాలను నేలపై ఉంచి చేయాలి.

స్టెప్-అప్: దృఢమైన కుర్చీ లేదా బెంచ్‌కు ఎదురుగా నిలబడి, ఎడమ కాలితో ఓ సారి కుడికాలితో మరోసారి ప్రారంభించి చేయాలి. 30 సెకన్ల వ్యవధిలో వీలైనన్ని సార్లు చేయాలి.

స్క్వాట్: పాదాలను భుజం–వెడల్పు వేరుగా చేసి కాలి వేళ్లను ముందుకు ఉంచి నిలబడాలి. ఈ భంగిమలో ఉన్నప్పుడు బరువులో ఎక్కువ భాగాన్ని మడమల మీద ఉంచాలి. 30 సెకన్ల పాటు ఇలా చేయాలి.



ట్రైసెప్ డిప్: కుర్చీ లేదా బెంచ్ ముందు అంచున కూర్చుని, మన అరచేతులను అంచుపై ఉంచి దీనిని చేయాలి.

ప్లాంక్: చాపపై బోర్లా పొట్టపై పడుకుని దీన్ని చేయాలి. ఈ భంగిమలో మన మోచేతులు మన వైపు దగ్గరగా, అరచేతులు కిందికి వేళ్ల ముందుకు ఎదురుగా ఉంటాయి.

హై 'నీస్': 30 సెకన్ల పాటు ఉన్నచోటే పరుగెత్తడంగా దీన్ని చెప్పొచ్చు. ప్రతి అడుగుతో మోకాళ్లను వీలైనంత ఎత్తుకు పైకి తీసుకొస్తూ, అరచేతులను తాకడానికి మన మోకాళ్లను వేగంగా పైకి కందికి ఎత్తుతూ చేయాలి.

లంజెస్: పాదాలను కలిపి నిలబడి, కుడి పాదం మీద ముందుకు సాగదీయాలి. ముందు, వెనుక మోకాలు రెండూ వీలైనంత 90–డిగ్రీల కోణానికి దగ్గరగా వంగి ఉండే వరకూ చేయాలి.

సైడ్ ప్లాంక్‌లు: చాపపై కుడి వైపున పడుకుని, ఎడమవైపు పడుకుని చేసే వ్యాయామం.



28న షాడోస్ అండ్

సిల్‌హౌటీస్

లైవ్ కాన్సర్ట్‌తో సందడి చేయనున్న సినీ తార శృతి హాసన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీ తార శృతి హాసన్ నగరం వేదికగా తన లైవ్ కాన్సర్ట్‌తో సందడి చేయనుంది. ప్రిజమ్ ఆధ్వర్యంలో నగరంలోని ఓడియం వేదికగా శృతి హాసన్ షాడోస్ అండ్ సిల్‌హౌటీస్ పేరుతో లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఈ నెల 28వ తేదీన తన ప్రత్యేక బ్యాండ్‌తో స్వర సంగ్రామాన్ని సృష్టించనున్నారు. ఈ నైట్ ఎలక్ట్రిఫైయింగ్ ఈవెంట్ కోసం పాస్‌లను బుక్ మై షో వేదికగా పొందవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. నాలుగు గంటలకు పైగా కొనసాగనున్న ఈ ఈవెంట్‌లో 21 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే అనుమతి ఉందని వారు వెల్లడించారు.



ఫిట్‌నెస్ మా లైఫ్ స్టైల్

సినీ నటుడు నరేష్



సాక్షి, సిటీబ్యూరో: ఫిట్‌నెస్ రొటీన్ అనేది తమ జీవనశైలిలో ముఖ్యమైన అంశమని ప్రముఖ సినీనటుడు నరేష్ అన్నారు. నానక్‌రామ్ గూడలో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'గోల్డ్' జిమ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమనే భాగ్యం అందాలంటే వ్యాయామం చేయడం తప్పనిసరి అన్నారు. చురుకైన జీవనశైలికి జిమ్స్ తోడ్పడతాయని, ప్రపంచ స్థాయి ఫిట్‌నెస్ శిక్షణ, పరికరాలను నగరవాసులకు అందుబాటులోకి తెస్తుండడం మెచ్చుకోదగిన విషయమని అన్నారు. గోల్డ్ జిమ్ 1965 నుంచి 30కి పైగా దేశాల్లో నడుస్తోందని జిమ్ మేనేజింగ్ డైరెక్టర్లు మధన్ మోహన్ రాజు, కార్తీక్ పేనాని తెలిపారు. కార్యక్రమానికి ఫిట్‌నెస్ ఔత్సాహికులు, జిమ్ నిపుణులు హాజరయ్యారు.



తగ్గేదే లే..

క్రికెట్ ప్రయాణ అనుభవాలు పంచుకున్న నితీష్ కుమార్ రెడ్డి

- విరాట్ కోహ్లి ప్రత్యేక బహుమతి, మెల్‌బోర్న్‌లో 'పుష్పా'సెలబ్రేషన్
- తెలుగు సినిమా అభిమానిని.. అందుకే 'తగ్గేదే లే'
- పూమా ఇండియా స్పెషల్ చాట్‌లో సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ అనుభవాలు

సాక్షి, సిటీబ్యూరో: సచిన్ టెండూల్కర్, రిషబ్ పంత్ తర్వాత ఆస్ట్రేలియాలో శతకం సాధించిన మూడో అత్యంత పిన్న వయస్కుడిగా తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచాడు. ఆ మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లి తనకు కానుకగా ఇచ్చిన షూతో ఆడి సెంచరీ చేశానని నితీష్ వెల్లడించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో హైదరాబాద్ జట్టు సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి ఆడుతున్నాడు. ఈ నేపథ్యంలో తను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న పూమా ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తన క్రికెట్ అనుభవాలను పంచుకున్నాడు. విరాట్ కోహ్లి ఇచ్చిన ప్రత్యేక బహుమతి మొదలు తన మొదటి టెస్ట్ అర్ధ శతకం తరువాత వేసిన పుష్పా స్టెప్ వరకూ నితీష్ పంచుకున్న అనుభవాలు ఆయన మాటల్లోనే..

కోహ్లి షూ కోసం అబద్ధం చెప్పాను..

'డ్రెస్సింగ్ రూమ్‌లో కోహ్లి.. సర్ఫరాజ్ ఖాన్ వద్దకు వచ్చి 'సర్ఫూ, నీ షూ సైజ్ ఎంత?' అని అడగ్గా.. తను 'తొమ్మిది' అని చెప్పాడు. తర్వాత నన్ను చూసి షూ నంబర్ ఎంత అన్నాడు. ఆ క్షణం ఎలాగైనా నా ఫేవరెట్ కోహ్లి బూట్లు పొందాలనే ఆశతో నా సైజ్ కాకుండా 'పది' అని చెప్పాను. వెంటనే కోహ్లి వాటిని నాకు ఇచ్చాడు. తదుపరి మ్యాచ్‌లో ఆ షూస్ వేసుకుని సెంచరీ కొట్టాను. ఆ జ్ఞాపకం ఎప్పటికీ మర్చిపోలేను. 21 ఏళ్ల వయస్సులో మొదటి టెస్ట్ అర్ధ శతకాన్ని చేసిన తరుణంలో ఆ సంతోషాన్ని పుష్పా సినిమా తగ్గేదెలే అనే స్టయిల్లో సెలబ్రేట్ చేసుకున్నాను. 'నేను తెలుగు సినిమా అభిమాని.. నేను తెలుగు వాడిని కాబట్టి టాలీవుడ్ అభిమానులు ఆనందించేలా సెలబ్రేట్ చేసుకున్నాను. తర్వాతి మ్యాచ్‌లలో కూడా మరికొన్ని సినిమా సెలబ్రేషన్స్ ప్లాన్ చేసుకున్నాను.

నా విజయంలో మామయ్య త్యాగం..

నా క్రికెట్ ప్రయాణంలో కుటుంబ ప్రాముఖ్యత ప్రధానమైనది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా.. మా మామయ్య అండగా నిలిచాడు. 'ఆర్థిక సమస్యల కారణంగా మా నాన్న నాకు స్పైక్ షూస్, క్రికెట్ బ్యాట్ కొనలేని సందర్భాల్లో మామయ్య తన తక్కువ జీతంలోనే నేను కోరుకున్న విరాట్ కోహ్లి ధరించే షూస్ కొనిచ్చాడు. ఆ బూట్లు వేసుకుని మైదానంలో కోహ్లీలా ఫీలయ్యా. అలాంటిది 2024లో పూమా ఇండియా బ్రాండ్ అంబాసిడర్‌గా మారడం గర్వంగా ఉంది. పాడ్‌కాస్ట్‌లో మామయ్యకు వీడియో కాల్ చేసి, పూమా షూస్ గిఫ్ట్‌గా ఇస్తున్నట్టు తెలిపాను. ఆయన చేసిన త్యాగం తీర్చలేనిది.. ఇది ఆయనను సంతోషపెట్టడానికి నా చిన్న ప్రయత్నం.



బీమా ఎగ్గొట్టావు.. పరిహారం కట్టు బాబూ

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్



వైఎస్సార్ జిల్లా తాతిరెడ్డి పల్లెలో నేలవాలిన అరటి తోటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి కడప: ''అకాల వర్షం.. పెనుగాలులు.. వడగండ్ల ధాటికి అరటి తోటలు నేల కూలాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతన్నలు ఇవాళో రేపో అరటి గెలలు కోసే సమయంలో తీవ్ర నష్టం సంభవించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఎంతో కొంత ఆసరాగా నిలబడాలి.. కానీ ఈ సర్కారు ఇన్సూ రెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో రైతులకు ఇన్సూరెన్స్ వచ్చే పరిస్థితి లేదు.. ఇలాంటప్పుడు ప్రభుత్వమే పూర్తి స్థాయిలో పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి'' అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పడిపోయిన గెలలను కూడా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల న్నారు. వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలంలో భారీ ఈదురు గాలులు, అకాల వర్షాలకు నేలవాలిన అరటి తోటలను వైఎస్ జగన్ సోమవారం పరిశీలించారు. తాతి రెడ్డిపల్లె, కోమన్నూతలలో అరటి తోటల్లోకి వెళ్లి రైతులను ఓదార్చి నష్టాన్ని ఆరా తీశారు. అనంతరం కోమన్నూతల సమీపంలో తోటలో మీడియాతో మాట్లాడారు. 'అరటి రైతు ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చు పెట్టి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చే సమయంలో పెను గాలులు దెబ్బతీయడంతో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఆదాయం రాకపోగా చివరికి నష్టం మిగలడం బాధేస్తోంది. రైతన్నలకు ఉచిత పంటల బీమా ఒక హక్కుగా వైఎస్సార్ సీపీ హయాంలో అమల య్యేది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమాను ఎత్తేశారు. దీన్ని ఎత్తివేయడం ఒక నేరమైతే.. 2024 మే, జూన్ నెలలలో కట్టాల్సిన పంటల ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని చంద్రబాబు కట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కట్టాల్సిన ప్రీమియం రూ.1,280 కోట్లు కట్టి ఉంటే రైతులకు మేలు జరిగేది. బాబు అధికారంలోకి వచ్చాక ప్రీమియం ఎగ్గొట్టడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ తర్వాత 2024-25కి సంబంధించిన ప్రీమియం కూడా ఆయన కట్టలేదు. అసలు ఈరోజు ఉచిత పంటల బీమా ఉందా? లేదా? మీరిచ్చిన జీవోను చూస్తే దశల వారీగా ఎత్తేస్తామని చెబుతున్నారు. చంద్రబాబు పుణ్యాన ఇప్పటికే పలు పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ధాన్యం రంగు మారింది. మొక్కజొన్న, జొన్నకు కూడా భారీగా నష్టం వాటిల్లింది. వరుసగా రెండేళ్లు ఖరీఫ్ సీజన్‌లో అదే జరిగింది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టాలి. ఈ-క్రాప్ పక్కాగా నమోదు చేయాలి. ప్రతి రైతు పండించిన పంటల వివరాలు ఈ-క్రాప్ కింద నమోదు చేసి నష్టం జరిగితే వారికి ఇన్సూరెన్స్ వచ్చేలా చూడాలి. ఎవరూ ఇన్సూరెన్స్ కట్టలేదన్న పరిస్థితి ఉత్పన్నం కాకూడదు. మన ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద రైతన్నలకు ఏటా రూ.13,500 చొప్పున ఇచ్చాం. చంద్రబాబు తాము అధికారంలోకి రాగానే రూ.26,000 (కేంద్ర సాయంతో కలిపి మొత్తం) ఇస్తానన్నాడు. కానీ రూ.20 కూడా ఇవ్వలేదు. ఇప్పటికే ఒక ఏడాది పెట్టుబడి సాయాన్ని రైతులకు ఎగ్గొట్టారు' అని విమర్శించారు.

ఏప్రిల్ 23న హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నిక

మార్చి 28న నోటిఫికేషన్..
నామినేషన్లకు గడువు ఏప్రిల్ 4
ఏప్రిల్ 25న ఫలితాలు

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు.. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు పదవీకాలం మే 1తో ముగియనుంది. తాజాగా విడుదలైన షెడ్యూల్ ప్రకారం.. ఈ ఖాళీని భర్తీ చేసేందుకు మార్చి 28న నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఏప్రిల్ 4న నామినేషన్లు స్వీకరిస్తారు, ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 గడువు. ఏప్రిల్ 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 25న ఓట్ల లెకింపు, ఫలితాలు వెల్లడిస్తామని ఈసీ తెలిపింది.

మైనార్టీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలి: కేటీఆర్



ఇఫ్తార్ విందులో భాగంగా మహమూద్ అలీకి ఖర్జూరం తినిపిస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మైనారిటీలకు కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కేటీఆర్ ఉపవాసం ఉంటున్న ముస్లింలకు పండ్లు, ఫలహారాలు అందించారు. ప్రార్థనల్లో కూడా పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ మనుషులందరినీ మనుషులుగా, మతాలకతీతంగా చూసిన గొప్ప పాలకుడు, మాజీ సీఎం కేసీఆర్ అని, ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మతాలకతీతంగా అన్ని పండుగలకు ప్రభుత్వ కానుకలు అందించిందని గుర్తుచేశారు. మైనార్టీ బాలబాలికలకు అత్యుత్తమ విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా విదేశీ విద్యావకాశాలను కల్పించేందుకు మైనార్టీ సోదరులు, సోదరీమణుల కోసం ప్రత్యేక విదేశీ విద్యా పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ మంగళం పాడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో ఎక్కడైనా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంటుందని, తెలంగాణలో మాత్రం చరిత్రలో తొలిసారిగా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేదన్నారు. త్వరలోనే మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థుల ఆందోళనకు కేటీఆర్ మద్దతు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంపట్ల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు కేటీఆర్ మద్దతు తెలిపారు. హెచ్‌సీయూకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులతో సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో సమావేశమై ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆందోళనను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర సెంట్రల్ యూనివర్సిటీలకు తీసుకెళ్లాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

మిల్లర్లు న్యాయబద్ధంగా వ్యాపారం చేయాలి: కోమటిరెడ్డి



నల్లగొండలోని పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మిల్ల ర్లపై చర్యలు తప్పవని రాష్ట్ర రోడ్లు భవనా లు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాష్ట్రంలోనే మొట్ట మొదట యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, కొందరు మిల్లర్లు గతంలో రైతులను ఇబ్బంది పెట్టారని, అలాంటి వారిని ఈసారి బ్లాక్‌లిస్టులో పెట్టాలనే ఆలోచనలో ఉన్నామ న్నారు. ధాన్యం కొనుగోలులో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలవాలన్నారు. కొనుగోళ్ల విషయంలో ఆలస్యమైతే రైతులకు కేంద్రాల వద్ద భోజనం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తున్నామని తెలిపారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు బీఆర్ఎస్ వ్యతిరేకం: కవిత



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బాన్సువాడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. సోమవారం బాన్సువాడ పెద్ద మజీద్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ముస్లింలకు తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా కొట్లాడటానికి బీఆర్ఎస్ ముందుంటుందని తెలిపారు.

బీఆర్ఎస్ సభా వేదిక మార్పు?

వరంగల్‌కు బదులుగా హైదరాబాద్ శివార్లలో సభ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 27న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ వేదికను మార్పు చేసినట్లు సమాచారం. పార్కింగ్ సదుపాయాలు, వేసవి తీవ్రత, అన్ని జిల్లాల నుంచి రవాణా సదుపాయం.. తదితరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ తొలుత ఈ సభను వరంగల్‌లో నిర్వహించాలనుకున్న విషయం తెలిసిందే. తాజాగా సభకోసం హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు సమీపంలో ఘట్కేసర్ వద్ద ఓ ప్రైవేటు స్కూల్ వెనుక ప్రాంతాన్ని ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో ఈ విషయంపై స్పష్టత వస్తుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

కేసీఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలి

గవర్నర్, సీఎంలకు గజ్వేల్ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలు శాసనసభలో ప్రస్తావనకు రాకపోవడానికి కారకులైన తమ నియోజక వర్గ ఎమ్మెల్యే కేసీఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రగా వచ్చిన పార్టీ కార్యకర్తలు.. మాజీ సీఎం కేసీఆర్ సభకు వెళ్లనందున ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం వీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలిశారు. కేసీఆర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉగాదికి అటు ఇటుగా!

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీకి వచ్చిన రేవంత్, భట్టి, ఉత్తమ్, మహేశ్‌గౌడ్‌లు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో ఇందిరా భవన్‌లో భేటీ అయ్యారు. సుమారు గంటన్నర పాటు జరిగిన చర్చల్లో జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక వర్గాలు, పార్టీలో పనిచేసిన అనుభవం, సీనియార్టీ ఆధారంగా కొత్త మంత్రుల ఎంపికపై చర్చించినట్లు తెలిసింది. పార్టీ బీ-ఫామ్‌ల మీద గెలిచిన ఎమ్మెల్యేలకే మంత్రివర్గంలో చోటు కల్పించాలని, కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వరాదని అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలెవరికీ పదవులు దక్కే అవకాశం లేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

గుర్తించిన నేతలపై విస్తృత చర్చ

సోమవారం నాటి భేటీలో మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఇదివరకే గుర్తించిన పేర్లపై మరోమారు చర్చించారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి.సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆది శ్రీనివాస్, మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్‌ల పేర్లు ఉన్నాయి. అలాగే మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరును కూడా పరిశీలించినట్టు సమాచారం. ఆమెను ఎమ్మెల్సీగా ప్రకటించినప్పుడే కేబినెట్‌లోకి కూడా తీసుకుంటారనే ప్రచారం జరిగింది. నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేనందున సుదర్శన్‌రెడ్డికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.



సమావేశం అనంతరం తిరిగి వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రేమ్‌సాగర్ వైపు భట్టి మొగ్గు

వెలమ సామాజిక వర్గం నుంచి మంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉంది. ఈ సామాజిక వర్గం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, మదన్‌మోహన్, మైనంపల్లి రోహిత్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ల మధ్య పోటీ నెలకొంది. అయితే ఈ సామాజిక వర్గం నుంచి ఇప్పటికే జూపల్లి కృష్ణారావు ఉన్నందున మరొకరికి అవకాశం ఇవ్వాలా? లేదా? అన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. ప్రేమ్‌సాగర్‌రావుకు అవకాశం ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించినట్లు తెలిసింది.

మదన్‌మోహన్‌కు పార్టీ పెద్దలు, రోహిత్‌కు సీఎం ఆశీస్సులు!

మదన్‌మోహన్ పార్టీ పెద్దల నుంచి ఒత్తిళ్లు తెస్తుండగా, రోహిత్‌కు ముఖ్యమంత్రి మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్‌లలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉన్నా, తాజా నిర్ణయం నేపథ్యంలో వారికి అవకాశం లేదని తెలిసింది. నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే ఎస్టీ (లంబాడా) కోటాలో శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్సీగా చేసినందున, బాలూనాయక్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా డిప్యూటీ స్పీకర్‌గా చేయాలన్న ప్రతిపాదనలపై చర్చలు జరిగాయి.

త్వరలో కార్యవర్గం!

పీసీసీ కార్యవర్గ ప్రకటన కూడా త్వరలో వెలువడే అవకాశం ఉంది. ఏఐసీసీ పెద్దలతో భేటీలో ఈ అంశం కూడా చర్చకు రాగా ముందుగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, 20 మందికి పైగా వైస్ ప్రెసిడెంట్‌లను ప్రకటించేందుకు నిర్ణయం జరిగినట్లు తెలిసింది. కొన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీపై సైతం చర్చించినట్లు చెబుతున్నారు. అలాగూ కులగణనపై ప్రజలు ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు? ఎస్సీ వర్గీకరణపై ఏమనుకుంటున్నారు? స్థానిక సంస్థల ఎన్నికల్లో వీటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలపై కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

కేబినెట్ విస్తరణపై ఇదే చివరి భేటీ

త్వరలో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది
పీసీసీ కార్యవర్గం తదితర అంశాలపై చర్చ
టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై త్వరలోనే అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. కేబినెట్ కూర్పు, పీసీసీ పదవులు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై హైకమాండ్ పెద్దలతో చర్చించామని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలకు సంబంధించి అధిష్టానంతో ఇదే చివరి సమావేశమని, మరోసారి చర్చ ఉండదని స్పష్టం చేశారు. ఢిల్లీలోని పార్టీ నూతన కార్యాలయంలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సోమవారం కీలక సమావేశం జరిగింది. అనంతరం మహేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ఖర్గే, రాహుల్‌గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం, విద్య గురించి రాహుల్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు గురించి అడిగారు. వాటివల్ల ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు లాభం జరుగుతుంది? ఎంతమందికి ప్రవేశాలు లభిస్తాయి? అని అడిగారు. పీసీసీ కార్యవర్గం, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బోర్డుల నియామకంపై కూడా చర్చ జరిగింది. అన్ని విషయాలపై త్వరలో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది..' అని మహేశ్‌గౌడ్ చెప్పారు.

బటన్‌తో భద్రతకు భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

తప్పనిసరి చేయనుంది. మహిళలకు వేధింపులు ఎదురైనప్పుడు ఆ బటన్ నొక్కితే చాలు.. వెంటనే పోలీస్ కంట్రోల్ రూంకు సందేశం వెళ్లిపోతుంది. వాహనం లొకేషన్ ఆధారంగా పోలీసులు వాహనం వద్దకు చేరుకుంటారు. ఆర్టీసీ బస్సుల్లో వెహికల్ ట్రాకింగ్ విధానం ఇప్పటికే అమలవుతోంది. త్వర లో ప్రైవేట్ ప్రజా రవాణా వాహనాల్లో కూడా అందుబాటులోకి రానుంది. ఇలాంటి వ్యవస్థ ఏర్పాటుచేయా లని నిర్భయ చట్టంలోనే స్పష్టంగా ప్రతిపాదించినా అమల్లోకి రాలేదు. కొన్ని క్యాబ్ సంస్థలు వేటికి అవే స్వయంగా ఏర్పాటు చేసుకున్నా మహిళా ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ క్రమంలో తాజాగా ట్రాకింగ్ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని రవాణాశాఖ నిర్ణయించింది.

రెండు లక్షల వాహనాల్లో..

- గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 8,000 లకు పైగా ప్రైవేట్ బస్సులు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల మధ్య స్టేజీ క్యారేజీలుగా నడిచే బస్సులతో పాటు నేషనల్ పర్మిట్‌లపై టూరిస్టు బస్సులుగా వివిధ రాష్ట్రాలకు మరికొన్ని రాకపోకలు సాగిస్తున్నాయి.
- బస్సులకు అదనంగా 1.2 లక్షల క్యాబ్‌లు, సుమారు 30 వేల మ్యాక్సీ క్యాబ్‌లు, మినీ బస్సులు, ట్యాక్సీలు సేవలందిస్తున్నాయి. మొత్తంగా దాదాపు రెండు లక్షల ప్రైవేటు ప్రజా రవాణా వాహనాలు తిరుగుతున్నాయి.
- కోవిడ్ అనంతరం నగరంలో రకరకాల క్యాబ్ అగ్రిగేటర్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొన్నిసార్లు వాహనాన్ని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొన్న సమయంలో నమోదయ్యే వాహనం నంబర్‌కు, అందుబాటులోకి వచ్చే వాహనానికి సంబంధం ఉండడం లేదు. చివరకు ఏ క్యాబ్ వినియోగంలోకి వస్తుందో తెలియని గందరగోళం నెలకొంటోంది.
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే క్యాబ్‌లలోనూ డ్రైవర్ల తీరుపై మహిళా ప్రయాణికులు తరచుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో కూడా డ్రైవర్లు, సిబ్బంది తరచుగా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో వెహికల్ ట్రాకింగ్ అనివార్యంగా మారింది.

బేసిన్‌లోని పంటలకు నీళ్లివ్వండి

బేసిన్ బయటి పంటలకు ఏపీ నీళ్లడుగుతోంది.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదన

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్) వెలుపలి ప్రాంతాల అవసరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని కేటాయించాలని కోరుతుండగా.. బేసిన్‌లోని ప్రాంతాలకు నీటిని కేటాయించాలని తాము కోరుతున్నామని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం వాదించింది. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల వాటా నుంచి తెలంగాణకు కనీసం 575 టీఎంసీలను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. కరువు పీడిత ప్రాంతాల్లో ఒక ఆరు తడి పంటకైనా నీళ్లు కేటాయించాలని కోరుతున్నామేగాని.. బేసిన్ వెలుపలి ప్రాంతాల్లో తరి పంటలకు నీటిని కేటాయించాలని కోరడం లేదని పేర్కొంది. కేంద్రం జారీ చేసిన తాజా మార్గదర్శకాలు, విభజన చట్టంలోని నిబంధనల ప్రకారం కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2 సోమవారం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు.

నీటి పునఃపంపిణీ చేయాలి

కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపుల ప్రకారం కృష్ణా బేసిన్‌లో తలసరి నీటి లభ్యత 733 క్యూబిక్ మీటర్లు అయితే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అది 828 క్యూబిక్ మీటర్లు అని వైద్యనాథన్ వివరించారు. కేంద్రం ఏర్పాటుచేసిన అడ్మినిస్ట్రేటివ్ అరేంజ్‌మెంట్ (తాత్కాలిక సర్దుబాటు)ను పరిగణనలోకి తీసుకుంటే.. కృష్ణా బేసిన్‌లో తెలంగాణలో నీటి లభ్యత 422 క్యూబిక్ మీటర్లు ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో 1,892 క్యూబిక్ మీటర్లు ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాల్లో కృష్ణా జలాలతోపాటు స్థానిక వనరుల ద్వారా నీటి లభ్యత 1,027 క్యూబిక్ మీటర్లు ఉందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా ఉండటం వల్లే తాత్కాలిక సర్దుబాటును కొనసాగించాలని ఆ రాష్ట్రం కోరుతోందని.. తెలంగాణకు అది ప్రతికూలంగా ఉంది కాబట్టే నీటిని పునఃపంపిణీ చేయాలని కోరుతున్నామని చెప్పారు. ఉమ్మడి ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో నాటి ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంతో తాత్కాలిక సర్దుబాటులో ఆ రాష్ట్రానికే నీళ్లు ఎక్కువగా కేటాయించారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయంగా ఆమోదించిన ప్రమాణాల మేరకు కృష్ణా జలాల పంపిణీలో సమ న్యాయం చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటిని కేటాయించాలని విన్నవించారు. కృష్ణా బేసిన్ నుంచి 330 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్ పెన్నా బేసిన్‌కు మళ్లిస్తోందని.. పెన్నా బేసిన్‌లో నీటి లభ్యత 344 టీఎంసీలు ఉందని వివరించారు. ట్రిబ్యునల్‌లో విచారణ మంగళవారం కూడా కొనసాగనుంది.

శ్రవణ్‌ను ముందు దేశానికి రానివ్వండి

ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌కుమార్ రావుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. 'ముందు శ్రవణ్‌ను భారతదేశానికి రానివ్వండి' అంటూ ఆయనకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలువురు ప్రముఖుల ఫోన్లను సైతం ట్యాప్ చేశారనే ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం తిరస్కరించింది. దీనిని ఈనెల 3న శ్రవణ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. శ్రవణ్ కుమార్‌కు రక్షణ కల్పిస్తే 48 గంటల్లోగా స్వదేశానికి వస్తారని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. దీంతో శ్రవణ్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది. ఆయనకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్

▶ మొదటి పేజీ తరువాయి

అవతలి వైపు నుంచి మరో 20.43 కి.మీల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. మధ్యలో 9.55 కి.మీల మేర సొరంగం తవ్వకాలు జరగాల్సి ఉంది. ఇకపై టీబీఎంతో రెండు వైపులా తవ్వకాలను విరమించుకొని ప్రత్యామ్నాయంగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రెండు వైపుల నుంచి సొరంగాన్ని నేరుగా అనుసంధానం చేసేందుకు ఇప్పటి వరకు తవ్వకాలు జరిగాయి. ఇకపై నేరుగా తవ్వకాలను కొనసాగించరు. రెండు వైపులా తవ్వకాలు ఆగిపోయిన చివర పక్కభాగం నుంచి డ్రిలింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరుపుకుంటూపోయి రెండు చివరలను అనుసంధానం చేస్తారు దీంతో కిలోమీటర్ వరకు సొరంగం పొడవు పెరిగే అవకాశముంది. రెండు టీబీఎంలను సొరంగంలో ఇప్పుడున్న ప్రాంతంలోనే సమాధి చేస్తారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన ఘటనలో గల్లంతైన కార్మికులను వెలికితీసేందుకు జరుగుతున్న సహాయక చర్యలపై ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమీక్షలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

సహాయక చర్యలు కొనసాగించండి: కార్మికులను వెలికితీసేందుకు కొనసాగుతున్న సహాయక చర్యలను ఏప్రిల్ 10లోగా ముగించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించాలని సీఎస్‌ను ఆదేశించారు. నెలరోజులుగా ప్రమాద స్థలిలో కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని విపత్తుల నిర్వహణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అర్వింద్‌కుమార్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా ముఖ్యమంత్రికి వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ కళ్లకు కట్టేలా ప్రమాదం జరిగిన రోజు నుంచి, ఇప్పుడున్న పరిస్థితులపై ఫొటోలతో సహా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30 మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్ ఉన్నట్టు గుర్తించామన్నారు. జీఎస్ఐ, ఎన్జీఆర్ఐ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం..అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి ఉంటుందనే అభిప్రాయం వెలిబుచ్చారు.

బీసీలకు రిజర్వేషన్ల కోసం ప్రజా ఐక్యకూటమి

అఖిలపక్ష భేటీలో ఆర్.కృష్ణయ్య, మధుసూదనాచారి, అద్దంకి



అభివాదం చేస్తున్న కృష్ణయ్య, మధుసూదనాచారి, రాపోలు ఆనందభాస్కర్, అద్దంకి, చిరంజీవులు, దాసు సురేష్ తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం అంకితభావంతో ఉన్న నాయకులతో కలిసి కమిటీ వేసి ముందుకు పోదామని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించుకునేవరకు మనం అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధనకై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా, 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై ప్రజా ఐక్య కూటమి ఏర్పాటు చేద్దామని తీర్మానించారు. మాజీ శాసనసభ స్పీకర్, బీఆర్ఎస్ శాసనమండలిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. మూడు, నాలుగు శాతం ఓట్ల తేడాతో అధికారాలే మారిపోతున్నాయని, కానీ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు ఐక్యం కాలేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కొరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్తున్నారని అప్పుడు కిషన్‌రెడ్డి, బీజేపీ ప్రజాప్రతినిధులను అందర్నీ ఆహ్వానిస్తామని, వారు తప్పకుండా వచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు రాపోలు ఆనందభాస్కర్, వి.హనుమంతరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై ప్రజా ఐక్యకూటమి ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు.

అభిషేక్ మహంతికి హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి హైకోర్టులో ఊరట లభించింది. అభిషేక్ మహంతిని ఏపీకి పంపాలన్న కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)లో దాఖలు చేసిన పిటిషన్‌ను పరిష్కరించే వరకు ఆయన తెలంగాణలో ఉండేందుకు అనుమతించాలని కేంద్రం, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ.. విచారణ ముగించింది.

భూ భారతితో పాటు భూ విలువల పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

ఆదాయం పెరుగుతుంది. భూముల విలువలను మార్కెట్ ధరలకు అనుగుణంగా శాస్త్రీయంగా అధ్యయనం చేసి పెంచాం. అదే సమయంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ ఉన్నచోట తగ్గిస్తాం..'అని మంత్రి వివరించారు.

ఐదారు వేలమందికి సర్వేయర్ లైసెన్సులిస్తాం: 'భూముల రిజిస్ట్రేషన్లకు ఇకపై సర్వే మ్యాపులను తప్పనిసరి చేయనున్నాం. భూమి విక్రయించే వారు తమ పాస్ పుస్తకంలో ఉన్న భూమి ఆధారంగా సర్వే చేయించి మ్యాపులు జోడించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ భూములకు, ఆ తర్వాత ప్లాట్లకు అమలు చేస్తాం. సర్వేయర్ల కొరత తీర్చడానికి వెయ్యి మందిని రిక్రూట్ చేసుకుంటాం. ప్రతి మండలంలో సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్‌ని నియమిస్తాం. అలాగే రాష్ట్రంలో ఐదారు వేల మందికి శిక్షణ ఇచ్చి వారికి సర్వేయర్ లైసెన్స్‌లు మంజూరు చేస్తాం.

ఏ అధికారి రిజిస్ట్రేషన్ చేస్తారో తెలియకుండా ఏర్పాట్లు: రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగే 15 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఆధార్ అనుసంధాన ప్రక్రియ, స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేస్తాం. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని పరిష్కరించిన తర్వాత దీనిని రాష్ట్ర వ్యాప్తం చేస్తాం. నాలుగైదు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఒకేచోట చేర్చి కౌంటర్లు పెడ్తాం. ఏ అధికారి రిజిస్ట్రేషన్ చేస్తారో తెలియకుండా చూస్తాం. టోకెన్ నంబర్లు ఇచ్చి.. ఏ కౌంటర్‌లో నంబర్ వస్తే అక్కడ రిజిస్ట్రేషన్ జరిగేలా చేస్తాం. దీనివల్ల అవినీతి తగ్గుతుంది. ఇదివరకు ప్రకటించినట్లు ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దాదాపు 12లక్షల సాదా బైనామాలను మాత్రమే పరిష్కరిస్తాం..'అని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 25-3-2025

జీవనయోధ



కశ్మీర్‌లో సైకిల్ తొక్కడం కష్టం. అయితే మగ పోస్ట్‌మేన్‌లే సైకిల్ తొక్కుతారు. ఉల్ఫతాబానోకు తన రెండు కాళ్లే సైకిల్ చక్రాలు. కశ్మీర్‌లో మొదటి మహిళా పోస్ట్‌ఉమన్‌గా ఆమె 30 ఏళ్లుగా నడిచి ఉత్తరాలు అందిస్తోంది. మంచు తుఫాన్లు, కాల్పుల మోతలు, భయం గొలిపే ఒంటరి మార్గాలు ఆమెను ఆపలేవు. ఇలా వార్తలు మోసే పావురం ఒకటి ఉందని తెలియడానికి ఇంత కాలం పట్టింది. ఇప్పుడుగాని మీడియా రాయడం లేదు. ఈ ఉత్తరం జీవితకాలం లేటు.

మంచు పావురం

మంచులో నడవడం మీకు వచ్చా? మూడు నాలుగడుగుల మంచులో నాలుగు అడుగులు నడవడం ఎంత కష్టమో తెలుసా? బాగా శక్తి ఉన్న యువతీ యువకులకే సాధ్యం కాదు. కాని 55 ఏళ్ల ఉల్ఫతా బానో గత 30 ఏళ్లుగా అలాంటి మంచులోనే నడిచి తన ఊరికి బయటి ప్రపంచానికి అనుసంధానకర్తగా ఉంది. 'హిర్‌పురా' అనే చిన్న పల్లెకి ఆమె ఏకైక మహిళా పోస్ట్‌ఉమన్. ఈ ఊరు శ్రీనగర్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రపంచంతో తెగినట్టుండే ఈ ఊరిలో ఒక వార్త తెలియాలన్నా ఒక విశేషం అందాలన్నా ఉల్ఫతానే ఆధారం.

5 నెలలు మంచులోనే

దక్షిణ కశ్మీర్‌లోని హిర్‌పురాలో ప్రతి నవంబర్ నుంచి మార్చి వరకు ఐదు నెలల పాటు దారుణమైన వాతావరణం ఉంటుంది. దట్టమైన మంచు కురుస్తుంది. రోడ్లు మూసుకుపోతాయి. కాని హిర్‌పురాకు ప్రతిరోజూ కనీసం 30 ఉత్తరాలో, పార్శిళ్లో వస్తాయి. ఒక పురుష ఉద్యోగి జిల్లా హెడ్‌క్వార్టర్ అయిన షోపియన్‌కు వెళ్లి వాటిని పట్టుకొస్తాడు. ఇక పంచే బాధ్యత ఉల్ఫతా బానోదే. 'నేను మెట్రిక్యులేషన్ చదవడం వల్ల ఈ ఉద్యోగం వచ్చింది. నా భర్త కూడా పోస్ట్‌మేన్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. నాకు ప్రస్తుతం 22 వేల రూపాయల జీతం వస్తోంది' అని తెలిపింది ఉల్ఫతా బానో.

ఎన్నో సవాళ్లు ధైర్యమే జవాబు

ఉల్ఫతాకు సైకిల్ తొక్కడం రాదు. సైకిల్ తొక్కడం కష్టమే ఆ ప్రాంతంలో. అందుకే తాను ఎక్కువగా నడుస్తుంది. 'రోజుకు నాలుగైదు కిలోమీటర్లు నడుస్తాను' అంటుందామె. ఉల్ఫతా ఎంతో అవసరం అయితే తప్ప లీవ్ పెట్టదు. 'దట్టమైన మంచు కురుస్తున్నా లాంగ్‌బూట్లు వేసుకొని గొడుగు తీసుకొని డ్యూటీకి వెళతాను. పాపం... ఉత్తరాల కోసం ఎదురు చూస్తుంటారు కదా' అంటుందామె. మంచులో ఒకో ఇంటికి మరో ఇంటికి కూడా సంబంధం తెగిపోయినా ఉల్ఫతా మాత్రం అక్కడకు వెళ్లి ఉత్తరం అందిస్తుంది. 'ఊళ్లో చాలామంది స్టూడెంట్స్ స్టడీ మెటీరియల్ తెప్పించుకుంటూ ఉంటారు. వారికి నన్ను చూస్తే సంతోషం. వాళ్ళు చదువుకోవడానికి నేను సాయపడుతున్నందుకు తృప్తిగా ఉంటుంది' అంటుందామె.



క్రూరమృగాల భయం

కశ్మీర్ సున్నిత ప్రాంతం. గొడవలు... కాల్పుల భయం ఉండనే ఉంటుంది. అయితే అది అటవీ ప్రాంతం కూడా. 'మంచు కాలంలో ఆహారం దొరక్క మంచు చిరుతలు, ఎలుగుబంట్లు ఊరి మీద పడతాయి. నేను ఉత్తరాలు ఇవ్వడానికి తిరుగుతుంటే అవి ఎక్కడ దాడి చేస్తాయోననే భయం ఉంటుంది. కాని నాకెప్పుడు అవి ప్రమాదం తలపెట్టలేదు' అంటుంది ఉల్ఫతా. సాధారణంగా ఇలాంటి ఊళ్లలో డ్యూటీ చేసినా చేయక పోయినా ఎవరూ పట్టించుకోరు. 'కాని డ్యూటీ ఒప్పుకున్నాక చేయాలి కదా. అది పెద్ద బాధ్యత. ఆ బాధ్యతే నన్ను 30 ఏళ్లుగా పని చేసేలా చేస్తోంది' అని సంతృప్తి వ్యక్తం చేస్తుంది ఉల్ఫతా.

ఏసి ఆఫీసుల్లో ఉంటూ హాయిగా వాహనాల్లో వచ్చి పోతూ కూడా తమ డ్యూటీ తాము చేయడానికి అలక్ష్యం చేసే వారు ఉల్ఫతాను చూసి బాధ్యతను గుర్తెరగాలి.

ఇంటిప్స్

పట్టు చీరపై నూనె మరక పడితే..?



- పట్టు చీర కట్టుకున్నప్పుడు పూజలు వంటి ప్రత్యేక సందర్భాలలో నూనె చుక్కలు పడటం సహజమే. నూనె మరక పడిన వెంటనే శుభ్రమైన పొడి కాటన్ బట్టతో ఆ ప్రదేశంలో అద్దాలి. బట్ట లేకపోతే పేపర్, టవల్ తో కూడా నూనె పడిన చోట అద్దవచ్చు. అయితే ఇది చాలా జాగ్రత్తగా చేయాలి. ఎందుకంటే మరక పడిన చోట గట్టిగా రుద్దితే మిగతా చోట్లకు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఇలా చేస్తే నూనె పీల్చుకుని ఆ ప్రదేశంలో మరక పోవడం మొదలవుతుంది. నూనె పడిన చోట మాత్రమే మెల్లగా అద్ది మరకను తొలగించాలి.
- ఇలా వస్త్రం లేదా పేపర్ టవల్ తో అద్దిన తర్వాత అక్కడ పౌడర్ చల్లి శుభ్రం చేయాలి. పౌడర్ చల్లి మరక పడిన చోటును నీటితో కడిగితే చాలు. పేరుకుపోయిన నూనె, మురికి అంతా పోతుంది. పొరపాటున కూడా వేడి నీటితో మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. వేడి నీరు పడితే మరక పోనే పోదు.

బ్యూటిప్

మృదువుగా.. కాంతిమంతంగా...

ఆలివ్ ఆయిల్, అలొవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని అందులో కొద్దిగా వెనిలా ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడిబారే చర్మతత్త్వం గలవారు మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.



బతికాను బతికించాను

దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా సాగింది కోవిడ్ కాలం! నిజంగానే ఫ్రంట్‌లైన్ వారియర్స్ ధైర్యంగా మనకు అండగా నిలబడకపోయింటే ఎలా ఉండేదో మన జీవనం! ఆ టాస్క్‌లో వైద్యులది కీలకపాత్ర. ట్రాన్స్‌పోర్టేషన్ దగ్గర్నుంచి మందుల దాకా ఎదురైన సమస్యలన్నిటినీ పరిష్కరించుకుంటూ తమను తాము మోటివేట్ చేసుకుంటూ స్టాఫ్‌ని ముందుకు నడిపిస్తూ పేషంట్స్‌కి భరోసా ఇచ్చి, ప్రభుత్వ ఆసుపత్రుల గౌరవాన్ని పెంచిన డాక్టర్లలో హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్ అప్పటి సూపరింటెండెంట్.. ఇప్పుడు మహేశ్వరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ ఒకరు. ఆ రోజులను గుర్తుచేసుకుంటూ ఆయన చెప్పిన విషయాలు..

"కోవిడ్ ప్రకృతి వైపరీత్యంలా వచ్చింది. దీని గురించి ప్రజలకే కాదు.. డాక్టర్స్‌కీ అవగాహన లేదప్పుడు. నేనప్పుడు ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా ఉన్నాను. గాంధీ హాస్పిటల్‌ని కోవిడ్ హాస్పిటల్‌గా మార్చారు. అందుకని జనరల్ పేషంట్స్ అందరూ ఉస్మానియాకే వచ్చేవాళ్లు. వాళ్లకు కోవిడ్ ఉండొచ్చు.. లేకపోవచ్చు. టెస్ట్‌లో వాళ్లకు కోవిడ్ నిర్ధారణైతే గాంధీకి పంపేవాళ్లం. అప్పటికే అది ఎందరికో వ్యాపించేసేది. ఏదో ఒక జబ్బుతో వచ్చిన వాళ్లకు కోవిడ్ అని తేలితే కోవిడ్‌తో పాటు వాళ్లకున్న జబ్బుకూ ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి వచ్చేది. ఉదాహరణకు అపెండిక్స్‌తో జాయిన్ అయిన వాళ్లకు కోవిడ్ అని తేలితే వాళ్లను గాంధీకి పంపలేకపోయేవాళ్లం. ఎందుకంటే గాంధీలో అప్పుడు అపెండిక్స్ ట్రీట్‌మెంట్ లేదు.. కేవలం కోవిడ్‌కే! దాంతో కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ఆ పేషంట్‌కి ఉస్మానియాలోనే అపెండిక్స్‌కి ట్రీట్‌మెంట్ ఇచ్చేవాళ్లం. ఈ మొత్తం సర్వీస్‌లో నర్సింగ్ స్టాఫ్, శానిటేషన్ సిబ్బందిని అప్రిషియేట్ చేయాలి. వాళ్లు చాలా ధైర్యంగా నిలబడ్డారు.



డాక్టర్ బి. నాగేందర్
సూపరింటెండెంట్
గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్
మహేశ్వరం

మా బలాన్ని పెంచింది..

లాక్‌డౌన్ ఎంత గడ్డు పరిస్థితో అందరికీ తెలుసు. రవాణా కూడా ఉండేది కాదు. హాస్పిటల్ స్టాఫ్ చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. అందుకే వాళ్లకోసం ఆర్టీసీ సంస్థ వాళ్లతో మాట్లాడి స్పెషల్ బస్‌లు, పాస్‌లను ఏర్పాటు చేయించాం. ఫుడ్ కూడా సమస్య కూడా ఉండేది. కొన్ని మందుల కొరత వల్ల దొంగతనాలూ జరిగేవి. అన్ని సమస్యల్లో.. అంత కోవిడ్ తీవ్రతలోనూ సర్జరీలు చేశాం. సరైన చికిత్స చేస్తూ రోగులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోగలిగాం. ముగ్గురు పేషంట్లకు న్యూరో సర్జరీ అయిన వెంటనే కోవిడ్ సోకింది. వాళ్లను ఆరోగ్యవంతులను చేసి పంపాం. చికిత్సతోపాటు కౌన్సెలింగ్ చేస్తూ వాళ్లకు ధైర్యమిచ్చే వాళ్లం. పేషంట్స్ చూపించిన కృతజ్ఞత మా స్ట్రెంత్‌ను పెంచింది. ఐసీయూలో పేషంట్లను చూస్తుండటం వల్ల నాకూ కోవిడ్ వచ్చింది. గాంధీలో అడ్మిట్ అయ్యాను. తీవ్రమయ్యేసరికి నిమ్స్‌లో చేరాల్సి వచ్చింది. నా పక్క బెడ్ అతని కండిషన్ సడెన్‌గా సీరియస్ అయి చనిపోయాడు. చాలా డిస్టర్బ్ అయ్యాను. నేను వీక్ అయితే నా స్టాఫ్ కూడా వీక్ అయిపోతారని నన్ను నేను మోటివేట్ చేసుకున్నాను. డిశ్చార్జ్ అవగానే డ్యూటీలో చేరాను. వ్యాక్సినేషన్ ప్రక్రియ స్టార్ట్ అయినప్పుడు కూడా వ్యాక్సిన్ తీసుకోవడానికి అందరూ భయపడుతుంటే నేనే ముందు వ్యాక్సిన్ తీసుకుని మిగతావాళ్లను మోటివేట్ చేశాను.

సమర్థంగా, సమన్వయంతో పనిచేసి...

కోవిడ్ టైమ్‌లో మేము అందించిన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులకి మంచి పేరొచ్చింది. గౌరవం పెరిగింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశం కోవిడ్ పరిస్థితులను చక్కగా మేనేజ్ చేసింది. వైద్యరంగం, పోలీస్ వ్యవస్థ, మున్సిపల్ కార్పొరేషన్, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సమన్వయంతో పనిచేయడం వల్ల సమర్థంగా కోవిడ్ సిట్యుయేషన్‌ను ఎదుర్కొన్నాం. కోవిడ్‌ను మానవ చరిత్రలో ఒక అధ్యాయంగా చెప్పుకోవచ్చు. గుణపాఠంగా మలచుకోవచ్చు. ఆరోగ్యాన్ని మించింది లేదని కరోనా మహమ్మారి నిరూపించింది. శుభ్రత నేర్పింది. మంచి జీవనశైలి అవసరాన్ని తెలియజెప్పింది. మానవ సంబంధాల విలువ చూపించింది" అంటూ నాటి గడ్డు రోజులను తాను అధిగమించిన తీరును గుర్తు చేసుకున్నారు డాక్టర్ నాగేందర్.

– సరస్వతి రమ

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు
రేవతి కార్తె: 31 నుంచి

పెను గాలుల నుంచి టేపులతో అరటికి రక్షణ!

- అరటి చెట్లకు నాలుగు వైపులా టేపులు కట్టి గాలుల నుంచి రక్షణ
- కర్ణాటకలో వినూత్న పద్ధతిలో అరటి సాగు చేస్తున్న తెలుగు యువ రైతు సురేష్
- ఎకరానికి టేపుల ఖర్చు రూ. 12 వేలు మాత్రమే!

అరటి తోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులకు పెనుగాలులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తూ ఉంటాయి. లక్షలు పెట్టుబడి పెట్టి పెంచిన అరటి తోటల్లో కొద్ది రోజుల్లో గెలలు కోతకు వచ్చే దశలో సుడిగాలులు, తుపాన్లకు విరిగి పడిపోతే రైతులకు నూటికి నూరు శాతం నష్టం జరుగుతుంది. వెదురు బొంగుల ఊతంతో అరటి చెట్లకు గాలుల నుంచి రక్షించుకునేందుకు రైతులు విఫలయత్నం చేస్తూ వుంటారు. అయితే, కర్ణాటకలో అరటి తోటలు సాగు చేస్తున్న ఒక యువ రైతు సరికొత్త ఆలోచనతో, తక్కువ ఖర్చుతోనే అరటి తోటలను పెను గాలుల నుంచి చక్కగా రక్షించుకుంటున్నారు. చెట్టుకు నాలుగు వైపులా గూటాలు వేసి, వాటికి ప్లాస్టిక్ టేప్‌లను కట్టటం ద్వారా పెను గాలుల నుంచి అరటి చెట్లను చాలా వరకు రక్షించుకోవచ్చని యువ రైతు సురేష్ సింహాద్రి చెబుతున్నారు.. సురేష్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు. కర్ణాటకలోని మైసూరు ప్రాంతానికి వలస వెళ్లి కొన్ని సంవత్సరాల నుంచి యాలక్కి రకం అరటి తోటలను కౌలు భూముల్లో సాగు చేస్తున్నారు. చామరాజానగర జిల్లా కొళ్లేగాలా తాలూకా, సత్తేగాల గ్రామంలో సురేష్ అరటి తోటలను సాగు చేస్తున్నారు. ఆయన అనుభవాలు.. ఆయన మాటల్లోనే..



యువ రైతు సురేష్

అరటి చెట్లకు నాలుగు వైపులా గూటాలు వేసి టేపులతో కట్టేస్తాం

గాలుల నుంచి అరటి చెట్లకు గల సమస్యను అధిగమించడానికి తెలుగు రాష్ట్రాల్లో రైతులు సాధారణంగా వెదురు బొంగులను ఆసరాగా పెట్టి అరటి చెట్లకు రక్షణ కల్పిస్తుంటారు. ఇందుకోసం కర్రల కొనుగోలుకే ఎకరానికి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. అయితే, మేము కర్రల అవసరం లేకుండా కేవలం టేపులతోనే అరటి చెట్టుకు నాలుగు వైపులా కట్టి గాలుల నుంచి విజయవంతంగా రక్షించుకుంటున్నాం. చెట్టుకు నాలుగు వైపులా నేలలోకి కట్టె గూటాలు దిగవేసి, వాటికి టేపులతో అరటి చెట్టు పై భాగాన్ని కడుతున్నాం. చెట్టుకు గట్టిగా బిగుతుగా కట్టకుండా కొంచెం వదులుగా ఉండేలా చెట్టు చుట్టూతా టేపులను రక్షణ చక్రం మాదిరిగా కడతాం. గాలులు వీచి చెట్టు అటూ ఇటూ ఊగినప్పుడు చెట్టు కాండం విరిగి పడిపోకుండా రక్షించుకుంటున్నాం. చెట్టుకు 6 నెలల వయసులో పువ్వు దశలో టేపు కట్టాలి. గత ఏడాది ఎప్పుడూ ఎరుగని రీతిలో మా ప్రాంతంలో గాలి వాన వచ్చి అరటి తోటలే కాదు, కరెంటు స్థంభాలు కూడా కూలిపోయాయి. అయినా, మా తోటలో కొన్ని చెట్లు మాత్రమే ఒరిగాయి. మిగతా చెట్లు అదృష్టం కొద్దీ గాలులను చాలా వరకు తట్టుకున్నాయి. టేపులతో కట్టటం వల్లనే ఇది సాధ్యమైంది.



అరటి చెట్టు పైభాగంలో నాలుగు వైపులా టేపులతో కట్టిన దృశ్యం



నేల మీద కట్టె గూటాలకు చెట్టు నాలుగు వైపులా టేపులతో లాగి కట్టిన దృశ్యం

ఎకరానికి రూ. 12 వేల ఖర్చు

ఎకరం అరటి తోటకు రూ. 12 వేల ఖర్చుతోనే టేపులతో రక్షణ కల్పించుకుంటున్నాం. ఎకరానికి 25 కిలోల టేపు అవసరం అవుతుంది. కిలో ధర రూ. 130. టేపులు కట్టడానికి కట్టె గూటాలు కావాలి. యూకలిప్టస్ లేత కర్రలను కొనుగోలు చేసి, 2 అడుగుల గూటాలను తయారు చేసుకొని వాడుతున్నాం. అడుగున్నర లోతు వరకు నేలలోకి ఏటవాలుగా దిగగొట్టి, ఆ గూటాలకు టేపులు కడతాం. దీని వల్ల గాలులు వచ్చినప్పుడు అవి చెక్కుచెదర కుండా చెట్టును కాపాడుతున్నాయి. కూలీల ఖర్చుతో కలిపితే చెట్టుకు రూ. 10 లకు మించి ఖర్చు కాదు. 6×6 దూరంలో అరటి మొక్కలు నాటితే ఎకరానికి 1200 మొక్కలు పడతాయి. అంటే.. ఎకరానికి టేపులు కట్టడానికి అయ్యే ఖర్చు కేవలం రూ. 12,000 మాత్రమే! కట్టిన టేపు రెండో పంటకు వాడటానికి పనికి రాదు. ప్రతి పంటకు మళ్లీ కట్టుకోవాలి.

మేం యాలక్కి రకం నాటు రకం పిలకలను తెప్పించి నాటుతున్నాం. టిష్యూకల్చర్ మొక్కలు నాటితే అవి మరీ ఎత్తు పెరుగుతాయి. నాటు పిలకలు అయితే ఎత్తు తక్కువ పెరుగుతాయి, కాండం గట్టిగా కూడా ఉంటుంది. వరలక్ష్మి వ్రతం, వినియకచవితి రోజుల్లో ఈ రకం అరటికాయలకు మంచి గిరాకీ ఉంటుంది. కిలో కాయలను రూ. వందకు కూడా అమ్ముతూ ఉంటాం.

రైతుగా నా అనుభవాలను, టేపులను అరటి చెట్లకు కట్టే విధానాన్ని చూపే వీడియోలను 'మీ ఫార్మర్ సురేష్ (@MeFarmerSuresh)' అనే నా యూట్యూబ్ ఛానల్‌లో పెట్టాను. రైతులు ఈ వీడియోలు చూసి అవగాహన పెంచుకోవచ్చు. నా ఫోన్ నంబర్: 99004 42287.

అకాల వర్షంతో నష్ట నివారణకు ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు

అకాల వర్షాలు విరుచుకుపడటంతో గత రెండు, మూడు రోజులుగా అనేక చోట్ల అనేక పండ్ల తోటలకు నష్టం జరిగింది. ఈ తోటల్లో పునరుద్ధరణకు, నష్ట నివారణకు సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ ధరావత్ సూచనలు ఇక్కడ పొందుపరుస్తున్నాం..

మామిడి

- నీటైనంత వరకు అకాల వర్షపు నీటిని 24 గంటల లోపు తోట బయటకు పంపాలి. అదే విధంగా నీరు నిలిచి పోయే పరిస్థితులను నివారించడానికి ఎత్తైన కట్టలతో సరైన పారుదల సౌకర్యాన్ని అందించాలి.
- గాలికి దెబ్బతిన్న కొమ్మలను కత్తిరించి కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఒక లీటర్ నీటికి 20గ్రా. కలిపి పేస్ట్ లాగ చేసి పూయాలి.
- రాలిపోయిన పండ్లను చెట్ల కింద నుంచి సేకరించి దూరంగా వేసి, నాశనం చేయాలి. వీటిని అలాగే వదిలివేయటం వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.
- మామిడికి ప్రస్తుతం పక్షి కన్ను తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక లీటర్ నీటికి 3 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. అదే విధంగా బాక్టీరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.5 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పండ్ల పరిమాణం పెరగడానికి ఒక లీటర్ నీటికి కెఎన్03ను 10 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- కాయలకు పగుళ్ల రాకుండా ఉండటానికి ఒక లీటర్ నీటికి బోరాన్‌ను 1.25 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, కెఎన్03, బోరాన్.. ఈ నాలుగింటిని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చు.
- ప్రస్తుతం తడి వాతావరణం వల్ల పండు ఈగ కాయల్లో గుడ్లు పెట్టే అవకాశం ఉంది. నివారణకు మిథైల్ యూజీనాల్ (ఎర) ఉచ్చులను ఎకరానికి 10–20 అమర్చుకోవాలి.
- చెట్టుపైన మామిడి పండ్లను సంచులతో కప్పితే ఎగుమతికి అవసరమైన నాణ్యమైన పండ్లను పొందవచ్చు.



టమాట

- కాయలకు పగుళ్ల వచ్చే అవకాశం ఉన్నందున బొరాక్స్ ఒక లీటర్ నీటికి 2 నుండి 3గ్రా. కలిపి పిచికారీ చేయాలి.
- పూత దశలో ఉంటే, పూత రాలిపోకుండా ఉండటానికి ప్లానోఫిక్స్ ఒక మి.లీ., 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- సూక్ష్మ పోషక మిశ్రమాన్ని ఒకలీటర్ నీటికి 5గ్రా. కలిపి పిచికారి చేయాలి.

రైతులకు ఏమైనా సందేహాలుంటే వివిధ పంటలకు సంబంధించి ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

పండ్లు : డా. వి. సుచిత్ర – 6369803253
కూరగాయలు : డా. డి. అనిత –94401 62396
పూలు : డా. జి. జ్యోతి – 7993613179
ఔషధ మరియు సుగంధద్రవ్య మొక్కలు: శ్రీమతి కృష్ణవేణి – 9110726430
పసుపు : శ్రీ మహేందర్ : 94415 32072
మిర్చి : శ్రీ నాగరాజు : 8861188885

పసుపు

- వర్షాల వల్ల ఆరబెట్టిన పసుపు తడిసిపోయే ప్రమాదం ఉంది. అందుబాటులో ఉన్న ప్లాస్టిక్ షీట్స్‌ను కప్పడం ద్వారా దీన్ని నివారించుకోవచ్చు.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

27న ప్రకృతి సేద్యంపై అంతర్జాతీయ సదస్సు

'ప్రకృతి సేద్యం దిశగా భారతీయ వ్యవసాయ రంగాన్ని మళ్లించే మార్గాలు' అనే అంశంపై ఈ నెల 27 (గురువారం)న సా. 4 గం. నుంచి 7.30 గం. వరకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్(సెస్) ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సును సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ) హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్నది. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారు స్వయంగా లేదా జూమ్ ద్వారా హాజరుకావచ్చు. మహారాష్ట్ర యవత్‌మల్‌కు చెందిన సేంద్రియ రైతు శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ శర్మ, ఎడిన్‌బరో యూనివర్సిటీ గ్లోబల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ పర్సనల్ ఛైర్ లిండ్సే ఎం జాక్స్, ఆహార–వాణిజ్య విధాన విశ్లేషకులు దేవేందర్ శర్మ, సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ), కృష్ణసుధ అకాడమీ ఫర్ ఆగ్రోఎకాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సదస్సులో ప్రసంగిస్తారు.
రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. www.csa-india.org ; +91 87448 15465

సాక్షి బిజినెస్

బుధవారం
26-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	33	78,017
నిఫ్టీ ▲	10	23,669

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,220	▲ 31
డోజోన్స్	42,550	▲ 33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,664	▲ 26
డాక్స్	23,110	▲ 257
షాంఘై	3,370	▲ 5
నికాయ్	37,608	▲ 172

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	87,751	▲ 32
బంగారం (99.5 స్వచ్ఛత)	87,400	▲ 32
వెండి (కేజీ)	97,922	▲ 515

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.30	86.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.50	112.36
€	యూరో	ఎస్‌బీఐ	91.40	94.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.27	57.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.81	56.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.90	66.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.46	24.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.94	12.76

ఎన్‌పీఏల వేలానికి ప్రత్యేక పోర్టల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌యూ) మొండిబాకీలను (ఎన్‌పీఏ) వేలం వేసే ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించేందుకు 'బ్యాంక్‌నెట్' పేరిట కేంద్ర ఆర్థిక శాఖ ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. సరికొత్తగా



తీర్చిదిద్దిన ఈ–ఆక్షన్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఎన్‌పీఏ కేసుల పరిష్కార ప్రక్రియను పారదర్శకమైన విధంగా, వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని మంత్రి వివరించారు. ఆటోమేటెడ్ కేవైసీ సాధనాలు, సురక్షితమైన పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకు ధ్రువీకరించిన ప్రాపర్టీ టైటిల్స్ మొదలైన వాటిని అనుసంధానించడంతో పాటు అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తూ ప్రాపర్టీ వేలం ప్రక్రియ ఆసాంతం అత్యంత పారదర్శకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. మరోవైపు, 15 ప్రభుత్వ ప్రాయోజిత రుణాలు, సబ్సిడీ పథకాలను ఒకే చోట అనుసంధానించేందుకు 'జన సమర్థ్ పోర్టల్' ఉపయోగపడుతోందని మంత్రి తెలిపారు. దరఖాస్తుదారు డేటాను డిజిటల్‌గా మదింపు చేసే ఈ ప్రక్రియతో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడం, అనుమతులను పొందడం మరింత సులభతరం అయ్యిందని వివరించారు.

ఐటీ షేర్ల అండ.. ఏడోరోజూ ముందడుగు

- 78 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం పది పాయింట్లు



ముంబై: ఐటీ రంగ షేర్ల అండతో స్టాక్ సూచీల ర్యాలీ ఏడోరోజూ కొనసాగింది. అయితే లాభాల స్వీకరణతో ఆరంభ లాభాలు హరించుకుపోయాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 757 పాయింట్లు ఎగసిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్లు పరిమిత లాభంతో 78 వేల స్థాయిపైన 78,017 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్ల స్వల్ప లాభంతో 23,669 వద్ద నిలిచింది. ఐటీ, ప్రైవేటు రంగ బ్యాంకు షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇప్పటికీ అధిక విలువల వద్ద ట్రేడవుతున్న చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో విక్రయాలు చోటుచేసుకున్నాయి. బీఎస్‌ఈ స్మాల్ సూచీ 1.63%, మిడ్ క్యాప్ ఇండెక్సు 1.13 శాతం నష్టపోయాయి. ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రానున్న ప్రతీకార సుంకాల్లో మినహాయింపు ఉండొచ్చని ట్రంప్ సంకేతాలతో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- అధిక విలువ కలిగిన షేర్లలో ఇటీవల దిద్దుబాటు కారణంగా ఐటీ షేర్లకు డిమాండ్ నెలకొంది. పెర్సిస్టెంట్ 2.60%, కో ఫోర్జ్ 2.25% ర్యాలీ చేశాయి. ఎంఫసిస్, ఇన్ఫోసిస్ 1.50% పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 1%, టీసీఎస్, విప్రో షేర్లు అరశాతం మేర లాభపడ్డాయి.
- ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. సెంట్రల్ బ్యాంక్ ఇండియా, యూకో బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3–5% క్షీణించాయి.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ ఊపందుకుంటుందనే అంచనాలతో బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ సిమెంట్ రంగ షేర్లకు 'బై' కేటాయించింది. అల్ట్రాటెక్ 3.50%, ఏసీసీ, దాల్మియా భారత్, అంబుజా సిమెంట్స్ 3% పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఈ ఏడాది ఐటీఈఎస్ కొలువుల జోరు	జీడీపీ వృద్ధికి ఎస్‌అండ్‌పీ కోత

కారు చౌక ఈవీ బేరం!



తగ్గింపు ఇలా...

కంపెనీ	మోడల్	డిస్కౌంట్ (రూ.లలో)
కియా	ఈవీ6	15 లక్షలు
హ్యుందాయ్	ఐయానిక్5	4 లక్షలు
ఎంజీ	జెడ్ఎస్	2.5 లక్షలు
టాటా మోటార్స్	కర్వ్ ఈవీ	1.71 లక్షలు
టాటా మోటార్స్	నెక్సాన్ ఈవీ	1.41 లక్షలు
మారుతీ	గ్రాండ్ విటారా హైబ్రిడ్	1.35 లక్షలు
టాటా మోటార్స్	పంచ్ ఈవీ	1.2 లక్షలు
సిట్రాన్	ఈసీ3	1 లక్ష

■ డిస్కౌంట్‌లో క్యాష్, స్క్రాపేజ్, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ఉచిత యాక్సెసరీలు, అదనపు వారెంటీ వంటివన్నీ కలిసి ఉన్నాయి



ఎలక్ట్రిక్ కార్లపై అదిరిపోయే డిస్కౌంట్ల 'మార్చ్' నడుస్తోంది. ఈవీలకు డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో నిల్వలను తగ్గించుకోవడానికి ఆటోమొబైల్ కంపెనీలు ఆఫర్ల జోరు పెంచాయి. ఎలక్ట్రిక్‌తో పాటు హైబ్రిడ్ వాహనాలపై కూడా కనిష్ఠంగా రూ. 1 లక్ష నుంచి గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు డిస్కౌంట్లు లభిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

- డిమాండ్ తగ్గుతుండటంతో ఆఫర్ల వెల్లువ
- కనీసం రూ.1 లక్ష.. గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు తగ్గింపు
- జాబితాలో హైబ్రిడ్ వాహనాలు కూడా...
- వచ్చే నెల నుంచి రేట్ల పెంపు బాటలో ఆటోమొబైల్ కంపెనీలు

ఏప్రిల్ 1 నుంచి రేట్ల పెంపు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాహన కంపెనీలు ఈవీలపై భారీ డిస్కౌంట్లతో ఊరిస్తున్నాయి. గడిచిన కొన్ని వారాల్లో విడుదల చేసిన కొన్ని కొత్త మోడల్స్ మినహా దాదాపు అన్ని ఎలక్ట్రిక్ కార్లపై కనీసం రూ.1 లక్ష తగ్గింపును ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో 2025 మోడల్స్‌తో పాటు 2024లో తయారైనవి కూడా ఉన్నాయి. కాగా, ఈ డిస్కౌంట్లలో క్యాష్ తగ్గింపు, స్క్రాపేజీ, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ఉచిత యాక్సెసరీలు, అలాగే అదనపు వారంటీ వంటివన్నీ కలిసి ఉంటాయి. సాధారణంగా అమ్మకాలు మందకొడిగా ఉండే సంవత్సరాంతం (డిసెంబర్ నెల)లో వాహన సంస్థలు భారీగా డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. అయితే, ప్రస్తుతం ఈవీలపై ఇస్తున్న తగ్గింపు అప్పటితో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఉండటం విశేషం. దీనికి ప్రధానంగా డిమాండ్ తగ్గడమే కారణమని పరిశీలకులు పేర్కొంటున్నారు.

కొత్త మోడల్స్ దన్ను...

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఈవీ కార్ల సేల్స్ 20,234 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే 26 శాతం పెరిగినట్లు వాహన డీలర్ల అసోసియేషన్ సమాఖ్య (ఎఫ్ఏడీఏ) పేర్కొంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలకు కొత్త మోడల్స్ దన్నుగా నిలుస్తున్నాయి. ఇందులో ఎంజీ విండ్సర్ వంటి మోడల్స్ అమ్మకాలు కీలకంగా నిలుస్తుండటమే కారణం. 2024లో 20 శాతం వృద్ధితో 99,165 ఈవీ కార్లు అమ్ముడయ్యాయి. కాగా, మార్కెట్ లీడర్ టాటా మోటార్స్ (43 శాతం వాటా) ఈవీ సేల్స్ ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 19 శాతం మేర పడిపోవడం గమనార్హం.



కియా.. బంపర్ ఆఫర్

దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియా మోటార్స్ తన ఈవీ6 2025 వేరియంట్‌పై ఏకంగా రూ.15 లక్షల భారీ డిస్కౌంట్‌ను అందిస్తోంది. దీని రేంజ్ 650 కిలోమీటర్లు. అంతక్రితం రూ. 77 లక్షలుగా ఉన్న ఈవీ6 ఆన్‌రోడ్ ధర ఇప్పుడు రూ.62 లక్షలకు దిగొచ్చింది. ఇక హ్యుందాయ్ కూడా ఐయానిక్5 మోడల్‌పై రూ. 4 లక్షల తగ్గింపు ఆఫర్ చేస్తోంది. డిసెంబర్లో దీనిపై రూ.2 లక్షల డిస్కౌంట్ మాత్రమే కంపెనీ అందించింది. అయితే, జనవరిలో విడుదల చేసిన క్రెటా ఈవీపై మాత్రం ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వడం లేదు. ఈవీ మార్కెట్లో అత్యధిక వాటాతో దూసుకెళ్తున్న టాటా మోటార్స్ పలు మోడల్స్‌పై రూ. 1.86 లక్షల వరకు ఆఫర్లను ప్రకటించింది. ఇటీవల ప్రవేశపెట్టిన కర్వ్ ఈవీపై గరిష్ఠంగా రూ.1.71 లక్షల తగ్గింపు లభిస్తోంది. నెక్సాన్ ఈవీపై రూ.1.41 లక్షలు , టియాగో ఈవీపై రూ.1.31 లక్షలు చొప్పున డిస్కౌంట్ ఇస్తోంది.

హైబ్రిడ్‌లపైనా...

మహీంద్రాతో పాటు కొన్ని కంపెనీలు ఈ ఏడాది కొత్త ఈవీలను తీసుకురావడంతో పాత మోడల్స్ పట్ల ఆసక్తి తగ్గిందని.. దీనికి తోడు అధిక ధరల ప్రభావం వల్ల కూడా డిమాండ్ తగ్గుముఖం పట్టిందని ప్రముఖ కార్ల కంపెనీకి చెందిన ఓ డీలర్ అభిప్రాయపడ్డారు. కాగా, ఈవీలతో పాటు హైబ్రిడ్ మోడల్స్ కూడా కారు చౌకగా దొరుకుతున్నాయి. మారుతీ సుజుకీ హైబ్రిడ్ కార్లు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షలు, ఇన్విక్టోపై రూ.1.4 లక్షల చొప్పున ఆఫర్ నడుస్తోంది. అలాగే హోండా సిటీ ఈ–హెచ్‌ఈవీ దాదాపు రూ.1 లక్ష తక్కువకే దొరుకుతోంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్‌లోకి ప్యూర్ ఈవీ

ప్యూర్‌పవర్ శ్రేణి ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ తాజాగా 'స్మార్ట్ ఇన్వర్టర్ల' విభాగంలోకి ప్రవేశించింది. గృహ, వాణిజ్య అవసరాల కోసం 'ప్యూర్‌పవర్' పేరిట విద్యుత్ స్టోరేజీ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించింది. ఇవి 3 కేవీఏ, 5 కేవీఏ, 15 కేవీఏ సామర్థ్యంతో లభిస్తాయి. ధర రూ. 74,999 నుంచి రూ. 1,74,999 వరకు ఉంటుంది. సాంప్రదాయ ఇన్వర్టర్ల కన్నా మెరుగ్గా ఏసీలు, ఇతరత్రా ఉపకరణాలను కూడా ఉపయోగించుకునేందుకు అవసరమైనంత విద్యుత్‌ను ఇవి బ్యాకప్‌గా అందించగలవు. వీటికి బుకింగ్స్ ఏప్రిల్ 1 నుంచి, డెలివరీలు ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమవుతాయని సంస్థ వ్యవస్థాపకుడు నిశాంత్ దొంగారి తెలిపారు. వీటిని పునరుత్పాదక విద్యుత్‌కు కూడా అనుసంధానించుకోవచ్చని పేర్కొన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం (4 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యంతో) ప్యూర్‌పవర్ గ్రిడ్ ఉత్పత్తిని వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దేశీయంగా పునరుత్పాదక విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం, మొత్తం వాహనాల్లోఈవీల వాటాను 40 శాతానికి పెంచుకోవాలనేది లక్ష్యమని చెప్పారు.

టెస్లాను ఓవర్‌టేక్ చేసిన బీవైడీ

గతేడాది 107 బిలియన్ డాలర్ల ఆదాయం



బ్యాంకాక్: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు గట్టి పోటీనిస్తున్న చైనా కంపెనీ బీవైడీ తాజాగా ఆదాయంపరంగా పోటీ సంస్థను అధిగమించింది. బ్యాటరీ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహన విక్రయాలు 40% ఎగియడంతో 2024లో 107 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించింది. గతేడాది టెస్లా ఆదాయం 97.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మరోవైపు 2024లో బీవైడీ నికర లాభం 34% పెరిగి 5.6 బిలియన్ డాలర్లకు చేరింది. కంపెనీ గతేడాది 43 లక్షల ఈవీలను విక్రయించింది. ఇందులో 29% అమ్మకాల వాటా చైనా వెలుపల హాంకాంగ్, తైవాన్ తదితర దేశాలదే ఉంది. బీవైడీ ఈ మధ్యే 5 నిమిషాల్లోనే వాహనాలను చార్జింగ్ చేసే సూపర్ ఫాస్ట్ ఈవీ చార్జింగ్ సిస్టంను ప్రకటించింది. అలాగే, టెస్లా మోడల్ 3 పోలిన కిన్ ఎల్ ఈవీ సెడాన్‌ను సగం రేటుకే ప్రవేశపెట్టింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



ఆంధ్రప్రదేశ్‌లో 14 జిల్లా జడ్జి (ఎంట్రీ లెవల్) పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడిషియల్ సర్వీస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జిల్లా జడ్జి(ఎంట్రీ లెవల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి 7 సంవత్సరాలకు తక్కువ కాకుండా న్యాయవాద వృత్తిలో పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.03.2025 నాటికి 35 నుంచి 45 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్ సెక్రటరీ టు ది గవర్నమెంట్,గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్,సెక్రటేరియట్ బిల్డింగ్స్,వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా–522238 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 27.03.2025.
» వెబ్‌సైట్: https://aphc.gov.in

ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో 28 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్) మేనేజ్‌మెంట్ ట్రైనీల నియామకానికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 28.
» పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రైనీ–డిజిటల్ టెక్నాలజీ–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ–రీసెర్చ్ అండ్ అనాలసిస్–05, మేనేజ్‌మెంట్ ట్రైనీ–రాజ్‌భాష–02, మేనేజ్‌మెంట్ ట్రైనీ–లీగల్–05, డిప్యూటీ మేనేజర్–లీగల్–04, డిప్యూటీ మేనేజర్–01, చీఫ్ మేనేజర్–01.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ, పీజీ, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వయసు: 28.02.2025 నాటికి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 నుంచి 33 ఏళ్లు,ఈడబ్ల్యూఎస్/యూఆర్ అభ్యర్థులకు 28 నుంచి 40 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.65,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,480 నుంచి రూ.85,920, చీఫ్ మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.04.2025
» రాతపరీక్ష తేది: మే 2025.
» వెబ్‌సైట్: www.eximbankindia.in

సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 19.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 21.04.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.1,37,907.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 21.04.2025.
» వెబ్‌సైట్: www.ngri.res.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్స్ట్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

ఈఏపీసెట్‌తో ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా

బీటెక్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థుల తొలి ప్రాధాన్యం! బైపీసీ విద్యార్థులు సైతం మెడిసిన్‌కు ప్రత్యామ్నాయ కోర్సుల గురించి అన్వేషిస్తున్న పరిస్థితి. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంట్రన్స్‌లపై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నారు. ఇలాంటి వారికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. ఈఏపీ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) సెట్!! ఇందులో విజయం సాధిస్తే.. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ అనుబంధ కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఈఏపీసెట్-2025 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ-ఈఏపీసెట్ 2025తో ప్రవేశం కల్పించే కోర్సులు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఏపీ ఈఏపీ సెట్-2025

» ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీసెట్-2025 నోటిఫికేషన్ విడుదల
» ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సులకూ ఈ పరీక్ష ర్యాంకే ఆధారం
» మే 19 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు

ఈ కోర్సుల్లో ప్రవేశం

ఏపీ ఈఏపీ సెట్‌తో ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ, బ్యాచిలర్ ఫిషరీస్ సైన్స్, బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఈఏపీ సెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

అర్హత

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ అభ్యర్థులు ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు సైతం ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

160 మార్కులకు పరీక్ష

ఏపీ ఈఏపీసెట్ పరీక్ష మూడు విభాగాల్లో 160 మార్కులకు జరుగుతుంది. ఈ సెట్‌ను ఇంజనీరింగ్ స్ట్రీమ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లుగా వేర్వేరుగా నిర్వహిస్తారు.

ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతుంది.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాలుంటాయి. బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బయాలజీలో బోటనీ, జువాలజీ నుంచి 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

పరీక్షలో రాణించేలా

మ్యాథమెటిక్స్

ఈఏపీసెట్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సిలబస్ అంశాల్లోని ప్రాథమిక సూత్రాలపై పట్టుసాధించాలి. దీంతోపాటు వేగం, కచ్చితత్వంపై దృష్టిసారించాలి. ఇంటర్ మ్యాథ్స్ సిలబస్‌ను ఆల్‌జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్‌జీబ్రా, ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. జామెట్రీకి వెయిటేజీ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో 2డీ, 3డీ జామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రైట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి. అదే విధంగా ఆల్‌జీబ్రా విభాగంలో ఫంక్షన్స్, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోయర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై పట్టు సాధించాలి. ట్రిగ్నోమెట్రీలో ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్, ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ తదితర అంశాలను సమగ్రంగా ప్రిపేర్‌కావాలి. వెక్టర్ ఆల్‌జీబ్రా నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి.

ఫిజిక్స్

ఇందులో హీట్ అండ్ థర్మోడైనమిక్స్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఆ తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తాయి. గ్రావిటేషన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియల్ అండ్ కెపాసిటెన్స్ చాప్టర్ల నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున వస్తాయి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇనార్గానిక్ తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు నిలుస్తాయి. కెమిస్ట్రీ అంటే సహజంగా చాలా మందికి తెలియని భయం ఉంటుంది. కాబట్టి ఆ భావనను పక్కనబెట్టి ప్రిపేరయితే కెమిస్ట్రీలోనూ మంచి మార్కులు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. గ్రూప్ మూలకాలు, బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లు, ఎలక్ట్రో పాజిటివిటీ, ఎలక్ట్రో నెగెటివిటీ, ఫస్ట్ ఆర్డర్ రియాక్షన్, టైప్స్ ఆఫ్ ఎలిమెంట్స్, స్టాండర్డ్ రిడక్షన్, పొటన్షియల్ వాల్యూమ్ టాపిక్స్‌పైనా దృష్టిపెట్టాలి. వీటితోపాటు డి, ఎఫ్–బ్లాక్ ఎలిమెంట్లు, స్టాండర్డ్ రిడక్షన్ పొటెన్షియల్ వాల్యూ, వెన్నర్ థియరీ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి.

బోటనీ

డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్ (మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రో బయాలజీ(బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జువాలజీ

జువాలజీ నుంచి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఈఏపీసెట్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రం, సిద్ధాంతంపై అవగాహన పెంచుకోవాలి. ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సాధించేందుకు కృషి చేయాలి. ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్‌కు సమయం కేటాయించాలి. ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై పట్టు సాధించాలి. పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచి పూర్తిగా పునశ్చరణకే ప్రాధాన్యం ఇవ్వాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 2025, ఏప్రిల్ 24
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: 2025, మే 12
- ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: మే 21 నుంచి 27 వరకు
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ తేదీలు: మే 19, 20
- పూర్తి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/EAPCET/Eapcet/EAPCET_HomePage.aspx

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- సైన్స్ మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,079	308
77,984	23,658

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	18,143	▲	359
డోజోన్స్	42,473	▲	487
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,638	▼	9
డాక్స్	22,853	▼	39
షాంఘై	3,370	▲	5
నికాయ్	37,608	▼	69

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	87,719
బంగారం (99.5 స్వచ్ఛత)	87,368
వెండి (కేజీ)	97,407

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.80	86.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.40	113.24
€	యూరో	ఎస్‌బీఐ	92.23	94.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.17	58.64
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.68	56.54
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.13	66.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.52	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

ఆరోరోజూ లాభాల మార్చ్

ఆరువారాల గరిష్టానికి సూచీలు

- సెన్సెక్స్ 1,079 పాయింట్లు జంప్
- నిఫ్టీ 308 పాయింట్లు జూమ్
- రూ.27.10 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు, దిగువ స్థాయిల్లో పలు షేర్లకు డిమాండ్ లభించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,079 పాయింట్లు పెరిగి 77,984 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 308 పాయింట్లు బలపడి 23,658 వద్ద నిలిచింది. ఆరోరోజూ ర్యాలీతో సూచీలు ఆరువారాల గరిష్టానికి చేరుకున్నాయి. అలాగే దలాల్ స్ట్రీట్‌లో మొత్తం 6 ట్రేడింగ్ సెషన్లలో రూ.27.10 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.418 లక్షల కోట్ల(4.87 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకుంది.

రోజంతా లాభాలు: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో సూచీలు లాభాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లూ రాణించడంతో ఒక దశలో సెన్సెక్స్ 1,201 పాయింట్లు ఎగసి సాంకేతికంగా కీలకమైన 78 వేల స్థాయిని ఛేదించి 78,107 వద్ద గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 359 పాయింట్లు దూసుకెళ్లి 23,709 వద్ద ఇంట్రాడే హైని తాకింది.

లాభాలు ఎందుకంటే: దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడం, వ్యాలుయేషన్లు దిగిరావడంతో భారత షేర్ల ధరలు ఆకర్షణీయంగా మారాయి. గతేడాది సెప్టెంబర్ నుంచి రూ.2.4 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మేసిన విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐలు) తాజాగా కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. వరుస మూడు ట్రేడింగ్ సెషన్లో రూ.13,765 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. అమెరికా బాండ్లపై రాబడులు అనూహ్యంగా తగ్గడమూ కలిసొచ్చింది. వ్యాలుయేషన్లు దీర్ఘకాల సగటుకు దిగిరావడంతో పాటు కంపెనీల ఆదాయాల్లో రికవరీ జరగొచ్చనే ముందస్తు ఆశావాద అంచనాలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి.

ఈ ఏడాది నష్టాలన్నీ భర్తీ

స్టాక్ సూచీల వరుస ర్యాలీతో దలాల్ స్ట్రీట్‌లో ఈ ఏడాది (2025)లో కోల్పోయిన నష్టాలన్నీ భర్తీ అయ్యాయి. సెన్సెక్స్ ఫిబ్రవరిలో 4,302 పాయింట్లు(5.55%), జనవరిలో 638 (0.81%) పాయింట్లు క్షీణించింది. ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాదిలో రెండుసార్లు వడ్డీ రేట్ల కోత ఉండొచ్చనే సంకేతాలు, డాలర్ బలహీనత, అమెరికా బాండ్లపై రాబడులు దిగిరావడం, దిగువ స్థాయిల్లో పలు షేర్లకు డిమాండ్ లభించడంతో మార్చిలో సెన్సెక్స్ 4,786 పాయింట్లు(6.53%) లాభపడింది. ఈ మార్చి 17 నుంచి (ఆరు ట్రేడింగ్ సెషన్లలో) 4,155 పాయింట్లు లాభపడింది. ఇదే సమయంలో నిఫ్టీ సైతం 1,261 పాయింట్లు పెరిగింది. సెన్సెక్స్ ఈ ఏడాది కనిష్టం(72,633) నుంచి 7.5%, నిఫ్టీ(21,965) 7.7% బౌన్స్ బ్యాక్ అయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- చిన్న, మధ్య తరహా షేర్లకు పెద్ద ఎత్తున డిమాండ్ లభించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.32%, 1.17 శాతం పెరిగాయి. రంగాల వారీగా అత్యధికంగా బ్యాంకెక్స్ ఇండెక్స్ 2.53% పెరిగింది. విద్యుత్ సూచీ 2.31%, ఇండస్ట్రియల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు 2%, రియల్టీ సూచీ ఒకటిన్నర శాతం లాభపడ్డాయి.
- భారత రైల్వే పునరుత్పాదక, అణుశక్తిపై దృష్టి సారించడంతో ఎన్‌టీపీసీ షేరు 4.61% లాభపడి రూ.367 వద్ద ముగిసింది. నూతన చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌ను నియమించినట్లు ప్రకటించడంతో కోటక్ మహీంద్రా షేరు 4.51% పెరిగి రూ.2,178 వద్ద స్థిరపడింది. నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చనే బ్రోకరేజీల అంచనాలతో టాటా టైటాన్ షేరు రెండున్నర శాతం నష్టపోయి రూ.3,078 వద్ద ముగిసింది.

రూపాయి రయ్ రయ్



ముంబై: ఏడో రోజూ ర్యాలీతో రూపాయి ఈ ఏడాది నష్టాలన్నీ పూడ్చుకోగలిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ వరుస లాభాల పరంపర, ఎఫ్‌ఐఐల పునరాగమనంతో దేశీయ కరెన్సీ వరుస 7 ట్రేడింగ్ సెషన్లలో 154 పైసలు బలపడింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, డాలర్ ఇండెక్సు బలహీనత అంశాలు కలిసొచ్చాయి. తాజాగా సోమవారం డాలర్ మారకంలో 37 పైసలు బలపడిన రూపాయి 85.61 వద్ద ముగిసింది. కాగా, 2024 డిసెంబర్ 31న 85.64 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 85.93 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 85.49 వద్ద గరిష్టాన్ని, 86.01 వద్ద కనిష్టాన్ని తాకింది. ''ఆర్థిక సంవత్సరం ముగింపు సర్దుబాటులో భాగంగా విదేశీ బ్యాంకులు, ఎగుమతిదారులు డాలర్ల అమ్మకాలకు పాల్పడుతున్నారు. ఏప్రిల్ 2 నుంచి అమెరికా ప్రతీకార సుంకాలు అమల్లోకి రాకముందే చర్చలు జరుపుతామని భారత ప్రతినిధుల ప్రకటన ఇన్వెస్టర్లకు భరోసానిచ్చింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ విశ్లేషకుడు దిలీప్ పర్మార్ తెలిపారు.

రూ.700 తగ్గిన బంగారం

10 గ్రాముల ధర రూ. 90,550



న్యూఢిల్లీ: నూతన గరిష్టాల వద్ద బంగారం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటోంది. జ్యుయలర్లు, స్టాకిస్టుల అమ్మకాలతో వరుసగా మూడో రోజూ పసిడి నష్టాల బాటలో నడిచింది. ఢిల్లీలో 99.9% స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములకు సోమవారం రూ.700 తగ్గి.. రూ.90,550 వద్ద ముగిసింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య అమెరికా చొరవతో సంధిపై అంచనాలు పెరగడం బంగారంలో లాంగ్ పొజిషన్లను విక్రయించేందుకు దారితీసినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 8 డాలర్లు నష్టంతో 3,013 డాలర్ల స్థాయిలో ఉంది. 'ఉక్రెయిన్–అమెరికా మధ్య చర్చలతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు చల్లారడం ఫలితంగా బంగారం ధరలు గరిష్టాల నుంచి వెనుదిరిగాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ ఎగిసినందున సురక్షిత సాధనంగా పసిడికి బలమైన డిమాండ్ కొనసాగుతుంది. ఇటీవల బంగారం ధరలు కొంత తగ్గినప్పటికీ.. యూఎస్ ఫెడ్ రేట్ల కోత అంచనాలతో బంగారంలో ర్యాలీ కొనసాగుతుంది' అని అబాన్స్ ఫైనాన్షియల్ సీఈవో చింతన్ మెహతా తన అంచనాలను వివరించారు.

ఆన్‌లైన్ ప్రకటనలపై డిజిటల్ ట్యాక్స్ తొలగింపు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ప్రకటనలపై విధిస్తున్న ఈక్వలైజేషన్ లెవీని (డిజిటల్ ట్యాక్స్) తొలగించేలా ఆర్థిక బిల్లులో కేంద్రం సవరణ చేసింది. దీనితో గూగుల్, ఎక్స్, మెటాలాంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై అడ్వర్టైజ్‌మెంట్ సర్వీసులు అందించే సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లులో ప్రతిపాదిత 59 సవరణల్లో ఇది కూడా ఒకటి. ఈ సవరణ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. 2016 జూన్ 1న ఈ ట్యాక్స్‌ను ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార పన్నులు విధిస్తామంటూ హెచ్చరించిన అమెరికాను ప్రసన్నం చేసుకునేందుకే ఆన్‌లైన్ ప్రకటనలపై డిజిటల్ ట్యాక్స్‌ను భారత్ తొలగించి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఆదాయ పన్ను చట్టాలను సరళతరం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి కూడా ఇది దోహదపడుతుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ సుమీత్ సింఘానియా చెప్పారు.

ఎంఎస్‌ఎంఈల వర్గీకరణకు నోటిఫికేషన్

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్‌ఎంఈ) వర్గీకరించడానికి సంబంధించి పెట్టుబడులు, టర్నోవరు ప్రమాణాల్లో గణనీయంగా మార్పులు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. వీటి ప్రకారం రూ. 2.5 కోట్ల వరకు పెట్టుబడులున్న సంస్థలను సూక్ష్మ సంస్థలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 1 కోటిగా ఉంది. అలాగే వీటి టర్నోవరు పరిమాణాన్ని రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు సవరించారు. ఇక చిన్న సంస్థల హోదాకు సంబంధించి పెట్టుబడుల పరిమాణాన్ని రూ. 10 కోట్ల నుంచి రూ. 25 కోట్లకు, టర్నోవరు పరిమితిని రూ. 50 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు పెంచారు. రూ. 125 కోట్ల వరకు పెట్టుబడులు, రూ. 500 కోట్ల వరకు టర్నోవరు ఉన్న సంస్థలను మధ్య తరహా సంస్థలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం వీటి పెట్టుబడుల పరిమితి రూ. 50 కోట్లుగా ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో ఎంఎస్‌ఎంఈల వర్గీకరణకు సంబంధించి కొత్త ప్రమాణాలను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. పెట్టుబడులు, టర్నోవరు పరిమితులను వరుసగా రెండున్నర రెట్లు, రెండు రెట్లు పెంచేలా బడ్జెట్లో ప్రతిపాదించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లు 2 శాతమే	హల్దీరామ్‌లో టెమాసెక్‌కు 10% వాటా

భీమా జ్యువెలర్స్ ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: ఉగాది పండుగ సందర్భంగా ప్రముఖ జ్యువెలరీ సంస్థ భీమా జ్యువెలర్స్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. బంగారు ఆభరణాల తయారీ చార్జీలపై 35% వరకు, కేజీ వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.5,000 తగ్గింపు ఇస్తోంది. వజ్రాభరణాలపై క్యారెట్‌కు 20% వరకు డిస్కౌంట్ అందిస్తోంది. ఈ పరిమితకాల ఆఫర్ అన్ని భీమా స్టోర్లలో అందుబాటులో ఉంటుందని, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ఎండీ అభిషేక్ బిందుమాధవ్ కోరారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్- ఫిజిక్స్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

ఇంటర్‌తో ఎంట్రెన్స్‌లెన్నో!

- » ఇంజనీరింగ్ నుంచి లా వరకు పలు ఎంట్రన్స్‌లు
- » వీటిలో స్కోర్‌తో సంబంధిత కోర్సుల్లో ప్రవేశం
- » ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుకునే అవకాశం

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అనేక సందేహాలు..! భవిష్యత్తులో ఏ కోర్సులో చేరాలి.. ఏ కోర్సులో చేరితే కెరీర్ అవకాశాలు బాగుంటాయి.. ఆయా కోర్సులో చేరేందుకు మార్గాలేమిటి? రాయాల్సిన ఎంట్రెన్స్ టెస్టులు?! ఇంటర్ ఉత్తీర్ణులకు ఇంజనీరింగ్, మెడిసిన్‌తోపాటు బెస్ట్ కెరీర్స్‌ను అందించే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రవేశానికి అనేక ఎంట్రెన్స్ టెస్టులు!! తాజాగా ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉపయోగపడేలా.. ఇంటర్ తర్వాత అందుబాటులో ఉన్న ముఖ్యమైన ఎంట్రన్స్ టెస్ట్‌ల వివరాలు..

జేఈఈ-మెయిన్

జేఈఈ–మెయిన్ జాతీయ స్థాయిలో.. ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. దీంతోపాటు ఐఐటీల్లో ప్రవేశానికి జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కూడా ఇది ప్రామాణిక పరీక్ష. మొత్తం మూడు విభాగాల్లో(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. 300 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది.

జేఈఈ-అడ్వాన్స్‌డ్

ఇంజనీరింగ్ విద్యా బోధనలో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్(ఐఐటీ)ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది. జేఈఈ–మెయిన్ పేపర్–1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది.

ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో ఉత్తమ స్కోర్ ఆధారంగా ఐఐటీలే కాకుండా ఐఐఎస్‌టీ, ఐఐఎస్సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశాలు లభిస్తాయి.

బీఆర్క్, బీప్లానింగ్.. వయా జేఈఈ-మెయిన్

జేఈఈ–మెయిన్‌తో బీటెక్ మాత్రమే కాకుండా.. ఎన్‌ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో సైతం ప్రవేశాలు లభిస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్వహించే జేఈఈ–మెయిన్ పేపర్–2లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈ పేపర్‌లో మ్యాథమెటిక్స్,ఆప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్‌ల్లో నైపుణ్యాలను పరీక్షిస్తారు. మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్‌లను ఆన్‌లైన్ విధానంలో, డ్రాయింగ్ టెస్ట్‌ను పెన్–పేపర్ విధానంలో నిర్వహిస్తారు. అదే విధంగా.. పేపర్–2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మరో పేపర్‌లో పరీక్ష ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్లానింగ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతారు.

ఏపీ, టీజీ ఈఏపీసెట్

రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్, కాలేజీల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న ఎంట్రెన్స్ టెస్ట్.. ఈఏపీసెట్. బీటెక్ కోర్సుల అభ్యర్థులు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలో ఉత్తీర్ణత ద్వారా బీటెక్‌తోపాటు బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ)/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్(బయో టెక్నాలజీ)/బీఫార్మసీ(ఎంపీసీ)/ఫార్మ్–డీ(ఎంపీసీ) కోర్సుల్లోనూ చేరొచ్చు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌ల ద్వారా అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున మొత్తం 160 ప్రశ్నలు–160 మార్కులకు పరీక్ష జరుగుతుంది. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున మొత్తం 160 ప్రశ్నలు –160 మార్కులకు పరీక్ష ఉంటుంది.

బిట్‌శాట్

జాతీయ స్థాయిలో జేఈఈ తర్వాత అంతటి ప్రాముఖ్యం కలిగిన మరో ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్.. బిట్‌శాట్! ఇంజనీరింగ్ విద్యలో పేరు గడించిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ ద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది. ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్, మ్యాథమెటిక్స్(ఇంజనీరింగ్); బయాలజీ(బీఫార్మసీ)ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 130 ప్రశ్నలు.. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

నాటా

ఇంటర్మీడియెట్ ఎంపీసీ అర్హతతో ప్రవేశం పొందే అవకాశం ఉన్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఇందులో ప్రవేశానికి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో అడ్మిషన్ లభిస్తుంది. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు (200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

నీట్-యూజీ

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. నీట్–యూజీ. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులతోపాటు..ఆయుష్ కోర్సులుగా పేరొందిన హోమియోపతి,ఆయుర్వేద, యునానీ, నేచురోపతి తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. బైపీసీ ఉత్తీర్ణులు ఈ ఎంట్రన్స్‌కు అర్హులు. నీట్–యూజీ పరీక్షను నాలుగు విభాగాల్లో(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ) 720 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 45 ప్రశ్నలు అడుగుతారు.

నెస్ట్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు సైన్స్, అనుబంధ విభాగాల్లో ఉన్నత విద్యను చదవాలనుకుంటే మరో చక్కటి మార్గం.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)–భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై–డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అందించే అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు. వీటిల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్. నాలుగు విభాగాల్లో(మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ) 200 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరుగుతుంది.

హోటల్ మేనేజ్‌మెంట్‌కు.. ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో హాస్పిటాలిటీ, టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి. బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు.. జాతీయ స్థాయిలో టూరిజం శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు ప్రత్యేక గుర్తింపు పొందాయి. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ –జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ). అయిదు విభాగాల్లో (న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, అప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్) మొత్తం 200 ప్రశ్నలు అడుగుతారు.

క్లాట్-లా

ఇంటర్మీడియెట్ అర్హతతో అందుబాటులో ఉన్న మరో వినూత్న కోర్సు.. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ. దేశ వ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి క్లాట్–యూజీ నిర్వహిస్తారు. ఈ పరీక్ష అయిదు విభాగాల్లో 120 ప్రశ్నలకు ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (22 నుంచి 26 ప్రశ్నలు), జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (28 నుంచి 32 ప్రశ్నలు), లీగల్ రీజనింగ్ (28–32 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్ (22–26 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ టెక్నిక్స్ (10 నుంచి 14 ప్రశ్నలు) ఉంటాయి.

రాష్ట్ర స్థాయిలో నిర్వహించే లాసెట్‌లో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

సీయూఈటీ-యూజీ

ఇంటర్మీడియెట్ తర్వాత ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో, సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న మార్గం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్–యూజీ. ఈ ఎంట్రన్స్ టెస్ట్‌ను మూడు సెక్షన్లుగా నిర్వహిస్తారు. సెక్షన్–1ఎ (లాంగ్వేజెస్–50 ప్రశ్నలు), సెక్షన్ 1బి (లాంగ్వేజెస్–50 ప్రశ్నలు), సెక్షన్–2(డొమైన్ సబ్జెక్ట్స్ 45/50 ప్రశ్నలు), సెక్షన్–3 (జనరల్ టెస్ట్–60 ప్రశ్నలు) ఉంటాయి. 37 డొమైన్ సబ్జెక్ట్‌లలో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్టంగా అయిదు సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు.

ఫ్యాషన్ కెరీర్‌కు నిఫ్ట్

దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్‌ల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రతి ఏటా నిఫ్ట్ ఎంట్రెన్స్ టెస్టును నిర్వహిస్తోంది. ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులు యూజీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పేపర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష ఉంటుంది. ఇందులో జనరల్ ఎబిలిటీ టెస్ట్, క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్, ఆ తర్వాత పర్సనాలిటీ టెస్ట్‌లు ఉంటాయి. వీటిల్లో ప్రతిభ ద్వారా బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.



గ్యాట్-బి

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్–బయోటెక్నాలజీ.. సంక్షిప్తంగా గ్యాట్(జీఏటీ)–బి. ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నెలకొల్పిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ స్పెషలైజేషన్లలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 77 యూనివర్సిటీల్లో అగ్రి బయోటెక్, ప్లాంట్ బయో టెక్నాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో మెడికల్ టెక్నాలజీ, కంప్యుటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ తదితర స్పెషలైజేషన్లతో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గ్యాట్–బిను రెండు సెక్షన్లుగా, ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో 240 మార్కులకు నిర్వహిస్తారు. సెక్షన్–ఎలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ సబ్జెక్ట్‌ల నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు. సెక్షన్–బిలో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ అనుబంధ విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు సెక్షన్–బిని నిర్వహిస్తారు.

ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ

ఫ్యాషన్ టెక్నాలజీ, డిజైన్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గంగా నిలుస్తున్న పరీక్ష.. ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ. కేంద్ర పర్యాటక శాఖ నేతృత్వంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్.. ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ)ని నిర్వహిస్తోంది. ఇందులో స్కోర్ ఆధారంగా.. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–ఫ్యాషన్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–లెదర్ గూడ్స్ అండ్, బీబీఏ–రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్ కోర్సులో అడుగు పెట్టొచ్చు. బ్యాచిలర్ కోర్సులకు నిర్వహించే ఏఐఎస్‌టీ పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది.

ఎన్‌సీఈటీ

ఇంటర్‌తోనే నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందేందుకు వీలు కల్పించే పరీక్ష.. నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్. ఇందులో స్కోర్ సాధిస్తే.. ఎన్‌సీఈఆర్‌టీ నేతృత్వంలోని రీజనల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లు, ఇతర ప్రముఖ యూనివర్సిటీల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులో ప్రవేశించి ఉపాధ్యాయ వృత్తికి అర్హత పొందొచ్చు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.



– నేలకొండపల్లి

బండెనక బండి కట్టి...

ధాన్యం అమ్మకానికి రైతుల పడిగాపులు

ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు కింద యాసంగిలో పలువురు రైతులు ముందుగానే వరిసాగు చేయగా ప్రస్తుతం కోతలు మొదలయ్యాయి. అయితే, అన్నిచోట్ల వరి చేతికి రాకపోవడంతో ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. దీంతో నేలకొండపల్లి మండలంలోని పలువురు రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. సోమవారం దాదాపు 70 - 80 ట్రాక్టర్ల మేర ధాన్యాన్ని ఒక మిల్లుకు తీసుకురాగా.. ధర నిర్ణయం, కొనుగోళ్లలో ఆలస్యంతో బారులుతీరి కనిపించాయి. మిల్లర్లు క్వింటాకు రూ.2,200 మేర చెల్లిస్తున్నారని, మరింత ధర పెంచమని అడిగితే తిప్పి పంపిస్తున్నందున.. ప్రభుత్వం త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

మోటారు పక్కన మోటారు పెట్టి..

నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చడంతో.. ఖమ్మం నగరంలోని 21వ డివిజన్ పార్శీబంధంలో ఉన్న పురాతన బావికి స్థానికులు 30 వరకు మోటార్లు బిగించారు. ఆపై తమ ఇళ్ల వరకు అర్ధ కిలోమీటర్ మేర పైపులు వేసుకున్నారు. డివిజన్‌లోని ఇళ్లకు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా అవుతున్నా.. ఎక్కువ సేపు నల్లాలు రావడం లేదు. వచ్చినా ధార తక్కువగా ఉంటోంది. ఇళ్లలో బోర్లు వేసినా నీటి లభ్యత ఉండడం లేదు. దీంతో ఎక్కువ మంది కొన్నేళ్లుగా ఈ బావినే నమ్ముకుంటున్నారు. ఎండలు ముదిరాక ఈ బావి సైతం ఎండిపోతే ట్యాంకర్లు తెప్పించుకుంటామని స్థానికులు చెబుతున్నారు.

మహోన్నత దానం మరింత వేగం

ఆయా అవయవాల కోసం వేచిఉన్న వారి సంఖ్య

అవయవం పేరు	సంఖ్య
కాలేయం	930
కిడ్నీ	2,704
గుండె	98
ఊపిరితిత్తులు	76
క్లోమం	15

▶ మొదటి పేజీ తరువాయి

పునర్జన్మ పొందారు. ఇంకా 3,823 మంది అవయవ మార్పిడి కోసం రాష్ట్ర ప్రభుత్వ 'జీవన్‌దాన్' కార్యక్రమం కింద నమోదు చేసుకున్నారు. దీనిని బట్టే రాష్ట్రంలో అవయవ దానం, అవయవ మార్పిడిపై ప్రజల్లో అవగాహన ఎంతగా పెరుగుతోందో స్పష్టమవుతోంది.

2021 నుంచి ఏటా 700 సగటుతో అవయవ మార్పిడి

అవయవ మార్పిడిలో దేశంలో తమిళనాడు మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ అవయవ మార్పిడి రేటు 1.9 పర్ మిలియన్ పాపులేషన్ (పీఎంపీ)గా ఉంది. ఇది జాతీయ సగటు (0.65 పీఎంపీ) కంటే చాలా ఎక్కువ. తెలంగాణలో కూడా చైతన్యం పెరగడంతో 2021 నుంచి ప్రతి ఏటా 700 సగటుతో అవయవ మార్పిడి కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ఊపిరితిత్తులు, కాలేయం, కంటి కార్నియా మార్పిడులు ఎక్కువగా ఉండగా, బ్రెయిన్ డెడ్ అయిన వారి ద్వారా సేకరించి గుండెను మార్చే శస్త్రచికిత్సలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు నాలుగు గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరగడం ప్రజల్లో పెరిగిన చైతన్యాన్ని సూచిస్తున్నాయి.

సవరించిన చట్టాన్ని అమలు చేసేలా తీర్మానం

రాష్ట్రంలో 1994 నాటి అవయవ మార్పిడి చట్టం 'టీహెచ్ఓఏ' (ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్)ను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం గత పదకొండేళ్లుగా అమలు చేస్తూ వచ్చింది. దీంతో అవయవ మార్పిడి ఆశించిన స్థాయిలో జరగలేదు. కానీ ఇప్పుడు.. ఆ చట్టానికి సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2014లో తీసుకొచ్చిన 'టీహెచ్ఓటీఏ-తోటా' (ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్) చట్టాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేసేలా సోమవారం శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించింది. దీంతో రాష్ట్రంలో మరింత పారదర్శకంగా, మానవ అవయవాల వ్యాపారాన్ని నిరోధించి, అవసరమైన వారికి చట్టబద్ధంగా, ఎక్కువ సంఖ్యలో అవయవ మార్పిడి జరిగేందుకు అవకాశం ఏర్పడింది.

'జీవన్‌దాన్' ద్వారా పునర్జన్మ

రాష్ట్ర ప్రభుత్వం 'జీవన్‌దాన్' కార్యక్రమం ద్వారా అధికారికంగా అవయవమార్పిడి ప్రక్రియను నిర్వహిస్తోంది. ఎవరికైనా వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా మూత్రపిండం (కిడ్నీ), గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె నాళాలు, కంటి కార్నియా, క్లోమం (ప్యాంక్రియాస్) వంటి అవయవాలను మారుస్తున్నారు. 2013 నుంచి ఇప్పటివరకు 6,007 మందికి మార్చి కొత్త జీవితాన్ని అందించారు. ఈ 6,007 మందిలో అత్యధికంగా 2,394 మందికి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరగగా, కాలేయం (లివర్) మార్పిడి చికిత్సలు 1,462 మందికి జరిగాయి. 2013 నుంచి రాష్ట్రంలో గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా జరుగుతుండడం గమనార్హం. అప్పటినుంచి ఇప్పటివరకు 218 మందికి గుండె మార్పిడిలు జరగగా, 2017, 2022లో వరుసగా 32, 31 చొప్పున గుండె మార్పిడి చికిత్సలు జరిగాయి.

'తోటా'తో వేగవంతం!

'తోటా' చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా మానవ అవయవాల మార్పిడి ప్రక్రియ వేగవంతం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్రెయిన్ డెడ్ అయినవారు, మరణించిన వారినుంచి అవసరమైన అవయవాలను సేకరించి, మార్పిడి చేసేందుకు వీలుగా నిబంధనల్లో మార్పులు జరిగాయి. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు.. వారి మనవళ్లు, మనవరాళ్లకు అవయవ దానం చేయడానికి ఈ చట్టం అనుమతి ఇస్తోంది. కొన్ని రకాల జన్యుపరమైన సమస్యల వల్ల పిల్లలకు కాలేయ మార్పిడి చేయాల్సి వచ్చినప్పుడు వారి గ్రాండ్ పేరెంట్స్ కాలేయ దానం (కాలేయంలో కొంత భాగం) చేయడానికి అవకాశం కలుగుతోంది. అలాగే 1995 నాటి నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెడ్ డిక్లేర్ చేసే అధికారం న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లకు మాత్రమే ఉంది. కొత్త నిబంధనల ప్రకారం ఫిజీషియన్, సర్జన్, ఇంటెన్సివిస్ట్, అనస్థీషియన్ కూడా బ్రెయిన్ డెడ్ డిక్లేర్ చేయడానికి అర్హులు. మరోవైపు అవయవాల అక్రమ రవాణా, అక్రమ మార్పిడి చేస్తే ఇప్పటివరకు రూ.5 వేల జరిమానా, 3 సంవత్సరాల వరకూ జైలు శిక్ష విధించేందుకే అవకాశం ఉండేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం ఒక కోటి రూపాయల వరకు జరిమానా, పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఏర్పడింది.

దాతల్లో 41 నుంచి 60 ఏళ్ల వారే ఎక్కువ

అవయవ దాతల్లో 41 సంవత్సరం నుంచి 60 సంవత్సరాల లోపు వారే అధికంగా ఉన్నారు. 2020 నుంచి అవయవ దానం చేసిన వారిని చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఐదేళ్లలో 41 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు వారు 187 మంది అవయవదానాలు చేయగా, 51 నుంచి 60 ఏళ్లలోపు వారు 190 మంది ఉన్నారు. ఇక 61 నుంచి 70 వయస్సు గల వారు 88 మంది ఉన్నారు. అవయవదానం చేసిన యువకుల్లో 21 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు 149 మంది ఉండగా, 31 నుంచి 40 ఏళ్ల లోపు వారు 140 మంది ఉన్నారు. ఇక 1 నుంచి 10 ఏళ్ల వయస్సు వాళ్లు ఆరుగురు, 11 నుంచి 20 ఏళ్ల లోపు వారు 64 మంది ఉన్నారు. 71 నుంచి 78 ఏళ్ల లోపు వారు 36 మంది ఉంటే, 81 ఏళ్లు పైబడిన వారు 2020లో ఇద్దరు, 2023లో ఒక్కరు వారి అవయవాలను దానం చేశారు. కాగా 2020 నుంచి అవయవ దానం చేసిన 863 మందిలో మహిళలు 672 మంది కాగా, పురుషులు కేవలం 191 మాత్రమే కావడం గమనార్హం.

2020 నుంచి రాష్ట్రంలో జరిగిన అవయవ దానాల వివరాలు

సంవత్సరం	కిడ్నీ	లివర్	గుండె	కంటి కార్నియా	ఊపిరితిత్తులు	క్లోమం	మొత్తం
2020	97	70	14	56	20	0	257
2021	228	139	26	138	83	2	616
2022	263	171	31	186	65	0	716
2023	287	173	15	176	76	2	729
2024	297	175	26	152	75	0	725
2025 (మార్చి 24 వరకు)	67	41	8	30	16	0	162
మొత్తం	1239	769	120	738	335	4	3205



అవయవాల కోసం వెయిటింగ్‌లో 3,823 మంది

అవయవ మార్పిడి కోసం 'జీవన్‌దాన్' వద్ద ఇంకా 3,823 మంది నమోదు చేసుకుని ఉన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఈఎస్ఐతో పాటు హైదరాబాద్‌లోని 41 ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తారు. అత్యధికంగా నిమ్స్‌లో 620కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. - డాక్టర్ శ్రీభూషణ్ రాజు (జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్)

వైద్యులకు ఆధార్ అటెండెన్స్

వ్యక్తిగత మొబైల్ యాప్‌లోనే రోజూ హాజరు రికార్డు

- ఏప్రిల్ 1 నుంచి అమలు చేసే యోచనలో ప్రభుత్వం
- పీహెచ్‌సీ నుంచి జనరల్ ఆసుపత్రి వరకు వర్తింపు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వైద్య సంఘాలు




సాక్షి, హైదరాబాద్: పీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా స్థాయి ఆస్పత్రుల్లో ఉద్యోగం చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు (ఆధార్ బేస్డ్ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్) విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఇప్పటికే రాష్ట్రంలోని టీచింగ్ హాస్పిటల్స్‌లో ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబస్)ను అమలు చేస్తున్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తూ.. విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తటంతో హాజరు విధానంలో మార్పులు తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని హాస్పిటల్స్, పీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీల్లో కలిపి 10 వేల మందికి పైగా వైద్యులు పనిచేస్తున్నారు. ఈ ఆధార్ ఆధారిత హాజరు విధానాన్ని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అటెండెన్స్ యాప్‌ను డాక్టర్లు తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్‌కు ఆధార్‌తో లింక్ చేసి, ఫేస్ రికగ్నిషన్‌తో హాజరు నమోదు చేస్తారు. అయితే, ఈ విధానాన్ని వైద్యుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేరకు సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ వైద్యుల సంఘాలన్నీ మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఏసీ నేతృత్వంలో సమావేశమై ఆధార్ ద్వారా హాజరు విధానాన్ని వ్యతిరేకించాయి.

వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దు

ప్రైవేట్ యాప్ ద్వారా అటెండెన్స్ విధానం అమలు చేయడం వల్ల ఉద్యోగి వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుంది. అటెండెన్స్‌కు ఆధార్‌తో లింక్ చేయడం సరికాదు. ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ కోసం పీహెచ్‌సీల్లో మెషీన్లు ఏర్పాటుచేయాలి. దాన్ని మేం కూడా స్వాగతిస్తాం. కానీ సొంత మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసి వ్యక్తిగత వివరాలన్నింటినీ ఏదో కంపెనీకి ఇస్తామంటే మాత్రం వ్యతిరేకిస్తాం.

-లాలూప్రసాద్ రాథోడ్, సెక్రెటరీ జనరల్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం.

నా బెస్ట్ ఫ్రెండ్ నేనే..



ఒడిదుడుకులను అధిగమిస్తేనే ఉన్నత శిఖరాలు

ఎస్సీ గురుకుల విద్యార్థులతో రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి

జూమ్‌లో పాఠాలు

సాక్షి, హైదరాబాద్: ప్రతి వ్యక్తి తన జీవిత ప్రయాణంలో ఒడిదుడుకులను అధిగమిస్తేనే.. ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ఎంపీ సుధామూర్తి స్పష్టం చేశారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, పరీక్షల్లో భయం వీడి ధైర్యంగా సన్నద్ధం కావడం, ఆత్మస్థైర్యంతో జీవితంలో రాణించేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రముఖులతో విద్యార్థులను మాట్లాడించి చైతన్యపరిచేందుకు.. ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సొసైటీ పరిధిలోని పలువురు పాఠశాల విద్యార్థులను సోమవారం జూమ్ ద్వారా కనెక్ట్ చేసిన అనంతరం.. సుధామూర్తిని భాగస్వామిని చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటిస్తూ తన అనుభవాలను పంచుకున్నారు. సుధామూర్తి బెస్ట్ ఫ్రెండ్ పేరు చెప్పాలని ఈ సందర్భంగా విద్యార్థులు అడిగారు. దీనిపై ఆమె స్పందిస్తూ తనకు ప్రత్యేకంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఎవరూ లేరని, తనకు తానే బెస్ట్ ఫ్రెండ్ అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, ఓర్పు, సహనం ముఖ్యమని, నిత్యం ఇష్టమైన పుస్తకాలను చదువుతూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తన బాల్య దశలో ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలను విద్యార్థులకు వివరించారు. తను చదువుకునే రోజుల్లో కళాశాలలు లేవని, రెండు మైళ్లకు పైగా పాఠశాల నుంచి ఇంటికి నడిచానన్నారు. 1968లో తన 17వ ఏట ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు.. సైన్స్ గ్రూపులో దరఖాస్తు చేసుకుంటే కంప్యూటర్ సైన్స్‌లో సీటు వచ్చిందన్నారు. ఆ కళాశాలలో తాను ఒకే ఒక్క బాలికనని, మిగతా విద్యార్థులంతా బాలురేనని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆ కళాశాల ప్రిన్సిపల్.. ఇంత మంది మధ్యలో ఎలా చదువుకుంటావని ప్రశ్నించారన్నారు. చదువుపై తనకు విశేషమైన ఆసక్తి ఉన్నందున అది పెద్ద సమస్య కాదనడంతో.. ప్రిన్సిపల్ ఎంతో మెచ్చుకుని ప్రోత్సహించారన్నారు. బోధన అంటే చాలా ఇష్టమని, పీహెచ్‌డీ పూర్తి చేసుకొని ఉపాధ్యాయినిగా స్థిరపడాలనుకున్నా.. జీవితంలో ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని ఒక సంస్థ స్థాపించడానికి దారితీసిందని సుధామూర్తి చెప్పారు.

19 బెట్టింగ్ యాప్స్ యజమానులపై కేసు నమోదు

మియాపూర్: నిషేధిత బెట్టింగ్ యాప్స్ యజమానులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న 25 మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా 19 బెట్టింగ్, గేమింగ్ యాప్స్ యజమానులపై కేసు నమోదు చేశామని సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. కాగా, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో సినీ నటి, యాంకర్ శ్యామల సోమవారం పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం పోలీస్‌స్టేషన్ బయట ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చెయ్యడం తప్పని, ఇకపై ఇలాంటివి చేయబోనని చెప్పారు.

ఈ సమావేశాల్లోనే మా బిల్లులపై ప్రకటన చేయండి

మంత్రి పొన్నంకు సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా పెద్ద మనసుతో ఆలోచించి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ.. బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తిచేసింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలతో పాటు రాష్ట్ర ఆర్థికసంఘం నిధులు విడుదల చేసేలా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరింది. ఈ మేరకు సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రికి జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు ఆకలి 'పరీక్ష'

1 నుంచి 9 తరగతుల వారికి మధ్యాహ్న భోజనం ఆలస్యం

- టెన్త్ పరీక్షల నేపథ్యంలో వంట చేసే వారిని లోనికి అనుమతించని వైనం
- మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష ముగిసిన తర్వాత వంట ప్రారంభిస్తున్న వర్కర్లు
- 2 గంటల తర్వాతే భోజనం వడ్డింపు.. నీరసించిపోతున్న చిన్నారులు



సాక్షి, హైదరాబాద్: ఉన్నతాధికారుల ఆదేశాలు విద్యార్థులను ఆకలి మంటలకు గురి చేస్తున్నాయి. మండు వేసవిలో మధ్యాహ్నం రెండింటి దాకా అన్నం తినలేని పరిస్థితిని కల్పిస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల టెన్త్ పరీక్షలు మొదలయ్యాయి. ప్రభుత్వ స్కూళ్లనూ పరీక్షా కేంద్రాల జాబితాలో చేర్చగా.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతోంది. ఈ సమయంలో పరీక్ష రాసే విద్యార్థులను తప్ప ఇంకెవరినీ పాఠశాల లోనికి అనుమతించవద్దని అధికారులు ఆదేశించారు. దీంతో 1 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు, మధ్యాహ్నం భోజనం వండి తీసుకొచ్చే వర్కర్లు లోనికి వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. పరీక్ష పూర్తయిన తర్వాతే వీరిని లోనికి అనుమతిస్తున్నారు. అప్పుడు వంట ప్రారంభించాల్సి వస్తోంది. పోనీ ఉదయం వేళ వచ్చి వంట చేద్దామంటే విద్యార్థులకు ఉదయం 7 లేదా 8 గంటలప్పుడు వండిన చల్లారిన అన్నం పెట్టాల్సి వస్తుంది. కాబట్టి పరీక్ష అయిపోయిన తర్వాతే వంట చేయాల్సి వస్తోందని వర్కర్లు చెబుతున్నారు. 12 తర్వాత వంట ప్రారంభించి పూర్తి చేసేసరికి రెండు గంటలు దాటుతోంది. విద్యార్థులందరూ భోజనం చేసే సరికి మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటలవుతోంది. దీంతో చిన్న పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. కొంత మంది నీరసించి పోతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.

తొలిరోజు ఘటనల నేపథ్యంలోనే..

వాస్తవానికి పరీక్షల మొదటి రోజు మధ్యాహ్న భోజనం ఎప్పటిలాగే సాగింది. పరీక్ష జరుగుతున్నా ఇతర క్లాసుల్లోకి విద్యార్థులను అనుమతించారు. అలాగే వర్కర్లూ ముందే వంట మొదలు పెట్టారు. మధ్యాహ్నం 1 గంటకు భోజనాలు అందించారు. అయితే తొలిరోజు అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. నల్లగొండ జిల్లాలో ప్రశ్నపత్రం వాట్సాప్ ద్వారా బయటకు వెళ్ళింది. మరి కొన్నిచోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పరీక్ష ముగిసే వరకూ ఎవరినీ పాఠశాల లోపలికి అనుమతించవద్దంటూ పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా మధ్యాహ్న భోజనం కోసం వంట కార్యక్రమాన్ని కూడా నిలిపివేశారు. ఆదిలాబాద్, సిరిసిల్లతో పాటు పలుచోట్ల విద్యార్థులు ఈ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయం ఆలోచించాలని కోరుతున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.




కేసీఆర్‌పై బండి వ్యాఖ్యలు సిగ్గుచేటు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఆధారాల్లేకుండా కేసీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారని, హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కించుకోవడం కోసమే సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదని, రెచ్చగొట్టే మాటలతో రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే హైదరాబాద్‌కు ఒక నేషనల్ పార్క్, నిధులు తీసుకురావాలని సవాలు విసిరారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ ఇలాంటి నాయకులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

చేప పిల్లల కాంట్రాక్టర్ చేతివాటం

విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యే 'గండ్ర' డిమాండ్



సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి నియోజకవర్గం గణపసముద్రం చెరువులో 1.30 లక్షల చేప పిల్లలు పోసి, 8 లక్షలు పోసినట్టు కాంట్రాక్టర్ లెక్కలు చూపాడని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆరోపించారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర కూడా ఉందని, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ కాంట్రాక్టర్ రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా దోపిడీకి పాల్పడ్డాడని ఆరోపించారు. జనగాం నియోజకవర్గం ధర్మసాగర్ పరిధిలోని పంపులను ఆఫ్ చేయడం వల్ల 50 శాతం పంటలు దెబ్బ తిన్నాయని, వీటిని తక్షణమే ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. చేర్యాల, జనగాం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, మందుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను విచారించి ఎత్తివేయాలని కాంగ్రెస్ సభ్యుడు రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణలు, అనుమతుల్లేని
నిర్మాణాల్నే కూల్చాం

292.59 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీనం • పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, కుంటలను ఆక్రమించుకుని నిర్మించుకున్న కట్టడాలను, ఎలాంటి అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. శాసనసభలో సోమవారం వివిధ పద్దులపై వాడివేడిగా చర్చలు జరిగాయి. పురపాలక, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, ఐటీ శాఖలకు సంబంధించి ప్రవేశపెట్టిన పద్దులపై.. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 ప్రాంతాల్లో హైడ్రా ఇప్పటి వరకు మొత్తం 399 భవనాలు/ఇళ్లు కూల్చివేసినట్లు స్పష్టం చేశారు. దాదాపు 292.59 ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.3454.70 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, హెచ్‌ఎండీఏ, మెట్రోలైన్ అభివృద్ధి కోసం రూ.7325 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. హైదరాబాద్‌ను పూర్తిగా జీఐఎస్ మ్యాపింగ్‌తోపాటు, డ్రోన్‌లతో సర్వే చేశామన్నారు. ఇప్పటి వరకు 13.39 లక్షల భవనాల ఫుట్‌ప్రింట్‌లు తీశామని వివరించారు. క్షేత్రస్థాయిలో 8.55 లక్షల ఇళ్లను తనిఖీ చేశామన్నారు. ఆస్తిపన్ను వసూళ్లు, మౌలిక సదుపాయాల కోసం ఈ సర్వేలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. తాము మూసీని సుందరీకరించడం లేదని, పునరుజ్జీవం చేస్తున్నామని వెల్లడించారు. తద్వారా తాగు, సాగునీరు అందించేలా చూస్తామన్నారు. మూసీలో దుర్గంధంలో జీవిస్తున్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తామని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీరు తీసుకొస్తున్నామన్నారు. అక్కడ కేశవపూర్ రిజర్వాయర్ వద్ద నుంచి నీరు తీసుకునే అవకాశం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్ నగరానికి అదనంగా ఒక్క చుక్క నీరు కూడా తీసుకురాలేదన్నారు. హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్న తాగునీటి ప్రాజెక్టులన్నీ.. కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని స్పష్టం చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి అన్ని ప్రాంతాల నుంచి మెట్రో రైలు సౌకర్యం కల్పిస్తున్నామని, ఎలివేటెడ్ కారిడార్లను 36 నెలల్లో పూర్తి చేస్తామన్నారు.

పదేళ్లలో అన్ని రంగాల నిర్లక్ష్యం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో పలు రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సరైన ప్రాధామ్యాలు లేక లక్ష్యసాధన దిశగా ముందుకు సాగకపోవడంతో రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ప్రారంభోత్సవాలు, శిలాఫలకాలకే పరిమితమై ప్రజలను మోసగించిందన్నారు. అప్పటి ప్రభుత్వానికి నిజంగా, చిత్తశుద్ధి ఉంటే నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉండేదన్నారు. కేంద్రంతో అనవసర ఘర్షణల వల్ల నష్టం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ తప్పిదాల వల్ల భారీ జరిమానాలు పడే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. 2014లో ఢిల్లీ తర్వాత రెండోస్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో.. ఇప్పుడు తొమ్మిదో స్థానానికి చేరుకుందని వెల్లడించారు. పారదర్శకతను పెంచడంతో పాటు, పట్టణాభివృద్ధి, నాణ్యతను మెరుగుపరిచేందుకు ఏఐని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. గతంలో నిర్మాణ అనుమతులకు 2 నుంచి 5 నెలలు పడుతుండగా.. ఇప్పుడు బిల్డ్ నౌ ద్వారా కేవలం 10 నిమిషాల్లో అనుమతులు ఇచ్చేందుకు సాంకేతికతను ఇంటిగ్రేట్ చేసినట్టు వెల్లడించారు.

3,316 మంది యువ ప్రతిభావంతుల నియామకం

గతంలో కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటైనా పోస్టులు సృష్టించలేదని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. కానీ తమ ప్రభుత్వం ఇప్పటికే 3,316 మంది యువ ప్రతిభావంతులను నియమించిందన్నారు. ఇప్పటికే 521 కొత్త పోస్టుల్లో నియమించి, 453 ఇంజనీరింగ్, 125 టౌన్‌ప్లానింగ్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేసిందని వెల్లడించారు.

హామీలు అమలు చేయండి

ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో.. దళిత బంధు పథకం కింద పేదల్లో నిరుపేదలకు ఇచ్చినట్టు నిరూపించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌కు సవాల్ చేశారు. పల్లెలన్నీ తల్లడిల్లుతున్నాయని, ఏగ్రామానికి వెళ్లినా తాగునీరు రావడం లేదని, బోర్లు వేయాలని ప్రజలు కోరుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. బీఆర్‌ఎస్ హయాంలో సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో సెక్షన్ 30 విధించి.. కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులతో జైల్లో పెట్టారని గుర్తు చేశారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తాను పీఆర్ శాఖ మంత్రిగా ఉన్నపుడు ఎల్‌ఈడీ దీపాలను తీసుకొచ్చే ప్రయత్నాన్ని వ్యతిరేకించి నిలిపివేశామన్నారు. తాను వ్యతిరేకించిన దాన్ని.. ఆ తర్వాత తీసుకొచ్చారని, ఆ ఒప్పందాల రద్దుకు ప్రస్తుత తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈఈఎస్‌ఎల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల గ్రామ పంచాయతీలకు 75 శాతం ఆదాయం పోతోందన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీల ఆదాయాన్ని దోచిపెట్టారని ఆరోపించారు. ఈ పద్దులపై చర్చలో.. ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, అనిరుధ్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

బీజేపీ నేత రాణి రుద్రమ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: హిందూ సమాజానికి మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. రంజాన్ సందర్భంగా ఒక వర్గాన్ని సంతృప్తిపరిచే ఉద్దేశంతో, హిందూ దేవుళ్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. రాములవారి అక్షింతలపై కేటీఆర్ రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ, చివరకు దేవుడిని కూడా రాజకీయాల్లోకి తీసుకురావడం సిగ్గుచేటన్నారు. కరీంనగర్ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. అయోధ్య నుంచి అక్షింతలు రాలేదని, ఇక్కడే రేషన్ బియ్యాన్ని ఇంటింటికి పంచి బీజేపీ అధికారంలోకి వచ్చిందని తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు.

ఇఫ్తార్‌కు రూ.70 కోట్ల ఖర్చా?

బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్



సాక్షి, హైదరాబాద్: రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందుల నిర్వహణకు పెద్దమొత్తంలో నిధులు ఖర్చు పెట్టడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్న వేళ రూ.70 కోట్ల నిధులను ఇఫ్తార్ కోసం ఖర్చు చేయడం అన్యాయమని సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మైనారిటీ సంక్షేమ నిధులను దుర్వినియోగం చేస్తోందని పౌర సమాజం వ్యక్తం చేసిన ఆందోళనకు బీజేపీ మద్దతు తెలుపుతోందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పౌర సమాజం అభిప్రాయాలను గౌరవించాలని సంక్షేమ నిధులను లక్ష్యబద్ధంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తున్న వారిలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సామాజిక కార్యకర్త డాక్టర్ లుబ్నా సర్వత్, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు సలీం అల్‌హిందీ, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జనరల్ సెక్రటరీ సయ్యద్ రఫీ వంటి ప్రముఖులున్నారని సుభాష్ తెలిపారు.

రాష్ట్రానికి కేంద్ర అవయవ మార్పిడి చట్టం అన్వయింపు

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర తీర్మానం.. సభ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: మానవ అవయవాలు, కణజాల మార్పిడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని తెలంగాణ రాష్ట్రానికి అన్వయిస్తూ.. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ మానవ అవయవాల మార్పిడి చట్టం 1995 అమల్లో ఉందని తెలిపారు. అయితే అవయవ మార్పిడిలో వాణిజ్య లావాదేవీలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం 2011లో సమగ్ర చట్టాన్ని రూపొందించినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ చట్టాన్ని గోవా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ సహా పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. కేంద్రం తెచ్చిన ఈ చట్టాన్ని రాష్ట్రానికి అన్వయిస్తూ.. తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అనంతరం తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై
నేడు సుప్రీంకోర్టు విచారణ

అఫిడవిట్‌లు దాఖలు చేసిన అసెంబ్లీ కార్యదర్శి, ఇద్దరు ఎమ్మెల్యేలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం మరోసారి విచారణ జరపనుంది. కారు గుర్తుపై గెలిచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ జనవరి 10వ తేదీన సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్పీ) దాఖలు అయ్యింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై రిట్ పిటిషన్ దాఖలైంది. వీటిపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన సుప్రీంకోర్టు..గత విచారణ సందర్భంగా స్పీకర్, స్పీకర్ కార్యదర్శి, ప్రభుత్వం, ఎన్నికల సంఘం, 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. మార్చి 22వ తేదీలోపు దీనిపై రిప్లై ఇవ్వాలని ఆదేశించింది. దీంతో కొద్దిరోజుల క్రితం మహిపాల్‌రెడ్డి, తాజాగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి అఫిడవిట్‌లు దాఖలు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శ్రమదోపిడీ: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శ్రమను యాజమాన్యాలు అడ్డగోలుగా దోచుకుంటున్నాయని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎక్కువ పని గంటలతో మానసికంగా వేధిస్తున్నాయని ఆరోపించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మానవ సంబంధాలను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని నియంత్రించే చట్టాలు తేవాలని అభిప్రాయపడ్డారు. కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ఎర్త్ యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కే పరిమితమైన పారిశ్రామిక విధానాన్ని అన్ని జిల్లాలకు విస్తరించాలని, ఆయా ప్రాంతాల్లోని వనరులకు అనుగుణంగా కొత్త పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. బీసీలకు ప్రతీ నియోజకవర్గంలో ఆత్మగౌరవ భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. గీత కార్మికులకు భద్రత కల్పించాలని, స్థానిక సంస్థల ఆదాయాన్ని అవే ఉపయోగించుకునే స్వేచ్ఛ కల్పించాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసివేస్తారనే ప్రచారం జరుగుతోందని, ఇందులో వాస్తవాలేంటో వివరించాలని డిమాండ్ చేశారు.



నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ఎంపీలు కొండా, ఈటల, నగేశ్

వ్యవసాయ వర్సిటీ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు బీజేపీ ఎంపీల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఎంపీలు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఈటల రాజేందర్, గొడెం నగేశ్, కొండా విశ్వేశ్వరరెడ్డి కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 01.01.2016 నుంచి 30.06.2019 వరకు అధ్యాపకుల బకాయి బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కేంద్రం వాటాకు సంబంధించి ఎలాంటి రశీదు రాలేదని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం వాటా రాకుంటే రాష్ట్ర వాటా నష్టపోయే అవకాశం ఉందని, ఈ సమస్య గత ఆరేళ్లుగా అపరిష్కృతంగానే ఉందని వివరించారు. పదవీ విరమణ పొందిన వారికి తగిన మద్దతు, గౌరవం లభించేలా అవసరమైన సహాయం అందించేలా చొరవ చూపాలని కేంద్రమంత్రిని ఎంపీలు కోరారు.



ఖర్గేతో టీకాంగ్రెస్ ఎంపీల భేటీ

సంక్షేమ పథకాలు, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో టీ కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ తదితరులు సోమవారం ఖర్గేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆరు గ్యారంటీల అమలు తీరును ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల తదితర పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్ భావజాలాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు రాష్ట్రంలో నిర్వహించిన 'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్' కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఖర్గేకు ఎంపీలు వివరించారు.

పెద్దపల్లి రైతులను ఆదుకోండి

సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే విజయరమణారావు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షానికి పెద్దపల్లి నియోజకవర్గంలో 2,627 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, 1,896 మంది రైతులు నష్టపోయారని ఎమ్మెల్యే సీహెచ్ విజయ రమణారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. సోమవారం అసెంబ్లీలో సీఎంను కలిసిన ఆయన ఈ మేరకు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని జూలపల్లి, పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడ్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో వడగండ్లతో కూడిన వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వరి, మొక్కజొన్న బాగా దెబ్బతిందని చెప్పారు. జరిగిన నష్టానికి అనుగుణంగా రైతులకు పరిహారం అందించేలా వ్యవసాయ శాఖకు ఆదేశాలివ్వాలని విజయరమణారావు కోరారు.



అసెంబ్లీలో రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే విజయ రమణారావు

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.100 కోట్లు

సీఎంకు బ్రాహ్మణ సంఘాల ధన్యవాదాలు



సాక్షి, హైదరాబాద్: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.100 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి.. రాష్ట్ర బ్రాహ్మణ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ మేరకు సోమవారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఘనంగా సన్మానించాయి. అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి తులసి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నిధులతో బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ద్రోణంరాజు రవికుమార్ అఖిల భారత ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేసిన సహాయం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర రావు, నందిరాజు లక్ష్మీ నారాయణ, బడంగ్ పేట, రంగారెడ్డి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవ రావు, బ్రాహ్మణ సంక్షేమ వేదిక అధ్యక్షుడు బాల శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు అవ్వా విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసే సామాజిక న్యాయం చేయగలదు: పొన్నం

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని బీసీ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు అందరూ అగ్రవర్ణాల వారే ఉన్నారని దుయ్యబట్టారు. తాము కులగణన చేయడం వల్లనే ఎమ్మెల్యే కోటాలో తప్పనిసరై బీఆర్‌ఎస్ బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చిందని అన్నారు. కులగణన సమయంలో బీఆర్‌ఎస్ సభ నుంచి వెళ్లిపోయిందని, ఇప్పుడు బీసీ సంక్షేమంపై చర్చకు సమాధానం సమయంలో బయటకు వెళ్లిపోయిందంటే.. వారికి బీసీలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని వ్యాఖ్యానించారు. శాసనసభలో సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఆయన వివిధ పద్దులు ప్రవేశపెట్టిన సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో తాను హక్కుదారునని అంటే బీసీ మంత్రివర్గం నుంచి బయటకు పంపించారన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే బాధ్యత బీజేపీపై ఉందని అన్నారు.

బీఆర్‌ఎస్‌పై దొంగనోట్ల ఆరోపణలున్నాయి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ గతంలో దొంగనోట్లు ప్రింటింగ్ చేసి ఎన్నికల్లో గెలిచిందని, దొంగనోట్ల వ్యాపారమే కాకుండా బీఆర్‌ఎస్ నాయకులు పాస్‌పోర్ట్‌ల వ్యాపారం చేశారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. మనుషుల అక్రమ రవాణా చేసి డబ్బులు దోచుకున్న ఆరోపణలు కూడా వచ్చాయన్నారు. ఈ ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ గతంలోనే చేసిందని చెప్పారు. వాటిలో నిజం లేదని నిరూపించుకోవాల్సిన బీఆర్‌ఎస్ నాయకులు.. ఉల్టా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపణలు చేశారని ఫిర్యాదు చేయడం వారి అవివేకానికి నిదర్శనమని ప్రకాశ్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీనిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు నష్టపోయిన పంటను చేతుల్లో పట్టుకొని బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు భారీగా నష్టపోయారని, ఆరుగాలం పండించిన పంట నీటి పాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. శాసనసభ బయట ప్రాంగణంలోకి రాలిపోయిన మామిడి, ఇతర పంటలను తీసుకొస్తే వాటిని తీసుకురాకుండా మార్షల్స్‌తో అడ్డుకోవడం దుర్మార్గమని, మార్షల్స్‌పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోయిన బడ్జెట్‌లో ఫసల్ బీమాకి నిధులు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమాలో భాగస్వామ్యం అయితే నష్టపోయిన రైతులకు లక్ష పరిహారం వచ్చేదన్నారు.

పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాలు

రాష్ట్రంలో 8,71,254 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 2015 నుంచి 2024 వరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) నేతృత్వంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, జన్ శిక్షణ్ సంస్థాన్ పథకం, జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం, క్రాఫ్ట్‌మెన్ శిక్షణ వంటి వివిధ పథకాల ద్వారా మొత్తం 8,71,254 మంది నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందారని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. సోమవారం బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి ఈ మేరకు బదులిచ్చారు.

రాష్ట్రంలో రెండు ఎక్సలెన్స్ కేంద్రాలు

తెలంగాణలో గ్రాంట్స్‌ఇన్ ఎయిడ్ పథకం కింద డైరెక్ట్ రీసెర్చ్ నిధుల కోసం డీఆర్‌డీఓ విధానం ఆధారంగా, ప్రభుత్వం రెండు డీఆర్‌డీఓ ఇండస్ట్రీ అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ-సీఓఈ) కేంద్రాలను ఏర్పాటు చేసిందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. ఐఐటీ హైదరాబాద్‌తో కలిపి ఒక డీఐఏ-సీఓఈ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిపి మరో డీఐఏ-సీఓఈను స్థాపించినట్లు కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజ్యసభలో సోమవారం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీఏడీసీఎల్ టెండర్లకు సాంకేతిక కమిటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్)కి రూ. 25 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తం కలిగిన టెండర్లను పరిశీలించి ఆమోదించడానికై పదిమంది సభ్యులతో సాంకేతిక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తులసిబాబు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గతంలో హింసించారన్న ఆరోపణలపై నమోదయిన కేసులో రెండు నెలలుగా జైలులో ఉన్న కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పును రిజర్వ్ చేశారు. తులసిబాబు తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపించారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు పేదలకివ్వాలి

సాక్షి, అమరావతి: అన్యాక్రాంత్రమైన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు అప్పగించాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లుతో కూడిన ప్రతినిధి బృందం సీసీఎల్ఏ జి.జయలక్ష్మిని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు.

సరెండర్ లీవ్ బిల్లులూ చెల్లించండి: ఆప్టా

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలతో పాటు సరెండర్ లీవ్ బిల్లులనూ చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డిమాండ్ చేసింది. 2022 నుంచి పెండింగ్ సరెండర్ లీవ్ బిల్లులతో పాటు బకాయిలనూ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు విజ్ఞప్తి చేశారు.

కోస్టల్ సైక్లోథాన్- 2025 బృందానికి ఘన స్వాగతం



తడ/దొరవారిసత్రం: సమృద్ధి భారత్, తీర ప్రాంత భద్రత- పరిరక్షణే ధ్యేయం.. నినాదంతో సీఐఎస్ఎఫ్ (కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం) సిబ్బంది కోల్‌కతా నుంచి మార్చి 7న ప్రారంభించిన కోస్టల్ సైక్లోథాన్- 2025 సైకిల్ యాత్ర సోమవారం తిరుపతి జిల్లా దొరవారిసత్రం చేరుకుంది. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. సూళ్లూరుపేట, టోల్‌ప్లాజా, తడ ఇలా.. యాత్ర సాగిన మార్గమధ్యంలో ప్రతిచోటా ఘన స్వాగతం లభించింది. అక్కంపేట గ్రామం వద్ద షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, సౌత్ సెక్టార్ ఐజీ శరవణన్, సౌత్‌జోన్-2 (హైదరాబాదు) డీఐజీ అపరాజిత మహాపాత్ర, శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండర్ సంజీత్ కుమార్ స్వాగతం పలికారు. 56వ సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే సందర్భంగా జరుగుతున్న దేశవ్యాప్త పర్యటన ఏప్రిల్ 1న కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ముగుస్తుందని సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండర్ సంజీత్ కుమార్ తెలిపారు.

దళితులకు భూ పంపిణీ చేయండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఒక్కో దళిత కుటుంబానికి రెండెకరాల చొప్పున భూ పంపిణీ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి సంఘ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. దళితుల అభ్యున్నతికి భూపంపిణీ కీలకమైన విషయమని, దీన్ని రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ స్పష్టం చేసిందన్నారు. విభజన అనంతరం ప్రభుత్వ రంగంలో ఉద్యోగ నియామకాలు క్రమంగా పడిపోతున్నాయని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టడం బాధాకరమన్నారు.

విద్యార్థుల సమగ్ర ప్రగతికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు

శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

అమరావతి: హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు కేవలం మార్కులు, గ్రేడ్లకే పరిమితం కాకుండా విద్యార్థుల బహుముఖ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల విద్య, ఎస్ సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులపై రెండు రోజుల సదస్సు సోమవారం విజయవాడలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీడీ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను ఆధునికీకరణ, డిజిటల్ పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు హోలిస్టిక్ కార్డులు ఉపయోగపడతాయన్నారు.

కూటమి నేతలకు పోలీసు శాఖ గులాంగిరీ



- పోలీసు శాఖ అంతర్గత విచారణ పత్రాలు టీడీపీ నేతలకు
- విచారణ నివేదిక ప్రతిని బయటపెట్టిన టీడీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అధికార టీడీపీ కూటమి నేతలకు ఎంతగా ఊడిగం చేస్తోందో మరోసారి బట్టబయలైంది. రెడ్‌బుక్ కుట్రలతో నమోదు చేసిన కేసుల దర్యాప్తు పత్రాలు, పోలీసు శాఖలో అంతర్గత విచారణకు సంబంధించిన పత్రాలు కూటమి నేతల గుప్పిట్లో వాలుతున్నాయి. ఓ పోలీసు ఉన్నతాధికారి శాఖాపరమైన విచారణకు హాజరై సమర్పించిన నివేదిక కూడా టీడీపీ నేతలకు అందుతున్నాయి. మాజీ మంత్రి విడదల రజిని, ఐపీఎస్ అధికారి జాషువా తదితరులపై నమోదు చేసిన అక్రమ కేసులో విచారణాంశాలను ఓ ప్రజాప్రతినిధి వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అంతర్గత విచారణకు సంబంధించిన పత్రాలను నరసరావుపేట టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం విలేకరుల సమావేశంలో బయటపెట్టడం అందరినీ విభ్రాంతికి గురిచేసింది. ఇంతకీ విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధిపతి మరెవరో కాదు.. సాక్షాత్తూ రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తానే. పోలీసు శాఖలో అత్యున్నతస్థాయి అధికారులే టీడీపీ నేతలకు గులాంగిరీ చేస్తున్నారన్నది వాస్తవం.

రెడ్‌బుక్ కుట్రతోనే అక్రమ కేసు

రెడ్‌బుక్ కుట్రలో భాగంగా టీడీపీ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి విడదల రజిని, ఐపీఎస్ అధికారి జాషువా తదితరులపై గత ఏడాది అక్రమ కేసు నమోదు చేసింది. మూడేళ్ల క్రితం చిలకలూరిపేట ఎమ్మెల్యేగా ఉన్న ఎమ్మెల్యే రజిని బెదిరించారని, అనంతరం విజిలెన్స్ విచారణకు ఆదేశించి బలవంతంగా డబ్బులు వసూలు చేశారంటూ పల్నాడు జిల్లాలో ఓ క్వారీ యజమానితో తప్పుడు ఫిర్యాదు ఇప్పించారు. రజినితో పాటు అప్పట్లో పల్నాడు జిల్లా విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా ఉన్న జాషువా తదితరులపై ఈ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ అంశాన్ని విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి గత ఏడాదే పంపింది. ఆ విభాగానికి డీజీగా ప్రస్తుత డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఉన్నారు. ఆ ఫిర్యాదుపై శాఖాపరమైన విచారణలో భాగంగా ఐపీఎస్ అధికారి జాషువాను వివరణ కోరారు. ఆయన గత ఏడాది అక్టోబరు 21న విచారణకు హాజరై, లిఖితపూర్వకంగా వివరణ సమర్పించారు.

ఆ నివేదిక టీడీపీ ఎంపీకి ఎలా వచ్చింది?

ఐపీఎస్ అధికారి జాషువా విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అంతర్గత విచారణకు హాజరై సమర్పించిన లిఖితపూర్వక వివరణ కాపీని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం విడుదల చేయడం చర్చనీయాంశమైంది. శాఖాపరమైన ఆ విచారణ అనంతరం విజిలెన్స్ శాఖ నివేదిక ఆధారంగా ఏసీబీ పోలీసులు రెండు రోజుల క్రితం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంటే ఆ అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. మరి దర్యాప్తు కొనసాగుతున్న కేసులు, న్యాయస్థానం పరిధిలోని అంశాలకు సంబంధించినవి, బయటకే రాకూడని పత్రాలు టీడీపీ నేతల చేతికి ఎలా వచ్చాయి, ఎవరిచ్చారన్నది కీలకంగా మారింది. అందులోనూ డీజీపీ ఇన్‌చార్జిగా ఉన్న విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచే రావడం వెనుక ఉన్నతస్థాయి అధికారుల హస్తం ఉన్నట్లుగా పోలీసువర్గాలు చెబుతున్నాయి.

కీలక అంశాలు ట్యాంపర్.. ముఖ్యమైన పత్రాలు మాయం

'అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము విజిలెన్స్ విచారణ నిర్వహించాం. క్వారీ వ్యవహారాలు గనుల శాఖ పరిధిలోకి వస్తాయి కాబట్టి ఆ అంశాన్ని గుంటూరు జిల్లా గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదించాం. గనుల శాఖ సమగ్ర సర్వే చేసి, రూ.10.5 కోట్ల విలువైన రాయల్టీని ఆ క్వారీ యజమాని ప్రభుత్వానికి ఎగవేసినట్టు నిగ్గు తేల్చింది. గనుల శాఖ నివేదికపై సందేహాలు ఉండటంతో దాన్ని మరోసారి సరిచూడాలని నేను విజిలెన్స్ విభాగం అసిస్టెంట్ జియాలజిస్ట్ శివప్రసాద్‌ను ఆదేశించాను. ఆ తర్వాత నేను బదిలీ అయ్యాను. శివప్రసాద్ గత ఏడాది జూన్‌లో గుండెపోటుతో మరణించారు. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్‌గా ఉండగా నేను ఇచ్చిన నివేదిక ప్రతి కోసం గుంటూరు విజిలెన్స్ కార్యాలయంలో సంప్రదించగా, ఆ నివేదిక కాపీ అందుబాటులో లేదని తెలిసింది. నాకు రజిని ఇచ్చిన ఫిర్యాదు కాపీ కూడా ఆ కార్యాలయం నుంచి మాయమైంది. విజిలెన్స్ నివేదికలోని కొన్ని కీలక అంశాలను ట్యాంపర్ చేశారు. కొన్ని ముఖ్యమైన పత్రాలను మాయం చేశారు. ఐపీఎస్ అధికారి అయిన నన్ను విచారించే అర్హత గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారికి లేదు. అదే విధంగా విజిలెన్స్ విభాగం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం నిబంధనలకు విరుద్ధం' అని జాషువా ఆ నివేదికలో తెలిపారు.

రెండు వర్సిటీలకు నిధులు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి రూ.7 కోట్లు, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి రూ.14.50 కోట్లు విడుదల చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వంశీ బెయిల్ పిటిషన్ నేటికి వాయిదా

విజయవాడ లీగల్: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో పాటు సహ నిందితులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం కోర్టు బెయిల్ పిటిషన్‌ను మంగళవారానికి వాయిదా వేసింది.

మూడు పోర్టులకు బోర్డుల పునర్ వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంపెనీల బోర్డులను పునర్ వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోర్టుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కంపెనీ (ఎస్పీవీ)ల్లో ఆ ఎస్పీవీకి చెందిన ఎండీతో పాటు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ) సీఈవో, ఏపీఫైబర్‌నెట్ ఎండీ, పోర్టు పరిధిలోని జిల్లా కలెక్టరు, ఏపీఐఐసీ వీసీఎండీ, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, ఏపీ మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్, పోర్టుపరిధిలోని ఏపీఐఐసీ జెడ్ఎంలు డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీప్లేన్ డెమోకు రూ.2.50 కోట్లు

సాక్షి, అమరావతి: విజయవాడ-శ్రీశైలం మధ్య నవంబర్‌లో నిర్వహించిన సీ-ప్లేన్ ప్రదర్శనకు మూడు నెలల తర్వాత పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రదర్శనకు రూ.2.5 కోట్లు వ్యయమైందని, ఈ మొత్తాన్ని కృష్ణ, నంద్యాల కలెక్టర్లకు ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్) చెల్లించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొప్పర్తి, ఓర్వకల్లు టెండర్లకు రెండు కమిటీలు

సాక్షి,అమరావతి: బెంగళూరు-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు వద్ద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కు, విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కుల టెండర్లను ఖరారు చేయడానికి టెక్నికల్, ఫైనాన్షియల్ ఎవాల్యుయేషన్ కమిటీలను ఏర్పాటు చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజనులను ఎన్నాళ్లు మోసం చేస్తారు?

2017లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?

- గ్రేహౌండ్స్ ఏర్పాటుకు భూములిచ్చే ప్రసక్తేలేదు
- టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిలదీత
- ప్రజాభిప్రాయ సేకరణ సభను బహిష్కరించిన అడవిబిడ్డలు



ఎమ్మెల్యేపై గిరిజన యువకుడి ఆగ్రహం

కొత్తవలస: 'గిరిజనులను వెర్రివాళ్లను చేసి ఎన్నిసార్లు మోసం చేస్తారు? 2017లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలుచేసిందా? గిరిజన యూనివర్సిటీకి 144 మంది రైతుల నుంచి 178 ఎకరాల భూమిని సేకరించారు. భూమికి భూమి ఇస్తామని నమ్మబలికారు.. తర్వాత మరిచిపోయారు. భూములు సేకరించిన వెంటనే వర్సిటీ నిర్మిస్తే ఈ సమస్య ఉండేది కాదు. రాజకీయ లబ్ధికోసం పాలన చివర్లో కేవలం ప్రహరీ నిర్మాణాన్ని మాత్రమే చేపట్టారు. ఇప్పుడీ స్థలాన్ని గ్రేహౌండ్స్‌కు ఇస్తామంటున్నారు. ఇచ్చిన హామీలు అమలుచేస్తారన్న నమ్మకం మాకులేదు. పైగా.. మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా కూడా లేం'.. అని విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని అప్పన్నదొరపాలెం, జోడిమెరక, తమ్మన్నమెరక గ్రామాల గిరిజనులు ఎస్.కోట టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మొహంమీదే తెగేసి చెప్పారు. ఆ తర్వాత.. రెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1-8లో గ్రేహౌండ్స్ (పోలీస్ శిక్షణా కేంద్రం) ఏర్పాటు కోసం అప్పన్నదొరపాలెంలో ఎమ్మెల్యేతోపాటు ఆర్డీఓ దాట్ల కీర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభను వారంతా బహిష్కరించారు.

హామీలు అమలు చేస్తారన్న నమ్మకం లేదు..

మరోవైపు.. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తానని, ఎమ్మెల్యే లలితకుమారి చెబుతుండగా గిరిజనుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. హామీలు అమలుచేస్తారన్న నమ్మకం తమకు లేదని.. తమను ఐటీడీఏలో చేర్చలేదని, సరైన రిజర్వేషన్లు కల్పించకపోవడంతో యువకులు చదువుకున్నా సరైన ఉద్యోగాలు లేక వ్యవసాయ పనులు చేసుకుంటున్నారని వారంతా ఏకరువు పెట్టారు. పూర్వీకుల నుంచి జీడిమామిడి తోటలపై వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు మా భూములు గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి ఇస్తే ఉపాధి కోల్పోతామంటూ సభ నుంచి నిష్క్రమించారు. ఇదిలా ఉంటే.. ప్రజాభిప్రాయ సేకరణ సభకు భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంపై గిరిజనులు మండిపడ్డారు. తామేమైనా ఉగ్రవాదులమా అని ప్రశ్నించారు.

సీట్లు తగ్గుతాయనేది పసలేని వాదన

మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: నియోజకవర్గాల పునర్విభజనతో (డీలిమిటేషన్) దక్షిణాదిలో సీట్లు తగ్గుతాయన్న వాదనలో పస లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పునర్విభజనపై కమిటీని వేయడం జరుగుతుందని, కమిటీ సిఫారసులకు అనుగుణంగానే డీలిమిటేషన్‌పై చర్యలు ఉంటాయని సచివాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తమిళనాడులో రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే కారణంతో ఆ రాష్ట్రానికి చెందిన పార్టీ పునర్విభజనపై వివాదానికి తెరలేపిందన్నారు.

బలభద్రపురంపై భయం అక్కర్లేదు

పశ్చిమగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా లేవని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణ బాబు మాట్లాడుతూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు బృందం బలభద్రపురంలో పర్యటించిందని, పర్యావరణ ప్రభావంతో సంభవించే ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు అక్కడ బయటపడలేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయుష్ విభాగంపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

వర్గీకరణ జాప్యానికి మంద కృష్ణ కారణం

మామిడి సుదర్శన్ విమర్శ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం సంక్లిష్టం కావడానికి మంద కృష్ణ కారణమని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక సామాజిక సమస్య పరిష్కారానికి అన్ని పార్టీల మద్దతు అవసరమనే ఆలోచన లేకుండా, ప్రతి ఎన్నికల్లో ఏదో పార్టీకి మద్దతిచ్చి రూ.కోట్లు దండుకోవడం వల్లే రాష్ట్రంలో వర్గీకరణ సంక్లిష్టంగా మారిందన్నారు. వర్గీకరణకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మద్దతు కోరకుండా ఆయనను విమర్శిస్తున్న మంద కృష్ణ వైఖరి ఎంతమాత్రం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం వర్గీకరణ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోస్టర్ పాయింట్లలో మాదిగలకు అన్యాయం: కృపాకర్

కాగా, ఎస్సీ ఉప కులాల వర్గీకరణలో భాగంగా ప్రతిపాదించిన రోస్టర్ పాయింట్స్‌లో మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతోందని ఈ అంశాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు.

వీఎంఆర్‌డీఏ పీపీపీ ప్రాజెక్టుల టెండర్లకు కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) పరిధిలో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ వ్యయంతో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) కింద చేపట్టే ప్రాజెక్టుల టెండర్ల ప్రక్రియను పర్యవేక్షించి, ఆమోదించడానికి ఓ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో పురపాలక శాఖ అదనపు కార్యదర్శి, జీవీఎంసీ సీఈ, ఏపీయూఎఫ్ఐడీసీ సీఈ, వీఎంఆర్‌డీఏ సీఈలు సభ్యులుగా ఉంటారు. వీఎంఆర్‌డీఏ ఎస్ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

తాత్కాలిక మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆరుగురు వైద్యులతో తాత్కాలిక మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. బోధన విభాగంలో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గోగినేని సుజాత, ఒంగోలుకు చెందిన డాక్టర్ కె.వెంకట సుబ్బానాయుడుని నియమించారు. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ విభాగంలో తిరుపతికి చెందిన మెడికల్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ డి.శ్రీహరిరావు, ప్రకాశం జిల్లాకు చెందిన డాక్టర్ ఎస్.గీత, విజయవాడకు చెందిన ఎస్.కేశవరావుబాబు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన డాక్టర్ సీహెచ్.మల్లీశ్వరి సభ్యులుగా వ్యవహరించనున్నారు.

విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు సీఎంపీ తయారీకి గ్రీన్ సిగ్నల్

సిస్ట్రా ఎంవీఏ సంస్థకు బాధ్యతలు అప్పగింత

సాక్షి, అమరావతి: విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక (కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్-సీఎంపీ) తయారీ పనులను సిస్ట్రా ఎంవీఏ కన్సల్టింగ్(ఇండియా)కు అప్పగించడానికి అనుమతినిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ సోమవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ, రాజధాని అమరావతి ప్రాంతంలో మెట్రో రైల్ ప్రాజెక్టు సీఎంపీ తయారీ పనులకు రూ.81,67,606, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్ట్ సీఎంపీ తయారీ పనుల కోసం రూ.84,47,443 ఆ సంస్థకు అప్పగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

సకాలంలో ఎందుకు లొంగిపోలేదు?

బోరుగడ్డ అనిల్‌పై హైకోర్టు మండిపాటు

సాక్షి, అమరావతి: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తదితరులను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన కేసులో తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలన్న బోరుగడ్డ అనిల్ అభ్యర్థనపై హైకోర్టు మండిపడింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలన్న తమ ఆదేశాలను ఎందుకు పాటించలేదని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని అనిల్‌ను ఆదేశించింది. అలాగే తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించి మధ్యంతర బెయిల్ పొందారన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దానిని పరిశీలించి కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యుడిని కూడా విచారిస్తామని తెలిపింది. విడుదల సమయంలో పూచీకత్తులు సమర్పించిన వారి వివరాలను తమ ముందుంచాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో అరెస్టయి జైల్లో ఉన్న బోరుగడ్డ అనిల్ బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. తన తల్లికి అనారోగ్యంగా ఉందంటూ ఈ నెల 11 వరకు మధ్యంతర బెయిల్ పొందారు. తల్లి అనారోగ్యం విషయంలో ఆయన సమర్పించిన మెడికల్ రిపోర్టులు తప్పుడువన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో హైకోర్టు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని అనిల్‌ను ఆదేశించింది. తాజాగా అనిల్ బెయిల్ పిటిషన్ మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి పిటిషనర్ అనిల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సస్పెన్షన్.. వెంటనే మళ్లీ విధుల్లోకి

- ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్
- ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు అధికారులు, ఆరుగురు టీచర్ల సస్పెన్షన్
- విచారణలో ఉండగానే వారందరూ మళ్లీ విధుల్లోకి

నెల్లూరు టౌన్: ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌లో పట్టుబడి సస్పెండయిన ఉపాధ్యాయులను.. మళ్లీ వెంటనే విధుల్లోకి తీసుకుంటూ అధికారులు ఉత్తర్వులిచ్చిన వైనమిది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని కందుకూరులో జరుగుతున్న ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలను ఈనెల 19న విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తుండటం, మరికొందరు పుస్తకాలు పెట్టుకుని పరీక్ష రాస్తుండగా పట్టుకున్నారు. కందుకూరులోని చైతన్య స్కూల్, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లుగా ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని డీఈఓ బాలాజీరావును ఆదేశించారు. డీఈవో వారిని సస్పెండ్ చేశారు. నలుగురు అభ్యాసకులను డిబార్ చేశారు. మాస్ కాపీయింగ్‌పై ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలంటూ టీచర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయంపై విచారణకు అక్కడి డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను విచారణ అధికారులుగా నియమించారు. ఇంతలోనే సస్పెండ్ చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ విద్యా శాఖాధికారులు హడావుడిగా ఆదేశాలిచ్చారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి తెచ్చిన ఒత్తిళ్లతోనే మళ్లీ వారిని విధుల్లోకి తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. తప్పు చేసిన వారిని శిక్షించకుండా ఇలా వెనుకవేసుకొని రావడమేమిటని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.


బేసిన్‌లో ఒక్క పంటకైనా నీటిని కేటాయించండి

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం వాదన

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్) వెలుపలి ప్రాంతాలకు నీటిని కేటాయించాలని ఏపీ ప్రభుత్వం కోరుతుండగా.. బేసిన్‌లోని ప్రాంతాలకు కేటాయించాలని తాము కోరుతున్నామని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కార్ వాదించింది. కరువు పీడిత ప్రాంతాల్లో ఒక్క ఆరు తడి పంటకైనా నీళ్లివ్వాలని అడుగుతున్నామనీ.. బేసిన్ వెలుపలి ప్రాంతాల్లో తరి పంటలకు కాదని వివరించింది. కేంద్రం జారీ చేసిన తాజా మార్గదర్శకాలు, విభజన చట్టంలోని నిబంధనల ప్రకారం కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2 సోమవారం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు విన్పించారు. కృష్ణా బేసిన్‌లో 75 శాతం లభ్యతగా ఉన్న నీటిని కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులు చేసిందని.. కేడబ్ల్యూడీటీ-2 బేసిన్‌లో అందుబాటులో ఉన్న అదనపు నీటిని పంపిణీ చేసిందని వివరించారు. కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపుల ప్రకారం బేసిన్‌లో తలసరి నీటి లభ్యత 733 క్యూబిక్ మీటర్లైతే.. ఉమ్మడి ఏపీలో అది 828 క్యూబిక్ మీటర్లని వివరించారు. కేంద్రం ఏర్పాటుచేసిన అడ్మినిస్ట్రేటివ్ అరేంజ్‌మెంట్ (తాత్కాలిక సర్దుబాటు)ను పరిగణనలోకి తీసుకుంటే.. కృష్ణా బేసిన్‌లో తెలంగాణలో నీటి లభ్యత 422 క్యూబిక్ మీటర్లు.. ఏపీలో 1,892 క్యూబిక్ మీటర్లు ఉందని చెప్పారు. ఏపీలో కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాల్లో జలాలతో పాటు స్థానిక వనరుల ద్వారా నీటి లభ్యత 1,027 క్యూబిక్ మీటర్లు ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా ఉండడం వల్లే తాత్కాలిక సర్దుబాటును కొనసాగించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని.. తమకు ప్రతికూలంగా ఉంది కాబట్టి నీటిని పునఃపంపిణీ చేయాలంటున్నామని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ చెప్పారు. జాతీయ, అంతర్జాతీయంగా ఆమోదించిన ప్రమాణాల మేరకు కృష్ణా జలాల పంపిణీలో సమ న్యాయం చేయాలని కోరారు. ఏపీలో 40 నదీ పరీవాహక ప్రాంతాలు ఉన్నాయని.. వాటిలో గణనీయంగా నీటి లభ్యత ఉందని వివరించారు. నీటి కోసం తెలంగాణ కరువు ప్రాంతాలు అల్లాడుతున్నాయని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌కు కేటాయింపులు చేయాలని కోరారు.

- కృష్ణా బేసిన్ నుంచి 330 టీఎంసీలను ఏపీ పెన్నా బేసిన్‌కు మళ్లిస్తోందని.. ఆ బేసిన్‌లో నీటి లభ్యత 344 టీఎంసీలు ఉందని వివరించారు. ట్రిబ్యునల్‌కు ఏపీ ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారమే పెన్నా బేసిన్‌లో 360 టీఎంసీలను నిల్వ చేసేలా రిజర్వాయర్లు ఉన్నాయన్నారు.
- పోలవరం-బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలను మళ్లించేందుకు ఏపీ ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తోందని.. బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మిస్తోందని తెలంగాణ సీనియర్ కౌన్సిల్ ప్రస్తావించారు. తెలంగాణ ఫైల్ చేసిన కేసు స్టేట్‌మెంట్ ఆధారంగా బేసిన్ పరామితులపై ఆ రాష్ట్ర సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ట్రిబ్యునల్‌కు వివరించారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య



కోడుమూరు రూరల్: రాష్ట్రంలో మరో అన్నదాత బలవన్మరణానికి పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా గూడూరు మండలం జూలకల్ గ్రామానికి చెందిన రైతు జెట్టి దేవరాజు (34) తనకున్న ఎకరన్నర పొలంతో పాటు, మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అయితే వ్యవసాయం కలిసి రాకపోవడం, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు రూ.10 లక్షలకు చేరుకోవడంతో ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఈ నెల 22 న ఇంట్లో పురుగులమందు తాగి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సహాయం పొందుతూ ఈ నెల 23న అసువులు బాసాడు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే బ్లూఫ్లాగ్ కొనసాగింపు

పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

కొమ్మాది(విశాఖ): బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్‌ను పదికాలాల పాటు నిలబెట్టుకోవాలంటే ప్రజలు, పర్యాటకుల భాగస్వామ్యం అవసరమని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రుషికొండ బీచ్‌లో సోమవారం బ్లూఫ్లాగ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నిర్లక్ష్యం కారణంగా గతంలో తాత్కాలికంగా రద్దయిన బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. బీచ్ సౌందర్యం, స్వచ్ఛత కాపాడేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. బీచ్‌లో అంతర్జాతీయ ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, చైర్మన్ డా.నూకసాని బాలాజీ, జేసీ మయూర్ అశోక్ పాల్గొన్నారు.



కోమా గురించి సామాన్య ప్రజల్లో చాలా దురభిప్రాయాలు ఉన్నాయి. ఒకసారి కోమాలోకి వెళ్తే బయటకు రావడం చాలా కష్టమనేది చాలామందిలో ఉండే అపోహ. అయితే కేవలం 20 శాతం కేసులు మినహా మిగతా వాళ్లంతా కోమాలోంచి బయటపడేందుకు అవకాశముంటుంది. ఇక తలకూ లేదా మెదడుకు గాయమైనప్పుడు కోమాలోకి వెళ్తుంటారనేది మరో అపోహ. ఇలాంటి ఎన్నో అపోహలను దూరం చేస్తూ 'కోమా'పై అవగాహన కల్పించే కథనమిది.

కోమా కొన్ని సంగతులు

డాక్టర్ శ్రీకృష్ణ ఆర్. బొడ్డు
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

కోమా అంటే ఒక రకమైన స్పృహ లేని కండిషన్. కాకపోతే ఈ స్పృహ కోల్పోవడం మరింత గాఢంగా (ప్రొఫౌండ్ అన్‌కాన్షియస్ స్టేజ్) ఉంటుంది. వెలుతురుకూ, నొప్పికీ, దెబ్బల వంటి అంశాలకు ఎలాంటి స్పందనా లేకుండా నిద్రావస్థలకూ, మెలకువకూ... అతీతమైన స్థితే... 'కోమా'.


సాధారణంగా కోమాకు మూడు ప్రధాన కారణాలుంటాయని చెప్పవచ్చు.

1. మెదడుకు సంబంధించిన రుగ్మతల వల్ల.
2. శరీరంలోని ఇతర అవయవాల కారణంగా.
3. ఇతరత్రా కారణాలు అంటే... ఆల్కహాల్, డ్రగ్స్, విషపదార్థాలు (టాక్సిక్ మెటీరియల్స్) తీసుకోవడం వల్లగానీ, కార్బన్‌డయాక్సైడ్, సయనైడ్ వంటి విషవాయువులు పీల్చడం వల్లగానీ లేదా ఒక్కోసారి వడదెబ్బ లాంటి చాలా చిన్న కారణాల వల్ల కూడా కోమాలోకి వెళ్లడం జరుగుతుంది.

కోమా... కొన్ని నిర్దిష్ట కారణాలు

● సాధారణ వడదెబ్బతో...

ఎండలో విపరీతంగా తిరిగినప్పుడు కోమాలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు చల్లటి నీటితో కోల్డ్ స్పాంజింగ్‌తో సాంత్వన కలిగించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు.



● దయాబెటిస్‌తో...

దయాబెటిస్ బాధితులు రెండు రకాలుగా కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.



మొదటిది...

దయాబెటిస్‌తో బాధపడేవారు తమలో చక్కెర మోతాదులు నియంత్రణలో ఉంచేందుకు క్రమం తప్పకుండా మందులు వాడుతుంటారు. ఒక్కోసారి తాము సరిగా ఆహారం తీసుకోనప్పుడు కూడా క్రమం తప్పకూడదనే ఉద్దేశంతో మందులు తీసుకుంటారు. అప్పుడా మందులు... అన్నం తినని కారణంగా దేహంలో ఉన్న కొద్దిపాటి చక్కెర పైనా పనిచేసి, దేహంలోని చక్కెర మోతాదులను విపరీతంగా తగ్గించడంతో శరీరంలో చక్కెర లెవెల్స్ ఒక్కసారిగా తగ్గిపోతాయి. అంటే 100-140 వరకు ఉండాల్సిన షుగర్ లెవెల్స్ 30-20 కంటే తక్కువకు పడిపోతాయి. అప్పుడు బాధితులు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో డాక్టర్లు బాధితులకు చాక్లెట్ వంటి తీపి పదార్థాలు తినిపిస్తారు.

రెండవది...

ఇక రెండో రకమైన కోమాను దయాబెటిక్ కోమాగా చెబుతారు. దయాబెటిస్ బాధితులు తాము తీసుకోవాల్సిన మందుల్ని సరిగ్గా తీసుకోకపోవడం వల్ల అలాగే సరైన చికిత్స తీసుకోకపోవడం వల్ల ఒక్కోసారి చక్కెర మోతాదులు విపరీతంగా పెరిగిపోతాయి. ఇలా పెరగడం వల్ల కోమాలోకి వెళ్లాల్సిన పరిస్థితి రావచ్చు.

ఇందులోనూ మళ్లీ రెండు రకాలు...

1) చక్కెర మోతాదులు 500 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా పెరగడంతో కోమాలోకి వెళ్తారు. దీన్ని 'హైపర్ ఆస్మోలార్ కోమా' అంటారు.
2) దేహంలో తయారయ్యే వ్యర్థాలు (కీటోన్స్) పెరగడం వల్ల కోమాలోకి వెళ్లే పరిస్థితిని 'కీటో ఎసిడోటిక్ కోమా' అంటారు.

ఈ రెండు సందర్భాల్లోనూ బాధితులకు ఇన్సులిన్ ఇచ్చి, దేహంలో చక్కెర మోతాదులను తగ్గించి కోమా నుంచి వెనక్కు తీసుకువస్తారు.

● హైపో నేట్రీమిక్ కోమా

శరీరం చక్కగా పనిచేయడానికి సోడియం, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటివి అనేక రకాల లవణాలు అవసరం. వీటిల్లో ఆహారంలోని ఉప్పు ద్వారా సోడియమ్ లవణం దేహంలోకి చేరుతుంది. దీని మోతాదు 140-150 మిల్లీ ఈక్వివాలెంట్స్ పరిమాణంలో ఉండటం అన్నది నార్మల్ కొలత. అది ఒకవేళ 110 కంటే తగ్గితే మనిషి కోమాలోకి వెళ్లే అవకాశం ఉంది. దీన్నే హైపో నేట్రిమిక్ కోమా అంటారు. హై-బీపీతో బాధపడేవాళ్లలో ఇలా సోడియమ్ తగ్గడం వల్ల కోమాలోకి వెళ్లడం చాలా సాధారణంగా జరుగుతుంటుంది. బీపీని నియంత్రించడానికి డాక్టర్లు ఉప్పు తగ్గించమని సూచిస్తారు. దాంతో కొందరు ఉప్పు తీసుకోవడం పూర్తిగా మానేస్తారు. ఫలితంగా ఈ హైపో నేట్రిమిక్ కోమాలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువ. సాధారణ ఐవీ ఫ్లుయిడ్స్ ఎక్కించడం ద్వారా డాక్టర్లు బాధితులను ఈ సమస్యనుంచి బయటపడేస్తారు.

● హైపర్ నేట్రిమిక్ కోమా

దేహంలో సోడియమ్ మోతాదులు పెరగడం వల్ల కోమాలోకి వెళ్తే దాన్ని 'హైపర్ నేట్రిమిక్ కోమా'గా చెప్పవచ్చు. అంటే ఉదాహరణకు సోడియం మోతాదులు 165 మిల్లీ ఈక్వివలెంట్స్ కంటే ఎక్కువ కావడం వల్ల ఇలా కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

కొందరు బాధితుల్లో పొటాషియం లవణాల లోపం వల్ల కోమాలోకి వెళ్లే పరిస్థితి ఉంటే... వాళ్లకు కాసిన్ని కొబ్బరినీళ్లు తాగించడం ద్వారా వాళ్లు కోమాలోకి వెళ్లకుండా చూడవచ్చు.

● లివర్ కోమా

కాలేయం దెబ్బతినడానికి చాలా జబ్బులు కారణమవుతాయి. కొవ్వులు ఎక్కువగా తీసుకునే వారు మొదలుకొని... హెచ్‌బీసీ, హెచ్‌బీబీ వంటి వైరస్‌ల వల్ల లివర్ దెబ్బతిన్నప్పుడూ బాధితులు కోమాలోకి వెళ్లే అవకాశముంది.

● కిడ్నీ కోమా

మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల కోమాలోకి వెళ్లవచ్చు. ఇందులో 99% కేసుల్లో డయాబెటిస్ కారణంగా మూత్రపిండాలు దెబ్బతిని, ఆ కారణంగానే కోమాలోకి వెళ్లే కేసులే ఎక్కువ.

ఇతరత్రా కారణాలతో కోమాలోకి...

కొందరిలో తీవ్రమైన జ్వరం వచ్చి బాధితులు కోమాలోకి వెళ్లడాన్ని 'ఫిబ్రయిల్ కోమా' అంటారు. కోల్డ్ స్పాంజింగ్ చేయడం వల్ల ఈ కోమాను నివారించవచ్చు.

● కార్బన్‌డయాక్సైడ్ నార్కోసిస్

కొందరు దీర్ఘకాలిక బ్రాంకైటిస్ రోగుల్లో ఊపిరితిత్తుల్లోని కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువగా పేరుకుపోతుంది. దాంతో ఆ కార్బన్ డై ఆక్సైడ్ మెదడుకు చేరి, మనిషి కోమాలోకి వెళ్లే ముప్పు ఉంటుంది.

● ఆల్కహాల్ వల్ల

ఆల్కహాల్‌తో కోమాలోకి వెళ్లేందుకు అనేక పరిస్థితులు కారణమవుతాయి. ఉదాహరణకు... మితిమీరి తాగడం వల్ల మెదడు దెబ్బతినడం; అలాగే ఆల్కహాల్ మానేయడంతో వచ్చి విత్‌డ్రావల్ సింప్టమ్స్‌తో కూడా కొందరు కోమాలోకి వెళ్లవచ్చు. ఒక్కోసారి ఆల్కహాల్ వల్ల వచ్చే ఫిట్స్‌తో కూడా కోమాలోకి జారిపోయే అవకాశాలుంటాయి.

ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కొన్నిసార్లు దేహంలో కొన్ని విటమిన్లు (ప్రధానంగా థయామిన్) వంటివి తగ్గడం కారణంగా కూడా కోమాలోకి వెళ్తారు. ఈ కండిషన్‌ను 'వెర్నిక్స్ ఎన్‌కెఫలోపతి' అంటారు. వీరికి థయామిన్ ఇస్తే కోలుకుంటారు.

కొందరు ఆల్కహాల్ తాగాక తూలి పడిపోయి తలకు దెబ్బ తగలడం, దాని వల్ల రక్తస్రావం కావడం లేదా మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల కూడా కోమాలోకి వెళ్లవచ్చు.

● పాత బావుల్లోకి...

గ్రామాలూ, పల్లెటూళ్లలో ఈ కారణంగా చాలామంది కోమాలోకి వెళ్తుంటారు. దిగుడు బావుల్లోకి దిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సందర్భాలను చాలామంది చాలాసార్లు చూస్తారు. పాతబావులూ, పెద్దగా ఉపయోగంలో లేని లోతైన దిగుడు బావుల్లో కార్బన్ డయాక్సైడ్‌తో పాటు మరెన్నో విషవాయువులు వ్యాపించి ఉంటాయి. ఏదైనా కారణంతో వీటిలోకి దిగగానే అక్కడి కార్బన్ డై ఆక్సైడ్‌తో పాటు ఆక్సిజన్ లేమి కారణంగా బాధితులకు తగినంత ఆక్సిజన్ అందదు. దాంతో కోమాలోకి వెళ్లే పరిస్థితి వస్తుంది.

ఇక ఇలాంటి పరిస్థితే నగరాల్లోనైతే మ్యాన్‌హోల్స్ కారణంగా ఏర్పడుతుంది. ఈ మ్యాన్‌హోల్స్‌లో రకరకాల విషవాయువులు (టాక్సిక్ గ్యాసెస్) వ్యాపించి ఉంటాయి. వాటిని శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన కార్మికులు అందులోని ప్రమాదకరమైన వాయువుల కారణంగా కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

● బావులూ, మ్యాన్‌హోల్స్...

ఈ రెండు సందర్భాల్లోనూ చాలా సులువుగా కోమా ముప్పును నివారించవచ్చు. ఉదాహరణకు... బావుల్లోకి దిగే ముందర నీళ్లను తోడే మోటార్‌ను కొద్దిసేపు ఆన్ చేసి ఉంచితే... లోపలి వాయువులు బయటకు రావడంతో లోనికి దిగే మనుషులకు ప్రాణాపాయం కలగకుండా కాపాడే అవకాశముంటుంది. ఇక నగరాల్లో మ్యాన్‌హోల్‌ను తెరవగానే, వెంటనే లోనికి దిగకుండా విషవాయువులు బయటకు చెదిరిపోవడం / పలుచగా మారడం జరిగేంతవరకు కాస్త వ్యవధి ఇచ్చి అటు తర్వాత లోపలకు దిగడం మంచిది.

మందుల వల్ల - కొన్నిసార్లు నొప్పి నివారణ మందులు (శాల్సిలేట్స్) ఎక్కువ మోతాదులో తీసుకున్నా లేదా కొందరు నిద్రమాత్రల వంటివి మితిమీరి తీసుకున్నప్పుడు కూడా కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో కడుపు శుభ్రం చేయడం (గ్యాస్ట్రిక్ లవాజ్) చేయడం వల్ల బాధితులను మామూలు స్థితికి తీసుకురావచ్చు.

గ్లాస్‌గో కోమా స్కేల్

కోమా తీవ్రతను కొలిచేందుకు ఉపయోగించే స్కేల్‌ను 'గ్లాస్‌గో కోమా స్కేల్'గా చెబుతారు. వాస్తవానికి ఇందులో స్కేల్ అంటూ ఏదీ ఉండదు. అయితే బాధితులకు ఇస్తున్న సూచనల ఆధారంగా వారు స్పందించే ఒక్కోరకమైన స్పందనకూ ఒక్కో స్కోర్ ఇస్తారు. ఉదాహరణకు రెప్పలు కదిలించమంటూ సూచన ఇస్తే వారు కనబరిచే కంటి కదలికలకూ, నోటి మాటకు స్పందించే తీరుకు, ఇలా... ఒక్కో దానికి ఒక్కో స్కోర్ ఉంటుంది. ఇందులో డాక్టర్ ఇచ్చిన ఏ ఆదేశానికీ స్పందన లేకపోతే కనిష్ఠంగా స్కోర్ మూడుగా నమోదవుతుంది. అలాగే డాక్టర్ ఆదేశాలకు రోగి నుంచి స్పందనలు పెరుగుతున్న కొద్దీ స్కోర్ కూడా పెరుగుతుంటుంది. అంటే స్కోర్ మూడు ఉంటే అది రోగి నుంచి ఏ స్పందనా లేని పరిస్థితి. అంటే అది పూర్తిస్థాయి కోమా అన్నమాట.

ఒకవేళ బాధితుడు ఆదేశాలకు స్పందిస్తూ పోతుంటే స్కోర్ పెరుగుతుంది. అన్ని ఆదేశాలకూ స్పందిస్తే స్కోర్ పెరిగి 15 అవుతుంది. ఇది నార్మల్. అది నార్మల్‌గా అది నార్మల్‌గా అంటే గ్లోస్‌గో స్కేల్ ఆదేశాలకు రోగి స్పందిస్తున్నకొద్దీ కోమా నుంచి బయటకు వస్తున్నాడని అర్థం.







కోమాలోకి వెళ్తే అనుసరించాల్సిన ఏబీసీ...

మామూలు ప్రథమ చికిత్సలోలాగే కోమాలోనూ బాధితులకు చేయాల్సిన ప్రథమ చికిత్సను ABCగా చెప్పవచ్చు. వీటిల్లో...

A - ఎయిర్ వే... అంటే ఊపిరి తీసుకోడానికి నోట్లో గళ్ల వంటిది ఏదైనా ఉంటే దాన్ని గుడ్డతో గాని, చేత్తోగాని తొలగించాలి.

B - బ్రీతింగ్... అంటే గాలి బాగా ఆడేలా, ఊపిరి తీసుకోగలిగేలా చూడాలి.

C - సర్క్యులేషన్... అంటే రక్తప్రసరణ వ్యవస్థ సరిగ్గా ఉండేలా చూడటంతో పాటు తల వంటి చోట్ల దెబ్బతగిలి రక్తస్రావం అవుతుంటే దాన్ని ఆపడం.

కోమా బాధితుల విషయంలో చేయాల్సినవి...

కోమాలోకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే బాధితుడిని బాగా గాలి వచ్చే ప్రదేశంలో పడుకోబెట్టాలి. అతడిని వెల్లకిలా కాకుండా ఓరగా ఒకవైపునకు తిరిగి ఉండేలా పడుకోబెట్టాలి. నోట్లో గుడ్డలు కుక్కడం వంటివి చేయకూడదు.

కోమాలో వెళ్లిన వారి చేత బలవంతంగా నీళ్లు తాగించడం వంటి పనులు ఎంతమాత్రమూ చేయకూడదు. స్పృహలోకి తెప్పించేందుకు చేసే ఈ పనులు బాధితులకు ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఎందుకంటే ఈ ప్రయత్నంలో నీళ్లు ఫుడ్ పైపులోకి కాకుండా ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే విండ్‌పైప్‌లోకి వెళ్తే ప్రాణాపాయం జరగడానికీ అవకాశముంది.

ప్రమాదానికి గురైన వ్యక్తికి అతడి మెడకు దెబ్బతగిలిందని భావిస్తే సాధ్యమైనంత వరకు మెడను కదల్చనివ్వకుండా చూడాలి.

చాలా పెద్దకారణాల వల్లనే కాకుండా, పైన పేర్కొన్న విధంగా చిన్న చిన్న కారణాలతోనూ కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, పాటించాల్సిన సూచనలు పాటిస్తూ... బాధితులను వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు చేరిస్తే చాలావరకు కోమాను నివారించవచ్చు లేదా వీలైనంత త్వరగా వాళ్లను కోమానుంచి బయటకు తీసుకురావచ్చు.

ఇవి కోమా లాంటి కండిషన్స్...

ఇవి కోమా లాంటి కండిషన్లేగానీ నిజానికి వాటిని పూర్తిస్థాయి కోమా అని చెప్పేందుకు వీల్లేని పరిస్థితులు ఈ కింది విధంగా ఉంటాయి.

● సైకోజెనిక్ కోమా - పేషంట్స్ కోమాలోనే ఉన్నట్లు ఉంటారు. గాని అది వాస్తవమైన కోమా కాదు.

● ఏకైనేట్ మ్యూటిజం - ఇది కూడా మానసిక పరిస్థితి వల్ల కలిగే కోమా లాంటి కండిషన్.

● లాక్‌డ్ ఇన్ స్టేట్ - బాధితులు చూడ్డానికి మామూలుగా స్పృహలో ఉన్నట్లే కనిపిస్తుంటారు. తెలివితో, స్పృహలో ఉన్నట్లే కనిపిస్తారు. కానీ కళ్లు, కాళ్లు, చేతులు ఏవీ కదపలేరు. మాట్లాడలేరు. అర్థమవుతూనే ఉన్నట్లుంటుంది. కాని అర్థం చేసుకోలేరు.

వెజిటేటివ్ స్టేట్ (కోమా విజిల్)

ఓ వ్యక్తి చూడటానికి అంతా మామూలుగానే ఉండి చూస్తున్నట్లే ఉంటాడు. కాని మన మాటలు, కమ్యూనికేషన్ ఏదీ అతడిని చేరదు.

బిజినెస్ రీల్

టాటా ఆటో చేతికి స్వీడన్ కంపెనీ

ఐఏసీ స్వీడన్ కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ యూరోపియన్ ఆటో రంగంలో మరింత పటిష్టపడే బాటలో స్వీడన్ సంస్థను కొనుగోలు చేయనుంది. ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ కంపోనెంట్స్ గ్రూప్ స్వీడన్ ఏబీ(ఐఏసీ స్వీడన్)ను సొంతం చేసుకోనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. ప్రతిపాదిత కొనుగోలుకి యూరోపియన్ అధీకృత సంస్థల నుంచి అనుమతులు పొందవలసి ఉన్నట్లు తెలియజేసింది. స్వీడిష్ కంపెనీ కొనుగోలు ద్వారా యూరోపియన్ ఓఈఎం కస్టమర్లతో సంబంధాలు పటిష్ట పడనున్నట్లు టాటా ఆటోకాంప్ వైస్‌చైర్మన్ అర్వింద్ గోయెల్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలకు అనుగుణంగా అటు ప్యాసింజర్, ఇటు వాణిజ్య వాహన విభాగాలలో కంపెనీ మరింత విస్తరించనున్నట్లు వివరించారు. ఇంటీరియర్ సిస్టమ్స్, ఇతర విడిభాగాల తయారీ కంపెనీ ఐఏసీ స్వీడన్ సుమారు 80 కోట్ల డాలర్ల(సుమారు రూ. 6,850 కోట్లు) టర్నోవర్ సాధించినట్లు వెల్లడించింది.

ఏడాది చార్జీని ముందే తీసుకోవచ్చు

అడ్వైజర్లు, రీసెర్చ్ అనలిస్ట్‌లకు సెబీ ఊరట



ముంబై: పెట్టుబడుల సలహాదారులు (ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు), పరిశోధన విశ్లేషకులు (రీసెర్చ్ అనలిస్టులు) తమ సేవలకు సంబంధించి ఏడాది కాల చార్జీని ముందుగానే క్లయింట్ల నుంచి తీసుకునేందుకు అనుమతించాలని సెబీ నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల మేరకు ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు క్లయింట్ల ఆమోదం మేరకు రెండు త్రైమాసికాల చార్జీలనే (ఆరు నెలలు) ముందస్తుగా తీసుకునేందుకు అనుమతి ఉంది. అదే, రీసెర్చ్ అనలిస్టులు అయితే ఒక త్రైమాసికం చార్జీలనే ముందుగా తీసుకోవచ్చు. ''ఐఏలు, ఆర్ఏలు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో.. క్లయింట్లు సమ్మతిస్తే ఏడాది కాల ఫీజులను ముందుగానే తీసుకునేందుకు అనుమతించాలని బోర్డు నిర్ణయించింది'' అని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. ఫీజుల పరిమితులు, చెల్లింపుల విధానాలు, రిఫండ్‌లు, బ్రేకేజ్ ఫీజులకు సంబంధించి నిబంధనల అమలు కేవలం వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్‌యూఎఫ్) క్లయింట్లకే పరిమితమని స్పష్టం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-3-2025

విశాఖ	400-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	392-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,180.00	4.86
NTPC	367	4.47
SBIN	781	3.69
TECHM	1,459.95	3.6
POWERGRID	292	3.14

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	667.75	-2.79
TITAN	3,076.00	-2.74
TRENT	5,063.00	-1.69
M&M	2,777.00	-0.89
BHARTIARTL	1,716.95	-0.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,703
ఎన్ఎస్ఈ	56,758
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,81,459
ఎఫ్ఐఐ	+ 3,056
డీఐఐ	+ 99

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	68.92	$	68.28
బ్రెంట్	72.18	$	71.61

రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లు 2 శాతమే

- ప్రశ్నార్థకంగా విశ్వసనీయత, జవాబుదారీతనం
- సీఎఫ్‌ఏ ఇనిస్టిట్యూట్ నివేదిక

పెట్టుబడులపై బాహాటంగా సిఫార్సులు ఇస్తున్న వారు 33 శాతం మంది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు, ఇతరత్రా పెట్టుబడులపై రిటైల్ మదుపరుల మీద ఫిన్‌ఫ్లుయెన్సర్లు చూపిస్తున్న ప్రభావం అంతా ఇంతా కాదు. సరైన అర్హతలు, తగిన అనుమతులు లేకుండా వారిచ్చే ఆర్థిక సలహాలను పట్టుకుని ఇన్వెస్ట్ చేస్తూ, ఎంతో మంది నష్టాల పాలవుతున్నారు. ఫిన్‌ఫ్లుయెన్సర్లపై అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొఫెషనల్స్ సంస్థ సీఎఫ్‌ఏ ఇనిస్టిట్యూట్ నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారి వివరాల ప్రకారం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద నమోదు చేసుకున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు (ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు) రెండు శాతమే ఉన్నారు. కానీ 33 శాతం మంది బాహాటంగానే క్రయ, విక్రయాలకు సంబంధించిన రికమెండేషన్లు ఇస్తున్నారు. దీంతో సదరు సలహాల విశ్వసనీయతపైనా, ఇన్‌ఫ్లుయెన్సర్ల జవాబుదారీతనంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిన్‌ఫ్లుయెన్సర్ల సానుకూల, ప్రతికూల ప్రభావాలు, పరిణామాలను తెలుసుకునేందుకు నిర్వహించిన ఈ సర్వేలో 51 మంది ప్రముఖ ఫిన్‌ఫ్లుయెన్సర్ల తీరును లోతుగా విశ్లేషించారు. ఇందులో 1,600 మంది ఇన్వెస్టర్లు పాల్గొన్నారు. ''ఆర్థిక అంశాలపై అవగాహన పెంచేందుకు దేశీయంగా ఫిన్‌ఫ్లుయెన్సర్ వ్యవస్థ ద్వారా ఎంతో చేయడానికి ఆస్కారం ఉంది. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు బాధ్యతాయుతమైన విధానాలను పాటించడం, పూర్తి సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి. ఫిన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సెబీ వద్ద రిజిస్టర్ చేసుకున్న అడ్వైజర్ల నుంచే పెట్టుబడులకు సంబంధించిన గైడెన్స్ తీసుకోవాలి. తాము ఫాలో అయ్యే ఇన్‌ఫ్లుయెన్సర్ల వివరాలను ధృవీకరించుకోవాలి'' అని సీఎఫ్‌ఏ ఇనిస్టిట్యూట్-ఇండియా కంట్రీ హెడ్ ఆరతి పోర్వాల్ తెలిపారు.

నివేదికలోని మరిన్ని వివరాలు..

- 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సున్న యువ ఇన్వెస్టర్లు ఒక క్రమపద్ధతిలో ఇన్వెస్ట్ చేయడం లేదు. పొదుపు రూపంలో కాస్త చెప్పుకోతగిన మొత్తాన్ని పోగేసుకునే వరకు వేచి చూస్తున్నారు. వయస్సులో పెద్దవారైన ఇన్వెస్టర్లు మాత్రం నెలవారీగా ఇన్వెస్ట్ చేయడంలో స్థిరమైన విధానాలను పాటిస్తున్నారు.
- విశ్వసనీయత, ఉపయోగించడానికి సులభతరంగా ఉండటమనేవి ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకోవడంలో కీలకాంశాలుగా ఉంటున్నాయి. యువ ఇన్వెస్టర్లు తక్కువ బ్రోకరేజీ ఉండే ప్లాట్‌ఫామ్‌లను ఎంచుకుంటుండగా, కాస్త సీనియర్లు ఫుల్-సర్వీస్ బ్రోకరేజీలను, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా గైడెన్స్ ఇచ్చే ప్లాట్‌ఫామ్‌లను ఎంచుకుంటున్నారు.
- సంక్లిష్టమైన ఆర్థికాంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు సరళంగా వివరిస్తున్నప్పటికీ, తమకు ఒనగూరే ప్రయోజనాల వివరాలను సరిగ్గా వెల్లడించడం లేదు. 63 శాతం మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు తమకు వచ్చే స్పాన్సర్‌షిప్‌ల గురించి, ఆర్థిక సంస్థలతో ఉన్న సంబంధాల గురించి సరైన వివరాలు వెల్లడించలేదు.
- ఈ నేపథ్యంలో నియంత్రణ, అవగాహనకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. సర్టిఫికేషన్ ప్రమాణాలను పటిష్టం చేయాలి. ఆర్థిక సలహాలు ఇచ్చే ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెబీలో రిజిస్టర్ చేసుకోవడాన్ని తప్పనిసరి చేయాలి. పర్యవేక్షణ విధానాలను కఠినతరం చేయాలి. సోషల్ మీడియాల్లో స్పాన్సర్డ్ కంటెంట్‌ను స్పష్టంగా పేర్కొనాలి. ఫిన్‌ఫ్లుయెన్సర్ల విశ్వసనీయతను ధృవీకరించే విధానాలను రూపొందించాలి. అలాగే, రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ఉపయోగాలు ఉన్నాయి, రిస్కులూ ఉన్నాయి..

గత అయిదేళ్లుగా ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య అనేక రెట్లు పెరిగింది. ఇది స్వాగతించతగిన పరిణామమే అయినప్పటికీ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అధ్యయనం ప్రకారం వీరిలో చాలా మంది స్పెక్యులేటర్లే ఉంటున్నారు తప్ప నిజమైన ఇన్వెస్టర్ల సంఖ్య తక్కువే ఉంటోంది. వీరిని ప్రభావితం చేస్తూ, అక్రమంగా లబ్ధి పొందుతున్న ఫిన్‌ఫ్లుయెన్సర్లను కట్టడి చేసేందుకు సెబీ భారీ జరిమానాలు విధిస్తున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో ఫిన్‌ఫ్లుయెన్సర్లను నియంత్రించడానికి ఇంకా చాలా సమయమే పట్టేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలంటే ఇన్వెస్టర్ల పెట్టుబడుల ధోరణులను అర్థం చేసుకోవడం, ఫిన్‌ఫ్లుయెన్సర్లు అందిస్తున్న కంటెంట్‌ను సమీక్షించడం కీలకమైన అంశాలని సీఎఫ్‌ఏ గుర్తించింది. ఇందులో భాగంగానే నిర్వహించిన అధ్యయనంలో ఇన్వెస్టర్లను ఫిన్‌ఫ్లుయెన్సర్లు గణనీయంగా ప్రభావితం చేస్తున్న సంగతి వెల్లడైంది. ఇన్‌ఫ్లుయెన్సర్ల సలహాల మేరకు పెట్టుబడులు పెట్టినట్లు 82 శాతం మంది ఫాలోయర్లు తెలిపారు. వీరిలో 72 శాతం మందికి ఆర్థికంగా ప్రయోజనాలు కూడా లభించాయి. అయితే, ఇందులో రిస్కులూ ఉంటున్నాయి. వయస్సులో కాస్త పెద్దవారైన ఇన్వెస్టర్లలో (40 ఏళ్ల అంతకు పైబడి) 14 శాతం మంది తాము తప్పుదోవ పట్టించే సలహాలు విని మోసపోయినట్లు వెల్లడించినట్లు నివేదిక తెలిపింది.

హల్దీరామ్‌లో టెమాసెక్‌కు వాటా

- 10 శాతం కొనుగోలుకి ఒప్పందం
- అనుమతి కోసం సీసీఐకు దరఖాస్తు



న్యూఢిల్లీ: ప్యాక్డ్ స్నాక్, స్వీట్స్ కంపెనీ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ టెమాసెక్ హోల్డింగ్స్ 10 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు అనుమతించమంటూ అనుబంధ సంస్థ జాంగ్‌సాంగ్ ఇన్వెస్ట్‌మెంట్స్ పీటీఈ ద్వారా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ)కు దరఖాస్తు చేసింది. ప్రతిపాదిత లావాదేవీ ద్వారా కంపెనీ చెల్లించిన మూలధనంలో 10 శాతానికంటే తక్కువ వాటా సొంతం చేసుకుకోనున్నట్లు సీసీఐకి తెలియజేసింది. షేర్లు, వోటింగ్ హక్కుల ద్వారా వాటా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం 10 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 85,700 కోట్లు) విలువలో హల్దీరామ్ స్నాక్స్‌లో 10 శాతం వాటా కొనుగోలుకి టెమాసెక్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బ్లాక్‌స్టోన్, అల్ఫా వేవ్ గ్లోబల్, బెయిన్ క్యాపిటల్ తదితర పీఈ దిగ్గజాలతో చర్చల అనంతరం టెమాసెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అగర్వాల్ కుటుంబ నిర్వహణలోని హల్దీరామ్ స్నాక్స్ రెస్టారెంట్లను సైతం నిర్వహించే సంగతి తెలిసిందే. 1937లో రాజస్తాన్‌లోని బికనీర్‌లో ఏర్పాటైన కంపెనీ వచ్చే ఏడాది(2025-26)లో పబ్లిక్ ఇష్యూ చేపట్టే ప్రణాళికల్లో ఉంది. తాజాగా అందుకోనున్న నిధులను విస్తరణకు వినియోగించే వీలుంది.

మహిళలకు భారీగా కాంట్రాక్టు ఉద్యోగాలు

- ప్రస్తుతం మెట్రోల్లోనే ఎక్కువ
- టైర్-2, 3 పట్టణాల్లో విస్తరణ అవకాశాలు
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక అంచనా



ముంబై: మహిళలకు సంబంధించి ఉద్యోగ అవకాశాలు, ముఖ్యంగా కాంట్రాక్టు పనులు మెట్రోల్లో, పారిశ్రామిక కేంద్రాల్లోనే ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయని.. భవిష్యత్తులో టైర్ 2, 3 పట్టణాల్లో విస్తరణకు అపార అవకాశాలున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక వెల్లడించింది. మహిళలకు కాంట్రాక్టు ఉద్యోగాల్లో 28.7 శాతం వాటాతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉండగా, తమిళనాడు 14.2 శాతం, కర్ణాటక 14.1 శాతం మేర అవకాశాలను అందిస్తున్నట్టు తెలిపింది. ఆ తర్వాత తెలంగాణలో 7.8 శాతం, గుజరాత్‌లో 7.2 శాతం, యూపీలో 6.6 శాతం చొప్పున మహిళలకు కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తున్నట్టు వెల్లడించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో మరింత మందికి ఈ అవకాశాల కల్పనకు గణనీయమైన అవకాశాలున్నట్టు గుర్తు చేసింది. టీమ్‌లీజ్ సర్వీసెస్ తన అంతర్గత డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.

రిటైల్‌లోనే ఎక్కువ

మహిళలకు కాంట్రాక్టు ఉద్యోగాల్లో 29.8 శాతం ఒక్క రిటైల్ రంగమే కల్పిస్తోందని టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక వెల్లడించింది. ఐటీ రంగంలో 20.7 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో 18.9 శాతం చొప్పున ఉద్యోగాలు లభిస్తున్నట్టు తెలిపింది. తయారీలో 10.8 శాతం, విద్యుత్, ఇంధన రంగంలో 5 శాతం, టెలికంలో 4 శాతం చొప్పున కాంట్రాక్టు ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం ఉన్నట్టు పేర్కొంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్‌తో కూడిన స్టెమ్ విద్యలో ఎక్కువ మంది మహిళలు చేరడం అన్నది ఐటీ, రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో మరింత మందికి అవకాశాలను చేరువ చేస్తుందని తెలిపింది. కాంట్రాక్టు మహిళా ఉద్యోగుల్లో 62.2 శాతం మంది వయసు 18-27 ఏళ్ల మధ్యలో ఉంటే.. 29.4 శాతం మంది 28-37 ఏళ్ల వయసులో ఉండడం అన్నది యువ ప్రాతినిధ్యాన్ని సూచిస్తున్నట్టు పేర్కొంది. 38-47 ఏళ్ల వయసులోని మహిళలు 6.6 శాతం, 48 ఏళ్లకుపైన వయసున్న మహిళలు 1.9 శాతం చొప్పున కాంట్రాక్టు ఉద్యోగాల్లో ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది.

టెక్ స్టార్టప్‌లకు నిధుల జోష్

క్యూ1లో 2.5 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: దేశీయంగా టెక్ స్టార్టప్‌లు 2025 తొలి క్వార్టర్‌లో 2.5 బిలియన్ డాలర్లు సమీకరించాయి. 2024 క్యూ4తో పోలిస్తే ఇవి దాదాపు 14 శాతం అధికంకాగా.. 2024 క్యూ1తో చూస్తే 9 శాతం వృద్ధి. దీంతో టెక్ స్టార్టప్‌ల నిధుల సమీకరణరీత్యా ప్రపంచవ్యాప్తంగా యూఎస్, యూకే తదుపరి భారత్ మూడో ర్యాంకులో నిలిచినట్లు ఒక నివేదికలో మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్ పేర్కొంది. ఈ వివరాల ప్రకారం నిధుల సమీకరణలో ఆటో టెక్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్, రిటైల్ అగ్రభాగాన నిలిచాయి. చివరి దశలో ఉన్న స్టార్టప్‌లకు నిధులు పెరిగితే.. ప్రాథమిక దశలో ఉన్న సంస్థలకు ఫండింగ్ క్షీణించింది. చివరి దశలో ఉన్న స్టార్టప్‌లకు 1.8 బిలియన్ డాలర్లు అందాయి. ఇది 2024 క్యూ1తో పోలిస్తే దాదాపు 115 శాతం పురోగతి. తొలి దశ స్టార్టప్‌లకు 56 శాతం తక్కువగా 15.7 కోట్ల డాలర్లు మాత్రమే లభించాయి. తొలి దశ స్టార్టప్‌లకు నిధుల లభ్యత 52 శాతం క్షీణించి 52.8 కోట్ల డాలర్లకు పరిమితమైంది.



ప్రభుత్వ బ్యాంకుల డివిడెండ్ అప్



2023-24లో రూ. 27,830 కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం(2023-24) ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ చెల్లింపులు 33 శాతం ఎగశాయి. ఉమ్మడిగా రూ. 27,830 కోట్లు చెల్లించాయి. ఇది పీఎస్‌యూ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి భారీగా మెరుగుపడినట్లు తెలియజేస్తోంది. అంతక్రితం ఏడాది(2022-23) ప్రభుత్వ బ్యాంకులు డివిడెండ్ రూపేణా రూ. 20,694 కోట్లు అందించాయి. వీటితో పోలిస్తే గతేడాది చెల్లింపులు 33 శాతం బలపడ్డాయి. కాగా.. వీటిలో 65 శాతం అంటే రూ. 27,830 కోట్లు వాటా ప్రకారం ప్రభుత్వానికి అందించాయి. ఇదేవిధంగా 2022-23లో ప్రభుత్వ వాటాకు పీఎస్‌యూ బ్యాంకులు ఉమ్మడిగా రూ. 13,804 కోట్లు చెల్లించాయి. గతేడాది ఎస్‌బీఐసహా 12 ప్రభుత్వ బ్యాంకులు పీఎస్‌యూ బ్యాంకింగ్ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1.41 లక్షల కోట్లకుపైగా నికర లాభం ఆర్జించాయి. దీనిలో ఎస్‌బీఐ వాటా విడిగా 40 శాతంకావడం గమనార్హం! 2022-23లో రూ. 1.05 లక్షల కోట్ల నికర లాభం ప్రకటించాయి. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి 9 నెలల్లో(ఏప్రిల్-డిసెంబర్) రూ. 1.29 లక్షల కోట్ల నికర లాభం సాధించిన విషయం విదితమే.

ఎస్‌బీఐ 22 శాతం జూమ్

గతేడాది ఎస్‌బీఐ రూ. 61,077 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది సాధించిన రూ. 50,232 కోట్లతో పోలిస్తే 22 శాతం అధికం! పంజాబ్ నేషనల్ బ్యాంక్ నికర లాభం అత్యధికంగా 228 శాతం దూసుకెళ్లి రూ. 8,245 కోట్లను తాకింది. ఈ బాటలో యూనియన్ బ్యాంక్ లాభం 62 శాతం వృద్ధితో రూ. 13,249 కోట్లకు చేరగా.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం 61 శాతం ఎగసి రూ. 2,549 కోట్లయ్యింది. ఇతర సంస్థల లాభాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా 57 శాతం వృద్ధితో రూ. 6,318 కోట్లకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 56 శాతం ఎగసి రూ. 4,055 కోట్లకు, ఇండియన్ బ్యాంక్ 53 శాతం అధికంగా రూ. 2,549 కోట్లకు చేరాయి. 2017-18లో పీఎస్‌బీలు ఉమ్మడిగా రూ. 85,390 కోట్ల నష్టాలు నమోదుచేయగా.. 2023-24కల్లా ఏకంగా రూ. 1,41,203 కోట్ల నికర లాభం ఆర్జించి సరికొత్త రికార్డ్ సాధించడం కొసమెరుపు!!

హైదరాబాద్‌లో పడిపోయిన ఇళ్ల అమ్మకాలు

- టాప్ 9 నగరాల్లో 23 తగ్గిన విక్రయాలు
- ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు, బలహీన డిమాండ్ ప్రభావం
- ప్రాప్ ఈక్విటీ సంస్థ నివేదికలో వెల్లడి

జనవరి-మార్చి మధ్య 47 శాతం డౌన్



న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఇళ్ల అమ్మకాలు పడిపోయాయి. జనవరి-మార్చి కాలంలో హైదరాబాద్‌లో 11,114 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదవుతాయని రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా. క్రితం ఏడాది తొలి మూడు నెలల కాలంలోని అమ్మకాలు 20,835 యూనిట్లతో పోల్చి చూస్తే 47 శాతం తగ్గనున్నాయి. ఇలా దేశవ్యాప్తంగా టాప్ 9 నగరాల్లో మార్చి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 23 శాతం తక్కువగా 1,05,791 యూనిట్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. క్రితం ఏడాది మొదటి మూడు నెలల్లో ఈ నగరాల్లో అమ్మకాలు 1,36,702 యూనిట్లుగా ఉన్నాయి. అధిక ధరలతో డిమాండ్ బలహీనపడడం, ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు విక్రయాలు పడిపోవడానికి కారణాలుగా ప్రాప్ ఈక్విటీ తన నివేదికలో పేర్కొంది. తొమ్మిది నగరాల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు మాత్రం వృద్ధిని చూసినట్టు తెలిపింది. ''మూడేళ్లపాటు రికార్డు స్థాయి సరఫరా అనంతరం హౌసింగ్ మార్కెట్లో దిద్దుబాటు చోటుచేసుకుంది. అమ్మకాలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. కొత్త ఇళ్ల సరఫరా సైతం జనవరి-మార్చి మధ్య 34 శాతం క్షీణించి 80,774 యూనిట్లకు పరిమితం కావచ్చు. క్రితం ఏడాది మొదటి త్రైమాసికంలో సరఫరా 1,22,365 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దేశ ఆర్థిక వ్యవస్థలో కొంత బలహీనత అమ్మకాలు తగ్గడానికి కారణాలుగా ఉన్నాయి'' అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు.

పట్టణాల వారీగా విక్రయ అంచనాలు..

- బెంగళూరులో జనవరి-మార్చి మధ్య విక్రయాలు 18,508 యూనిట్లుగా ఉండొచ్చు. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో అమ్మకాలు 16,768 యూనిట్లతో పోల్చితే 10% పెరుగుతాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లోనూ 10 శాతం వృద్ధితో 11,221 యూనిట్ల అమ్మకాలు నమోదు కావచ్చు.
- చెన్నైలో 4,858 యూనిట్లు అమ్ముడు కావచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 4,962 యూనిట్లతో పోల్చి చూస్తే 2 శాతం క్షీణించే అవకాశం ఉంది.
- కోల్‌కతాలో 28 శాతం తక్కువగా 4,219 యూనిట్ల విక్రయాలు నమోదవ్వొచ్చు.
- ముంబై మార్కెట్లో 10,432 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 16,204 యూనిట్లుగా ఉన్నాయి.
- నవీ ముంబైలో 7 శాతం తక్కువగా 8,551 యూనిట్లకు పరిమితం కావొచ్చు.
- పుణెలోనూ అమ్మకాలు 33 శాతం తక్కువగా 17,634 యూనిట్లుగా ఉంటాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 26,364 యూనిట్లుగా ఉన్నాయి.
- థానేలో 27 శాతం క్షీణతతో అమ్మకాలు 19,254 యూనిట్లుగా ఉంటాయి.

ప్రయివేట్ పెట్టుబడులు నేలచూపు

- 203-24లో 33 శాతం క్షీణత
- ఇక్రా రేటింగ్స్ నివేదికలో వెల్లడి



ముంబై: దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ప్రయివేట్ పెట్టుబడులు 33 శాతం క్షీణించినట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా వెల్లడించింది. ఇది గత దశాబ్ద కాలంలోనే కనిష్ఠంకాగా.. లిస్టెడ్ కంపెనీలతో పోలిస్తే అన్‌లిస్టెడ్ సంస్థలు పెట్టుబడుల్లో వెనకడుగు వేసినట్లు నివేదికలో పేర్కొంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వమే పెట్టుబడులకు దన్నుగా నిలుస్తున్నట్లు తెలియజేసింది. ప్రయివేట్ పెట్టుబడులు లేకపోవడం ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపవచ్చన్న ఆందోళనలు కొన్ని త్రైమాసికాలలో తలెత్తినట్లు వివరించింది. నివేదిక ప్రకారం.. కొత్త సౌకర్యాలపై ఇన్వెస్ట్ చేయడానికి బదులుగా ప్రయివేట్ రంగం రుణ చెల్లింపులకే మిగులు నిధులను వెచ్చించడంపై దృష్టి పెట్టింది. తద్వారా అధిక సామర్థ్య వినియోగానికి ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రధానంగా పట్టణాలలో వినియోగం బలహీనపడటం, డిమాండ్ మందగించడం, చైనా నుంచి పెరిగిన చౌక దిగుమతులు తదితర అంశాల కారణంగా దేశీ కార్పొరేట్ల విస్తరణ ప్రణాళికలు పరిమితమైపోయినట్లు ఇక్రా చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కె.రవిచంద్రన్ తెలియజేశారు.

ప్రాధాన్య రంగాల రుణ వితరణలో సవరణలు



ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు

ముంబై: ప్రాధాన్య రంగాల రుణ వితరణ (పీఎస్ఎల్) నిబంధనలను ఆర్‌బీఐ సవరించింది. ఆర్థిక వ్యవస్థలో కీలకమైన రంగాలకు బ్యాంకుల నుంచి మరింత రుణ వితరణకు కొత్త నిబంధనలు వీలు కల్పిస్తాయని ఆర్‌బీఐ ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. తాజా సవరణల్లో రుణ పరిమితుల్లో మార్పులు కూడా ఉన్నాయి. అర్బన్ కోపరేటివ్ బ్యాంకులకు పీఎస్ఎల్ లక్ష్యాన్ని సర్దుబాటు చేసిన నికర బ్యాంక్ రుణాల్లో 60 శాతంగా ఆర్‌బీఐ పేర్కొంది. బలహీన వర్గాలకు సైతం సవరించిన పీఎస్ఎల్ నిబంధనలను విస్తరించింది. పట్టణ కోపరేటివ్ బ్యాంకులు మహిళా రుణ గ్రహీతలకు మంజూరు చేసే రుణాలపై పరిమితిని తొలగించింది. పునరుత్పాదక ఇంధన విద్యుదుత్పత్తి ప్లాంట్లను వ్యక్తులు ఏర్పాటు చేసుకుంటే ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాన్ని మంజూరు చేయొచ్చని.. అదే సంస్థలకు అయితే రూ.35 కోట్ల వరకు మంజూరు చేసేలా పీఎస్ఎల్ నిబంధనలు సవరించింది.

సుమీత్ వీడ్కోలు

బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పిన భారత డబుల్స్ స్టార్ ప్లేయర్

సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం కూడా పెద్ద పరీక్షలాంటిదే. క్రీడాకారుడిగా కెరీర్ బాగా సాగుతున్న దశలోనే ఆట నుంచి వీడ్కోలు తీసుకోవాలంటే తెగువ అవసరం. ఆశించిన విజయాలు లభించకపోయినా... ఆటగాడిగా కొనసాగుతూ... ఇతరుల అవకాశాలను ప్రభావితం చేసే బదులు... వర్ధమాన క్రీడాకారులు తమ కెరీర్‌లో మరింత ఎదిగేందుకు మార్గదర్శిగా మారడం విజ్ఞుల లక్షణం. ఆ కోవలోకే తాను వస్తానని తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బసి సుమీత్ రెడ్డి చాటుకున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మిక్స్‌డ్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 25వ ర్యాంక్‌లో ఉన్న సుమీత్ రెడ్డి క్రీడాకారుడిగా తన ఇన్నింగ్స్ ముగిసిందని సోమవారం ప్రకటించాడు. కోచ్ రూపంలో ఇప్పటికే రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టానని... భవిష్యత్‌లో భారత్‌కు మెరికల్లాంటి షట్లర్లను తయారు చేయడమే లక్ష్యంగా కోచ్‌గా స్థిరపడతానని సుమీత్ స్పష్టం చేశాడు.

కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన తెలంగాణ షట్లర్	రియో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం	2022 కామన్వెల్త్ గేమ్స్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం నెగ్గిన భారత జట్టులో సభ్యుడు	2014, 2018 ఆసియా క్రీడల్లోనూ టీమిండియా తరఫున బరిలోకి

సాక్షి, హైదరాబాద్: బ్యాడ్మింటన్‌లో ఉన్న అన్ని ప్రముఖ టోర్నమెంట్‌లలో... నాలుగేళ్లకోసారి జరిగే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఒలింపిక్స్ క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకోవడమంటే ఆషామాషీ కాదు. తెలంగాణకు చెందిన 33 ఏళ్ల బసి సుమీత్ రెడ్డి తన కెరీర్‌లో ఇవన్నీ సాకారం చేసుకున్నాడు. ఇక తన కెరీర్‌లో మళ్లీ ఉన్నతస్థితికి చేరుకునే అవకాశం లేదని భావించిన సుమీత్ ఆటకు వీడ్కోలు పలకడమే ఉత్తమం అని ఆలోచించాడు. తన ఆలోచనను నిజం చేస్తూ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా రిటైర్ అవుతున్నట్లు సోమవారం ఇన్‌స్టాగామ్ వేదికగా ప్రకటించాడు. ఇక మీదట తన దృష్టంతా కోచింగ్‌పైనే ఉంటుందని ఈ సందర్భంగా సుమీత్ రెడ్డి స్పష్టం చేశాడు. 'రిటైరయ్యాను. గర్వంగా ఉన్నాను. కెరీర్‌లోని తర్వాతి అధ్యాయం కోసం ఉత్సుకతతో ఉన్నాను. నేనీ స్థాయికి చేరుకోవడంలో ముఖ్యపాత్ర పోషించిన కుటుంబసభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను' అని సుమీత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. 'నా పరిమితికి మించి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమించాను. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 25వ స్థానంలో ఉన్నప్పటికీ నా కెరీర్‌లో ఉన్నత దశ దాటిపోయానని భావిస్తున్నాను. ఇతరత్రా కారణాలతోనూ నా ప్రొఫెషనల్ కెరీర్ నుంచి వైదొలుగుతున్నాను. ఇక ఆటను ఆపేయాలనే సంకేతాలు మన మదిలో మెదిలినపుడు ఎలాంటి సంకోచం లేకుండా నిర్ణయం తీసుకోవాలి. వెన్నునొప్పి కారణంగా ఒకదశలో వైద్యులు బ్యాడ్మింటన్‌ను వదిలేయాలని సూచించారు. కానీ హెడ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఇచ్చిన ప్రోత్సాహంతో, ఆయన ఇచ్చిన సలహాలతో డబుల్స్ వైపు అడుగులు వేసి కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నాను' అని సుమీత్ వ్యాఖ్యానించాడు.

నాన్న ప్రోద్బలంతో...

అథ్లెటిక్స్ నేపథ్యమున్న తన తండ్రి భాస్కర్ రెడ్డి ప్రోత్సాహంతో 2001లో బ్యాడ్మింటన్ రాకెట్ పట్టిన సుమీత్ 2007లో ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత జూనియర్ జట్టుకు తొలిసారి ప్రాతినిధ్యం వహించాడు. ఐదేళ్ల తర్వాత 2012లో చైనా ఓపెన్ సూపర్ సిరీస్ టోర్నీ ద్వారా భారత సీనియర్ జట్టు తరఫున తొలిసారి బరిలోకి దిగాడు. అప్పటి నుంచి పుష్కరకాలం పాటు జాతీయ జట్టులో సభ్యుడిగా కొనసాగాడు. మనూ అత్రితో కలిసి సుమీత్ రెడ్డి 2015లో పురుషుల డబుల్స్‌లో కెరీర్ బెస్ట్ 17వ ర్యాంక్‌ను అందుకోగా... భార్య సిక్కి రెడ్డితో కలిసి సుమీత్ 2025 మార్చిలో మిక్స్‌డ్ డబుల్స్‌లో కెరీర్ బెస్ట్ 25వ ర్యాంక్‌లో నిలిచాడు. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో, 2018 జకార్తా ఆసియా క్రీడల్లో టీమ్ విభాగంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సుమీత్ రెడ్డి 2016 రియో ఒలింపిక్స్‌లో మనూ అత్రికి కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడ్డాడు. ఒక విజయం, రెండు పరాజయాలు నమోదు చేసుకొని సుమీత్ రెడ్డి-మనూ అత్రి ద్వయం రియో ఒలింపిక్స్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

12 అంతర్జాతీయ టైటిల్స్...

2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం నెగ్గిన భారత జట్టులో సుమీత్ సభ్యుడిగా ఉన్నాడు. 2016లో హైదరాబాద్ వేదికగా జరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన టీమిండియాలోనూ సుమీత్ సభ్యుడిగా నిలిచాడు. 2016లో గువాహటిలో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో, 2019లో కఠ్మాండూలో జరిగిన దక్షిణాసియా ఆసియా క్రీడల్లో సుమీత్ రెడ్డి పురుషుల డబుల్స్, పురుషుల టీమ్ ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) సర్క్యూట్‌లో సుమీత్ రెడ్డి ఓవరాల్‌గా 12 టైటిల్స్ సాధించాడు. ఇందులో గ్రాండ్‌ప్రి స్థాయికి చెందిన రెండు పురుషుల డబుల్స్ టైటిల్స్ (2015లో మనూ అత్రితో కలిసి మెక్సికో సిటీ గ్రాండ్‌ప్రి; 2016లో మనూ అత్రితో కలిసి కెనడా ఓపెన్) ఉన్నాయి. అంతర్జాతీయ చాలెంజ్, అంతర్జాతీయ సిరీస్ కేటగిరీల్లో కలిపి సుమీత్ 10 టైటిల్స్ గెలిచాడు. 2021లో భార్య సిక్కి రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో సిక్కీ సుమీత్ బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభించి ఒక వైపు కెరీర్‌ను కొనసాగిస్తూనే చిన్నారులకు శిక్షణ ఇచ్చాడు. ప్రస్తుతం జాతీయ డబుల్స్ కోచ్‌ల ప్యానెల్‌లో సభ్యుడిగా ఉన్న సుమీత్ భవిష్యత్‌లో భారత జట్టు బ్యాడ్మింటన్ పవర్‌హౌస్‌గా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు.







డుప్లాంటిస్ 'సెంచరీ'

- 100వ సారి 6 మీటర్ల ఎత్తును అధిగమించిన స్వీడన్ స్టార్ పోల్‌వాల్టర్
- వరుసగా మూడోసారి ప్రపంచ ఇండోర్ టైటిల్ సొంతం

నాన్‌జింగ్ (చైనా): వేదిక ఏదైనా... ప్రత్యర్థులు ఎవరైనా... స్వీడన్ స్టార్ పోల్‌వాల్టర్ అర్మాండ్ డుప్లాంటిస్ మరింత పైపైకి చేరుకుంటున్నాడు. ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో డుప్లాంటిస్ పురుషుల పోల్ వాల్ట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని సాధించాడు. డుప్లాంటిస్ 6.15 మీటర్ల ఎత్తుకు ఎగిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో 100 సార్లు 6 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుకు ఎగిరిన తొలి పోల్‌వాల్టర్‌గా డుప్లాంటిస్ రికార్డు నెలకొల్పాడు. ఈ అంశంలో పోల్‌వాల్ట్ దిగ్గజం సెర్గీ బుబ్కా 6 మీటర్ల ఎత్తును 45 సార్లు అధిగమించి రెండో స్థానంలో ఉన్నాడు. ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించడం 25 ఏళ్ల డుప్లాంటిస్‌కిది వరుసగా మూడోసారి. 2022, 2024లలో జరిగిన ఈ మెగా ఈవెంట్స్‌లోనూ అతను బంగారు పతకాలను సాధించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు నెగ్గిన డుప్లాంటిస్... 2022, 2023 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నాడు. ఓవరాల్‌గా 11 సార్లు డుప్లాంటిస్ తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డులన సవరించాడు.

చిరాగ్, అంతిమ్‌లపైనే ఆశలు

నేటి నుంచి ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

అమ్మాన్ (జోర్డాన్): గత ఏడాది భారత రెజ్లింగ్‌కు ఏదీ కలిసి రాలేదు. కొత్త ఏడాదిని సరికొత్తగా ప్రారంభించేందుకు ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ రూపంలో అవకాశం లభించింది. నేటి నుంచి జరిగే ఈ మెగా ఈవెంట్‌లో భారత్ నుంచి పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో 10 మంది... గ్రీకో రోమన్ విభాగంలో 10 మంది... మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో 10 మంది రెజ్లర్లు పోటీపడుతున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన అమన్ సెహ్రావత్ (57 కేజీలు) ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు దూరమైన నేపథ్యంలో... ఇదే కేటగిరీలో భారత ఆశలన్నీ చిరాగ్ చికారాపై ఆధారపడి ఉన్నాయి. గత ఏడాది అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన చిరాగ్ అదే ఫలితాన్ని 'ఆసియా'లోనూ పునరావృతం చేయాలనే లక్ష్యంతో ఉన్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన అంతిమ్ పంఘాల్... టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న దీపక్ పూనియా కూడా ఆసియా టోర్నీలో రాణించాలనే పట్టుదలతో ఉన్నారు. తొలి రోజు మంగళవారం పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో బౌట్‌లు జరుగుతాయి.



భారత రెజ్లింగ్ జట్టు: పురుషుల ఫ్రీస్టయిల్: చిరాగ్ (57 కేజీలు), ఉదిత్ (61 కేజీలు), సుజీత్ కల్కాల్ (65 కేజీలు), విశాల్ కాళీరామన్ (70 కేజీలు), జైదీప్ (74 కేజీలు), చందర్‌మోహన్ (79 కేజీలు), ముకుల్ దహియా (86 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), జాంటీ కుమార్ (97 కేజీలు), దినేశ్ (125 కేజీలు). **పురుషుల గ్రీకోరోమన్:** నితిన్ (55 కేజీలు), సుమిత్ (60 కేజీలు), ఉమేశ్ (63 కేజీలు), నీరజ్ (67 కేజీలు), కుల్దీప్ (72 కేజీలు), సాగర్ (77 కేజీలు), రాహుల్ (82 కేజీలు), సునీల్ (87 కేజీలు), నితేశ్ (97 కేజీలు), ప్రేమ్ (130 కేజీలు). **మహిళల ఫ్రీస్టయిల్:** అంకుశ్ (50 కేజీలు), అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), నిషు (55 కేజీలు), నేహా శర్మ (57 కేజీలు), ముస్కాన్ (59 కేజీలు), మనీషా భన్వాలా (62 కేజీలు), మోనిక (65 కేజీలు), మాన్సి లాథర్ (68 కేజీలు), జ్యోతి (72 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు).

సెమీస్‌లో పోర్చుగల్



లిస్బన్: నేషన్స్ లీగ్ టోర్నమెంట్‌లో పోర్చుగల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. డెన్మార్క్‌తో జరిగిన రెండో అంచె క్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్ 5-2 గోల్స్ తేడాతో గెలిచింది. తొలి అంచె క్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్ చేతిలో ఒక గోల్ తేడాతో ఓడిన పోర్చుగల్ ఈ మ్యాచ్‌లో స్పష్టమైన విజయాన్ని అందుకుంది. నిర్ణీత సమయం ముగిసేసరికి పోర్చుగల్ 3-2తో గెలిచింది. అయితే గోల్స్ సగటు 3-3తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు అదనపు సమయం ఆడించారు. అదనపు సమయంలో పోర్చుగల్ మరో రెండు గోల్స్ సాధించింది.

హారికకు మూడో స్థానం



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ నాలుగో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్‌కు చెందిన ద్రోణవల్లి హారిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. 10 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీ సోమవారం ముగిసింది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత హారిక, మరియా ముజిచుక్ (ఉక్రెయిన్) 5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... హారికకు మూడో స్థానం, మరియా ముజిచుక్‌కు నాలుగో స్థానం ఖరారయ్యాయి. అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ 4 పాయింట్లతో ఏడో స్థానాన్ని సంపాదించింది. ఈ టోర్నీలో హారిక ఆరు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, రెండు గేమ్‌లలో గెలిచి, ఒక గేమ్‌లో ఓడిపోయింది. ఆరు పాయింట్లతో అనా ముజిచుక్, జు జినెర్ (చైనా) సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... అనా ముజిచుక్‌కు టైటిల్ ఖరారైంది. జు జినెర్ రన్నరప్‌తో సంతృప్తి పడింది.

అఖిల, విజయలక్ష్మిలకు పతకాలు





సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర 100 మీటర్లు, 400 మీటర్లు, జావెలిన్ త్రో మీట్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన క్రీడాకారిణులు కొర్రా అఖిల, నేనావత్ విజయలక్ష్మి ఆకట్టుకున్నారు. కొల్లూరులోని గాడియం స్పోర్టోపియా స్కూల్‌లో సోమవారం ఈ మీట్ జరిగింది. మహిళల జావెలిన్ త్రోలో అఖిల పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. అఖిల జావెలిన్‌ను 33.62 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచింది. విజయలక్ష్మి (16.85 మీటర్లు) రజత పతకం దక్కించుకోగా... జర్పుల రాజేశ్వరి (మంచిర్యాల; 16.41 మీటర్లు) కాంస్య పతకాన్ని సాధించింది. 400 మీటర్ల విభాగంలో విజయలక్ష్మి రజత పతకం కైవసం చేసుకుంది. విజయలక్ష్మి 1ని:09.03 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన పంచాల శ్రేయ (1ని:04.1 సెకన్లు) టాప్ ర్యాంక్‌లో నిలిచి బంగారు పతకాన్ని అందుకుంది. పురుషుల 400 మీటర్ల విభాగంలో ఇస్లావత్ నితిన్ నాయక్ (హైదరాబాద్; 48.99 సెకన్లు) రజతం దక్కించుకోగా... హైదరాబాద్‌కు చెందిన తరుణ్ కుమార్ రాజు (48.67 సెకన్లు) స్వర్ణ పతకాన్ని సాధించాడు. నల్లగొండకు చెందిన రాహుల్ (50.39 సెకన్లు) కాంస్య పతకాన్ని గెలిచాడు. అఖిల, విజయలక్ష్మి, నితిన్ నాయక్ హయత్‌నగర్‌లోని అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్‌లో కోచ్ నేనావత్ వినోద్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

న్యూజిలాండ్.. మళ్లీ సాధించింది

2026 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత • 16 ఏళ్ల తర్వాత మళ్లీ మెగా ఈవెంట్ బరిలోకి

ఆక్లాండ్: మరో అవకాశం కోసం వేచి చూడకుండా... అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... న్యూజిలాండ్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు దర్జాగా ప్రపంచకప్ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. 10 దేశాలు పోటీపడ్డ ఓసియానియా జోన్ నుంచి 2026 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందిన తొలి జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది. సోమవారం జరిగిన ఓసియానియా జోన్ ఫైనల్లో న్యూజిలాండ్ 3-0 గోల్స్ తేడాతో న్యూ కాలడోనియా జట్టుపై గెలిచింది. న్యూజిలాండ్ తరఫున మైకేల్ జోసెఫ్ బాక్సల్ (61వ నిమిషంలో), బార్సరూసెస్ (66వ నిమిషంలో), హెన్రీ జస్ట్ (80వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఫైనల్లో ఓడిపోయిన న్యూ కాలడోనియా జట్టుకు ప్రపంచకప్ బెర్త్ దక్కించుకునే మరో అవకాశం మిగిలి ఉంది. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర, మధ్య, దక్షిణ అమెరికా జోన్‌లకు చెందిన ఆరు జట్లు పోటీపడే ఇంటర్ కాంటినెంటల్ ప్లే ఆఫ్ టోర్నీలో విజేతగా నిలిస్తే న్యూ కాలడోనియా జట్టు కూడా ప్రపంచకప్‌కు అర్హత పొందుతుంది. 2026లో ప్రపంచకప్ టోర్నీకి అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఆతిథ్య దేశాల హోదాలో అమెరికా, కెనడా, మెక్సికో ఇప్పటికే ప్రపంచకప్‌కు అర్హత పొందగా... జపాన్, న్యూజిలాండ్ ఈ మూడు జట్లతో చేరాయి. వందేళ్ల చరిత్ర కలిగిన ప్రపంచకప్ టోర్నీలో న్యూజిలాండ్ పోటీపడనుండటం ఇది మూడోసారి. తొలిసారి 1982లో వరల్డ్‌కప్‌లో ఆడిన న్యూజిలాండ్ రెండోసారి 2010 ప్రపంచకప్‌లో పోటీపడింది. ఆ తర్వాత 2014, 2018, 2022 ప్రపంచకప్ టోర్నీలకు న్యూజిలాండ్ అర్హత సాధించడంలో విఫలమైంది.



డంపర్ ట్రక్కు బీభత్సం



డెహ్రాడూన్: డంపర్ ట్రక్కు ఢీకొట్టడంతో ఓ కారు రూపు ఇలా మారిపోయింది. అందులోని ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్-డెహ్రాడూన్ హైవేపైనున్న లచ్చివాలా టోల్ ప్లాజా వద్ద సోమవారం ఉదయం 7.3 0గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. అదుపుతప్పి వేగంగా దూసుకువచ్చిన ఈ డంపర్ ట్రక్కు ప్లాజా వద్ద వరుసగా ఆగి ఉన్న మూడు కార్లను వెనుక నుంచి ఢీకొట్టింది. ఒక కారు ఇలా ఇనుప స్తంభాన్ని గుద్దుకుని ఇలా నుజ్జవగా మరో రెండు కార్లలోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసేందుకు పోలీసులు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. తెహ్రిలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఉద్యోగులైన వీరిద్దరూ విధులకు వెళ్తూ ఇలా ప్రమాదం బారినపడ్డారు. అతివేగం, ట్రక్కు బ్రేకులు ఫెయిలవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు.

తుర్కియేలో తీవ్ర ఉద్రిక్తత

ప్రతిపక్ష నేత ఇమామోగ్లు అరెస్టుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనలు



ఇస్తాంబుల్‌లో ఆందోళనకారులపై వాటర్ కెనన్లను ప్రయోగిస్తున్న పోలీసులు

ఇస్తాంబుల్: అవినీతి ఆరోపణలతో ప్రతిపక్ష నాయకుడు ఎక్రెమ్ ఇమామోగ్లు అరెస్టుతో తుర్కియేలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆయనకు మద్దతుగా వేలాది మంది ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చారు. ఇమామోగ్లును అదుపులోకి తీసుకున్న నాటి నుంచి ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి ఇస్తాంబుల్ సిటీ హాల్ వద్ద గుమిగూడిన జనం తుర్కియే జెండాలు ఎగరవేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రభుత్వం నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువును, రబ్బరు పెల్లెట్లను, పెప్పర్‌స్ప్రేని ప్రయోగించింది. మొత్తంగా తుర్కియేలోని 81 ప్రావిన్సుల్లో కనీసం 55 ప్రావిన్సుల్లో, దేశంలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 1,133 మందికి పైగా అరెస్టులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆందోళనల్లో 123 మంది పోలీసులు గాయపడ్డారని వెల్లడించారు.

జర్నలిస్టుల అరెస్టు..

మరోవైపు సోమవారం పలువురు జర్నలిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎనిమిది మంది రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టులను ప్రభుత్వం నిర్బంధించిందని జర్నలిస్టు యూనియన్ తెలిపింది. ఇది పత్రికా స్వేచ్ఛ, సత్యాన్ని తెలుసుకునే ప్రజల హక్కుపై దాడి చేయడమేనని, జర్నలిస్టులను మౌనంగా ఉంచి నిజాన్ని దాచలేరని పేర్కొంది. వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అవాంతరాలు..

ఇమామోగ్లును అరెస్టు చేసినా.. 2028 అధ్యక్ష అభ్యర్థి ఎంపిక కోసం ఆదివారం ఓటింగ్ జరిగింది. అధ్యక్ష అభ్యర్థిగా ఇమామోగ్లు ఒక్కరే పోటీ చేశారు. అధ్యక్ష అభ్యర్థి ఎన్నికల్లో దాదాపు కోటిన్నర మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని సీహెచ్‌పీ తెలిపింది. సుమారు పది లక్షలకు పైగా ఓట్లు తమ సభ్యుల నుంచి రాగా, మిగిలినవి ఇమామోగ్లుకు సంఘీభావంగా తమ సభ్యులు కానివారు వేసినవని సీహెచ్‌పీ వెల్లడించింది. ఈ అరెస్టు ఇమామోగ్లు అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకోలేదు. అభియోగాలు రుజువైతే మాత్రం అతను ఎన్నికల్లో పోటీ చేయలేరు. ఇదిలావుండగా, అవకతవకల కారణంగా ఇమామోగ్లు డిగ్రీని రద్దు చేస్తున్నట్లు ఇస్తాంబుల్ విశ్వవిద్యాలయం ప్రకటించింది. అధ్యక్ష పదవిని నిర్వహించడానికి ఉన్నత విద్యను పూర్తి చేసి ఉండాలని తుర్కియే రాజ్యాంగం చెబుతోంది. ఇదే జరిగితే.. అధ్యక్ష పదవికి పోటీ చేయడం కూడా ప్రశ్నార్థకం అవుతుంది. అయితే ఇమామోగ్లు డిగ్రీ రద్దు నిర్ణయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం, యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌లో అప్పీల్ చేస్తామని ఇమామోగ్లు న్యాయవాదులు తెలిపారు.

రాజకీయ ప్రతీకారంతోనే అరెస్టు : ఇమామోగ్లు

అవినీతి ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా రాజకీయనాకులు, జర్నలిస్టులు వ్యాపారవేత్తలను మొత్తంగా 100 మందిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సీహెచ్‌పీ) నేత ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఉగ్రవాద సంస్థతో సంబంధాలు, లంచాలు తీసుకోవడం, దోపిడీ, చట్టవిరుద్ధంగా వ్యక్తిగత డేటాను నమోదు చేయడం, టెండర్ రిగ్గింగ్ వంటి అభియోగాలపై అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిలివ్రీలోని జైలుకు రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఇమామోగ్లును మేయర్ పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు తుర్కియే అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

నాగ్‌పూర్ అల్లర్ల నిందితుడి ఇల్లు నేలమట్టం

హైకోర్టు ఆగ్రహం, అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరిక

నాగ్‌పూర్: నాగ్‌పూర్ హింసాకాండ ప్రధాన నిందితుడు ఫహీమ్ ఖాన్ రెండంతస్తుల ఇంటిని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎమ్‌సీ)అధికారులు కూల్చేశారు. మరో నిందితుడు యూసుఫ్ షేక్ ఇంట్లో ఓ భాగాన్ని కూడా అక్రమ కట్టడమంటూ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. కాగా, కూల్చివేతలపై బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కూల్చివేత ప్రారంభమైన కొద్ది గంటల్లో విచారణ చేపట్టిన జస్టిస్ నితిన్ సాంబ్రే, జస్టిస్ వృశాలి జోషీలతో కూడిన ధర్మాసనం పనులు నిలిపేయాలని స్టే ఇచ్చింది. కూల్చివేత చట్టవిరుద్ధంగా జరిగిందని తేలితే, నష్టానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ధర్మాసనం సూచించింది. వివరణ ఇచ్చేందుకు యజమానులకు అవకాశమెందుకు ఇవ్వలేదని ఎన్ఎమ్‌సీని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం, ఎన్ఎమ్‌సీ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. అయితే.. కోర్టు జోక్యానికి ముందే ఖాన్ ఇంటిని కూల్చివేయగా, ఆ ఆదేశాల మేరకు అధికారులు షేక్ ఇంట్లో కూల్చివేత పనులను నిలిపివేశారు.

హైకోర్టు విచారణకు ముందే..

సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో మూడు జేసీబీ యంత్రాలతో యశోధర నగర్ ప్రాంతంలోని సంజయ్ బాగ్ కాలనీలో ఉన్న ఖాన్ ఇంటికి ఎన్ఎమ్‌సీ అధికారులు చేరుకున్నారు. భారీ భద్రత, డ్రోన్ నిఘా మధ్య కూల్చివేత చేపట్టారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పూర్తిగా మూసివేశారు. అనంతరం మహల్ ప్రాంతంలోని జోహ్రీపురాలో ఉన్న షేక్ ఇంట్లో బాల్కనీని అక్రమంగా నిర్మించారంటూ తొలగించే ప్రయత్నం చేశారు. ఈలోపు హైకోర్టు ఉత్తర్వులు రావడంతో పనులను నిలిపేశారు.

24 గంటల ముందు నోటీసులు..

ఇంటి ప్లాన్‌కు ఆమోదం లేకపోవడం, నిర్మాణంలో లోపాల కారణంగా 24 గంటల ముందే ఖాన్‌కు ఎన్ఎమ్‌సీ నోటీసులు జారీ చేసింది. కూల్చివేతల విషయంలో 15 రోజుల ముందే ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలుంటాయని కూడా సుప్రీం స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించినా, కూల్చివేతకు కోర్టు ఆదేశించినా ఈ ఆదేశాలు వర్తించవని సుప్రీంకోర్టు తెలిపింది.

నాగ్‌పూర్ అల్లర్లు..

ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఔరంగజేబు సమాధిని తొలగించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల్లో మతపరమైన శాసనాలతో కూడిన 'చాదర్'ను తగలబెట్టారని పుకార్లు వ్యాపించడంతో మార్చి 17న నాగ్‌పూర్‌లో హింస చెలరేగింది. ఈ ఘర్షణల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో రాళ్లు రువ్వడం, నిప్పంటించడంతో ముగ్గురు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులు సహా 33 మంది పోలీసులు గాయపడ్డారు. ఈ హింసాకాండకు సంబంధించి 100 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మైనారిటీ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) నేత ఫహీమ్‌ఖాన్‌నూ అరెస్టు చేసి.. దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఎండీపీ నగర అధ్యక్షుడైన ఫహీంఖాన్ ప్రస్తుతం జైలులో ఉన్నారు.

నోటీసిచ్చి 24 గంటల్లో కూల్చేస్తారా?

ప్రయాగ్‌రాజ్‌లో ఇళ్ల కూల్చివేతపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ: ఇంటిని కూల్చేస్తామంటూ నోటీసు ఇచ్చిన 24 గంటల్లోపే బుల్డోజర్‌తో ఇంటిని కూల్చేస్తున్న ఘటనలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. నిబంధనలను పాటిస్తూనే ఇళ్ల కూల్చివేత ప్రక్రియను యోగి ఆదిత్యనాథ్ సర్కార్ కొనసాగిస్తోందని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి చేసిన వాదనలను జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాల సుప్రీంకోర్టు ధర్మాసనం తప్పుబట్టింది. 2023లో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన గ్యాంగ్‌స్టర్ పొలిటీషియన్ అతీఖ్ అహ్మద్‌కు చెందినదిగా భావిస్తున్న ప్రయాగ్‌రాజ్ నగరంలోని భవనాలను అధికారులు కూల్చేశారు. దీనిపై జుల్ఫికర్ హైదర్ అనే న్యాయవాది, ప్రొఫెసర్ అలీ అహ్మద్, ఇద్దరు వితంతువులు, మరో వ్యక్తి అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. గ్యాంగ్‌స్టర్‌విగా భావించి మా ఇళ్లను కూల్చేశారని బాధితులు కేసు వేశారు. అయితే ఈ కేసును అలహాబాద్ హైకోర్టు కొట్టేయడంతో వాళ్లంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ''ఇళ్లను నిర్దయగా కూల్చేయడం చూస్తుంటే మాకే షాకింగ్‌గా ఉంది. కూల్చివేతకు అనుసరించిన విధానం సైతం షాకింగ్‌కు గురిచేస్తోంది. మార్చి ఆరో తేదీ రాత్రి నోటీసులు ఇచ్చి మరుసటి రోజే కూల్చేస్తారా?. ఇలాంటి పద్ధతిని న్యాయస్థానాలు ఏమాత్రం అంగీకరించవు. ఒక్క కేసులో వీటిని పట్టించుకోకుండా ఉన్నామంటే ఇక ఇదే కూల్చివేతల ధోరణి కొనసాగుతుంది. నోటీసులు అందుకున్నాక బాధితులు వాటిపై అప్పీల్ చేసుకునే అవకాశం కూడా అధికారులు ఇవ్వలేదు. 24 గంటల్లోపు భవనాలను కూల్చేశారు. ఈ కేసులో తిరిగి ఇంటిని నిర్మించుకుంటామని బాధితులు కోరితే అందుకు మేం అనుమతిస్తాం. అయితే కేసు తుదితీర్పు వాళ్లకు వ్యతిరేకంగా వస్తే బాధితులే ఆ కొత్త ఇళ్లను నేలమట్టం చేయాల్సి ఉంటుంది''అని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. దీనిపై ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వాదించారు. ''లీజు గడువు దాటాక అక్రమంగా ఆ నివాసస్థలాల్లో పిటిషనర్లు ఉంటున్నారు. వాస్తవానికి 2020 డిసెంబర్‌లో తొలిసారి, 2021 జనవరి, మార్చి నెల ఆరో తేదీన నోటీసులు ఇచ్చారు. తర్వాతే కూల్చారు''అని వాదించారు. దీనిపై జడ్జి అభ్యంతరం వ్యక్తం చేశారు. ''గతంలో సాధారణ రీతిలో నోటీసులు ఇచ్చారు. చట్టప్రకారం రిజిస్టర్ పోస్ట్‌లో పంపాలి. అలాకాకుండా మామూలుగా పంపేసి, చివరి నోటీసు మాత్రం రిజిస్టర్ పోస్ట్‌లో పంపించి వెంటనే కూల్చేస్తారా?''అని ధర్మాసనం నిలదీసింది. మళ్లీ ఇంటి నిర్మాణాల విషయంలో అఫిడవిట్ సమర్పించేందుకు పిటిషనర్లను అనుమతిస్తూ కేసు విచారణను న్యాయస్థానం వాయిదావేసింది.

'క్రికెట్' నినాదాలతో కూల్చేశారు

గత నెల ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ ఆట సందర్భంగా భారత వ్యతిరేక నినాదాలు చేశారంటూ ఎఫ్ఐఆర్ నమోదుచేసి తమ ఇల్లు కూల్చారంటూ కితాబుల్లా హమీదుల్లా ఖాన్ వేసిన పిటిషన్‌పై స్పందన తెలపాలని మహారాష్ట్ర సర్కార్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం ఆదేశించింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని, ఈ అంశంలో సర్కార్‌పై, మాల్‌వాన్ మున్సిపల్ కౌన్సిల్ అడ్మినిస్ట్రేటర్‌లపై ఉల్లంఘన కేసు నమోదుచేయాలని బాధితుడు సుప్రీంకోర్టును కోరాడు. అయితే ఎఫ్ఐఆర్ నమోదుచేసి సింధుదుర్గ్ జిల్లాలో పాతసామాను దుకాణం, ఇల్లు రెండూ అక్రమ నిర్మాణాలని పేర్కొంటూ అధికారులు ఫిబ్రవరి 24న వాటిని కూల్చేశారు. భారతవ్యతిరేక నినాదాలు చేశాడంటూ తొలుత పిటిషనర్‌తోపాటు అతని 14ఏళ్ల కుమారుడిని అరెస్ట్‌చేసి తర్వాత కుమారుడిని వదిలేశారు. తర్వాత భార్యాభర్తలను అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. ఈ సమయంలోనే ఇల్లు, దుకాణం కూల్చేశారు.

ఆర్‌జీ కర్ ఘటనకు ముందే... ట్రామాలో బాధితురాలు!

కోల్‌కతా: దేశాన్ని కుదిపేసిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి హత్యాచార బాధితురాలైన ట్రెయినీ వైద్యురాలు ఆ ఘటనకు ముందు నుంచే తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడినట్టు మోహిత్ రణ్‌దీప్ అనే సైకియాట్రిస్టు తెలిపారు. ఆస్పత్రిలో జరిగే అవకతవకలతో పాటు సుదీర్ఘ పనివేళలు, షిఫ్టుల కేటాయింపులో వివక్ష వంటివి ఆమెను తీవ్ర ఇబ్బందులకు, ఒత్తిళ్లకు లోను చేసినట్టు వివరించారు. ఆయన సోమవారం ఒక బెంగాలీ టీవీ చానల్‌తో మాట్లాడారు. ''హత్యాచారోదంతానికి నెల ముందు ఆమె నన్ను సంప్రదించింది. ఒక్కోసారి వరుసగా 36 గంటలపాటు డ్యూటీ చేయాల్సి వచ్చేదని వాపోయింది. అందరికీ అలాగే వేస్తారా అని అడిగితే లేదని చెప్పింది. వీటికి తోడు ఆస్పత్రికి అవసరమయ్యే వైద్య పరికరాలు, ఔషధాల కొనుగోలులో భారీ అవకతవకలు ఆమెను ఎంతగానో కలతకు గురిచేశాయి. తనకు పలు సలహాలిచ్చా. ఆమె మరోసారి కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉండగా ఆలోపే ఘోరానికి బలైపోయింది''అంటూ ఆవేదన వెలిబుచ్చారు. ఇందుకు సంబంధించి సీబీఐ ముందు వాంగ్మూలమిచ్చేందుకు కూడా సిద్ధమన్నారు. గత ఆగస్టు 9న ఆస్పత్రి సెమినార్ హాల్లోనే ఆమె అత్యాచారానికి, హత్యకు గురవడం తెలిసిందే. ఈ ఘటనలో సంజయ్ రాయ్ అనే పౌర వలెంటీర్‌ను దోషిగా కోర్టు నిర్ధారిస్తూ అతనికి జీవితఖైదు విధించింది. ఈ ఘోరం వెనక పలువురు పెద్దల హస్తముందని బాధితురాలి తల్లిదండ్రులు, తోటి వైద్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో అవకతవకల్ని ప్రశ్నించినందుకే ఆమెపై కక్ష కట్టినట్టు చెబుతున్నారు.

పెళ్లితో భార్యకు భర్త యజమాని కాడు

అతను ఆమె నమ్మకాన్ని, గౌరవాన్ని పోగొట్టాడు

- ఇంటిమేట్ వీడియో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై హైకోర్టు ఆగ్రహం
- క్రిమినల్ కేసు కొట్టేయాలంటూ భర్త వేసిన పిటిషన్ తిరస్కరణ

ప్రయాగ్‌రాజ్: భార్య తనతో ఉన్న ఇంటిమేట్ వీడియోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పెళ్లి చేసుకోగానే భార్యకు భర్త యజమాని అయిపోడని వ్యాఖ్యానించింది. అతనిపై క్రిమినల్ కేసు కొట్టేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చింది. 'ఇంటిమేటెడ్ వీడియోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసి దరఖాస్తుదారుడు (భర్త) వివాహ బంధానికున్న పవిత్రతను ఉల్లంఘించారు. భార్య తనపై ఉంచిన నమ్మకాన్ని పోగొట్టారు. భార్య గౌరవాన్ని కాపాడలేకపోయారు. ఇలాంటి కంటెంట్‌ను షేర్ చేయడం భార్యాభర్తల మధ్య బంధాన్ని నిర్వచించే గోప్యతను ఉల్లంఘించడమే అవుతుంది.

ఈ నమ్మక ద్రోహం వైవాహిక బంధం పునాదినే దెబ్బతీస్తుంది'అని విచారణ సందర్భంగా జస్టిస్ వినోద్ దివాకర్ వ్యాఖ్యానించారు. భార్య అంటే భర్తకు కొనసాగింపు కాదని, తనకంటూ సొంత హక్కులు, కోరికలు, ఉన్న వ్యక్తని ఆయన పేర్కొన్నారు. తామిద్దరూ సాన్నిహిత్యంతో ఉన్న వీడియోలను తన భర్త మొబైల్‌లో చిత్రీకరించి, తనకు తెలియకుండా ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశాడని, తరువాత బంధువులు, గ్రామస్తులతో పంచుకున్నాడంటూ మీర్జాపూర్ జిల్లాలో ప్రద్యుమ్న యాదవ్ అనే వ్యక్తిపై అతని భార్య కేసు నమోదు చేసింది. తాను ఆమె భర్త కాబట్టి అది నేరం కాదని, తనపై మోపిన క్రిమినల్ కేసులను కొట్టేయాలని ప్రద్యుమ్న కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. భార్యాభర్తల మధ్య రాజీ కుదిరే అవకాశం ఉంది కాబట్టి.. కేసును కొట్టేయాలంటూ ఆయన తరపు న్యాయవాది సైతం వాదించారు. ఫిర్యాదుదారు చట్టబద్ధంగా వివాహం చేసుకున్న భార్య అయినప్పటికీ, ఆమెను అశ్లీల వీడియో తీసి బంధువులకు, గ్రామస్తులకు పంపే హక్కు భర్తకు లేదని కోర్టు తేల్చి చెప్పింది.

మహూ ఘటనలో ఐదుగురికి యావజ్జీవం

మహూ: ఆర్మీ ట్రెయినీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై గ్యాంగ్ రేప్ కేసులో మధ్యప్రదేశ్ కోర్టు ఐదుగురు దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. గతేడాది సెప్టెంబర్ 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో మహూలోని మహూ-మండలేశ్వర్ రహదారి పక్కన జామ్ గేట్ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. గ్యాంగ్ రేప్ బాధితురాలికి రూ.50 వేలు, మిగతా బాధితులకు రూ.10వేల చొప్పున చెల్లించాలని దోషులను ఆదేశిస్తూ నాలుగో అదనపు సెషన్స్ జడ్జి రవిశంకర్ డొహ్రె సోమవారం తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంధ్యా ఉయికె చెప్పారు. ఈ ఘటనలో ఆరో నిందితుడు మైనర్ అయినందున జువెనైల్ కోర్టులో విచారణ చేపడతారన్నారు. స్థానిక ఇన్‌ఫాంట్రీ స్కూల్‌లో శిక్షణలో ఉన్న ఆర్మీ అధికారులు ఇద్దరు తమ స్నేహితురాళ్లతో కలిసి జామ్‌గేట్ వద్దకు వచ్చారు. అకస్మాత్తుగా అక్కడికి చేరుకున్న దుండగులు వీరిని పిస్టల్ చూపి బెదిరించి కర్రలతో తీవ్రంగా కొట్టారు. సెల్‌ఫోన్లతోపాటు వారివద్ద ఉన్నదంతా లాగేసుకుని, రూ.10వేల ఇవ్వాలని బెదిరించారు. ఒక అధికారి, అతడి స్నేహితురాలిని డబ్బులు తెమ్మని అక్కడి నుంచి పంపించివేశారు. మరో అధికారిని కొట్టి, అతడి స్నేహితురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరుసటి రోజు ఘటనపై బడ్‌గోండా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. మొత్తం ఐదు నెలల 12 రోజుల్లో కోర్టు తీర్పు వెలువడిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివరించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌కు పెత్తనమిస్తే దేశం నాశనమే: రాహుల్

న్యూఢిల్లీ: విద్యా వ్యవస్థపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)కు పెత్తనమిస్తే దేశం సర్వనాశనమవుతుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీల మధ్య సైద్ధాంతిక, విధానపరమైన చిన్నచిన్న విభేదాలు ఉండొచ్చని, దేశ విద్యా విధానం విషయంలో మాత్రం అవి ఎన్నడూ రాజీపడబోవని తేల్చి చెప్పారు. 'దేశ విద్యా విధానాన్ని, భవిష్యత్తును నాశనం చేయాలని ఒక సంస్థ కోరుకుంటోంది. ఆ సంస్థ పేరే ఆర్‌ఎస్‌ఎస్. వీళ్ల చేతుల్లోకి విద్యా వ్యవస్థ వెళితే, వాస్తవానికి ఇప్పటికే నెమ్మదిగా ఇది జరుగుతోంది, ఈ దేశం నాశనమవుతుంది. అప్పుడిక ఎవరికీ ఉద్యోగాలు దక్కవు. దేశం పని ఖతమయిపోతుంది'అని నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా సోమవారం ఇండియా కూటమి అనుబంధ విద్యార్థి సంఘం జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ అన్నారు. 'ఇప్పటికే దేశంలోని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లలో ఎక్కువ మంది ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లే అనే విషయాన్ని విద్యార్థి సంఘాలు విద్యార్థులకు తెలియజెప్పాలి. రానున్న రోజుల్లో ఆర్‌ఎస్‌ఎస్ చెప్పిన వాళ్లకే వర్సిటీల వీసీ పదవులు దక్కుతాయి. మనం దీనిని అడ్డుకోవాలి'అని పిలుపునిచ్చారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించి ప్రధాని మోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని డిమాండ్ చేశారు. అన్ని వనరులను అదానీ, అంబానీలకు అప్పగించడం, అన్ని వ్యవస్థలపైనా ఆర్‌ఎస్‌ఎస్‌కు పెత్తన మివ్వడమే బీజేపీ ప్రభుత్వ విధానమని మండిపడ్డారు.

మత ఆధార చట్టాలు చేసేది బీజేపీయే: ఖర్గే

న్యూఢిల్లీ: కాంట్రాక్టుల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాజ్యసభ నేత జేపీ నడ్డా, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అసత్యాలతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకునేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అసలు మత ప్రాతిపదికన చట్టాలు చేస్తున్నది బీజేపీ ప్రభుత్వమే తప్ప, కాంగ్రెస్ కాదని ఎదురు దాడికి దిగారు. ఇటువంటి అంశాలను చర్చకు తెచ్చి హడావుడి చేస్తూ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇటీవల న్యాయ వ్యవస్థకు సంబంధించి బయటకు వచ్చిన ఒక కేసుపై ప్రతిపక్షాలను మాట్లాడకుండా చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్, ఇతర పార్టీలన్నీ 1994లోనే ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని ఆయన గుర్తు చేశారు. ప్రధాని మోదీ తన సొంత రాష్ట్రంలో ముస్లింను ఓబీసీ జాబితాలో చేర్చారన్నారు. కాంగ్రెస్‌కు పేరు రావడం ఇష్టం లేకనే బీజేపీ 30 ఏళ్లుగా ఉన్న చట్టాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తోందని ఖర్గే మండిపడ్డారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీ దానిని పరిరక్షించి తీరుతుందని స్పష్టం చేశారు.

సభ సాగడం ప్రభుత్వానికి ఇష్టం లేదు: ప్రియాంక

లోక్‌సభ సజావుగా కొనసాగడం ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుగా కనిపిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. అందుకే, అధికారపక్షం ఏదో ఒక మిషతో సభలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ వాయిదాలు పడుతున్న నేపథ్యంలో ఆమె సోమవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడారు. ముస్లింలకు కాంట్రాక్టుల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరిస్తామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు.

పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి

మహారాష్ట్ర అసెంబ్లీ తీర్మానం

ముంబై: సంఘ సంస్కర్తలు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని మహారాష్ట్ర అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఏకగ్రీవ తిర్మానాన్ని ఆమోదించింది. మంత్రి జయకుమార్ రావల్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ఎన్సీపీ ఎమ్మెల్యే ఛగన్ భుజ్‌బల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ్ వడెట్టివార్ మద్దతుగా మాట్లాడారు. మహాత్మ బిరుదుతో పూలేను ప్రజలు గుర్తించారని, భారతరత్న రాష్ట్రానికి గుర్తింపని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడం పట్ల ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సంతోషం వ్యక్తం చేశారు. ఆమోదించిన శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ సంఘ సంస్కర్తలకు దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇవ్వడం ప్రజల మనోభావాలను గౌరవించడమేనని, ఇది ప్రతిష్ఠను పెంచుతుందని వ్యాఖ్యానించారు. ఈ తీర్మానం ప్రగతిశీల, సంస్కరణవాద మహారాష్ట్ర ఖ్యాతిని పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా వారు చేసిన కృషి, సేవను అజిత్ పవార్ కొనియాడారు. కాగా, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిలకు భారతరత్న ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనూ కోరింది. కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు అప్పుడు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ 2018 ఆగస్టులో ప్రకటించారు.

జాతీయ స్థాయికి డీలిమిటేషన్ ఉద్యమం: స్టాలిన్

చెన్నై: లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై తమిళనాడు సారథ్యంలో చేపట్టిన అవగాహన ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రభావం చూపిందని సీఎం ఎంకే స్టాలిన్ చెప్పారు. సోమవారం ఆయన రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. డీలిమిటేషన్‌ను న్యాయబద్ధంగా చేపట్టాలంటూ 22న చెన్నైలో జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం కోరిందన్నారు. త్వరలో రాష్ట్ర ఎంపీలంతా ప్రధాని మోదీని కలిసి ఇదే విషయాన్ని వివరిస్తారని ఆయన వెల్లడించారు. తమిళనాడులోని 39 మంది ఎంపీలు అధికార డీఎంకే, మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలకు చెందిన వారే కావడం గమనార్హం. 1971 జన గణన ఆధారంగానే పునర్వ్యవస్థీకరణ జరపాలని కేంద్రాన్ని కోరుతూ 22న జరిగిన సమావేశం తీర్మానం చేయడం తెలిసిందే.

థాయ్ ప్రధానిపై అవిశ్వాస తీర్మానం

రేపు పార్లమెంట్‌లో బలపరీక్ష

బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్ ప్రధానమంత్రిగా ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టిన పెటొంగ్‌టర్న్ షినవత్రపై ప్రతిపక్షాలు సోమవారం పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాయి. తన తండ్రి, మాజీ ప్రధాని థక్సిన్ షినవత్ర కనుసన్నల్లో పని చేస్తూ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ పెటొంగ్‌టర్న్‌పై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కుటుంబ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తూ దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రయత్నించడం లేదని, పెరిగిన అవినీతి, నేరాలు, గాలి కాలుష్యం వంటి అంశాలను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నాయి. అయితే, పార్లమెంట్‌లో అధికార ఫ్యూ థాయ్ పార్టీ, మిత్రపక్షాలదే పైచేయి కావడంతో ఈ మొట్టమొదటి అవిశ్వాస తీర్మానాన్ని ఆమె సునాయాసంగా ఎదుర్కొంటారని పరిశీలకులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న వివాదాస్పద నేత థక్సిన్ షినవత్ర 2006లో జరిగిన సైనిక తిరుగుబాటులో దేశాన్ని విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయి ఇటీవలే తిరిగి వచ్చారు.

ప్రభావవంతంగా వ్యవహరించారు

జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టల ఉదంతంలో సీజేఐను పొగిడిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు జడ్జి యశ్వంత్ ఇంట్లో అగ్నిప్రమాదంవేళ కరెన్సీ కట్టలు వెలుగుచూసిన ఉదంతంలో సంబంధిత వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో బహిర్గతం చేసి ఈ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రభావవంతంగా, అత్యంత పారదర్శకంగా వ్యవహరించారని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పొగిడారు. రాజ్యసభలో అధికారపక్ష నేత జేపీ నడ్డా, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గేలతో సోమవారం ధన్‌ఖడ్ తన ఛాంబర్‌లో ఉదయం 11.30గంటలకు సమావేశమయ్యారు. సీజేఐ ఆదేశానుసారంగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీ అంతర్గత విచారణ ప్యానెల్ నివేదిక వచ్చేదాకా ఈ అంశంలో వేచిచూసే ధోరణి అవలంభించాలని ధన్‌ఖడ్, నడ్డా, ఖర్గేలు నిర్ణయించారు. కరెన్సీ కట్టల అంశాన్ని మార్చి 21న రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు జైరాంరమేశ్ లేవనెత్తిన విషయం తెల్సిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ న్యాయనియామకాల కమిషన్ చట్టం(ఎన్‌జేఏసీ) కొట్టేస్తూ 2015 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలనాత్మక తీర్పును ధన్‌ఖడ్ మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెల్సిందే. తాజాగా జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలు భయటపడడంతో న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం, ఎన్‌జేఏసీ చట్టంపై ఖర్గే సూచించినట్లుగా త్వరలో రాజ్యసభలో పలు పార్టీల పక్షనేతలతో సమావేశం ఏర్పాటుచేస్తానని ధన్‌ఖడ్ చెప్పారు.

దేశంలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి ఏది?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత సమాఖ్య విశిష్ట లక్షణాలు- కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలు

1. భారత సమాఖ్య ఏ విధంగా ఏర్పడింది?
ఎ) కేంద్రం,రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా
బి)రాష్ట్రాలు కేంద్రంలో విలీనమవడం ద్వారా
సి) ఎ, బి డి) ఏదీకాదు
2. కింది వాటిలో భారత సమాఖ్య విశిష్ట లక్షణం ఏది?
ఎ) ఏక కేంద్ర లక్షణాలు ఉన్న సమాఖ్య
బి) సమాఖ్య లక్షణాలు ఉన్న ఏక కేంద్రం
సి) బలమైన రాష్ట్రాలున్న సమాఖ్య
డి) అర్ధ సమాఖ్య
3. మొదటిసారిగా భారతదేశంలో సమాఖ్య వ్యవస్థను ఎప్పుడు ప్రతిపాదించారు?
ఎ) 1950 బి) 1947 సి) 1935 డి) 1946
4. కింది వాటిలో సరికానిది ఏది?
ఎ) కేంద్ర జాబితా - 97 అంశాలు
బి) రాష్ట్ర జాబితా - 66 అంశాలు
సి) ఉమ్మడి జాబితా - 46 అంశాలు
డి) అవశిష్ట జాబితా - 52 అంశాలు
5. కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ఏ అంశాన్ని మున్సిపల్ సంబంధంగా పేర్కొంటారు?
ఎ) రాష్ట్ర శాసన సంబంధమైన విషయాల్లో కేంద్రం నియంత్రణ
బి) రాష్ట్ర ఆర్థిక విషయాల్లో కేంద్రం నియంత్రణ
సి) రాష్ట్ర పరిపాలనలో కేంద్ర నియంత్రణ
డి) పైవన్నీ
6. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని సమాఖ్య విరుద్ధ లక్షణం ఏది?
ఎ) అఖిల భారత సర్వీసులు
బి) ఏకీకృత న్యాయవ్యవస్థ
సి) అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇవ్వడం
డి) పైవన్నీ
7. కింది వాటిలో ఉమ్మడి జాబితాలోని అంశం ఏది?
ఎ) క్రిమినల్ లా బి) సాంఘిక భద్రత
సి) ఆర్థిక, సాంఘిక ప్రణాళికలు
డి) పైవన్నీ
8. సాధారణ పరిస్థితుల్లో పార్లమెంటు రాష్ట్ర జాబితాలో ఎప్పుడు చట్టాలు చేస్తుంది?
ఎ) రెండు రాష్ట్ర శాసనసభలు తీర్మానం ద్వారా కోరినప్పుడు
బి) రాజ్యసభ ప్రత్యేక తీర్మానం ద్వారా అవసరాన్ని గుర్తించినప్పుడు
సి) అంతర్జాతీయ ఒప్పందాలను అమలు చేసే సందర్భంలో
డి) పైవన్నీ
9. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) అవశిష్ట అధికారాలు - ప్రకరణ 248
బి) అంతర్రాష్ట్ర నదీజలాల ట్రిబ్యునల్ - ప్రకరణ 262
సి) అంతర్రాష్ట్ర మండలి - ప్రకరణ 263
డి) ఆర్థిక సంఘం - ప్రకరణ 249
10. సమాఖ్యకు ఎలాంటి రాజ్యాంగం ఉండాలి?
ఎ) లిఖిత బి) అలిఖిత
సి) దృఢ
డి) ఏ తరహా రాజ్యాంగమైనా ఉండవచ్చు
11. కేంద్రం ఇచ్చే ఆదేశాలను రాష్ట్రాలు పాటించకపోతే ఎన్నో నిబంధన ప్రకారం రాష్ట్రాలపై చర్య తీసుకోవచ్చు?
ఎ) 257 బి) 356
సి) 365 డి) పైవన్నీ
12. 'భారతదేశం సమాఖ్య లక్షణాలున్న ఏక కేంద్రం కానీ, ఏక కేంద్ర లక్షణాలున్న సమాఖ్య కాదు' అని పేర్కొన్నది ఎవరు?
ఎ) ఐవర్ జెన్నింగ్స్ బి) బి.ఆర్.అంబేద్కర్
సి) కె.సి. వేర్ డి) ఎవరూకాదు
13. జోనల్ కౌన్సిళ్ల (ప్రాంతీయ మండలాలు)ను ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు?
ఎ) జోనల్ కౌన్సిల్స్ చట్టం
బి) రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం
సి) స్టేట్ కౌన్సిల్ చట్టం
డి) ఏదీకాదు
14. జోనల్ కౌన్సిళ్లకు ఉమ్మడి అధ్యక్షుడిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ప్రధానమంత్రి బి) రాష్ట్రపతి
సి) కేంద్ర హోం మంత్రి
డి) ఉప రాష్ట్రపతి
15. విద్యుచ్ఛక్తి ఏ జాబితాలో ఉంది?
ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా
సి) ఉమ్మడి జాబితా డి) అవశిష్ట జాబితా
16. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమీక్షించడానికి తమిళనాడు ప్రభుత్వం 1969లో నియమించిన కమిటీ ఏది?
ఎ) సర్కారియా కమిటీ
బి) రాజమన్నార్ కమిటీ
సి) సంతానం కమిటీ
డి) ఏదీకాదు
17. ఆర్థిక సంఘానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) ఇందులో నలుగురు సభ్యులు ఉంటారు
బి) ఈ సంఘం దాని సిఫారసులను రాష్ట్రపతికి సమర్పిస్తుంది
సి) ఈ సంఘానికి సలహా విధులు మాత్రమే ఉంటాయి
డి) పైవన్నీ
18. మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షులు ఎవరు?
ఎ) కె.సి. నియోగి బి) కె. సంతానం
సి) కె. బ్రహ్మానందరెడ్డి డి) ఎస్.కె.పి. సాల్వే
19. కింది వాటిలో కేంద్రం విధిస్తే రాష్ట్రాలు వసూలు చేసి, రాష్ట్రాలే తీసుకునే పన్ను ఏది?
ఎ) స్టాంప్ డ్యూటీ బి) ఎక్సైజ్ డ్యూటీ
సి) కార్పొరేషన్ డ్యూటీ డి) పైవన్నీ
20. కింది వాటిలో సమాఖ్య విరుద్ధమైన సంస్థ ఏది?
ఎ) ప్రణాళికా సంఘం
బి) జాతీయ అభివృద్ధి మండలి
సి) అంతర్రాష్ట్ర మండలి
డి) ప్రాంతీయ మండలాలు
21. ఈశాన్య మండలాన్ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1956 బి) 1971 సి) 1972 డి) 1975
22. భారత సమాఖ్యను 'సహకార సమాఖ్య'గా అభివర్ణించింది ఎవరు?
ఎ) గ్రాన్విల్ ఆస్టిన్ బి) పి.జి. నెహ్రూ
సి) కె.సి.వేర్
డి) డాక్టర్ రాజేంద్రప్రసాద్
23. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలో చేర్చిన అంశం ఏది?
ఎ) విద్య బి) అడవులు
సి) కుటుంబ నియంత్రణ
డి) పైవన్నీ
24. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్.ఎస్.సర్కారియా కమిషన్‌ను ఎప్పుడు నియమించింది? అది నివేదికను ఎప్పుడు సమర్పించింది?
ఎ) 1983, 1988 బి) 1984, 1989
సి) 1983, 1986 డి) 1985, 1990
25. కేంద్రం నుంచి రాష్ట్రాలకు లభించే ప్రణాళికా సహాయం ఏ ఫార్ములా ఆధారంగా బదిలీ అవుతుంది?
ఎ) గాడ్గిల్ ఫార్ములా బి) లక్డావాలా
సి) ఉన్నతన్ డి) సెతల్‌వాద్
26. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా విధించే పన్ను ఏది?
ఎ) అమ్మకం పన్ను బి) ఆదాయం పన్ను
సి) ఎక్సైజ్ డ్యూటీ డి) ఏదీకాదు
27. కేంద్రమే విధించి, కేంద్రమే వసూలు చేసి, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
ఎ) ప్రకటనలపై పన్ను
బి) రైల్వే చార్జీలపై పన్ను
సి) అంతర్రాష్ట్ర రవాణాపై పన్ను
డి) పైవన్నీ
28. కింది వాటిలో కేంద్రం, రాష్ట్రాల మధ్య విభజితమయ్యే పన్ను ఏది?
ఎ) సెంట్రల్ ఎక్సైజ్
బి) ఆదాయం పన్ను
సి) కార్పొరేషన్ పన్ను
డి) ఎ, బి
29. కింది వాటిలో ప్రత్యక్ష పన్ను కానిది ఏది?
ఎ) ఆదాయం పన్ను బి) కార్పొరేషన్ టాక్స్
సి) సంపద పన్ను డి) సెంట్రల్ ఎక్సైజ్
30. కేంద్ర ప్రణాళిక సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1950 బి) 1952 సి) 1953 డి) 1954
31. జాతీయ అభివృద్ధి మండలిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1952 బి) 1962 సి) 1972 డి) 1982
32. కింది వాటిలో ప్రధానమంత్రి దేనికి అధ్యక్షులుగా వ్యవహరిస్తారు?
ఎ) నీతి ఆయోగ్
బి) జాతీయ సమగ్రతా మండలి
సి) జాతీయ రక్షణ మండలి
డి) పైవన్నీ
33. దేశంలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి ఏది?
ఎ) పార్లమెంటు
బి) జాతీయ అభివృద్ధి మండలి
సి) ప్రణాళికా సంఘం
డి) ఏదీకాదు
34. కింది వాటిలో సమాఖ్య ముఖ్య లక్షణం ఏది?
ఎ) అధికార పృథక్కరణ
బి) అధికార విభజన
సి) అధికార బదలాయింపు
డి) పైవన్నీ
35. కింది వాటిలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన కమిటీ ఏది?
ఎ) ఆర్.ఎస్. సర్కారియా
బి) రాజమన్నార్
సి) ఎం.ఎం. పూంఛీ కమిషన్
డి) పైవన్నీ
36. కింది వాటిలో నీతి ఆయోగ్ విధి కానిది?
ఎ) పంచవర్ష ప్రణాళికలు రూపొందించడం
బి) దేశంలో మానవ వనరులు, ఇతర వనరులను అంచనా వేయడం
సి) రాష్ట్ర ప్రణాళికలను ఆమోదించడం
డి) ప్రణాళికా అమలును సమీక్షించడం
37. కేంద్ర, రాష్ట్రాల అధికార విభజనకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి ఉపయోగించే సూత్రాలను ఏమంటారు?
ఎ) డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్
బి) డాక్ట్రిన్ ఆఫ్ ఇంప్లైడ్ పవర్స్
సి) డాక్ట్రిన్ ఆఫ్ హార్మోనియస్ కన్‌స్ట్రక్షన్
డి) పైవన్నీ
38. ప్రభుత్వ విత్తంపై పార్లమెంటు నియంత్రణ చేసే పద్ధతి ఏది?
ఎ) బడ్జెట్
బి) అనుమతి ఉపక్రమణ బిల్లు
సి) ఆర్థిక బిల్లు
డి) పైవన్నీ
39. కేంద్ర సంఘటిత నిధి నుంచి నిధులను తీసుకోవడానికి ఎవరు ప్రతిపాదన చేయాల్సి ఉంటుంది?
ఎ) రాష్ట్రపతి బి) పార్లమెంటు
సి) కేంద్ర ఆర్థిక మంత్రి
డి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
40. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు కింది వాటిలో దేనిపై ఆధారపడతాయి?
1. రాజ్యాంగ ప్రకరణలు
2. సంప్రదాయాలు, వాడుకలు
3. న్యాయస్థానాల వ్యాఖ్యానాలు
4. సంప్రదింపులు, చర్చలు
ఎ) 1, 2, 3, 4 బి) 1, 2, 3
సి) 3, 4 డి) 1, 3, 4
41. కింద పేర్కొన్న ఏ కమిషన్ కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను సమీక్షించలేదు?
ఎ) ఎం.ఎన్.పూంఛీ బి) రాజమన్నార్
సి) సర్కారియా డి) దంత్‌వాలా
42. కింది వాటిలో రాష్ట్ర జాబితాలోకి రాని అంశం ఏది?
ఎ) శాంతి భద్రతలు
బి) మైనింగ్ సి) జైళ్లు
డి) క్రిమినల్ ప్రొసీజర్స్
43. కింది వాటిలో కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలకు కారణం కాని అంశం ఏది?
ఎ) గవర్నర్ల నియామకం
బి) రాష్ట్రపతి పాలన
సి) గ్రాంట్ల మంజూరు
డి) అఖిల భారత సర్వీసులు
44. సహకార సమాఖ్య అంటే...?
ఎ) రాష్ట్రాల ప్రాధాన్యతలు గుర్తించడం
బి) కేంద్రంపై ఆధారపడటం
సి) రాష్ట్రాలు అడిగిన సహాయాన్ని కేంద్రం అందించడం
డి) పరస్పర ఆధార, ప్రాధాన్యాలు
45. సహకార సమాఖ్యను పెంపొందించే రాజ్యాంగ ప్రకరణ ఏది?
ఎ) ప్రకరణ 252 బి) ప్రకరణ 258
సి) ప్రకరణ 258ఎ డి) పైవన్నీ
46. కేంద్ర బడ్జెట్ లోక్‌సభలో తిరస్కారం పొందితే..?
ఎ) బడ్జెట్‌ను మార్పు చేసి తిరిగి ప్రవేశపెడతారు
బి) కేంద్ర ఆర్థిక మంత్రి రాజీనామా చేస్తారు
సి) ప్రధాన మంత్రి, మంత్రిమండలి రాజీనామా చేయాలి
డి) రాష్ట్రపతి నిర్ణయం మేరకు పరిస్థితి ఉంటుంది
47. రాజ్యాంగంలో ప్రస్తావించకుండా.. తర్వాతి కాలంలో అమల్లోకి వచ్చిన పన్ను ఏది?
ఎ) కార్పొరేట్ టాక్స్
బి) సర్వీస్ టాక్స్
సి) గిఫ్ట్ టాక్స్ డి) పైవన్నీ
48. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) అడవులు - ఉమ్మడి జాబితా
బి) క్రీడలు - రాష్ట్ర జాబితా
సి) ప్రజారోగ్యం - రాష్ట్ర జాబితా
డి) లాటరీలు - ఉమ్మడి జాబితా
49. భారత సమాఖ్య ఒక..?
ఎ) అర్ధ సమాఖ్య బి) విశిష్ట సమాఖ్య
సి) కేంద్రీకృత సమాఖ్య
డి) పైవేవీ కాదు
50. కింది వాటిలో భారత సమాఖ్యలోని ఏక కేంద్ర లక్షణం ఏది?
ఎ) అఖిల భారత సర్వీసులు
బి) గవర్నర్ల నియామకం
సి) అత్యవసర అధికారాలు
డి) పైవన్నీ

సమాధానాలు

1) బి;	2) ఎ;	3) సి;	4) డి;	5) సి;
6) డి;	7) డి;	8) డి;	9) డి;	10) సి;
11) సి;	12) సి;	13) బి;	14) సి;	15) సి;
16) బి;	17) డి;	18) ఎ;	19) ఎ;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) డి;	24) ఎ;	25) ఎ;
26) డి;	27) డి;	28) డి;	29) డి;	30) ఎ;
31) ఎ;	32) డి;	33) బి;	34) బి;	35) డి;
36) డి;	37) డి;	38) డి;	39) బి;	40) ఎ;
41) డి;	42) డి;	43) డి;	44) డి;	45) డి;
46) సి;	47) డి;	48) డి;	49) బి;	50) డి.

పిన్‌వార్మ్ శాస్త్రీయ నామం ఏమిటి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ


మాదిరి ప్రశ్నలు

1. 'ద్వినామీకరణం'ను మొదట ప్రతిపాదించింది ఎవరు?
1) గాస్పర్డ్ బాహిన్ 2) కరోలిస్ లిన్నేయస్
3) డికండోల్ 4) థియోఫ్రాస్టస్
2. ద్వినామీకరణాన్ని బాగా ప్రాచుర్యంలోకి తెచ్చింది ఎవరు?
1) గాస్పర్డ్ బాహిన్ 2) కరోలిస్ లిన్నేయస్
3) హచిన్‌సన్ 4) తక్తజాన్
3. ప్రజాతి, జాతి పేర్లు రెండూ ఒకటే ఉంటే.. వాటిని ఏమని పిలుస్తారు?
1) సిన్‌టైప్ 2) పారాటైప్
3) టాటోనిమ్ 4) టోపోటైప్
4. కింది వాటిలో టాటోనిమ్స్‌కు ఉదాహరణ?
1) యాక్సిస్ యాక్సిస్
2) గాలస్ గాలస్
3) నాజా నాజా 4) పైవన్నీ
5. మచ్చల జింక టాటోనిమ్?
1) గాలస్ గాలస్ 2) గొరిల్లా గొరిల్లా
3) రాటస్ రాటస్
4) యాక్సిస్ యాక్సిస్
6. తెలంగాణ రాష్ట్ర పుష్పం ఏది?
1) కమలం 2) తామర
3) తంగేడు 4) చామంతి
7. జీవ వైవిధ్యం అనే పదాన్ని మొదట ఎవరు ప్రతిపాదించారు?
1) విల్సన్ 2) వాల్టర్ రోసెన్
3) పీటర్స్ 4) కార్ల్ ఎరికే
8. ప్రపంచంలోని 34 హాట్‌స్పాట్ (జీవ వైవిధ్య సున్నిత ప్రదేశాలు)లలో భారత్‌లో ఉన్న హాట్‌స్పాట్?
1) తూర్పు హిమాలయాలు
2) పశ్చిమ కనుమలు
3) 1, 2 4) ఏదీకాదు
9. జీవ వైవిధ్యంలో ప్రథమ స్థానంలో బ్రెజిల్ ఉంది. ఈ అంశంలో భారత్ స్థానం ఎంత?
1) 4 2) 6 3) 7 4) 10
10. ప్రమాద స్థితిలో ఉండి, అంతరించిపోతున్న జాతుల గురించి పొందుపరిచే పుస్తకాన్ని ఏమంటారు?
1) వైట్ డేటా బుక్ 2) గ్రీన్ డేటా బుక్
3) ఎల్లో డేటా బుక్ 4) రెడ్ డేటా బుక్
11. 'జీవ వైవిధ్య దినోత్సవం'గా ఎప్పుడు పాటిస్తారు?
1) డిసెంబర్ 1 2) జూన్ 10
3) మే 22 4) సెప్టెంబర్ 30
12. జాతీయ జలచర జంతువు (ఆక్వాటిక్ యానిమల్) ఏది?
1) ఆక్టోపస్ 2) రివర్ డాల్ఫిన్
3) బ్లూ వేల్ 4) టర్టిల్
13. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా గుర్తించిన జంతు జాతి పేరు తెలంగాణ క్రాబ్ స్పైడర్. దీన్ని మొదట ఏ జిల్లాలో గుర్తించారు?
1) వరంగల్ 2) కరీంనగర్
3) రంగారెడ్డి 4) ఆదిలాబాద్
14. ప్రపంచంలో ఆపదలో ఉన్న 100 జంతు జాతుల్లో భారతదేశానికి చెందినవి 4 ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన జాతి ఏది?
ఎ. గూటీ టారంటలా సాలీడు
బి. బట్టమేక పక్షి సి. కంగారు
1) ఎ, బి, సి 2) ఎ, సి
3) ఎ మాత్రమే 4) ఎ, బి
15. జీవ సాంకేతిక శాస్త్రం (బయోటెక్నాలజీ) పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
1) జాన్ కోల్ రీటర్ 2) కార్ల్ ఎరికే
3) బులాక్ 4) వాక్స్‌మన్
16. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఒక శిలీంధ్రం నుంచి సంశ్లేషణ చేసిన సూక్ష్మజీవ నాశక ఔషధం ఏది?
1) స్ట్రెప్టోమైసిన్ 2) ఎరిత్రోమైసిన్
3) పెన్సిలిన్ 4) ఆక్సీటెట్రాసైక్లిన్
17. వైరస్ వల్ల వ్యాధిగ్రస్థమైన సకశేరుకాల (అతిథేయి) కణం ఉత్పత్తి చేసే ప్రోటీన్లను ఏమంటారు?
1) హార్మోన్లు 2) ఎంజైమ్‌లు
3) ఇంటర్‌ఫెరాన్స్ 4) ఎబిజైమ్‌లు
18. కణజాల వర్ధనం అనే భావన ప్రవేశపెట్టింది ఎవరు?
1) హప్ మిస్టర్ 2) హాబర్ లాంట్
3) హన్‌స్టెయిన్ 4) హన్నింగ్
19. అర్ధ ఘన యానకాన్ని తయారుచేయడానికి కావలసిన పదార్థం?
1) అగార్-అగార్ 2) జిగురు
3) రెజిన్ 4) పిండి పదార్థం
20. పోషక యానకాన్ని సూక్ష్మజీవరహితం చేయడానికి ఉపయోగించే సాధనం ఏది?
1) ఆల్ట్రాసెంట్రిఫ్యూజ్
2) ఆటోక్లేవ్ 3) ఇనాక్యులేషన్ చాంబర్
4) మైక్రోటోమ్
21. కణజాల వర్ధనంలో ఏర్పడిన విభేదనం లేని కణాల సమూహాన్ని ఏమంటారు?
1) కాలోజ్ 2) కైమీర స్థితి
3) కాలస్ 4) ఎంబ్రియాయిడ్
22. సోడియం ఆల్జినేట్‌తో గుళికలుగా మార్చిన శాఖీయ పిండాలను ఏమంటారు?
1) అనిషేక ఫలాలు
2) సంశ్లేషిత లేదా కృత్రిమ విత్తనాలు
3) సంకర విత్తనాలు
4) ఆనృత ఫలాలు
23. కణజాల వర్ధనం ద్వారా కలిగే ప్రయోజనం ఏమిటి?
1) తక్కువ కాలంలో, తక్కువ ప్రదేశంలో మిలియన్లకొద్దీ మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు
2) కాండాగ్రవర్ధనం ద్వారా వైరస్ తెగులు సోకని మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు
3) కణజాల వర్ధనం ద్వారా కేవలం స్త్రీ మొక్కలను మాత్రమే ఉత్పత్తి చేయవచ్చు
4) పైవన్నీ
24. జీవ కీటకనాశినులకు ఉదాహరణ?
1) బాసిల్లస్ థురెంజియెన్సిస్
2) బాసిల్లస్ స్ఫైరికస్
3) హిర్సుటెల్లా థాంసోసై
4) పైవన్నీ
25. గోల్డెన్ రైస్ సృష్టికర్త ఎవరు? *(DL-2011)*
1) ఇంగోపాట్రికస్
2) నార్మన్ బోర్లాగ్
3) పాల్ బెర్గ్ 4) ఎం.ఎస్. స్వామినాథన్
26. జన్యు పరివర్తన మొక్కలకు ఉదాహరణ?
1) బి.టి.వంకాయ 2) బి.టి.పత్తి
3) ఫ్లేవర్ సేవర్ టమాటా
4) పైవన్నీ
27. అంతరించిపోతున్న జీవులను పరిరక్షించడంలో భాగంగా సీసీఎంబీ లాకోన్స్‌ ఆధ్వర్యంలో IVF పద్ధతి ద్వారా సృష్టించిన జీవి?
1) మచ్చల జింక 2) కృష్ణజింక
3) డాలి 4) 1, 2
28. స్కాట్లాండ్ శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ ప్రపంచంలో మొదటిసారిగా (1997) క్లోనింగ్ ద్వారా 'డాలి' అనే గొర్రెపిల్లను సృష్టించాడు. అతడు ప్రయోగాలు చేసిన సంస్థ?
1) ఎన్‌డీఆర్‌ఐ, కర్నాల్
2) సియోల్ నేషనల్ యూనివర్సిటీ
3) రోసెలిన్ ఇన్‌స్టిట్యూట్
4) UAE
29. 'సరోగేట్ మదర్' అంటే అర్థమేమిటి?
1) గర్భం ధరించిన స్త్రీ
2) గర్భాశయాన్ని 9 నెలలు అద్దెకిచ్చే స్త్రీ
3) నెలలు నిండిన స్త్రీ
4) ఏదీకాదు
30. శిలాజాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
1) పేలియో బోటనీ
2) పేలియో జువాలజీ
3) పేలియంటాలజీ
4) పేలినాలజీ
31. పేరమీషియం ఏ ఆకారంలో ఉంటుంది?
1) ఏనుగు చెవి ఆకారం
2) స్థూపాకారం 3) గంట ఆకారం
4) కాలి చెప్పు ఆకారం
32. ఈజిప్టులోని పిరమిడ్లను ఫొరామినిఫెరా జీవుల అస్థిపంజరాల ($CaCO_3$)తో నిర్మించారు. ఈ జీవులు ఏ వర్గానికి చెందుతాయి?
1) ప్రోటోజోవా 2) పొరిఫెరా
3) సీలెంటరేటా 4) అనెలిడా
33. అమీబాలో విసర్జక అవయవాలేవి?
1) సంకోచ రిక్తికలు 2) ఆహార రిక్తికలు
3) మొప్పలు 4) ట్రాకియా
34. స్పంజికల దేహకుడ్యంలో అధికంగా ఉండేవి?
1) జెమ్యూల్స్ 2) ప్రరోహాలు
3) రంధ్రాలు 4) ఆస్కులమ్
35. 'మృతుడి వేలు' (డెడ్ మ్యాన్స్ ఫింగర్) అని ఏ స్పంజికను పిలుస్తారు?
1) యూప్లెక్టెల్లా 2) యూస్పాంజియా
3) చలైనా 4) క్లయోనా
36. స్థానబద్ధ జాతికి చెందిన జీవి ఏది? **(Gr-II, 2003)**
1) తాచుపాము 2) ఆవు
3) స్పంజికలు 4) గుర్రం
37. కణజాల స్థాయికి ఎదిగిన మొట్టమొదటి బహుకణ, ద్విస్తరిత జీవులేవి?
1) ప్రోటోజోవా 2) సీలెంటరేటా
3) పొరిఫెరా 4) అనెలిడా
38. ఆంథోజోవన్ల ఎండిన బాహ్య అస్థిపంజరాన్ని ఏమంటారు?
1) స్కెలిటన్ 2) ఎక్సోస్కెలిటన్
3) ప్రవాళం/కోరల్స్ 4) బోన్ మ్యారో
39. కింది వాటిలో ఆభరణాల తయారీలో ఉపయోగపడే సముద్ర జీవి?
1) సముద్ర చేప 2) శైవలాలు
3) ప్రవాళాలు 4) జీవకణాలు
40. అతి పొడవైన ప్రవాళాలతో ఏర్పడిన గ్రేట్ బారియర్ రీఫ్ ఆస్ట్రేలియాలోని ఏ సముద్రంలో ఉంది?
1) ఆర్కిటిక్ 2) అంటార్కిటిక్
3) హిందూ మహాసముద్రం
4) పసిఫిక్ మహాసముద్రం
41. అనుకూల పరిస్థితుల్లో హైడ్రాలో జరిగే ప్రత్యుత్పత్తి విధానం?
1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుధావిచ్ఛిత్తి
3) కోరకీభవనం (బడ్డింగ్)
4) ఏదీకాదు
42. పల్టీలు కొట్టే చలనాన్ని చూపే జీవి ఏది?
1) వానపాము 2) కప్ప
3) హైడ్రా 4) చేప
43. నిడేరియా వర్గానికి చెందిన అరీలియా సాధారణ నామం?
1) జెల్లీ చేప 2) సీఫాన్
3) సీఫెన్ 4) మృతుడి వేలు
44. బద్దెపురుగు (టీనియా సోలియం)లో విసర్జక క్రియ నిర్వర్తించే అవయవం ఏది?
1) వృక్కాలు 2) కోక్సల్ గ్రంథులు
3) జ్వాలా కణం
4) బోత్రాయిడల్ కణజాలం
45. ప్లాటిహెల్మింథిస్ జీవులు సాధారణంగా ఏ రకమైనవి?
1) ఏసీలోమేట్లు 2) సూడో సీలోమేట్లు
3) సీలోమేట్లు 4) హీమోలింఫ్
46. ప్లాటీహెల్మింథిస్ జీవులు సాధారణంగా..?
1) గుండ్రటి పురుగులు
2) బల్లపరుపు పురుగులు
3) గుడ్డి పురుగులు
4) నులి పురుగులు
47. మచ్చల పందిమాంసం (మీస్లీ పోర్క్) కలిగి ఉండే బద్దెపురుగు డింభక దశ?
1) షట్కంటకి డింభకాలు
2) మైక్రో ఫైలేరియా 3) సిస్టీసర్కస్
4) ఫైలేరిఫార్మ్ డింభకం
48. నులి పురుగులు/కొంకి పురుగులు ఉండే వర్గం?
1) ప్రోటోజోవా 2) ప్లాటిహెల్మింథిస్
3) నిమాటి హెల్మింథిస్
4) అనెలిడా
49. పిన్‌వార్మ్ శాస్త్రీయ నామం ఏమిటి?
1) ఎంటరోబియస్ వర్మిక్యులారిస్
2) ఎన్‌కైలోస్టోమాడుయోడినేల్
3) వుచరేరియా బాన్‌క్రాఫ్టై
4) ఆస్కారిస్ లుంబ్రికాయిడిస్
50. మానవుడిలో బోదకాలు వ్యాధి కలుగజేసే మైక్రోఫైలేరియా డింభకాలు ఎక్కడ ఉంటాయి?
1) ప్లీహం 2) శోషరస నాళాలు
3) పరదీయ రక్తనాళాలు
4) 2, 3
51. ఆస్కారిస్ మాధ్యమిక అతిథేయి ఏది?
1) ఈగ 2) నత్త 3) నల్లి 4) ఉండదు
52. వర్మీకంపోస్ట్ అనేది ఒక..?
1) శీతల పానీయం
2) సబ్బు బ్రాండ్ నేమ్
3) వైరస్ 4) ఎరువు
53. 'ఫార్మర్స్ ఫ్రెండ్', 'ప్రకృతి నాగలి'గా ఏ జీవిని పేర్కొంటారు?
1) జలగ 2) వానపాము
3) బ్యాక్టీరియా 4) బొద్దింక
54. వానపాములో సంపర్కం సాధారణంగా ఏ సమయంలో జరుగుతుంది?
1) పగటిపూట 2) రాత్రిపూట
3) వర్షాకాలంలో రాత్రి
4) వేసవి రాత్రి
55. వానపాములో చలనానికి తోడ్పడే నిర్మాణాలేవి?
1) స్పర్శకాలు 2) కేసరాలు
3) శైలికలు 4) సీటములు (శూకాలు)
56. జలగ అనేది ఒక ..?
1) పరాన్నజీవి 2) బాహ్య పరాన్న జీవి
3) స్యాంగివోరస్ బాహ్య పరాన్నజీవి
4) ఏదీకాదు
57. ఏ జీవిలో బోట్రాయిడల్ కణజాలం బాగా అభివృద్ధి చెంది ఉంటుంది?
1) వానపాము 2) ఆఫ్రోడైట్
3) పెలాలో పురుగు 4) జలగ
58. కింది వాటిలో ఏ జీవి జీవసందీప్తిని ప్రదర్శిస్తుంది?
1) నీరిస్ 2) ఆఫ్రోడైట్
3) వానపాము 4) పెలాలో పురుగు

సమాధానాలు

1) 1;	2) 2;	3) 3;	4) 4;	5) 4;
6) 3;	7) 2;	8) 3;	9) 3;	10) 4;
11) 3;	12) 2;	13) 2;	14) 4;	15) 2;
16) 3;	17) 3;	18) 2;	19) 1;	20) 2;
21) 3;	22) 2;	23) 4;	24) 4;	25) 1;
26) 4;	27) 4;	28) 3;	29) 2;	30) 3;
31) 4;	32) 2;	33) 1;	34) 3;	35) 3;
36) 3;	37) 2;	38) 3;	39) 3;	40) 4;
41) 3;	42) 3;	43) 1;	44) 3;	45) 1;
46) 2;	47) 3;	48) 3;	49) 1;	50) 4;
51) 4;	52) 4;	53) 2;	54) 3;	55) 4;
56) 3;	57) 4;	58) 4.		

ఆడియో టేపులను దేనితో పూత పూస్తారు?



పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

విద్యుత్

1. ఎలక్ట్రికల్ బల్బుల్లో వాడే వాయువు?
   1) ఆక్సిజన్ 2) నైట్రోజన్
   3) హైడ్రోజన్ 4) కార్బన్ డై ఆక్సైడ్
2. ఎలక్ట్రిక్ బల్బును సీల్ చేయడానికి ఉపయోగించే పదార్థం?
   1) రాగి, 2) స్టీల్, 3) ఇత్తడి, 4) ప్లాటినం
3. విద్యుత్ తంతువులో ఉపయోగించే మూలకం ఏది?
   1) అల్యూమినియం 2) టంగ్స్టన్
   3) రాగి 4) ప్లాటినం
4. 'విద్యుద్విశ్లేష్య సిద్ధాంతాలు' ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
   1) న్యూటన్, 2) హెర్ట్జ్, 3) ఫారడే, 4) ఐన్‌స్టీన్
5. విద్యుచ్ఛక్తి ఎల్లప్పుడూ ఏ విధంగా ప్రయాణిస్తుంది?
   1) ఎక్కువ సంభావ్యం నుంచి తక్కువ సంభావ్యం ఉన్న వైపు
   2) తక్కువ సంభావ్యం నుంచి ఎక్కువ సంభావ్యం ఉన్న వైపు
   3) పైన పేర్కొన్న రెండు విధాలుగా
   4) పైవేవీ కావు
6. విద్యుత్ బల్బులోని ఫిలమెంట్ అధికంగా వేడెక్కుతుంది. కానీ ఫిలమెంట్‌కు ఆధారంగా ఉండే తీగలు మాత్రం చాలా తక్కువ వేడిగా ఉండటానికి కారణం?
   1) తక్కువ విద్యుత్ ప్రవహించడం
   2) చాలా తక్కువ నిరోధాన్ని కలిగి ఉండటం
   3) అధికంగా కరిగిపోయే స్థితి..
   4) నల్లని ఇనుముతో తయారు చేయడం వల్ల
7. కింది వాటిలో విద్యుచ్ఛక్తికి ఉత్తమ ఉదాహరణ?
   1) గ్లాస్ 2) ఎబోనైట్
   3) మానవ శరీరం 4) ప్లాస్టిక్
8. కంప్యూటర్‌లో ఉపయోగించే I.C. తయారీలో ఉపయోగించే మూలకం?
   1) సీసం 2) సిలికాన్
   3) క్రోమియం 4) బంగారం
9. విద్యుత్ వలయంలో కెపాసిటర్‌ను ఉపయోగించడానికి కారణం?
   1) ఓల్టేజ్‌ను తగ్గించడం
   2) ఓల్టేజ్‌ను పెంచడం
   3) విద్యుత్‌ను నిల్వ చేయడం
   4) విద్యుత్ ఉత్పత్తి చేయడం
10. రెండు బిందువుల మధ్య పొటెన్షియల్ భేదాన్ని దేనితో కొలుస్తారు?
    1) గాల్వనో మీటర్ 2) ఓల్ట్ మీటర్
    3) అమ్మీటర్ 4) స్పెక్ట్రోమీటర్
11. కృత్రిమంగా తయారు చేసిన ఉపగ్రహంలో విద్యుచ్ఛక్తికి ఆధారం?
    1) డైనమో 2) సౌర విద్యుద్ఘటం
    3) థర్మోపైల్
    4) చిన్న న్యూక్లియర్ రియాక్టర్
12. కింది వాటిలో భారతదేశంలో ఏ శక్తి నుంచి అధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది?
    1) థర్మల్ శక్తి 2) అణుశక్తి
    3) జలశక్తి 4) సంప్రదాయేతర శక్తి
13. వెలుతురు కోసం ప్రపంచంలో అత్యధికంగా కింది వాటిలో దేన్ని వాడుతున్నారు?
    1) టంగ్స్టన్ ఫిలమెంట్ బల్బ్
    2) ఫ్లోరోసెంట్ బల్బ్
    3) కాపర్ ఫిలమెంట్ బల్బ్ 4) ఫ్లడ్ లైట్
14. 60 వాట్‌ల బల్బ్‌లో ఉండే తీగకు ఎక్కువగా ఉపయోగించే లోహం?
    1) అల్యూమినియం 2) టైటానియం
    3) టంగ్స్టన్ 4) నికెల్
15. 'డైనమో'ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) ఎల్. స్టీఫెన్‌సన్ 2) జెడ్. జాన్సన్
    3) ఆర్. డీజిల్ 4) ఫారడే
16. విద్యుత్ ప్రవాహాన్ని ఏ ప్రమాణాల్లో కొలుస్తారు?
    1) ఆంపియర్, 2) ఓల్ట్స్
    3) ఓమ్స్ 4) న్యూటన్
17. విద్యుత్ ప్రవాహ విలువను కొలవడానికి ఉపయోగించే పరికరం?
    1) అమ్మీటర్ 2) ఓల్ట్‌మీటర్
    3) పొటెన్షియో మీటర్ 4) రియోస్టాట్
18. డైనమో నియమాన్ని వివరించినవారు?
    1) సర్ హంప్రిడేవి 2) ఫారడే
    3) ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 4) మాక్స్‌ప్లాంక్
19. అత్యుత్తమ విద్యుత్ వాహకం?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) సోలార్
20. విద్యుత్ బల్బులో నైట్రోజన్‌ను నింపడానికి కారణం?
    1) గాలి కంటే తేలికైంది
    2) దీపానికి మరింత వెలుగు వచ్చేలా చేస్తుంది
    3) దహన చర్యకు దోహదపడదు
    4) ఒక నాన్ టాక్సిక్
21. సాధారణంగా వాడే ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్‌పై రాసి ఉండే విలువ?
    1) 220 K 2) 273 K
    3) 600 K 4) 6500 K
22. కింది వాటిలో విద్యుత్ శక్తికి అంతగా ఉపయోగపడని మూలకం?
    1) సల్ఫర్ 2) బ్రోమిన్
    3) సెలీనియం 4) ఫాస్ఫరస్
23. ఎలక్ట్రిక్ తీగల తయారీలో రాగిని ఉపయోగించడానికి కారణం?
    1) త్వరగా కరుగదు
    2) ఎక్కువ కాలం మన్నికగా ఉంటుంది
    3) రాగిలో ఎలక్ట్రాన్లు అందుబాటులో ఉంటాయి
    4) మంచి థర్మల్ కండక్టివిటీ కలిగి ఉంటుంది
24. కింది వాటిలో ఫ్యూజ్ వైర్‌కు ఉండాల్సిన లక్షణం?
    1) అధిక నిరోధక శక్తి, అధిక ద్రవీభవన స్థానం
    2) అల్ప నిరోధక శక్తి, అధిక ద్రవీభవన స్థానం
    3) అధిక నిరోధక శక్తి, అల్ప ద్రవీభవన స్థానం
    4) అల్ప నిరోధక శక్తి, అల్ప ద్రవీభవన స్థానం
25. సాధారణంగా ఎలక్ట్రిక్ హీటర్‌లో ఉపయోగించే పదార్థం ఏది?
    1) స్టీల్ 2) యురేనియం
    3) నిక్రోమ్ 4) కాపర్
26. డ్రైసెల్‌లో ఎలాంటి శక్తి ఉంటుంది?
    1) విద్యుదయస్కాంత శక్తి
    2) విద్యుత్ శక్తి 3) యాంత్రికశక్తి
    4) రసాయనిక శక్తి
27. కాంతి విద్యుత్ ఘటాల్లో శక్తి ఏ విధంగా రూపాంతరం చెందుతుంది?
    1) కాంతి శక్తి ధ్వని శక్తిగా మారుతుంది
    2) కాంతి శక్తి ఉష్ణ శక్తిగా మారుతుంది
    3) కాంతి శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది
    4) పైవన్నీ
28. సౌర విద్యుత్ ఘటాలను దేనితో తయారు చేస్తారు?
    1) బంగారం 2) సిలికాన్
    3) వెండి 4) అల్యూమినియం
29. కంప్యూటర్ పరిభాషలో RAM అంటే?
    1) రాండమ్ ఆక్సెస్ మెమొరీ
    2) రాండమ్ ఆక్సెంట్ మెమొరీ
    3) రాండమ్ ఆక్సెస్ మెషిన్
    4) రాండమ్ ఆక్సెస్ మూవ్‌మెంట్
30. కంప్యూటర్ మెమొరీని సాధారణంగా కిలోబైట్స్ లేదా మెగా బైట్స్‌లో కొలుస్తారు. బైట్ అంటే?
    1) ఎనిమిది బైనరీ డిజిట్స్
    2) ఎనిమిది డెసిమల్ డిజిట్స్
    3) రెండు బైనరీ డిజిట్స్
    4) రెండు డెసిమల్ డిజిట్స్
31. ఉష్ణాన్ని దేని ద్వారా విద్యుచ్ఛక్తిగా మారుస్తారు?
    1) ట్రాన్సిస్టర్ 2) తాపయుగ్మం
    3) ఫొటోసెల్ 4) ఓల్టామీటర్
32. విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త?
    1) పాస్కల్ 2) డార్విన్
    3) గెలీలియో 4) థామస్ ఆల్వా ఎడిసన్
33. టెలివిజన్ సంకేతాలు ఒక నియమిత దూరం నుంచి అందకపోవడానికి కారణం?
    1) సంకేతాలు బలహీనంగా ఉండటం
    2) బలహీన యాంటెన్నా
    3) సంకేతాలు గాలిలో కలిసిపోవడం
    4) భూమి వంపుగా ఉండటం
34. ఆడియో టేపులను దేనితో పూత పూస్తారు?
    1) అల్యూమినియం ఆక్సైడ్
    2) సిల్వర్ అయొడైడ్ 3) ఫెర్రిక్ ఆక్సైడ్
    4) పొటాషియం నైట్రేట్
35. ఒక ఫొటో విద్యుత్ ఘటం ఏ విధమైన మార్పును కలిగిస్తుంది?
    1) విద్యుచ్ఛక్తిని ఉష్ణ శక్తిగా మారుస్తుంది
    2) కాంతి శక్తిని శబ్ద శక్తిగా మారుస్తుంది
    3) విద్యుచ్ఛక్తిని కాంతి శక్తిగా మారుస్తుంది
    4) కాంతి శక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తుంది
36. టెలిఫోన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
    1) ఆల్ఫ్రెడ్ నోబెల్
    2) అలెగ్జాండర్ గ్రహంబెల్
    3) థామస్ అల్వా ఎడిసన్
    4) చార్లెస్ డార్విన్

కాంతి

- కాంతి ఏ తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది?
- విద్యుదయస్కాంత తరంగాల రూపంలో.
- శూన్యంలో కాంతి వేగం ఎంత?
- 3×10^{10} cm/ sec లేదా
  3×10^{8} m/ sec లేదా
  3×10^{5} km/ sec.
- వస్తువులను చూడటానికి ప్రధాన కారణమైన కాంతి ధర్మం ఏది?
- పరావర్తనం.
- కెలిడియోస్కోప్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
- కాంతి పరావర్తనం.
- పెరిస్కోప్‌లో ఉండే రెండు దర్పణాలు కాంతికి ఎంత కోణంతో అమరి ఉంటాయి?
- 45°
- సైనికులు కందకాల్లో దాగి శత్రువులను చూడటానికి ఉపయోగించే పరికరం ఏది?
- పెరిస్కోప్
- ఒక వ్యక్తి తన పూర్తి ప్రతిబింబాన్ని చూసుకోవాలంటే దర్పణం పొడవు కనీసం ఆ వ్యక్తి ఎత్తులో ఎంత ఉండాలి?
- సగం
- సమతలంగా ఉన్న దర్పణం ముందు మనం 5 మీ. దూరంలో ఉంటే ప్రతిబింబం దర్పణం వెనక ఎంత దూరంలో ఉంటుంది?
- 5 మీ. వ్యక్తికి, ప్రతిబింబానికి మధ్య ఉండే దూరం = 10 మీ.
- కాంతి ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణించేటప్పుడు సరిహద్దు వద్ద వంగి ప్రయాణించడాన్ని ఏమంటారు?
- వక్రీభవనం
- వక్రీభవనం అనే కాంతి ధర్మానికి నిత్యజీవితంలో కొన్ని ఉదాహరణలు?
- చేతి వేళ్లను నీటిలో ముంచినప్పుడు చిన్నగా కనిపించడం.
- పెన్సిల్‌ను నీటిలో సగం ముంచినప్పుడు వంగిపోయినట్లు కనిపించడం.
- బీకర్‌లో నీరు పోసినప్పుడు దానిలో ఉంచిన నాణెం పైకి లేచినట్లు కనిపించడం.
- నక్షత్రాలు మిణుకు మిణుకుమనడం.
- అక్షరాలపై గాజును ఉంచినప్పుడు అక్షరాలు పైకి లేచినట్లు కనిపించడం.

వివిధ రకాల పదార్థాలు - వక్రీభవన గుణకాలు

1) గాలి = 1; 2) నీరు = 1.33
3) గాజు = 1.5; 4) వజ్రం = 2.42
(వజ్రానికి అన్నింటి కంటే ఎక్కువ వక్రీభవన గుణకం ఉంటుంది).

- కాంతి ఏ ధర్మం వల్ల వజ్రం మెరుస్తుంది?
- సంపూర్ణాంతర పరావర్తనం.
- ఆప్టికల్ ఫైబర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
- డాక్టర్ నరేంద్రసింగ్ కపాని
- గోళీయ తలాలు ఉండే పారదర్శక వస్తువులను ఏమంటారు?
- కటకాలు
- సరళ సూక్ష్మదర్శినిగా పనిచేసే కటకం ఏది?
- కుంభాకార కటకం
- సరళ సూక్ష్మదర్శిని ప్రయోజనాలు ఏవి?
- 1) ప్రయోగశాలల్లో రీడింగులు తీసుకోవడానికి.
  2) చేతి గడియారాలు రిపేర్ చేసేవారు చిన్న చిన్న భాగాలు చూడటానికి
  గమనిక: సరళ సూక్ష్మదర్శినిలో ఒకే ఒక 'కుంభాకార కటకం' ఉంటుంది.
  సంయుక్త సూక్ష్మదర్శినిలో 'రెండు కుంభాకార కటకాలు' ఉంటాయి.
- సంయుక్త సూక్ష్మదర్శిని ప్రయోజనాలు ఏవి?
- 1) రక్త పరీక్ష కేంద్రాల్లో ఉపయోగిస్తారు.
  2) జంతు, వృక్ష ప్రయోగశాలల్లో కణాల పరిశీలనకు వినియోగిస్తారు.
  3) బ్యాక్టీరియా, వైరస్‌ల పరిశీలనలో వాడతారు.
- కొలతలు తీసుకోవడానికి ఉపయోగపడే అక్షికటకం ఏది?
- రామ్స్‌డన్
- కటక కేంద్రం నుంచి నాభి వరకు ఉండే దూరాన్ని ఏమంటారు?
- నాభ్యంతరం
- నాభ్యంతరం వ్యుత్క్రమాన్ని ఏమంటారు?
- కటక సామర్థ్యం

37. జె.ఎల్. బయర్డ్ కనుగొన్నది?
    1) డైనమైట్ 2) రేడియోధార్మిక శక్తి
    3) రేడియో 4) టెలివిజన్
38. రేడియోను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
    1) న్యూటన్ 2) గ్రాహం
    3) మార్కొని 4) ఆట్టోహన్
39. కంప్యూటర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) పాస్కల్ 2) బబేజ్
    3) టొరిసెల్లి 4) గెలీలియో
40. కంప్యూటర్‌లో CPU అంటే?
    1) కంప్యూటర్ ప్రాసెసింగ్ యూనిట్
    2) సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్
    3) కోర్ ప్రోగ్రామబుల్ యూనిట్
    4) కంట్రోల్ ప్లానింగ్ యూనిట్

సమాధానాలు

1) 2; 2) 4; 3) 2; 4) 3; 5) 1;
6) 2; 7) 3; 8) 2; 9) 3; 10) 2;
11) 2; 12) 1; 13) 1; 14) 3; 15) 4;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 3;
21) 4; 22) 3; 23) 4; 24) 3; 25) 3;
26) 4; 27) 3; 28) 2; 29) 1; 30) 1;
31) 2; 32) 4; 33) 4; 34) 3; 35) 4;
36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 2.

She was better suited for..

BANK EXAMS

GENERAL ENGLISH

PRONOUNS



Pronoun Subject *Vs* Pronoun Object:

The first step in tackling a pronoun question is to locate and identify any pronouns in the sentence.

Once you've found a pronoun in a Sentence Correction question, check whether it's acting as the SUBJECT or the OBJECT of the sentence or phrase. Let us look at an example and understand.

Example: *How could she blame you and he for the accident?*

The first step is to identify the pronoun(s). There are three in this sentence: "she," "you," and "he":

Next, try to define whether each pronoun is acting as a *subject* or *object*. Here, "she" is the subject, and the pronouns "you" and "he" are acting as the objects of the sentence:

How do we know this? Because "she" is doing the action (blaming) and "you" and "he" are receiving it (getting blamed). However, "he" does not seem to be in the correct form. "Who did she blame?" which is "him" not "he." (Who did she blame? She blamed *him.*)

The pronouns acting as objects must be in the objective case; as indicated above, "him" is objective - while "he," used in the first sentence, is subjective, and therefore incorrect.

Incorrect: *How could she blame you and he for the accident?*

Correct: *How could she blame you and him for the accident?*

Let's look at another example:

Example: *Her was better suited for the job.*

Here, the pronoun is the subject of the sentence, as "the job" is clearly not the subject, and there are no other nouns in the sentence. Because the pronoun stands in for "the woman" (some woman), the pronoun should be the *subject* form of her meaning, "she".

Incorrect: *Her was better suited for the job.*

Correct: *She was better suited for the job.*

Who *Vs* Whom:

If the pronoun is acting as a subject, use who. If it is acting as an object, use whom.

*I don't know **whom** Kavitha married.*

Why is "whom" correct? Because Kavitha is the subject of this sentence - not the person she married. To simplify who...whom questions, try rearranging the sentence into a question, and then answer it. Let's try it:

Question: *Whom did Kavitha marry?*

Answer: *Kavitha married him.*

You wouldn't say "Kavitha married he," right? Since the pronoun used in the answer is "him," an object pronoun, the pronoun in the original sentence should also be an object pronoun: whom.

Let us look at another example..

***Who** took out the paper?*

Because the sentence is already a question, you can't run the test as we did above. But not to worry: all you need to do is answer the question:

***He** took out the paper.*

You wouldn't say "him took out the paper," so the pronoun in the original sentence must match the form of the pronoun "he," which is a subject pronoun: *who* is correct.

Objects of to be verbs are in the subject form

Very simple: watch for pronouns following "to be" verbs such "It should have been," "It is," "It could have been," "It was", and make sure they are in subject form. This is another error common in speech; but it's easy to identify, and easy to fix.

Incorrect: *It must have been **her** who called.*

Correct: *It must have been **she** who called.*

"It must have been" is a "to be" verb, so the pronoun must be in subject form: "she," not "her".

Model Questions

Directions (Q. No. 1-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. He, I and you (1)/ want to (2)/ purchase (3)/ a yacht. (4)/ No error (5)
2. Myself (1)/ went to the office, (2)/ when they came (3)/ yesterday. (4)/ No error (5)
3. John and (1)/ Jane (2)/ dislike (3)/ one another. (4)/ No error (5)
4. Any of the two (1)/ criminals (2)/ might have cut (3)/ the window bars. (4)/ No error (5)
5. Neither of (1)/ the three teams (2)/ finished (3)/ their task. (4)/ No error (5)
6. This issue (1)/ is between (2)/ you (3)/ and I. (4)/ No error (5)
7. Let (1)/ him and (2)/ I (3)/ go. (4)/ No error (5)
8. The matter (1)/ is among (2)/ them (3)/ and I. (4)/ No error (5)
9. This is (1)/ Meena's house (2)/ who is (3)/ a doctor. (4)/ No error (5)
10. My friend was looking (1)/ for him lost keys (2)/ in (3)/ the hall. (4)/ No error (5)
11. The rich man (1)/ has a low opinion (2)/ on he (3)/ poor friends. (4)/ No error (5)
12. One has to (1)/ keep up appearances (2)/ for the sake of (3)/ respectability. (4)/ No error (5)
13. Stay away (1)/ from this (2)/ crumbling house, (3)/ its too dangerous. (4)/ No error (5)
14. A (1)/ true man (2)/ always keeps (3)/ to one's promise. (4)/ No error (5)
15. We (1)/ look forward (2)/ to meeting (3)/ he soon. (4)/ No error (5)
16. He got off (1)/ at Chennai (2)/ although his (3)/ had to go to Bengaluru. (4)/ No error (5)
17. The king (1)/ donated everything (2)/ him possessed (3)/ to the charity. (4)/ No error (5)
18. Him was feeling (1)/ so tired that (2)/ he gave up (3)/ reading the novel. (4)/ No error (5)
19. He insisted (1)/ on having (2)/ he (3)/ wages paid. (4)/ No error (5)
20. He came (1)/ as soon as (2)/ the letter (3)/ reached him. (4)/ No error (5)
21. Please hold on, (1)/ you (2)/ will connect you (3)/ to the director. (4)/ No error (5)
22. The boarders (1)/ must account for (2)/ you absence (3)/ from the rooms at night. (4)/ No error (5)
23. The poor man (1)/ got away (2)/ from the three men (3)/ who were holding he. (4)/ No error (5)
24. He (1)/ came across (2)/ you lost cousin (3)/ in New York. (4)/ No error (5)
25. My roommate (1)/ had a quarrel (2)/ with (3)/ her parents. (4)/ No error (5)

Key:

1) 1 2) 1 3) 4 4) 1
5) 1 6) 4 7) 3 8) 4
9) 2 10) 2 11) 3 12) 5
13) 4 14) 4 15) 4 16) 3
17) 3 18) 1 19) 3 20) 5
21) 2 22) 3 23) 4 24) 3
25) 5

విద్య, ఉద్యోగ సమాచారం

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు, కోల్‌కతాలో క్యాబిన్ మాస్టర్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు(ఎస్‌పీఎంపీకే) ఒప్పంద ప్రాతిపదికన క్యాబిన్ మాస్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాధ్యమిక విద్యలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును సీనియర్ డిప్యూటీ మేనేజర్, ట్రాఫిక్ ఆపరేషన్స్(రైల్వే) హల్దియా డాక్ కాంప్లెక్స్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా, జవహర్ టవర్, పీవో, హల్దియా టౌన్‌షిప్, పశ్చిమ బెంగాల్-721607 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 04.04.2025.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://smp.smportkolkata.in

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో పాయింట్స్ మెన్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు (ఎస్‌పీఎంపీకే) ఒప్పంద ప్రాతిపదికన క్యాబిన్ అసిస్టెంట్, పాయింట్స్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 09.
» పోస్టుల వివరాలు: క్యాబిన్ అసిస్టెంట్-05, పాయింట్స్ మెన్-04.
» అర్హత: సంబంధిత విభాగంలో మాధ్యమిక విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును సీనియర్ డిప్యూటీ సెక్రటరీ-2, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా, 15 స్ట్రాండ్ రోడ్, కోల్‌కతా-700001 చిరునామకు పంపించాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: 04.04.2025.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://smp.smportkolkata.in